www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

సీఎంవో అధికారులకు శాఖలు

శేషాద్రికి హోం, ఫైనాన్స్, ల్యాండ్ రెవెన్యూ, సీఎంవో ఇన్‌చార్జి బాధ్యతలు

షానవాజ్ ఖాసింకు సీఎం భద్రత.. సీఎం రిలీఫ్‌ఫండ్ బాధ్యత అజిత్‌రెడ్డికి

హైదరాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన కార్యాలయం (సీఎంవో)లో నియమితులైన అధికారులకు శాఖలను కేటాయించారు. సీఎంవోలో మొట్టమొదట సీనియర్ ఐఏఎస్ అధికారి శేషాద్రిని ముఖ్య కార్యదర్శిగా తీసుకున్న విషయం తెలిసిందే. ఆ తరువాత వివిధ విభాగాల నుంచి ఇతరులను నియమించారు. ఈ మేరకు సీఎంవోను ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్, డిఫెన్స్ విభాగాలకు చెందిన అధికారులతో భర్తీ చేశారు. కాగా వీరికి ఇప్పటి వరకు శాఖల కేటాయింపు

మిగతా 13వ పేజీలో...




వి.శేషాద్రి

బుధవారం | 10-1-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 21 | సంచిక (Issue) : 283 | వరంగల్

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, బహుళపక్షం; తిథి: చతుర్దశి రా. 8.12 తదుపరి అమావాస్య నక్షత్రం: మూల రా. 7.41 తదుపరి పూర్వాషాఢ వర్జ్యం: రా. 6.11-7.41, తె. 4.28-5.56; దుర్ముహూర్తం: మ. 12.01-12.45; అమృతఘడియలు: మ. 1.41-3.11; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 6.52; సూర్యాస్తమయం: 5.54

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

భూంఫట్ స్వాహా!



క్రమబద్ధీకరించిన స్థలాల్లో ఎలాంటి కట్టడాలు లేవని ధరణి మ్యాప్‌లో కనిపిస్తున్న దృశ్యం

గత ప్రభుత్వ హయాంలో అక్రమబద్ధీకరణ

- జీవో 59 కింద ప్రభుత్వ భూముల మాయం
- ఒక్కరికే 7 ప్లాట్ల క్రమబద్ధీకరణ.. మొత్తం 6034 గజాలు
- మరో కుటుంబానికి మరో ఏడు ప్లాట్లు.. 6650 గజాలు
- కేవలం నలుగురికే 17 ప్లాట్లుగా 15,534 చ.గజాల రిజిస్ట్రేషన్
- దాదాపు ఐదు ఎకరాలు కేవలం 15 మందికి అప్పగింత
- రూ.750 కోట్ల విలువైన స్థలం కేవలం రూ.31.52 కోట్లకే డీడ్
- నానక్‌రాంగూడలో ఔటర్ పక్కన ప్రభుత్వ భూమికి ఎసరు
- వెంటనే వాటిని నిర్మాణ సంస్థలకు అమ్మేసుకున్న కబ్జాదారులు
- మొత్తం వ్యవహారం వెనక ఓ మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే

ప్రభుత్వ భూమిని ఆక్రమించి ఇల్లు కట్టుకుంటే.. దానిని క్రమబద్ధీకరించడానికి గత ప్రభుత్వం జీవో 59 తీసుకొచ్చింది! కానీ, సామాన్యుల కంటే ఎక్కువగా బడా బాబులు, అక్రమార్కులే ఈ జీవోతో లబ్ధి పొందారు! హైదరాబాద్‌లో మరీ ముఖ్యంగా ఔటర్ రింగ్ రోడ్డు చుట్టుపక్కల వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను కొట్టేశారు. పక్కా నిర్మాణాలు లేకపోయినా పకడ్బందీగా నొక్కేశారు! ప్రభుత్వ భూములను నొక్కేయడానికే జీవో 59ని వెలువరించారా!? అన్నట్లు అప్పట్లో జరిగిన అక్రమాలన్నీ ఇప్పుడు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి! గోపన్‌పల్లి జర్నలిస్టు కాలనీకి అనుకుని ఉన్న స్థలాన్ని నొక్కేసిన వైనాన్ని ఇప్పటికే 'ఆంధ్రజ్యోతి' బయటపెట్టగా.. తాజాగా.. హైదరాబాద్‌కు గుండెకాయ వంటి నానక్‌రాంగూడలో ఎటువంటి నిర్మాణాలూ లేని దాదాపు ఐదెకరాల ఖాళీ ప్రభుత్వ స్థలాన్ని బిట్లు బిట్లుగా చేసి కట్టబెట్టేశారు! ఔటర్ రింగ్ రోడ్డుకు అనుకుని ఉన్న అత్యంత విలువైన స్థలమిది! ఏకంగా 21,634 చదరపు గజాలను 29 ప్లాట్లుగా విభజించి 15 మందికి రాసిచ్చేశారు! వారిలో ఒక్కరికే ఏడు ప్లాట్లను క్రమబద్ధీకరించారు! అది కూడా.. వంద.. రెండు వందలో కాదు.. ఏకంగా 6,034 చదరపు గజాలు! ఇక్కడ బహిరంగ మార్కెట్లో చదరపు గజం రూ.3 లక్షల వరకూ పలుకుతున్న స్థలాన్ని కేవలం రూ.26,700కే కట్టబెట్టేశారు! క్రమబద్ధీకరణ జరిగిన వెంటనే ఆ స్థలాలను వాళ్లు ప్రముఖ నిర్మాణ సంస్థలకు అమ్మేసుకున్నారు కూడా! ఈ మొత్తం దందాలో గత ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన మంత్రి, ఓ ఎమ్మెల్యే ఉన్నారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి!

(ఆంధ్రజ్యోతి నిఘా విభాగం)

ప్రభుత్వ భూమిని కబ్జా చేశారు! అందులో ఇల్లు కట్టుకున్నారు! క్రమబద్ధీకరణకు దరఖాస్తు పెట్టుకున్నారు! అప్పుడు ఎవరైనా ఏం చేస్తారు!? ఒకరికి ఒక స్థలాన్నే క్రమబద్ధీకరిస్తారు! అంతే తప్పితే.. ఒక్కొక్కరికీ ఐదారు స్థలాలను రాసిచ్చేస్తారా!? నిబంధనలను ఏమాత్రం పట్టించుకోకుండా ఒక్కొక్కరికీ వేల చదరపు గజాలు క్రమబద్ధీకరిస్తారా!? కానీ, నానక్‌రాంగూడలో జరిగింది ఇదే! రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం నానక్‌రాంగూడ రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 149 ఉంది. ఇందులో 82 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. దీనిలో కొంత భగీరథ చెరువు ఉండగా, ఐఏఎస్ అధికారులకు ఇళ్ల స్థలాల కోసం 70 ఎకరాలకుపైగా కేటాయించారు. బీసీ కమిషన్‌కు కూడా కొంత కేటాయించారు. ఇవన్నీపోను.. మరో ఏడు ఎకరాలకుపైగా ప్రభుత్వ భూమి అందుబాటులో ఉంది. ఔటర్ రింగ్ రోడ్డు నుంచి నార్సింగి వైపు వెళ్లే మార్గంలో నానక్‌రాంగూడ రోటరీ దాటగానే ఎడమ వైపున ఈ భూమి ఉంటుంది. ఇక్కడ మొత్తం 82 ఎకరాలూ రాళ్లు రప్పలు, చెట్లతో అడవిలా కనిపిస్తుంది. మచ్చుకు కూడా నిర్మాణాలు కనిపించవు. దీని చుట్టూ మాత్రం ఇప్పటికే బహుళ అంతస్తుల భవనాలు, భారీ విల్లా ప్రాజెక్టులు వచ్చాయి. ఇక్కడ ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిని కొట్టేసేందుకు అక్రమార్కులు

మిగతా 13వ పేజీలో...



కబ్జాదారులు అమ్మేసిన భూమి చుట్టూ ఏర్పాటు చేసిన కంచె




ప్రక్షాళన

- పోర్టల్‌లో సమస్యల పరిష్కారానికి ఐదుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటు
- నిషేధిత జాబితా నుంచి మాయమైన భూముల చిట్టాపై దృష్టి
- రికార్డుల్లో మళ్లీ అనుభవదారు కాలమ్?
- ధరణిలో సమస్యలన్నీ పరిశీలించి సిఫారసులు
- 'బడ్జెట్' ముందు క్యాబినెట్ ఆమోదించే చాన్స్

హైదరాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ భూములపై గత ప్రభుత్వం తెచ్చిన 'ధరణి'లోని సమస్యలను పరిష్కరించేందుకు రేవంత్ సర్కార్ సిద్ధమైంది. అందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధ్యయనానికి మంగళవారం ఐదుగురు సభ్యులతో కీలక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షుడు ఎం.కోదండ రెడ్డి, భూపరిపాలన విశ్రాంత ప్రధాన కమిషనర్, మాజీ ఐఏఎస్ రేమండ్ పీటర్, నల్సార్ యూనివర్సిటీకి చెందిన భూచట్టాల నిపుణులు సునీల్, మాజీ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ ఉండగా.. భూపరిపాలన ప్రధాన కమిషనర్ నవీన్‌మిట్టల్ మెంబర్ కన్వీనర్‌గా ఉన్నారు. ఈ కమిటీ ధరణితో ముడిపడిన అన్ని అంశాలనూ పరిశీలించి ప్రత్యామ్నాయంపై ప్రభుత్వానికి సిఫారసులు

మిగతా 3వ పేజీలో...

కాళేశ్వరంపై విజిలెన్స్ విచారణ



- మంగళవారం ఆదేశించిన రేవంత్ సర్కారు.. ఆ వెంటనే రాష్ట్రవ్యాప్తంగా ఏకకాలంలో దాడులు
- పది నీటిపారుదల శాఖ ఆఫీసుల్లో తనిఖీలు.. డిజైన్లు, అంచనా వ్యయాలు సహా ఫైళ్ల స్వాధీనం

మేడిగడ్డపై విచారణకు సిటింగ్ జడ్జిని నియమించండి

- హైకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం లేఖ.. న్యాయవిచారణపై క్యాబినెట్ తీర్మానమూ చేశాం: ఉత్తమ్
- కాళేశ్వరం ప్రాజెక్టుపై నేడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష



జలసౌధలో సోదాలకు వెళుతున్న అధికారులు

హైదరాబాద్, పెద్దపల్లి, భూపాలపల్లి, తిమ్మాపూర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిపోవడం; కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని అక్రమాలపై ప్రభుత్వం మంగళవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ విచారణకు ఆదేశించింది. ఆ వెంటనే, హైదరాబాద్ నుంచి మేడిగడ్డ వరకూ ఉన్న పది నీటిపారుదల శాఖ కార్యాలయాల్లో విజిలెన్స్ అధికారులు ఏకకాలంలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం మధ్యాహ్నం జలసౌధను అధీనంలోకి తీసుకున్న ఆ విభాగం అధికారులు.. ఈఎన్‌సీ సి.మురళీధర్ నేతృత్వంలోని ప్రాజెక్టు అండ్ మానిటరింగ్ (పీ అండ్ ఎం) విభాగంలో తనిఖీలు చేశారు. కాళేశ్వరం లింక్-1లో మేడిగడ్డ బ్యారేజీతోపాటు కన్నెపల్లి పంప్‌హౌస్‌లో రెండు టీఎంసీలు, మూడో టీఎంసీకి చెందిన పనులు, పంప్‌హౌస్‌ల ఫైళ్లు, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు, పంప్ హౌస్‌లకు చెందిన ఫైళ్లను స్వాధీనం చేసుకొని, ఆయా పత్రాలను జిరాక్స్ తీసుకున్నారు. లింక్-1లో నాలుగు ప్యాకేజీలుగా చేపట్టిన పనులకు సంబంధించిన ఫైళ్లను తీసుకున్నారు. తనిఖీల సందర్భంగా కార్యాలయంలోనికి బయటి వ్యక్తులను అనుమతించలేదు. ఉద్యోగుల రాకపోకలపై కూడా ఆంక్షలు విధించారు. తొలి అంతస్తులోని కాళేశ్వరం కార్పొరేషన్, గజ్వేల్ ఈఎన్‌సీ బి.హరిరాం, రెండో అంతస్తులో పీ అండ్ ఎం, హైడ్రాలజీ విభాగం; ఐదో అంతస్తులో రామగుండం ఈఎన్‌సీ నల్లా వెంకటేశ్వర్లు కార్యాలయం; ఆరో అంతస్తులో

మిగతా 13వ పేజీలో...

హమ్మయ్య.. అప్పు పుట్టింది

9 వేల కోట్ల రుణానికి కేంద్రం ఓకే

- చివరి త్రైమాసికంలో తీసుకోవచ్చని వెల్లడి
- తొలుత 2 వేల కోట్లు తీసుకోనున్న రాష్ట్రం
- 16న ఆర్బీఐ వేలంపాటకు ఇండెంటు
- మరో 6 వేల కోట్ల అప్పు కోసం యత్నాలు

హైదరాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వానికి అప్పు పుట్టింది. ఖాళీ ఖజానాతో కష్టాల్లో ఉన్న సమయంలో కొంత ఊరట లభించింది. జనవరి, ఫిబ్రవరి, మార్చిలతో కూడిన చివరి త్రైమాసికంలో రూ.9,000 కోట్ల అప్పు తీసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దీంతో తొలుత రూ.2,000 కోట్లను ఈ నెల 16వ తేదీన తీసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. కాగా, రాష్ట్ర బడ్జెట్‌లో ప్రతిపాదించిన అప్పులో వెయ్యి కోట్లు వినహా మిగతా అప్పును గత బీఆర్ఎస్ ప్రభుత్వం

మిగతా 13వ పేజీలో...

హైదరాబాద్‌లో త్వరలో గ్లోబల్ ఏఐ సదస్సు

- నగరాన్ని ఏఐ హబ్ చేయడమే లక్ష్యం
- ఐటీ రంగం అభివృద్ధికి సంపూర్ణ సహకారం
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు
- ఐటీ సంస్థల ప్రతినిధులతో భేటీ



జిల్లాల ఇన్‌చార్జి మంత్రులు, ఎమ్మెల్యేలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

అభివృద్ధి చేసుకోండి రూ.10 కోట్లు ఇస్తా..

నియోజకవర్గ స్థాయిలో హామీల అమలుకు ప్రత్యేక నిధి

- కోడ్ వచ్చేలోపు శంకుస్థాపనలు చేయండి
- నిజాయితీ గల అధికారులను పెట్టుకోండి
- అవినీతిపరులు.. పైరవీకారులు వద్దు
- 5 జిల్లాల ఇన్‌చార్జి మంత్రులు, ఎమ్మెల్యేల సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా నియోజకవర్గ స్థాయిలో ఇచ్చిన హామీల అమలు కోసం ప్రతి నియోజకవర్గానికీ రూ.10 కోట్ల చొప్పున ప్రత్యేక అభివృద్ధి నిధి కింద కేటాయిస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ నిధుల బాధ్యత ఇన్‌చార్జ్ మంత్రులకు అప్పగిస్తున్నామని, వారితో సమన్వయం చేసుకుని నియోజకవర్గాలను అభివృద్ధి చేసుకుని సమస్యలు పరిష్కరించుకోవాలని పార్టీ ఎమ్మెల్యేలకు ఆయన సూచించారు. లోక్‌సభ ఎన్నికల కోడ్

మిగతా 12వ పేజీలో...

పెట్టుబడులతో రండి

- రాష్ట్రంలో అపార వ్యాపార అవకాశాలు
- గోద్రేజ్ ఆగ్రోవెట్ కంపెనీ ప్రతినిధులతో సీఎం

రోడ్డు ప్రమాదంలో మరణించిన కానిస్టేబుల్ భార్యకు ఉద్యోగం 3

- స్థానికత నెపంతో నిరాకరించిన అప్పటి ప్రభుత్వం
- సీఎం రేవంత్ ఆదేశంతో బాధితురాలికి ఊరట

ఫార్ములా-ఈ రేస్ ఒప్పందం.. నిబంధనలకు విరుద్ధం

- ప్రైవేటు సంస్థలకు డబ్బు దక్కితే.. ప్రభుత్వం నష్టపోయింది
- రాష్ట్రాన్ని అమ్మకానికి పెట్టి.. ఇమేజ్ పడిపోతోందని అంటారా?
- ఈ మొత్తం వ్యవహారంలో తెరవెనుక ఉన్నది ఎవరో చెబుతాం
- కేటీఆర్ విమర్శలపై డిప్యూటీ సీఎం భట్టి స్పందన 3
- 55 కోట్లు చెల్లించిన అధికారిపై చర్యలుంటాయని స్పష్టీకరణ
- జెన్‌కో, ట్రాన్స్‌కోల్లో అక్రమ ఉద్యోగాలపై నివేదిక కోరినట్లు వెల్లడి

ప్లాస్టిక్ తాగేస్తున్నాం!



- లీటరు బాటిల్ నీళ్లలో 2.4 లక్షల ప్లాస్టిక్ రేణువులు
- తాగునీటిలో నానోప్లాస్టిక్స్‌పై తొలిసారిగా పరిశోధన
- నీళ్ల ద్వారా సులువుగా రక్తం, అవయవాల్లోకి..
- బాటిల్ నీళ్ల కన్నా నల్లా నీళ్లే నయం 2

సీఎం కన్నా.. కేసీఆర్ అనే 3 అక్షరాలే పవర్‌ఫుల్



బీఆర్ఎస్‌ను ప్రజలు పూర్తిగా తిరస్కరించలేదు

- ఎన్నికల్లో పార్టీకి వచ్చిన ఓట్లే ఇందుకు నిదర్శనం
- మాట నిలబెట్టుకునే చిత్తశుద్ధి కాంగ్రెస్‌కు లేదు
- త్వరలో బీఆర్ఎస్ రాష్ట్ర, జిల్లా కమిటీలు: కేటీఆర్
- బీఆర్ఎస్ కార్యకర్తలపై కక్షసాధింపులు పెరిగాయి
- కేసీఆర్ అలా చేస్తే కాంగ్రెసోళ్లు జైళ్లలోనే: హరీశ్
- ఖమ్మం ఎంపీ అభ్యర్థిగా నామ నాగేశ్వర్‌రావు
- పార్లమెంటు నియోజకవర్గ సమీక్షలో ప్రతిపాదన
- సీనియర్లను వదులుకోవడమే పార్టీకి పెద్ద దెబ్బ
- సమావేశంలో బీఆర్ఎస్ కార్యకర్తల ఆవేదన

హైదరాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం వంటి ఒకటి రెండు జిల్లాల్లో తప్ప.. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ప్రజలు పూర్తిగా తిరస్కరించలేదని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు వచ్చిన ఓట్లే ఇందుకు నిదర్శనమన్నారు. 39 ఎమ్మెల్యే స్థానాలను గెలుచుకున్నామని, 11 స్థానాలు అత్యల్ప మెజారిటీతోనే చేజారిపోయాయని తెలిపారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో ఖమ్మం పార్లమెంటు నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. పార్టీ అధినేత కేసీఆర్ ఫిబ్రవరిలో ప్రజల మధ్యకు

మిగతా 14వ పేజీలో...

తల్లే దయ్యమైంది!



2

- భర్తమీద కోపంతో నాలుగేళ్ల కొడుకు గొంతుకోసిన తల్లి
- ఆపై చేయి కోసుకుని ఆత్మహత్య చేసుకునేందుకు యత్నం
- గోవాలో ఘోరానికి పాల్పడ్డ బెంగళూరు స్టార్టప్ సీఈవో
- కర్ణాటకలో అరెస్టు.. గోవాకు తరలింపు.. 6 రోజుల కస్టడీ

భర్తతో పొసగక కొడుకుతో కలిసి విడిగా ఉంటోందామె! కానీ.. వారానికోసారి కొడుకును చూసే హక్కు అతడికి కోర్టు కల్పించడాన్ని జీర్ణించుకోలేకపోయింది. తండ్రీకొడుకులను కలవనీయకూడదని భావించింది. అందుకామె ఎంచుకున్న మార్గం.. కన్నకొడుకును చంపేయడం!! కృత్రిమ మేధకు నైతికవిలువలు నేర్పేంత చదువు చదివి, ఒక స్టార్టప్‌కు సీఈవోగా వ్యవహరిస్తున్న ఓ మహాతల్లి చేసిన దారుణమిది! కడుపున పుట్టిన బిడ్డను కర్కశంగా చంపేసి, బాలుడి మృతదేహాన్ని బ్యాగులో కుక్కి, గోవా నుంచి బెంగళూరుకు బయల్దేరిన ఆమె.. దారిలోనే పోలీసులకు అడ్డంగా దొరికిపోయింది!!

ప్లాస్టిక్‌ను తాగేస్తున్నాం!

లీటరు బాటిల్ నీళ్లలో 2.4 లక్షల ప్లాస్టిక్ రేణువులు




- కొత్త టెక్నాలజీతో గుర్తించిన శాస్త్రవేత్తలు
- బాటిల్ నీళ్ల కన్నా నల్లా నీళ్లే నయం

వాషింగ్టన్, జనవరి 9: ఒక లీటరు బాటిల్ నీళ్లలో సగటున 2,40,000 ప్లాస్టిక్ రేణువులు ఉంటున్నాయని శాస్త్రవేత్తలు ఓ తాజా పరిశోధనలో గుర్తించారు. ఇప్పటి వరకూ అంచనా వేసినదానికన్నా ఇది 100 రెట్లు ఎక్కువ. మనుష్యుల ఆరోగ్యంపై ఇది అత్యంత తీవ్ర ప్రభావం చూపించే అంశమని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. 'ప్రొసీడింగ్స్ ఆఫ్ ది నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్' జర్నల్‌లో ఈ పరిశోధన వివరాలు ప్రచురితమయ్యాయి. దీని ప్రకారం.. శాస్త్రవేత్తలు అమెరికాలోని మూడు ప్రముఖ కంపెనీలకు చెందిన 25 ఒక లీటరు నీళ్ల బాటిళ్లలో నానోప్లాస్టిక్స్ అవశేషాలపై అధ్యయనం జరిపారు. ఒక మైక్రోమీటరు కన్నా తక్కువ పొడవున్న (అంటే మనిషి వెంట్రుక మందంలో 70వ వంతు ఉన్న) ప్లాస్టిక్ కణాలను నానో ప్లాస్టిక్స్ అని అంటారు. అత్యంత సూక్ష్మంగా ఉండటం వల్ల ఇవి మనిషి కణాల్లోకి, రక్తంలోకి, ముఖ్యమైన అవయవాల్లోకి సులభంగా ప్రవేశించగలవు. గర్భంలో ఉన్న శిశువుల్లోకి కూడా ఇవి తల్లి ద్వారా వెళ్లే ప్రమాదం ఉంది. ప్లాస్టిక్ బాటిల్ నీళ్లలో నానోప్లాస్టిక్స్ ఉంటాయని శాస్త్రవేత్తలు చాలా కాలంగా అనుమానిస్తున్నా.. వాటిని గుర్తించే టెక్నాలజీ ఇప్పటి వరకూ అందుబాటులో లేదు. ఈ నేపథ్యంలో అమెరికాలోని కొలంబియా యూనివర్సిటీకి చెందిన నైక్సిన్ క్వియన్ సారథ్యంలో పరిశోధకుల బృందం.. డేటా ఆధారిత అల్గరిథమ్‌ను ఉపయోగించి ఒక కొత్త మైక్రోస్కోపీ టెక్నిక్‌ను అభివృద్ధిపరిచింది. దీనిద్వారా మూడు ప్రముఖ కంపెనీల (ఆ కంపెనీల పేర్లను శాస్త్రవేత్తలు వెల్లడించలేదు) నీళ్ల బాటిళ్లపై పరిశోధన చేయగా.. ఒక్కదానిలో 1,10,000 నుంచి 3,70,000 సూక్ష్మ ప్లాస్టిక్ రేణువులు కనిపించాయి. వీటిలో 90 శాతం నానోప్లాస్టిక్‌లే.

ఏడు రకాల అవశేషాలపై పరిశోధన

నీళ్లలో ప్లాస్టిక్ కాలుష్యాన్ని నానో స్థాయిలో గుర్తించే విషయంలో ఇప్పటి వరకూ ఉన్న ఖాళీని తమ పరిశోధన భర్తీ చేసిందని నైక్సిన్ క్వియన్ తెలిపారు. పరిశోధనలో భాగంగా నైక్సిన్ బృందం.. పాలీ ఎథిలీన్ టెరెఫ్తలేట్ (పీఈటీ), పాలీ అమైడ్‌లతోపాటు మొత్తం ఏడు రకాల ప్లాస్టిక్ అవశేషాలపై దృష్టి పెట్టింది. పీఈటీతో ప్లాస్టిక్ బాటిళ్లను తయారు చేస్తారు.. కాగా నీళ్లను శుద్ధి చేసే ఫిల్టర్‌లో పాలీఅమైడ్ ఉంటుంది. అయితే, శాస్త్రవేత్తలు ఆ ఏడింటితోపాటు ఇంకా అనేక రకాల నానో ప్లాస్టిక్ రేణువుల్ని కూడా కనుగొన్నారు. 2022లో జరిగిన ఓ పరిశోధన ద్వారా.. నల్లా నీళ్లలో కన్నా బాటిల్ నీళ్లలో ప్లాస్టిక్ అవశేషాలు ఎక్కువ ఉన్నట్లు తేలింది. 2021లో జరిగిన ఓ పరిశోధన మరో ఆసక్తికరమైన విషయాన్ని వెల్లడించింది. బాటిల్ మూత తెరిచి మళ్లీ మూసిన ప్రతిసారీ ప్లాస్టిక్ రేణువులు నీళ్లలో పడతాయని తెలిపింది.



జూలై 7న నీట్- పీజీ 2024

న్యూఢిల్లీ, జనవరి 9: వైద్యవిద్య పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నీట్- పీజీ 2024 ప్రవేశ పరీక్షను జూలై 7న నిర్వహించనున్నట్లు నేషనల్ బోర్డు ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ ప్రకటించింది. తొలుత మార్చి 3న ఈ పరీక్ష నిర్వహిస్తామని బోర్డు గతంలో తెలిపింది. అయితే జూలై 7కు పరీక్షను రీషెడ్యూల్ చేస్తున్నట్లు మంగళవారం వెల్లడించింది. పీజీ వైద్య విద్య నిబంధనలు- 2023 ప్రకారం.. పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నీట్-పీజీ బదులుగా ప్రతిపాదించిన నేషనల్ ఎగ్జిట్ టెస్ట్ అమల్లోకి వచ్చేదాకా నీట్ పీజీ కొనసాగనుంది.

లాలూ కుటుంబ సభ్యులపై ఈడీ తొలి చార్జిషీటు

న్యూఢిల్లీ, జనవరి 9: తక్కువ ధరలకు భూములు కొనుగోలు చేసి రైల్వే ఉద్యోగాలు ఇచ్చారన్న ఆరోపణలపై ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ కుటుంబ సభ్యుల సహా మొత్తం ఏడుగురిపై ఈడీ మంగళవారం మొదటి చార్జిషీటు దాఖలు చేసింది. బిహార్ మాజీ సీఎం, లాలూభార్య రబ్రీదేవి (68), కుమార్తె మీసా భారతి (47), మరో కుమార్తె హేమాయాదవ్ (40) తదితరులపై అభియోగాలు నమోదు చేసింది. ఢిల్లీలోని పీఎంఎల్‌ఏ కేసుల ప్రత్యేక కోర్టులో దీనిని సమర్పించింది. ఈ కేసు ఈ నెల 16న విచారణకు వచ్చే అవకాశం ఉంది. లాలూ ప్రసాద్ రైల్వే మంత్రిగా ఉన్నప్పుడు పట్నాలో విలువైన భూములను దాదాపు నాలుగో వంతు ధరకు కొనుగోలు చేసి వాటి యజమానులకు వివిధ జోన్లలో సబ్‌స్టిట్యూట్ గ్రూప్ డి ఉద్యోగాలు ఇచ్చినట్టు ఈడీ ఆరోపించింది.

ఉపఎన్నికలో ఓడిన రాజస్థాన్ మంత్రి రాజీనామా

జైపూర్, జనవని 9: ప్రమాణస్వీకారం చేసిన 10 రోజులకే రాజస్థాన్ మంత్రి ఒకరు రాజీనామా చేయాల్సి వచ్చింది. కరణ్‌పూర్ అసెంబ్లీ ఉపఎన్నికలో ఓటమి పాలవ్వడంతో రాష్ట్ర మైనారిటీ వ్యవహారాలశాఖ మంత్రి సురేందర్ పాల్ సింగ్ మంగళవారం తన మంత్రి పదవి రాజీనామా చేశారు. ఎమ్మెల్యేగా గెలువక ముందే మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ఆయన సోమవారం వెలువడిన ఉపఎన్నిక ఫలితాల్లో కాంగ్రెస్ అభ్యర్థి రూపిందర్ సింగ్ చేతిలో 11,283 ఓట్ల తేడాతో ఓడిపోయారు. కాగా, గతేడాది డిసెంబరు 30న సురేందర్ పాల్ సింగ్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయగా, ఈనెల 5న ఆయనకు మైనారిటీ శాఖ, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ, ఇరిగేషన్ శాఖలను కేటాయించారు.

డీఆర్‌డీవో కొత్త రైఫిల్ 'ఉగ్రం'



పుణె, జనవరి 9: భారత రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో ఓ కొత్త రైఫిల్‌ను రూపొందించింది. ఓ ప్రైవేటు సంస్థతో కలిసి పుణెలోని డీఆర్‌డీవో లేబొరేటరీ ఏఆర్‌డీఈలో రూపొందించిన ఈ రైఫిల్‌కు 'ఉగ్రం' అనే పేరు పెట్టింది. నాలుగు కిలోల కన్నా తక్కువ బరువు, 7.62/51 ఎంఎం నమూనాతో తయారు చేసిన ఉగ్రం రైఫిల్‌ను ఈ నెల 8న ఏఆర్‌డీఈ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎస్‌వీ గడే ఆవిష్కరించారు. అంతర్జాతీయ ప్రమాణాలకు ఏమాత్రం తీసిపోని విధంగా పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో ఈ రైఫిల్‌ను రూపొందించినట్లు ఆయన తెలిపారు.

నేరస్థుడిని కలిసిన జడ్జితో సమానం!

- మహా స్పీకర్ నర్వేకర్‌పై ఉద్ధవ్ ఠాక్రే ఆగ్రహం

న్యూఢిల్లీ/ముంబై, జనవరి 9: మహారాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ రాహుల్ నర్వేకర్ వెళ్లి సీఎం ఏక్‌నాథ్ షిండేతో సమావేశం కావడాన్ని మాజీ సీఎం ఉద్ధవ్ ఠాక్రే తప్పుపట్టారు. ఈ చర్యను 'జడ్జి వెళ్లి నేరస్థుడిని కలిసినట్లు'గా అభివర్ణించారు. శివసేన తిరుగుబాటు ఎమ్మెల్యేలపై అనర్హత విషయంలో బుధవారం తీర్పు ఇవ్వాల్సిన స్పీకర్ నర్వేకర్.. సీఎం ఏక్‌నాథ్ షిండే ఇంటికి వెళ్లి, ఆయనతో సమావేశం కావడంపై ఉద్ధవ్ మండిపడ్డారు. మంగళవారం ముంబైలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రెబెల్ ఎమ్మెల్యేల అనర్హతపై నిర్ణయం తీసుకునేందుకు సుప్రీంకోర్టు జనవరి 10 వరకు గడువు ఇచ్చిందన్నారు. 2022లో శివసేన ఎమ్మెల్యేలు ఉద్ధవ్, శిండే వర్గంగా చీలిపోయారు. బీజేపీ మద్దతుతో ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడింది. తిరుగుబాటు చేసిన ఎమ్మెల్యేలపై అనర్హత వ్యవహారం స్పీకర్ వద్ద పెండింగ్‌లో ఉంది. దీనిపై బుధవారం నిర్ణయం తీసుకోవాల్సిన తరుణంలో స్పీకర్ వెళ్లి సీఎంను కలవడమేంటని ఉద్ధవ్ నిలదీశారు. కాగా, స్పీకర్ వ్యవహారశైలిని తప్పు పడుతూ ఉద్ధవ్ వర్గం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది.



వైబ్రంట్ గుజరాత్ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరు కానున్న యూఏఈ అధ్యక్షుడు అల్ నహ్యాన్‌కు ప్రధాని మోదీ అహ్మదాబాద్ ఎయిర్ పోర్టులో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఇరువురు దేశాధినేతలు కలిసి మూడు కిలోమీటర్ల రోడ్ షోలో పాల్గొన్నారు. సదస్సు బుధవారం ప్రారంభం కానుంది.

తల్లే దయ్యమైంది!

భర్త మీద కోపంతో నాలుగేళ్ల కొడుకు గొంతుకోసి చంపిన తల్లి

- గోవాలో ఘోరానికి పాల్పడ్డ బెంగళూరు స్టార్టప్ సీఈవో సుచనా సేథ్



బెంగళూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): 'తల్లే దయ్యమైతే బిడ్డకు ఉయ్యాల కట్టే చోటేది' అని సామెత! ఆ సామెతను నిజంచేస్తూ.. తన నాలుగేళ్ల కొడుకుపట్ల ఓ తల్లే దయ్యమైంది!! భర్త మీద కోపంతో ఆ పసివాణ్ని కిరాతకంగా తలపై కొట్టి, గొంతు కోసి చంపేసింది. తర్వాత తానూ చేయి కోసుకుని చనిపోవడానికి ప్రయత్నించింది. అంతలోనే ఏమైందో ఏమో బిడ్డ మృతదేహాన్ని బ్యాగులో కుక్కి అక్కణ్నుంచీ పారిపోయే ప్రయత్నం చేసింది. ఇంత ఘోరానికి పాల్పడ్డ ఆ మహిళ పేరు.. సుచనా సేథ్ (39). 2021 సంవత్సరానికిగాను '100 బ్రిలియంట్ ఉమెన్ ఇన్ ఏఐ ఎథిక్స్'లో ఒకరిగా నిలిచిన సుచనాసేథ్ 'మైండ్‌ఫుల్ ఏఐ ల్యాబ్' అనే స్టార్టప్ స్థాపించి, దానికి సీఈవోగా వ్యవహరిస్తోంది. పోలీసులు తెలిపిన ప్రాథమిక సమాచారం ప్రకారం.. పశ్చిమబెంగాల్‌కు చెందిన సుచనా 2010లో కేరళకు చెందిన వెంకట్‌రామన్‌ను వివాహం చేసుకుంది. 2019లో వారికి ఒక అబ్బాయి పుట్టాడు. విభేదాలు రావడంతో ఆ దంపతులు 2020లో విడాకులకు దరఖాస్తు చేశారు. ప్రస్తుతం ఆమె తన కుమారుడితో కలిసి బెంగళూరులో ఉంటుండగా.. భర్త వెంకటరామన్ జకార్తా (ఇండోనేసియా)లో ఉంటున్నాడు. కాగా.. వారి విడాకుల కేసు విచారిస్తున్న కోర్టు.. ప్రతి శనివారం తన కుమారుణ్ని చూసుకుని, అతడితో గడిపే అవకాశాన్ని తండ్రికి కల్పించిందని, కానీ, భర్త మీద కోపంతో సుచనా ఆ తీర్పును ఎప్పుడూ గౌరవించలేదని సమాచారం. ఈ క్రమంలోనే.. నాలుగు రోజుల క్రితం (జనవరి 6న) కొడుకుతో సహా గోవాకు వచ్చి అక్కడ ఒక సర్వీస్ అపార్ట్‌మెంట్‌లో దిగింది. ఏడో తేదీ అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో.. అక్కడ నిర్వహణ బాధ్యతలు చూసే సిబ్బందికి ఫోన్ చేసి తనకు బెంగళూరుకు వెళ్లడానికి ట్యాక్సీ ఏర్పాటు చేయాల్సిందిగా కోరింది. అంతదూరం ట్యాక్సీలో వెళ్లడానికి చాలా సమయం పడుతుందని.. పైగా, ట్యాక్సీ కన్నా విమానంలో వెళ్తేనే చవకని వారు చెప్పినా వినలేదు. దీంతో వారు ట్యాక్సీ బుక్ చేశారు. ముందురోజు తన నాలుగేళ్ల కుమారుడితో కలిసి వచ్చిన ఆ మహిళ.. అర్ధరాత్రి సమయంలో కొడుకు తన వెంట లేకుండా, బరువైన బ్యాగుతో బయటకు వెళ్లడం చూసి ఆ సర్వీస్ అపార్ట్‌మెంట్ సిబ్బందికి అనుమానం వచ్చింది. పైకెళ్లి ఆమె బస చేసిన ఫ్లాట్‌ను శుభ్రం చేస్తుండగా ఒక టవల్‌పై రక్తపు మరకలు కనిపించాయి. దీంతో వారు పోలీసులకు సమాచారమిచ్చారు. తమ వద్ద రికార్డుల్లో ఉన్న ఆమె ఫోన్ నంబర్ కూడా పోలీసులకు ఇచ్చారు. పోలీసులు వెంటనే ఆమెకు ఫోన్ చేసి.. రక్తపు మరకల గురించి, ఆమె కుమారుడి గురించి ప్రశ్నించారు. దీనికి ఆమె.. అవి తన నెలసరి తాలూకా రక్తపు మరకలు అని, తన కుమారుడు దక్షిణగోవాలోని తన స్నేహితురాలి ఇంట్లో ఉన్నాడని వారికి తెలిపింది. స్నేహితురాలి చిరునామా అడగ్గా నోటికొచ్చిన అడ్రస్ చెప్పింది. పోలీసుల విచారణలో అది తప్పని తేలింది. దీంతో పోలీసులు.. సుచనా ప్రయాణిస్తున్న ట్యాక్సీ డ్రైవర్ వివరాలు తెలుసుకుని, అతడికి ఫోన్ చేశారు. దగ్గర్లో ఏ పోలీస్ స్టేషన్ ఉంటే అక్కడికి వెళ్లాలని.. ఆమెకు అర్థంకాకుండా ఉండేందుకు కొంకణి భాషలో ఆదేశించారు. అప్పటికే కారు కర్ణాటకలోని చిత్రదుర్గ ప్రాంతానికి చేరుకుంది. డ్రైవర్ తన కారును నేరుగా స్థానిక పోలీస్‌స్టేషన్‌కు పోనిచ్చాడు. అక్కడ పోలీసులు ఆమె లగేజీని పరిశీలించగా.. లోపల కుక్కి ఉన్న బాలుడి మృతదేహం కనిపించింది. వెంటనే వారు ఆమెను అదుపులోకి తీసుకున్నారు.



సుచనాను అరెస్టు చేసి తీసుకువెళ్తున్న పోలీసులు

కర్ణాటక నుంచి గోవాకు తరలింపు..

గోవా పోలీసులు సోమవారం రాత్రికి చిత్రదుర్గకు చేరుకుని, ఆమెను ట్రాన్సిట్ వారంట్‌పై తమ రాష్ట్రానికి తీసుకువెళ్లి, కోర్టులో హాజరుపరిచారు. న్యాయస్థానం ఆమెను 6 రోజులపాటు పోలీసు కస్టడీకి ఇచ్చింది. బాలుడి మృతదేహానికి పోస్ట్‌మార్టం చేస్తే.. అతడిని ఎలా చంపింది? ఎప్పుడు చంపింది? తదితర వివరాలు వెల్లడవుతాయని గోవా పోలీసులు తెలిపారు. సుచనాసేథ్‌పై హత్య, సాక్ష్యాల ధ్వంసం కింద, గోవా బాలల చట్టం కింద కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. బాలుడి హత్య గురించి తండ్రి వెంకట్‌రామన్‌కు సమాచారం అందించినట్లు చెప్పారు. అలాగే, సర్వీస్ అపార్ట్‌మెంట్‌లో టవల్‌పై కనిపించిన రక్తపు మరకలు ఆమె చెయ్యి కోసుకున్నప్పుడు పడ్డవేనని వెల్లడించారు. బాలుడి తలపై గాయం ఉందని, అతడి గొంతు కోసిన ఆనవాళ్లున్నాయని తెలిపారు. హోటల్ గదిలో గొంతు కోసి ఉంటే అక్కడ మరిన్ని రక్తపు జాడలు ఉండేవని.. ఆమెను ఇంటరాగేట్ చేస్తే పూర్తి వివరాలు తెలుస్తాయని వివరించారు.

అయోధ్యలో బాలరాముడి విగ్రహ ఊరేగింపు రద్దు

- 17న అయోధ్య నగరమంతటా ఊరేగించాలని తొలుత ట్రస్టు నిర్ణయం
- భక్తుల నియంత్రణ కష్టమన్న అధికారులు

అయోధ్య, జనవరి 9(ఆంధ్రజ్యోతి): అయోధ్యలోని రామాలయంలో ప్రతిష్ఠించనున్న బాలరాముడి విగ్రహాన్ని ఈ నెల 17న అయోధ్య నగరమంతటా ఊరేగించాలన్న నిర్ణయాన్ని రామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు ఉపసంహరించుకుంది. విగ్రహాన్ని దర్శించడానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తారని, వారిని నియంత్రించడం కష్టం అవుతుందని భద్రతాధికారులు ఆందోళన వ్యక్తం చేయడంతో ఈ నిర్ణయం తీసుకుంది. అయితే, అదే రోజున విగ్రహాన్ని 'రామజన్మభూమి' పరిసరాల్లో ఊరేగించనుంది. రాముడు వనవాసం నుంచి అయోధ్యకు చేరిన మార్గంగా రామాయణ ఇతిహాసంలో పేర్కొన్న దారిలో పలువురు ప్రముఖులు రామోత్సవ్ యాత్ర నిర్వహించనున్నారు. ఇది రామేశ్వరం నుంచి అయోధ్య వరకు ఐదు రాష్ట్రాల గుండా 4,500 కిలోమీటర్ల మేర నెలరోజుల పాటు జరుగుతుంది. ఇదిలా ఉండగా, అయోధ్యలో ఈ నెల 22న జరిగే రామ మందిర ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమానికి మాజీ సీజేఐ ఎన్వీ రమణకు ఆహ్వానం అందింది. మంగళవారం, వీహెచ్‌పీ అంతర్జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఆలోక్ కుమార్ ఈ మేరకు ఎన్వీరమణకు ఆహ్వాన పత్రం ఇచ్చారు.

అయోధ్య అపవిత్రమైనది: పన్నూన్

అయోధ్య రామాలయం అపవిత్రమైనదంటూ ఖలిస్థానీ ఉగ్రవాది పన్నూన్ మరోసారి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. రామమందిర ప్రాణ ప్రతిష్ఠను వ్యతిరేకించడంతో పాటు అడ్డుకోవల్సిందిగా ముస్లింలకు పిలుపునిచ్చారు. అమృత్‌సర్ నుంచి అయోధ్యకు వెళ్లే విమాన సర్వీసులను నిలిపివేయాలని, విమానాశ్రయాలను మూసివేయాలని డిమాండ్ చేస్తూ కొత్త వీడియోను విడుదల చేశారు.

సర్దార్ పటేల్ లేకుంటే లక్షదీవుల్లో పాక్ పాగా!

న్యూఢిల్లీ, జనవరి 9: ప్రధాని మోదీ పర్యటన, ఆ తర్వాత మాల్దీవుల మంత్రులు చేసిన వ్యాఖ్యలతో లక్షదీవులు మీడియా మీడియాలో తీవ్ర చర్చనీయాంశం అయ్యాయి. అయితే, లక్షదీవులు భారత్ పరం కావడంలో సర్దార్ పటేల్ కీలక పాత్ర పోషించారని చాలా మందికి తెలియదు. అంతేకాదు.. ఇద్దరు తమిళ సోదరులు వాటిని దేశంలో విలీనం చేశారు. 1947లో పాకిస్థాన్ ఏర్పడినప్పుడు.. దక్షిణాదిన ముస్లిం జనాభా 93% వరకు ఉన్న లక్షదీవులను మహ్మదాలీ జిన్నా తొలుత పట్టించుకోలేదు. కానీ ఆ తర్వాత ఆక్రమణకు ప్రయత్నించారు. లక్షదీవుల్లో పాక్ జెండాను ఎగురవేయాలని జిన్నా ఓ నౌకను కూడా పంపారు. ఇది తెలిసిన సర్దార్ పటేల్ క్షణం కూడా ఆలస్యం చేయకుండా.. తనకు బాగా తెలిసిన మొదలియార్ సోదరులను తక్షణమే ట్రావెన్కోర్ నుంచి జనంతో లక్షదీవులకు వెళ్లాలని ఆదేశించారు. వారు అక్కడకు వెళ్లి పాక్ నౌక రాకముందే త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. ఈ విషయాలను ప్రధాని మోదీ 2019లోనే తన 'మన్‌కీ బాత్' దీపావళి సంచికలో వెల్లడించారు. మొదలియార్ సోదరులు కర్నూలులో పుట్టడం విశేషం. వీరిలో ఆర్కాట్ రామస్వామి మొదలియార్ అప్పట్లో మైసూరు రాజసంస్థానం దివాన్‌గా పనిచేసేవారు. ఆయన సోదరుడు లక్ష్మణ్ మొదలియార్ డాక్టర్. మద్రాసు వర్సిటీ వీసీగా 20 ఏళ్లు పనిచేశారు. లక్షదీవుల్లో భారతీయ జెండా ఎగురవేశాక.. ఆ దీవుల అభివృద్ధిలో వ్యక్తిగత ఆసక్తి చూపాలని పటేల్ వీరిద్దరినీ కోరారు. ఈ ముగ్గురి వల్లే లక్షదీవులు ఇప్పుడు భారత పురోగతికి ఇతోధికంగా తోడ్పడుతున్నాయి.

ముయిజ్జు.. మీరు దిగిపోండి!

- మాల్దీవుల అధ్యక్షుడిపై అవిశ్వాసానికి ఆ దేశంలోని విపక్షాల ప్రయత్నం
- నష్టనివారణ చర్యల్లో ముయిజ్జు
- త్వరలో భారత్ పర్యటనకు సన్నాహాలు



న్యూఢిల్లీ/మాలె, జనవరి 9: భారత పర్యాటకం,ప్రధాని మోదీపై మాల్దీవుల మంత్రులు, ఓ ఎంపీ చేసిన కామెంట్లపై ఇప్పుడు ఆ దేశంలో రచ్చ జరుగుతోంది. అధ్యక్షుడు మహమ్మద్ ముయిజ్జును దింపేయాలని విపక్ష ఎంపీలు డిమాండ్ చేస్తున్నారు. మాల్దీవ్స్‌కు భారత్ అనాది కాలం నుంచి మిత్రదేశమని.. అలాంటి దేశ ప్రధానిపై కామెంట్లు సరికాదని పర్యాటక సంఘాలు చెబుతున్నాయి. కొవిడ్-19 కాలంలో భారత్ చేసిన మేలును మరిచిపోయారా? అంటూ ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. దీంతో మాల్దీవ్స్ అధ్యక్షుడు మహమ్మద్ ముయిజ్జు నష్టనివారణ చర్యలు చేపట్టారు. భారత్‌లో పర్యటించేందుకు ప్రయత్నాలను ప్రారంభించారు. భారత్‌తో ఉన్న సంబంధాలు ప్రమాదంలో పడేలా చేసిన మంత్రులను తొలగించడంతో సరిపోదని, అధ్యక్షుడు ముయిజ్జును గద్దె దించాలని విపక్ష మాల్దీవ్స్ డెమోక్రాటిక్ పార్టీ(ఎండీపీ) ఎంపీ అలీ అజీమ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పార్లమెంట్‌లో అధ్యక్షుడిపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెడతామని చెప్పారు. రక్షణ శాఖ మాజీ మంత్రి మారియా అహ్మద్ దీదీ కూడా అధికార పార్టీకి దూరదృష్టి లోపించిందని విమర్శించారు. మాల్దీవ్స్‌కు భారత్ 911 (ఎమర్జెన్సీ ఫోన్ నంబర్) లాంటిదని వ్యాఖ్యానించారు. మంత్రుల నోటి దురుసు మాల్దీవ్స్ ఆర్థికరంగంపై తీవ్ర దుష్ప్రభావాన్ని చూపుతుందని మాజీ మంత్రి అహ్మద్ మహ్లూఫ్ ఆందోళన వ్యక్తం చేశారు.


త్వరలో భారత్‌కు ముయిజ్జు

భారత్‌తో దౌత్యపరమైన ఇబ్బందులు తలెత్తుతున్న నేపథ్యంలో మాల్దీవ్స్ అధ్యక్షుడు ముయిజ్జు నష్టనివారణ చర్యలు చేపట్టారు. విపక్ష ఎంపీలు, పర్యాటకరంగంపై ఆధారపడ్డవారు విమర్శలు గుప్పిస్తుండడంతో.. ఈ నెలాఖరున, లేదంటే వచ్చేనెల ప్రథమార్థంలో భారత్‌లో పర్యటించేందుకు సిద్ధమయ్యారు. ఈ మేరకు మాల్దీవ్స్ అధ్యక్షుడి కార్యాలయం భారత్‌ను కోరినట్లు మీడియా సంస్థలు కథనాలను ప్రసారం చేశాయి. ప్రస్తుతం ముయిజ్జు చైనా పర్యటనలో ఉన్నారు. నవంబరులో అధికార బాధ్యతలు చేపట్టిన ముయిజ్జు తుర్కియే, యూఏఈ, చైనాల్లో పర్యటించారు. చైనా పర్యటన సందర్భంగా ఆయన జిన్‌పింగ్‌తో భేటీ అయ్యారు. భారత్‌లో 'బ్యాన్ మాల్దీవ్స్' హ్యాష్‌ట్యాగ్ ట్రెండ్ అవుతున్న నేపథ్యంలో.. చైనా నుంచి ఎక్కువ సంఖ్యలో పర్యాటకులను పంపాలని కోరారు.

లక్షదీవుల్లో కొత్త ఎయిర్‌పోర్ట్!

లక్షదీవులను పర్యాటక ప్రాంతంగానే గాక సైనిక స్థావరంగానూ తీర్చిదిద్దే దిశగా మోదీ ప్రభుత్వం యోచిస్తోంది. మిలిటరీ, పౌర అవసరాల కోసం అక్కడ విమానాశ్రయాన్ని నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తోంది. అరేబియా సముద్రం, హిందూ మహాసముద్రంలో వ్యూహాత్మక స్థితిలో ఉన్న ఈ దీవుల్లో కీలకమైన మినీకాయ్ వద్ద ఎయిర్‌పోర్టును నిర్మించాలని తలపెట్టింది. యుద్ధవిమానాలతో పాటు వాణిజ్య విమానాలు కూడా ల్యాండయ్యేందుకు ఉమ్మడి విమానాశ్రయం నిర్మించాలన్నది ప్రణాళికగా ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. ఈ ప్రతిపాదనలను కేంద్రం తీవ్రంగా పరిశీలిస్తోందని తెలిపాయి. రెండు సముద్రాల్లో శత్రువుల కదలికలను పసిగట్టడానికి ఈ ఎయిర్‌పోర్టు ఉపకరిస్తుందని వెల్లడించాయి. వాస్తవానికి మినీకాయ్ దీవుల్లో ఎయిర్‌స్ట్రిప్‌ను అభివృద్ధి చేయాలని భారతీయ కోస్టు గార్డు మొదట ప్రతిపాదించింది. ప్రస్తుత ప్రతిపాదన ప్రకారం ఈ ఎయిర్‌పోర్టు కార్యకలాపాలను భారతీయ వైమానిక దళం (ఐఏఎఫ్) పర్యవేక్షిస్తుంది. ప్రస్తుతం ఈ దీవుల్లో అగట్టీలో మాత్రమే ఒక ఎయిర్‌స్ట్రిప్ ఉంది. అన్ని విమానాలూ ఇక్కడ ల్యాండయ్యే పరిస్థితి లేదు.

ప్రధానికి వ్యతిరేకంగా దేన్నీ అంగీకరించను



ముంబై, జనవరి 9: "ప్రధాన మంత్రికి వ్యతిరేకంగా దేశానికి ఆవల జరిగే దేనినీ నేను అంగీకరించను. ప్రధాని పీఠానికి మనమంతా గౌరవం ఇవ్వాల్సిందే" అని ఎన్సీపీ అధినేత శరద్ పవార్ వ్యాఖ్యానించారు. మాల్దీవుల ఎంపీ చేసిన వివాదాస్పద వ్యాఖ్యల వ్యవహారంపై ఆయన స్పందిస్తూ.. ఈ వ్యాఖ్యలు ఆమోద యోగ్యం కావన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. "దేశం ఏదైనా.. ఎంతటి వారైనా.. ప్రధాన మంత్రిపై ఇలాంటి అవమానకర వ్యాఖ్యలు చేయడం ఆమోదయోగ్యంకాదు" అని పవార్ వ్యాఖ్యానించారు. ఇదిలావుంటే, బిల్కిస్ బానో కేసు విషయంలో 11 మంది దోషులు మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఆశ్రయించే అవకాశం ఉందని, అయితే, ఈ విషయంలో రాష్ట్ర సర్కారు జాగ్రత్తగా వ్యవహరించాలని పవార్ సూచించారు. ఈ కేసులో సదరు దోషుల శిక్షా కాలాన్ని తగ్గిస్తూ గుజరాత్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సుప్రీంకోర్టు తప్పుబట్టిన విషయం తెలిసిందే. మహారాష్ట్ర అధికారాన్ని దోచుకున్నారంటూ తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఈ నేపథ్యంలో సదరు దోషులు.. మహారాష్ట్ర సర్కారును ఆశ్రయించి.. శిక్ష తగ్గింపుపై అభ్యర్థించే అవకాశం ఉందని పవార్ అన్నారు. ఈ నేపథ్యంలో శిండే ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని, బాధితురాలి ఆవేదనను గుర్తుంచుకోవాలని అన్నారు.

కొలిక్కి వస్తున్న 'ఇండియా' సర్దుబాట్లు

- ఏడు రాష్ట్రాల్లో కుదిరిన అవగాహన
- బీహార్, మహారాష్ట్రల్లో పొత్తులు ఖరారు
- ఆప్‌తో కొనసాగుతున్న సంప్రదింపులు



న్యూఢిల్లీ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సీట్ల సర్దుబాటు దిశగా ఇండియా కూటమి వేగంగా అడుగులు వేస్తోంది. తొలుత ఏడు రాష్ట్రాల్లో సీట్ల పంపకంపై దాదాపుగా ఒప్పందం కుదిరింది. మహారాష్ట్ర, బీహార్, పంజాబ్, ఢిల్లీ, గోవా, గుజరాత్ రాష్ట్రాల్లో మిత్ర పక్షాలతో కాంగ్రెస్ ఒక అవగాహనకు వచ్చింది. ఉత్తరప్రదేశ్‌లో కూడా సమాజ్‌వాదీ పార్టీ నేత అఖిలేష్ యాదవ్‌తో కాంగ్రెస్ నేతలు సల్మాన్ ఖుర్షీద్, ముకుల్ వాస్నిక్, అశోక్ గెహ్లోత్‌లు చర్చలు ప్రారంభించారు. మహారాష్ట్రలో అయితే మంగళవారం శివసేన (ఉద్ధవ్ ఠాకరే), కాంగ్రెస్, ఎన్‌సీపీల మధ్య ఒప్పందం కుదిరింది. శివసేన, కాంగ్రెస్ చెరి 20 సీట్లకు పోటీ చేయనున్నాయి. ఎన్‌సీపీకి 6 సీట్లు, ప్రకాశ్ అంబేద్కర్ నేతృత్వంలోని వంచిత్ బహుజన్ అగాఢీకి రెండు సీట్లు కేటాయించాలని నిర్ణయించారు. బీహార్‌లోనూ పొత్తులు ఖరారయ్యాయి. జనతాదళ్ (యు), ఆర్జేడీలకు చెరి 17 సీట్లు, కాంగ్రెస్‌కు నాలుగు, సిపిఐ(ఎంఎల్)కు రెండు, సీపీఐకు ఒక సీటు ఇవ్వాలని ఇప్పటికే నిర్ణయించుకున్నారు. ఢిల్లీలో కూడా ఆప్‌కు, కాంగ్రెస్‌కు మధ్య సీట్ల ఒప్పందం దాదాపు కొలిక్కి వచ్చింది. ఢిల్లీలో కాంగ్రెస్‌కు 3 లేదా 4 సీట్లు ఇచ్చేందుకు ఆప్ సుముఖంగా ఉన్నట్లు సమాచారం. గుజరాత్, గోవాలో చెరొక సీటు, హర్యాణాలో 4 సీట్లు కేటాయించాలని ఆప్ కాంగ్రెస్‌ను కోరుతోంది. పంజాబ్‌లో కాంగ్రెస్‌కు ఆరు సీట్లు కేటాయించేందుకు ఆప్ సుముఖంగా ఉంది. కాంగ్రెస్, ఆప్‌ల మధ్య తుది చర్చలు ఒకటి రెండు రోజుల్లో ముగియనున్నాయి.

నితీశ్ కూడా పెద్ద నేతే: రాజా

ఇండియా కూటమి పార్టీల నేతల్లో బిహార్ సీఎం నితీశ్ కుమార్ కూడా పెద్ద నాయకుడేనని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా వ్యాఖ్యానించారు. మంగళవారం పట్నాలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నితీశ్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అయితే, ఇండియా కూటమిలో 'అతి పెద్ద పాత్ర' పోషించే అవకాశం నితీశ్‌కు ఉంటుందా? అన్న ప్రశ్నకు మాత్రం ఆయన సమాధానాన్ని దాట వేశారు. ఇక, కూటమి కన్వీనర్ పగ్గాలను నితీశ్‌కు అప్పగించాలన్న ప్రచారం కేవలం ఊహాగానమేనని, ఇలా జరగపోయినా కూటమి బలోపేతానికి వచ్చిన నష్టం ఏమీ ఉండదని రాజా అన్నారు. కాగా, సీపీఐ బిహార్ సహా దేశవ్యాప్తంగా బలంగా ఉందని, సీట్ల కేటాయింపుపై చర్చలు ప్రారంభమయ్యాక తమ డిమాండ్లను వినిపిస్తామని రాజా చెప్పారు.

రాహుల్ కన్నా మోదీకే ప్రజాదరణ

- కాంగ్రెస్ నేత కార్తీ వ్యాఖ్యల దుమారం

చెన్నై, జనవరి 9: రాహుల్ గాంధీ కన్నా ప్రధాని మోదీకే ప్రజాదరణ ఎక్కువగా ఉందని కాంగ్రెస్ నేత కార్తీ చిదంబరం సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలు కాంగ్రెస్‌లో దుమారం రేపాయి. తాజాగా తంతి టీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో కార్తీ మాట్లాడుతూ.. ప్రధాని మోదీపై ప్రశంసల జల్లు కురిపించారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు.. ఈవీఎంలపై సందేహాలు వ్యక్తం చేస్తున్న సమయంలో కార్తీ మాత్రం ఈవీఎంలపై తనకు పూర్తి విశ్వాసం ఉందని వ్యాఖ్యానించారు.అయితే కార్తీ వ్యాఖ్యలు పార్టీలో దుమారం రేపాయి. దీంతో ఆయనకు పార్టీ క్రమశిక్షణా సంఘం నాయకుడు, ఎమ్మెల్యే కేఆర్ రామసామి షోకాజ్ నోటీసు జారీ చేశారు. కానీ, రామసామికి షోకాజ్ నోటీసు జారీ చేసే అర్హత లేదని, ఏమైనా ఉంటే ఏఐసీసీ చూసుకుంటుందని స్థానిక నాయకులు వ్యాఖ్యానించడం గమనార్హం.

కర్ణాటక కాంగ్రెస్‌లో ముసలం

3 ఉపముఖ్యమంత్రి పోస్టుల కోసం మంత్రుల పట్టు

బెంగళూరు, జనవరి 9(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ కర్ణాటకలో ఉపముఖ్యమంత్రి పదవుల వ్యవహారం కాంగ్రెస్‌కు తలనొప్పిగా మారింది. రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి సూర్జేవాలాతో బెంగళూరులో సీనియర్ మంత్రుల బృందం భేటీ అయ్యాక వివాదం మరింత రాజుకుంటోంది. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ వ్యూహాన్ని తిప్పికొట్టాలంటే కులాలవారీగా ప్రాధాన్యమిస్తూ మూడు ఉపముఖ్యమంత్రి పదవులను సృష్టించాలని పలువురు మంత్రులు సూర్జేవాలాకు సూచించారు. ఈ విషయం తెలియగానే డీకే శివకుమార్ తీవ్ర ఆగ్రహానికి లోనైనట్లు తెలుస్తోంది. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌కు ఫోన్ చేసి, కొత్తగా ఉపముఖ్యమంత్రి పదవులు సృష్టించడాన్ని అంగీకరించబోనని, కాదంటే తాను ఉపముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేస్తానని తేల్చి చెప్పినట్లు తెలుస్తోంది.

నువ్వు బీజేపీకి 'బీ-టీం'.. కాదు నువ్వే!

ఎస్పీ బీఎస్పీ యుద్ధం

న్యూఢిల్లీ, జనవరి 9: పార్లమెంటు ఎన్నికల ముంగిట.. బీజేపీ వ్యతిరేక ఓటు బ్యాంకును తమవైపు తిప్పుకొనేందుకు ప్రయత్నిస్తున్న ఉత్తరప్రదేశ్ విపక్ష పార్టీలు ఎస్పీ, బీఎస్పీలు పరస్పరం కత్తులు దూసుకుంటున్నాయి. "బీఎస్పీ.. బీజేపీకి బీ-టీం" అని ఎస్పీ అంటే, "కాదు, ఎస్పీనే బీజేపీకి బీ-టీం".. అని బీఎస్పీ అధినేత్రి మాయావతి దుయ్యబడుతున్నారు. ఇండియా కూటమిలో బీఎస్పీకి భాగస్వామ్యం కల్పించాలన్న ఆలోచనను ఎస్పీ నేత, మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్ నిర్ద్వంద్వంగా తోసిపుచ్చితే.. అఖిలేశ్ వంటి కళంకిత నేత ఈ దేశంలోనే లేరంటూ.. మాయవతి నిప్పులు చెరుగుతున్నారు. వాస్తవానికి 2019 లోక్‌సభ ఎన్నికలకు ముందు బీజేపీకి వ్యతిరేకంగా ఎస్పీ, బీఎస్పీలు చేతులు కలిపాయి. అయితే.. ఐదేళ్ల తర్వాత స్వరం మార్చి పరస్పరం దూషించుకోవడం గమనార్హం. ప్రస్తుతం ఎస్పీ.. ఇండియా కూటమిలో భాగస్వామిగా ఉండగా, బీఎస్పీ మాత్రం ఇటు ఇండియా, అటు ఎన్డీయేలకు దూరం పాటిస్తోంది.

ప్రజాపాలన దరఖాస్తులపై నిర్లక్ష్యం.. జీహెచ్ఎంసీ సూపరింటెండెంట్‌పై వేటు

- కుత్బుల్లాపూర్‌లోనూ ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి అప్లికేషన్లు!
- డేటా ఎంట్రీ కోసం ఇళ్లకు తరలింపు
- జీహెచ్ఎంసీ అధికారుల తీరుపై విమర్శలు

హైదరాబాద్ సిటీ/కుత్బుల్లాపూర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రజా పాలనలో భాగంగా స్వీకరించిన అభయ హస్తం దరఖాస్తుల కంప్యూటరీకరణలో నిర్లక్ష్యాన్ని జీహెచ్ఎంసీ తీవ్రంగా పరిగణించింది. బాలానగర్ ఫ్లై ఓవర్‌పై దరఖాస్తులు రోడ్డుపై పడిపోయిన ఘటనలో ప్రజా పాలన టీమ్ లీడర్, హయత్‌నగర్ సర్కిల్ ఆస్తిపన్ను విభాగం సూపరింటెండెంట్ ఎం.మహేందర్‌పై సస్పెన్షన్ వేటు వేసింది. దరఖాస్తుల తరలింపు పర్యవేక్షణలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు సస్పెండ్ చేస్తున్నట్లు పేర్కొంటూ జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ ఉత్తర్వులు జారీ చేశారు. శాఖాపరమైన చర్యలపై తుది నిర్ణయం తీసుకునే వరకు ఈ సస్పెన్షన్ కొనసాగుతుందని, అప్పటివరకు అనుమతి లేకుండా మహేందర్ హైదరాబాద్ విడిచి వెళ్లొద్దని ఆదేశించారు. వాస్తవానికి ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తులను వార్డు, సర్కిల్, జోనల్ కార్యాలయాల్లో ప్రత్యేకంగా కంప్యూటర్లు ఏర్పాటుచేసి తాత్కాలిక సిబ్బంది ద్వారా డేటా ఎంట్రీ చేస్తున్నారు. ఇందుకోసం ఇంజనీరింగ్ డిగ్రీ, ఇతర విద్యార్థులు, కంప్యూటర్‌పై అవగాహన ఉన్న నిరుద్యోగ యువత, మెప్మా, ఇతర విభాగాల సిబ్బంది సేవలను వినియోగించుకుంటున్నారు. ప్రైవేట్ ఏజెన్సీలకు బాధ్యతలు అప్పగించినా.. జీహెచ్ఎంసీ కార్యాలయాల్లో వారి సిబ్బంది పనిచేసేలా ఒప్పందం ఉంది. పలు సర్కిళ్లలో మాత్రం ప్రైవేట్ ఏజెన్సీల కార్యాలయాలకు దరఖాస్తులను తరలించారు. హయత్‌నగర్ సర్కిల్ నుంచి కూకట్‌పల్లిలోని ఓ ఏజెన్సీకి ఇదే క్రమంలో అప్లికేషన్లు వెళ్లాయి. సర్కిల్ కార్యాలయం నుంచి ఎన్‌ఫోర్స్‌మెంట్ వాహనాల్లో ఏజెన్సీకి దరఖాస్తులు తరలించినట్టు ఓ అధికారి తెలిపారు. సదరు ఏజెన్సీ సబ్ కాంట్రాక్టులో భాగంగా ఇతర ప్రాంతాలకు ద్విచక్ర వాహనంపై దరఖాస్తులను తరలిస్తుండగా.. బాలానగర్ ఫ్లై ఓవర్‌పై పడిపోయాయి.


దరఖాస్తులను ద్విచక్ర వాహనంపై తీసుకెళ్తున్న వ్యక్తి

ప్రైవేటు వ్యక్తుల ఇళ్లకు దరఖాస్తులు..

హయత్‌నగర్ సర్కిల్‌కు చెందిన అభయహస్తం దరఖాస్తులు రోడ్డుపై పడిపోగా.. మంగళవారం కుత్బుల్లాపూర్‌లో ప్రైవేటు వ్యక్తులు దరఖాస్తులను తమ ఇళ్లకు తీసుకెళ్లే దృశ్యాలు దర్శనమిచ్చాయి. ఓ ఏజెన్సీకి చెందిన ఉద్యోగి దరఖాస్తులను ద్విచక్ర వాహనంపై ఇంటికి తీసుకెళ్తున్న వీడియో, ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేందుకు తీసుకెళుతున్నామని సదరు వ్యక్తులు చెప్పారు. అయితే తాము ఎవరి ఇంటికీ తీసుకెళ్లేందుకు దరఖాస్తులను ఇవ్వలేదని, ప్రక్రియను వేగవంతం చేసేందుకు వివిధ ప్రాంతాల్లో వాటిని అప్‌లోడ్ చేయిస్తున్నామని అధికారులు చెబుతున్నారు. కానీ, సంక్షేమ పథకాల కోసం ప్రజలు ఎన్నో వ్యయప్రయాసలకోర్చి చేసుకున్న దరఖాస్తులు రోడ్లపై పడిపోవడం, ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లడం పట్ల తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

సైబర్ నేరగాళ్ల చేతికి వెళ్లే ప్రమాదం: కేటీఆర్

హైదరాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన దరఖాస్తుల్లో కోట్లాది మంది తెలంగాణ పౌరుల సున్నితమైన డేటా ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. ఈ దరఖాస్తుల్ని ప్రైవేటు వ్యక్తులు నిర్లక్ష్యంగా హ్యాండిల్ చేస్తున్నారనే విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. ప్రజల రహస్య డేటా.. సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి వెళ్లకుండా ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీల్లో ఏదైనా ఇస్తామని సైబర్ నేరగాళ్లు ఫోన్ చేస్తే.. ఓటీపీ, బ్యాంకు ఖాతా వివరాలు ఇవ్వొద్దని ప్రజలకు సూచించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాటలు విని అనవసరంగా డబ్బులు పోగొట్టుకోవద్దన్నారు. బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేశారా, లేదా.. అనేదానితో సంబంధం లేకుండా సైబర్ క్రైం చట్టాన్ని రూపొందించడంలో భాగమైన వ్యక్తిగా తన మాటను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా జాగ్రత్త పడాలని ఎక్స్ వేదికగా ప్రజలకు కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.

మే రెండో వారంలో ఎంసెట్!

- పరీక్ష నిర్వహణ బాధ్యతలు మళ్లీ జేఎన్టీయూకే అప్పగించనున్న సర్కారు

హైదరాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఎంసెట్ పరీక్షను మే రెండవ వారంలో, ఆ తర్వాత మిగిలిన ప్రవేశ పరీక్షలను(సెట్‌లు) నిర్వహించాలని అధికారులు భావిస్తున్నారు. ఎంసెట్ నిర్వహణ బాధ్యతను ఈ ఏడాది కూడా జేఎన్టీయూకే అప్పగించనున్నారు. మిగతా ప్రవేశ పరీక్షల నిర్వహణను కూడా పాత కమిటీలకే అప్పగించాలని ఉన్నతాధికారులు నిర్ణయించినట్లు సమాచారం. సాధారణ పరిస్థితుల్లో అయితే ఈ సమయానికే ఆయా సెట్‌ల కమిటీలను ఎంపిక చేయడంతో పాటు, పరీక్షల నిర్వహణ తేదీలను కూడా ప్రకటించాల్సి ఉంది. కానీ, రాష్ట్రంలో ఇటీవలే అసెంబ్లీ ఎన్నికలు జరిగి కొత్త ప్రభుత్వం ఏర్పాటు కావడంతో సెట్‌ల నిర్వహణపై అధికారులు దృష్టి సారించలేదు. దీనికి తోడు కొత్త ప్రభుత్వం నామినేటెడ్ పోస్టుల్లో ఉన్న అందరినీ తొలగించింది. ఈ జాబితాలో ఉన్నత విద్యామండలి చైర్మన్, వైస్ చైర్మన్లు కూడా ఉన్నారు. వారి స్థానంలో కొత్తవారిని ఇంకా నియమించలేదు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలోనే ప్రవేశ పరీక్షలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పాతవారినే కొంతకాలం పాటు కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నారు. దీంతో, ప్రవేశపరీక్షల నిర్వహణపై అధికారులు తాజాగా దృష్టి సారించారు.

పాఠశాల విద్యపై కార్యదర్శి సమీక్ష

పాఠశాల విద్యపై విద్యాశాఖ కార్యదర్శి వెంకటేశం మంగళవారం పాఠశాల డైరెక్టర్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. విద్యా బోధన, మధ్యాహ్న భోజనం, ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలు, మెగా డీఎస్సీ తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాల వారీగా టీచర్ పోస్టులు, ఖాళీలపై ఎక్కువగా చర్చించినట్టు సమాచారం. కాగా, సెకండరీ గ్రేడ్ టీచర్స్ యూనియన్ (ఎస్జీటీయూ)అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటేశం ఇతర నేతలు మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డిని కలుసుకుని వినతి పత్రాన్ని అందజేశారు. ప్రతి పాఠశాలలో ఇద్దరు టీచర్లు ఉండాలని, సీపీఎస్‌ను రద్దు చేయాలని, ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులను పూర్తి చేయాలని వారు కోరారు.

ఫార్ములా-ఈ రేస్ ఒప్పందం.. నిబంధనలకు పూర్తి విరుద్ధం

ప్రైవేటు సంస్థలకు డబ్బు.. ప్రభుత్వానికి నష్టం.. బీఆర్ఎస్ హయాంలో స్వప్రయోజనాల కోసం రాష్ట్రం తాకట్టు

- ఈ మొత్తం వ్యవహారంలో తెరవెనుక ఉన్నది ఎవరో చెబుతాం
- మాజీ మంత్రి కేటీఆర్ విమర్శలపై డిప్యూటీ సీఎం భట్టి స్పందన
- 55 కోట్లు చెల్లించిన అధికారిపై చర్యలు ఉంటాయని స్పష్టీకరణ

హైదరాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 'ఫార్ములా-ఈ' రేస్ విషయంలో స్వప్రయోజనాల కోసం కొంతమంది రాష్ట్రాన్ని తాకట్టు పెట్టారని.. చేసినదంతా చేసి హైదరాబాద్ ఇమేజ్ తగ్గుతోందని వారు మాట్లాడడం హాస్యాస్పదమని డిప్యూటీ సీఎం, ఆర్థిక, విద్యుత్తు శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క మండిపడ్డారు. పదేళ్ల పాటు రాష్ట్రాన్ని పచ్చిగా అమ్మకానికి పెట్టిన మీరేనా.. ఇలాంటి మాటలు మాట్లాడేది..? అంటూ బీఆర్ఎస్‌పై ధ్వజమెత్తారు. రేస్‌తో ఒప్పందం నిబంధనలకు పూర్తి విరుద్ధంగా జరిగిందని పేర్కొన్నారు. ప్రభుత్వానికి ఏమైనా ఆదాయం వచ్చిందా? అని చెప్పకుండా నష్టం అంటూ గగ్గోలు పెడుతున్నారని అన్నారు. ఈ మొత్తం వ్యవహారంపై విచారణ జరిపి, చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఈ రేస్ రద్దుపై మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో మంగళవారం సచివాలయంలోని మీడియా సెంటర్‌లో భట్టి మాట్లాడారు. రేస్ టికెట్లను అమ్ముకుని 'ఏస్ నెక్స్ట్ జెన్' సంస్థ లబ్ధి పొందిందని, ఈవెంట్ నిర్వహణ సంస్థ 'ఎఫ్‌బీ ఫార్ములా-ఈ' రూ.110 కోట్లు రాబట్టుకుందని, మధ్యలో ప్రభుత్వం నష్టపోయిందని వివరించారు. నాలుగు సీజన్ల కోసం 2023 అక్టోబరు 22న ఏస్ నెక్స్ట్ జెన్, ఫార్ములా-ఈ కంపెనీ, ప్రభుత్వానికి మధ్య ఒప్పందం జరిగిందన్నారు. ప్రభుత్వం తరఫున హెచ్ఎండీఏ రూ.20 కోట్లు పెట్టి ట్రాక్ వేసిందని, హైదరాబాద్ రేసింగ్ లిమిటెడ్ రూ.35 కోట్లు ఖర్చు చేసిందని భట్టి తెలిపారు. ఫార్ములా-ఈ కంపెనీకి అప్పటి పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రూ.55 కోట్లు చెల్లించారని, మరో రూ.55 కోట్లను కట్టాలంటూ కంపెనీ ప్రభుత్వానికి నోటీసు ఇచ్చిందన్నారు. ఫిబ్రవరిలో జరిగే ఈ ఈవెంట్‌కు మంత్రివర్గం, సంబంధిత మంత్రి ఆమోదం లేకుండా ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రూ.55 కోట్లను ఎలా చెల్లించారని.. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన ఆయనపై తప్పకుండా చర్యలు తీసుకుంటామన్నారు. త్రైపాక్షిక ఒప్పందాన్ని కాదని అక్టోబరు 30న ద్వైపాక్షిక ఒప్పందం చేసుకున్నారని, దీనితో ఎవరికి ప్రయోజనం చేకూరిందో తేలాల్సి ఉందన్నారు. ఈ రేస్ టిక్కెట్లు అమ్ముకుని, అగ్రిమెంట్ నుంచి వైదొలగిన ఏస్ నెక్స్ట్ జెన్ సంస్థ ఎవరిది? దాని వెనుక ఉన్నది ఎవరో త్వరలో చెబుతామని భట్టి తెలిపారు. ద్వైపాక్షిక ఒప్పందంలో అవకతవకలు, నిధుల చెల్లింపుపై న్యాయపరంగా ముందుకు వెళతామన్నారు. రాష్ట్రాన్ని అధోగతి పాల్జేసి ప్రజల్లో మళ్లీ భ్రమలు కల్పించేలా అసత్యాలను ప్రచారం చేయడాన్ని మానుకోవాలని ప్రతిపక్ష నేతలకు హితవు పలికారు.


మీడియాతో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క

జెన్‌కో, ట్రాన్స్‌కోల్లో అక్రమ ఉద్యోగాలపై నివేదిక కోరాం

గత ప్రభుత్వంలో జెన్‌కో, ట్రాన్స్‌కోలో అక్రమ పద్ధతిలో నియామకాలు జరిగాయనే ఆరోపణలపై నివేదిక అందించాలని ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ఎస్ఏఎం రిజ్వీని విచారణకు ఆదేశించామని భట్టి తెలిపారు. కాగా, ఏ పరీక్ష రాయకున్నా అడ్డదారిలో జెన్‌కోలో 2017 జూలై 29న మాజీ సీఎం మేనల్లుడి భార్యకు ఉద్యోగం ఇవ్వడం, విధులకు హాజరుకాకున్నా ఆరున్నరేళ్లు మంత్రి పేషీలో డిప్యూటేషన్‌పై పనిచేసినట్లు రికార్డులు సృష్టించి, వేతనం పొందడం, మాజీ సీఎం సన్నిహితుల కుటుంబానికి చెందిన మరో మహిళను 2017లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఈఏగా నియమించి.. ట్రాన్స్‌కోలో విలీనం చేసుకున్నట్లు, ఆ తర్వాత ఆర్టిజన్ల కోటాలో ఏఈగా ఉద్యోగం ఇచ్చినట్లు తేలింది.

ఫార్ములా రేసు అక్రమాల్లో కేటీఆర్ హస్తం: చెనగాని

ఫార్ములా రేసు అక్రమాల్లో కేటీఆర్ హస్తం ఉందని టీపీసీసీ అధికార ప్రతినిధి చెనగాని దయాకర్‌గౌడ్ ఆరోపించారు. ఆయన సూచనతోనే ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్ వ్యవహారం నడిపారన్నారు. ఆయనతో పాటు కేటీఆర్‌పైనా చర్యలు తీసుకోవాలని కోరారు.

అద్భుతంగా ప్రజా పాలన

'ప్రజాపాలన' కింద దరఖాస్తుల స్వీకరణ అద్భుతంగా సాగిందని భట్టి వివరించారు. ఐదు గ్యారెంటీల దరఖాస్తులను ఇంటింటికీ పంపిణీ చేశామన్నారు. అధికారం చేపట్టిన రెండు రోజుల్లోనే మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించామని, 6.50కోట్ల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణ లబ్ధి పొందారన్నారు. ఒక ఎకరం ఉన్న రైతులకు రైతుబంధు సొమ్ము జమ చేశామని, రెండెకరాలున్నవారికి వేస్తున్నామన్నారు. ప్రజా భవన్‌లో తనను కలవాలనుకునేవారికి రోజూ ఉదయం 8.30-9.30 మధ్య అందుబాటులో ఉంటానని భట్టి చెప్పారు.

మెడికల్ కౌన్సిల్ చైర్మన్‌గా డాక్టర్ మహేశ్

- వైస్ చైర్మన్‌గా గుండగాని శ్రీనివాస్

హైదరాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి) తెలంగాణ రాష్ట్ర వైద్య మండలి చైర్మన్‌గా డాక్టర్ మహేశ్, వైస్ చైర్మన్‌గా డాక్టర్ గుండగాని శ్రీనివాస్ ఎన్నికయ్యారు. కౌన్సిల్ సభ్యులు డాక్టర్ రాజలింగం ఆధ్వర్యంలో చైర్మన్ ఎన్నిక ప్రక్రియ మంగళవారం జరిగింది. తెలంగాణ ఏర్పాటయ్యాక తొలిసారిగా ఇటీవల జరిగిన స్టేట్ మెడికల్ కౌన్సిల్ ఎన్నికల్లో హెల్త్‌కేర్ రిఫార్మర్స్ డాక్టర్స్ అసోసియేషన్(హెచ్ఆర్‌డీఏ) ప్యానెల్ విజయం సాధించింది. హెచ్ఆర్‌డీఏ తరఫున బరిలోకి దిగిన మహేశ్, శ్రీనివాస్ సహా 11 మంది గెలుపొందారు. కౌన్సిల్‌లో మొత్తం 25 మంది సభ్యులుంటారు. వీరిలో 13 మందిని ఎన్నికల ద్వారా ఎన్నుకుంటారు. మిగిలిన 12 మందిని ప్రభుత్వం నామినేట్ చేస్తుంది. ఎన్నికల్లో గెలుపొందిన వారి నుంచి చైర్మన్, వైస్ చైర్మన్‌ను మంగళవారం ఎన్నుకున్నారు. కాగా రాష్ట్రంలో నకిలీ వైద్యులను అరికడతామని, వైద్యులపై దాడులు జరగకుండా కఠిన చట్టాల రూపకల్పనకు కృషి చేస్తామని మెడికల్ కౌన్సిల్ చైర్మన్ మహేశ్‌కుమార్, వైస్ చైర్మన్ శ్రీనివాస్ విలేకరులతో అన్నారు.



మహేశ్, శ్రీనివాస్

రోడ్డు ప్రమాదంలో మరణించిన కానిస్టేబుల్ భార్యకు ఉద్యోగం

హైదరాబాద్‌సిటీ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ అంబర్‌పేట పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో విధులు నిర్వర్తిస్తూ రోడ్డు ప్రమాదంలో చనిపోయిన కానిస్టేబుల్ భార్యకు ఎట్టకేలకు ఉద్యోగం లభించింది. రాచకొండ పోలీసు కమిషనరేట్ పరిధిలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న సొంగా శేఖర్ 2021 సెప్టెంబరు 30న రోడ్డు ప్రమాదంలో మరణించారు. అతని భార్య సత్యలతకు ఉద్యోగం కల్పించడానికి ఆమె స్థానికత అడ్డంకిగా మారింది. దీంతో అప్పటి ప్రభుత్వం ఆమెకు ఉద్యోగం ఇవ్వడానికి నిరాకరించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఆమెకు స్థానికత కారణం చూపుతూ రెండేళ్లుగా ఉద్యోగం ఇవ్వలేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో.. సత్యలత ప్రజావాణి కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డిని కలిసి తన కుటుంబ దీనస్థితిని వివరించింది. వెంటనే స్పందించిన ముఖ్యమంత్రి మానవతా దృక్పథంతో.. నిబంధనలు సడలించి ఆమెకు ఉద్యోగం ఇవ్వాలని డీజీపీ, రాచకొండ పోలీస్ కమిషనర్లకు ఆదేశాలు జారీ చేశారు. ఈమేరకు రాచకొండ పోలీసు కమిషనర్ కార్యాలయములో సత్యలతను జూనియర్ అసిస్టెంట్‌గా నియమిస్తూ కమిషనర్ సుధీర్‌బాబు అపాయింట్‌మెంట్ ఆర్డర్ అందించారు.

'గుండ్లపోచంపల్లి'కి స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు

మేడ్చల్ టౌన్, జనవరి 9: కేంద్ర ప్రభుత్వం స్థానికసంస్థలకు అందజేసే ప్రతిష్ఠాత్మక స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ ఎంపికయ్యింది. రాష్ట్రంలో నాలుగు మున్సిపాలిటీలను ఎంపిక చేయగా అందులో గుండ్లపోచంపల్లి అవార్డు దక్కించుకుంది. ఈ నెల 11న రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు ప్రదానం చేయనున్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 14 వార్డులు ఉండగా ఇక్కడ పారిశుద్ధ్యం పట్ల పాలకవర్గం ప్రత్యేక దృష్టి సారించి ప్రజాచైతన్య కార్యక్రమాలు చేపట్టింది. దీంతో కాలనీలు దాదాపు చెత్త రహిత కాలనీలుగా మారాయి. మున్సిపాలిటీ తరఫున చెత్త సేకరణ, చెత్తశుద్ధి కేంద్రం ఏర్పాటుతో పాటు డంపింగ్ యార్డుల నిర్వహణకు పాలకులు ప్రత్యేక నిధులు కేటాయించి పనులు చేపట్టారు. మున్సిపల్ సిబ్బందికి కమిషనర్ రాములు ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చి తడి, పొడి చెత్తలను వేరుగా సేకరించేలా చేశారు.

(మొదటి పేజీ తరువాయి)

'ధరణి' ప్రక్షాళన

చేయనుంది. రేమండ్ పీటర్ సీసీఎల్ఏగా ఉండగా 'మా భూమి' అనే వెబ్‌సైట్‌ను రూపొందించడమే కాక.. రెవెన్యూ రికార్డులన్నీ పబ్లిక్ డొమైన్‌లో పెట్టి, ప్రజలందరికీ అందుబాటులోకి తెచ్చారు. అవకాశం ఇస్తే జాతీయ భూరికార్డుల నవీకరణ పథకం(ఎన్ఎల్ఆర్ఎంపీ) కింద.. 18 నెలల్లో భూముల సర్వే చేస్తానని అప్పటి ప్రభుత్వానికి నివేదిక కూడా ఇచ్చారు. రికార్డుల వడపోత కోసం గ్రామ రెవెన్యూ అధికారు(వీఆర్‌వో)లకు ట్యాబ్‌లు కూడా అందించారు. అయితే ప్రభుత్వం ఆయన విజ్ఞప్తులను పట్టించుకోలేదు. 2018లో రైతుబంధు కోసం హడావుడిగా 2017 సెప్టెంబరు నుంచి భూరికార్డుల నవీకరణ చేయగా.. దానిపై ఎన్నో విమర్శలు వచ్చాయి. ఆ రికార్డుల ఆధారంగానే తెలంగాణ భూమి హక్కులు పట్టాదారు పాస్‌పుస్తకం చట్టం-2020 ప్రకారం 'ధరణి'ని ఎలక్ట్రానిక్ రికార్డుగా గుర్తించారు. అయితే కాస్రా, సేత్వార్‌తో (భూరికార్డులు సంబంధం లేకుండా ధరణిలో ఏ రికార్డులు ఉంటే.. ఆ రికార్డులతోనే భూముల రిజిస్ట్రేషన్‌కు అవకాశం ఉంది. రిజిస్ట్రేషన్ కాగానే భూములు విక్రయించిన రైతు ఖాతాలో నుంచి ఏ మేరకు విక్రయించారో ఆ మేరకు విస్తీర్ణం నిమిషాల్లో తగ్గించి, అదే సమయంలో విక్రయదారుడి ఖాతాలో చేర్చేలా దీన్ని అందుబాటులోకి తెచ్చారు. కానీ, దానిపై భారీగా విమర్శలు వచ్చాయి.

అధికారం లేకుండా..

ధరణి చట్టం ప్రకారం భూములతో ముడిపడిన ఏ సమస్యనూ పరిష్కరించే అధికారం తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్, భూపరిపాలన ప్రధాన కమిషనర్‌కు లేకుండా తెలంగాణ భూమి హక్కులు పట్టాదారు పాస్‌పుస్తకం చట్టం-2020 తెచ్చారు. దానివల్ల.. రికార్డులతో ముడిపడిన ఏ సమస్యనైనా న్యాయస్థానంలో తేల్చుకోవాల్సిందే. దాంతో ధరణి వల్ల ప్రజలు పడే బాధలను గుర్తించిన కాంగ్రెస్ పార్టీ తాము అధికారంలోకి వస్తే ధరణిని రద్దు చేస్తామని ప్రకటించగా.. అప్పటి సీఎం కేసీఆర్ ధరణి రద్దుకు వ్యతిరేకంగా ప్రచారం చేశారు. ఈ నేపథ్యంలో.. తాజాగా కొలువుదీరిన కాంగ్రెస్ సర్కారు ధరణిని సంస్కరించే పనిలో పడింది. ఇందుకోసం వేసిన ఐదుగురు సభ్యుల కమిటీ ఇచ్చే నివేదికను బడ్జెట్ సమావేశాలకు ముందు జరిగే మంత్రివర్గంలో ఆమోదించి, శాసనసభలో చర్చించనుంది.



భూమికి రికార్డులకు లింకులు

ప్రస్తుతం భూమికి రికార్డులకు మధ్య లింకు లేకుండా పోయిందని.. ఈ నేపథ్యంలో.. రికార్డులను సరిచేయడంతో పాటు రైతులు నివేదించుకున్న అంశాలపై కమిటీ ప్రధానంగా అధ్యయనం చేయనుంది. కౌలు రైతులను గుర్తించడానికి వీలుగా ఏయే చర్యలు తీసుకోవాలి? రికార్డుల్లో అనుభవదారు కాలమ్‌ను గత ప్రభుత్వం ఎత్తివేయగా.. ఆ కాలమ్‌ను మళ్లీ ఏర్పాటు చేసే అవకాశాలను కూడా కమిటీ పరిశీలించనుంది. రికార్డులతో ముడిపడిన అన్ని సమస్యలకూ మండల స్థాయిలోనే పరిష్కారం దొరికేలా చర్యలు తీసుకోనుంది. పాత చట్టం ప్రకారం రికార్డులతో ముడిపడిన సమస్యల పరిష్కారానికి ఏ వ్యవస్థా లేకపోవడంతో వాటిపై విచారణకు జిల్లా, రాష్ట్ర స్థాయిలో రెవెన్యూ ట్రిబ్యునళ్ల ఏర్పాటు, సాదా బైనామాల క్రమబద్ధీకరణ, అసైన్డ్ భూముల యాజమానులకు ఆ భూములపై సర్వాధికారాలు అప్పగించడం, వివాదాల్లేని భూములకు టైటిల్ గ్యారంటీ అందించడం వంటి అంశాలను కమిటీ పరిశీలించే అవకాశాలున్నాయి.

నిషేధిత జాబితాపై కూడా

రిజిస్ట్రేషన్ యాక్ట్ ప్రకారం విక్రయించడానికి వీల్లేని భూములను 22(ఏ) కింద నిషేధిత జాబితా(ప్రొహిబిషన్ ఆర్డర్ బుక్-పీవోబీ)లో పెట్టగా.. అందులో పెట్టిన భూములు చాలా చోట్ల మాయమయ్యాయని.. రూ.వేల కోట్ల విలువైన భూకుంభకోణం జరిగిందని ప్రభుత్వం గుర్తించింది. నిషేధిత జాబితాలోని భూములను అయిన వారికోసమే గుట్టుగా తొలగించారనే విమర్శలు కూడా ఉన్నాయి. ప్రధానంగా శివారు జిల్లాల్లోని కలెక్టర్ల పనితీరుపై ఆరోపణలు బలంగా వచ్చాయి. ఈ నేపథ్యంలో నిషేధిత జాబితా నుంచి మాయమైన భూముల చిట్టానూ కమిటీ పరిశీలించనుంది.

టీఎస్ 'మహాలక్ష్మి'.. ఆంధ్రప్రదేశ్‌కు 'ధనలక్ష్మి'!

- ఏపీ వైపు బస్సులు తిప్పలేక చేతులెత్తేసిన తెలంగాణ
- ఏపీఎస్ఆర్టీసీ 3వేల అదనపు బస్సులు

అమరావతి, జనవరి 9(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో మహాలక్ష్మి పథకం ఆంధ్రప్రదేశ్‌కు ధనలక్ష్మిగా మారింది. సంక్రాంతి పండగ ఏపీఎస్ఆర్టీసీకి కాసుల వర్షం కురిపిస్తోంది. ఈ ఏడాది పండగ సీజన్ మొత్తం 6,795 బస్సులు నడుపుతున్న ఏపీఎస్ఆర్టీసీ.. హైదరాబాద్‌కు 1600సర్వీసులు తిప్పబోతోంది. అయితే అనూహ్యంగా ఏపీ బస్సుల్లో సీట్లన్నీ ముందస్తు రిజర్వేషన్లో అయిపోతున్నాయి. రెట్టింపు చార్జీలు వసూలు చేస్తున్న ప్రైవేటు బస్సుల్లో సైతం ఈ నెల 11 నుంచి 13మధ్యలో డిమాండ్ ఎక్కువ అవడంతో ఏపీఎస్ఆర్టీసీ అధికారులు కారణాలు ఆరా తీశారు. తెలంగాణలో మహాలక్ష్మి(మహిళలకు ఉచిత ప్రయాణం) పథకం అమలుతో హైదరాబాద్ నుంచి మహబూబ్‌నగర్, వరంగల్, ఖమ్మం, నిజామాబాద్ తదితర ప్రాంతాలకు రద్దీ ఎక్కువైంది. టీఎస్ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తే పురుషుడు టికెట్ తీసుకుంటే మహిళకు ఉచితం గనుక దాదాపు అందరూ వాటినే ఆశ్రయిస్తున్నారు. దీంతో తెలంగాణ నుంచి ఏపీ రాష్ట్రానికి పంపేందుకు బస్సులు లేక టీఎస్ఆర్టీసీ చేతులెత్తేసింది. రైళ్లన్నీ ఫుల్ అవడంతో ప్రయాణికులు ఇతర మార్గాలను అన్వేషించే పనిలో ఉండగా ఏపీఎస్ఆర్టీసీ అధికారులు అదనంగా మరో 1400బస్సులు అందుబాటులోకి తీసుకొచ్చారు. జిల్లాల మధ్య తిరిగే సూపర్ లగ్జరీ, డీలక్స్ బస్సుల్లో కండీషన్ ఉన్నవాటిని హైదరాబాద్‌కు మళ్లించారు. ఒకే సారి మూడు వేల బస్సులు అందుబాటులోకి రావడంతో రాష్ట్రానికి వచ్చే ప్రయాణికులు ఇబ్బంది లేకుండా రిజర్వేషన్లు చేసుకొంటున్నారు.

నగరంలో ఇంటర్నేషనల్ కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్

- తెలంగాణ కళలకు పూర్వ వైభవమే లక్ష్యం
- పర్యాటక-సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

హైదరాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సంస్కృతి-సంప్రదాయాలకు అనుగుణంగా సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఈ నెల 13 నుంచి 15 వరకు మూడు రోజుల పాటు పరేడ్ మైదానంలో అంతర్జాతీయ కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్‌ను భారీ ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఈ వేడుకల్లో సుమారు 15 లక్షల మందికి పైగా పాల్గొంటారని భావిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. సెక్రటేరియెట్ మీడియా కేంద్రంలో పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్‌తో కలిసి మంత్రి మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ 16 దేశాలకు చెందిన కైట్ ఫ్లైయర్స్ వేడుకల్లో పాల్గొంటారని వివరించారు. 400 రకాల స్వీట్లతో పాటు తెలంగాణ వంటకాలను ఈ సందర్భంగా ఏర్పాటు చేసే ఫుడ్ కోర్టులో విక్రయిస్తారని చెప్పారు.

రెవెన్యూ వ్యవస్థను పటిష్ఠ పరుస్తాం


- 'రెవెన్యూ ఉద్యోగుల కృతజ్ఞత సభ'లో మంత్రి పొంగులేటి

పేట్‌బషీరాబాద్, హైదరాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పరిపాలనలో రెవెన్యూ శాఖ కీలకమని, రెవెన్యూ వ్యవస్థను పటిష్ఠ పరిచి రైతులకు న్యాయం చేస్తామని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. 5 నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతన సమస్యలను బాధ్యతలు చేపట్టిన నెల రోజుల్లో నూతన సర్కారు పరిష్కరించినందుకు కృతజ్ఞతగా మంగళవారం కొంపల్లి చంద్రారెడ్డి గార్డెన్స్‌లో ట్రెసా ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూ ఉద్యోగుల కృతజ్ఞత సమావేశంలో పొంగులేటి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం రెవెన్యూ సమస్యలపై ట్రెసా సభ్యులు మంత్రికి వినతిపత్రం అందజేశారు. ట్రెసా రాష్ట్ర అధ్యక్షుడు వంగ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ ఆరు గ్యారెంటీ పథకాలను సమర్థంగా అమలు చేయడానికి గ్రామస్థాయిలో రెవెన్యూ వ్యవస్థను పునర్నిర్మించాలన్నారు. క్షేత్రస్థాయిలో సిబ్బందిని నియమించాలని ట్రెసా ప్రధాన కార్యదర్శి కె. గౌతమ్ కోరారు. వీఆర్వోలను తిరిగి రెవెన్యూశాఖలోకి తీసుకోవాలని, మరణించిన వీఆర్వోల కుటుంబాల నుంచి కారుణ్య నియామకాలు చేపట్టాలన్నారు. ట్రెసా అసోసియేషన్ అధ్యక్షులు రాజ్‌కుమార్, రియాజుద్దీన్, కోశాధికారి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఒక్క క్లిక్‌తో 33 సమస్యలపై ఫిర్యాదు

- ఎస్పీడీసీఎల్ వెబ్‌సైట్‌లో 'పవర్ ఇష్యూస్' ఆప్షన్ ఏర్పాటు
- ఫోన్ నంబర్‌తో ఫిర్యాదు.. నమోదు అనంతరం పరిష్కారం
- డిస్కమ్ సేవలపై దృష్టి.. సీఎండీ ముషారఫ్ ఫారూఖీ నిర్ణయం

హైదరాబాద్ సిటీ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మీ ఇంట్లో కరెంట్ పోయిందా..! వీధి మొత్తం విద్యుత్ సరఫరా నిలిచిపోయిందా..! ఇళ్లలో తరచూ ఓల్టేజీ సమస్యలు వస్తున్నాయా? ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ఫెన్సింగ్ లేదా, విద్యుత్ స్తంభాలపై లూజ్ లైన్ కనెక్షన్లున్నాయా? స్తంభం షాక్ కొడుతుందా? ఇలాంటి 33 రకాల సమస్యలకు ఒక్క క్లిక్‌తో ఫిర్యాదు చేసే అవకాశాన్ని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్ఎస్పీడీసీఎల్) అందుబాటులోకి తెచ్చింది. టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎండీగా బాధ్యతల స్వీకరణ అనంతరం తొలి సమీక్ష నిర్వహించిన ముషారఫ్ ఫారూఖీ.. సాంకేతికతతో వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారానికి శ్రీకారం చుట్టారు. సులభంగా ఫిర్యాదు చేయడంతో పాటు.. ఫిర్యాదుల స్థితిని వినియోగదారులు ఎప్పటికప్పుడు తెల్సుకునే అవకాశం కల్పించారు. కాగా, టీఎస్సదరన్ పవర్ వెబ్‌సైట్‌లో కొత్తగా "పవర్ ఇష్యూస్" పేరుతో ప్రత్యేక ఆప్షన్‌ను డిస్కమ్ అందుబాటులోకి తెచ్చింది. వినియోగదారులు పవర్‌ఇష్యూస్ అనే ఆప్షన్‌పై క్లిక్ చేసి.. ఎమర్జెన్సీ కంప్లైంట్ రిజిస్ట్రేషన్ పేరుతో 33 రకాల ఫిర్యాదులను నమోదు చేయొచ్చు. విద్యుత్ సంస్థల్లో రిజిస్టర్ అయిన ఫోన్ నంబర్ టైప్ చేయగానే ఓటీపీ వస్తుంది. దాన్ని ఎంటర్ చేశాక ఆ ఫోన్ నంబరుతో ఉన్న కనెక్షన్ల వివరాలు కన్పిస్తాయి. ఫిర్యాదుపై క్లిక్ చేసి వినియోగదారు పేరు, సర్కిల్, ప్రాంతం, డోర్ నంబర్ నమోదు చేయగానే ఫిర్యాదు రిజిస్టర్ అవుతుంది. అనంతరం పరిష్కరించారో లేదో కూడా తెలుసుకోవచ్చు. ఒక వినియోగదారుడు ఎన్నిసార్లు ఫిర్యాదు చేస్తున్నారనే వివరాలు వెబ్‌సైట్‌లో రికార్డవుతాయి. దీంతో ఏ ప్రాంతం నుంచి ఎలాంటి సమస్యలు ఎక్కువ వస్తున్నాయి? వాటి పరిష్కారానికి అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు. క్షేత్ర సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారా ఇలా ప్రతి అంశాన్ని విద్యుత్‌శాఖ పరిశీలిస్తుంది. శాఖలోని ఐటీ వింగ్ ఏ సర్కిల్ నుంచి ఎన్ని ఫిర్యాదులు వస్తున్నాయి వాటిని ఎన్ని గంటల్లో పరిష్కరిస్తున్నారనే వివరాలు రికార్డు చేయడంతో వినియోగదారులకు మరింత మెరుగైన సేవలందించే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.



టీఎస్ఎస్పీడీసీఎల్ వెబ్‌సైట్ కొత్తగా అందుబాటులోకి తెచ్చిన పవర్ ఇష్యూస్ ఆప్షన్

సమస్యల పరిష్కారమే ప్రధానం

- ముషారఫ్ ఫారూఖీ



వినియోగదారులు కార్యాలయాలకు రాకుండానే ఫిర్యాదులను పరిష్కరించే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని.. సేవలను మరింత సులభతరం చేసేందుకు ఉన్న ప్రతి అవకాశాన్ని పరిశీలిస్తున్నామని ముషారఫ్ ఫారూఖీ తెలిపారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో.. ఎలా ఫిర్యాదు అందినా వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. సీజీఎంలు, ఎస్ఈ, డీఈ, ఏడీఈ, ఏఈ స్థాయి అధికారులు వినియోగదారుల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకుంటూ అక్కడిక్కడే పరిష్కరిస్తున్నారని చెప్పారు. ప్రతి డివిజన్‌లో సమస్యల పరిష్కార వేదికలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. రికార్డయిన ప్రతి ఫిర్యాదును పరిష్కరించేందుకు దృష్టి సారిస్తున్నామని తెలిపారు. డిస్కం పరిధిలో 20 సర్కిళ్లలో ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నామన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

'పర్యాటక' యుద్ధం!

మీ దేశంనుంచి మరింతమంది పర్యాటకులను మా దేశానికి పంపండి అంటూ చైనా పర్యటనలో ఉన్న మాల్దీవుల కొత్త అధ్యక్షుడు మొహమద్ మొయిజు మంగళవారం విజ్ఞప్తిచేశారు. మాల్దీవుల్లో ఇంటిగ్రేటెడ్ టూరిజం జోన్ ఏర్పాటుకు వీలుగా ఉభయదేశాలు యాభైమిలియన్ డాలర్ల ఒప్పందం చేసుకున్నట్టు వార్తలు వస్తున్నాయి. మొయిజు ఇంకా ఎన్నికల ప్రచారంలో ఉండగానే, ఆయన చైనా అనుకూలుడన్న విశ్లేషణలు లోతుగా జరిగాయి. అధికారంలోకి రాగానే, ఆయన భారతదేశానికి వ్యతిరేకంగా కొన్ని నిర్ణయాలు కూడా తీసుకున్నారు. తన తొలి విదేశీ పర్యటన టర్కీలో పూర్తిచేసుకొని, ఇప్పుడు చైనాలో కాలూనడం కూడా అంచనాలకు అనుగుణంగానే ఉన్నది. ఈ పర్యటనలో ఆయన వ్యాఖ్యలు, ఒప్పందాలకు ఇటీవలి 'లక్షద్వీప్ వర్సెస్ మాల్దీవ్స్' వైరం కూడా దోహదపడి ఉండవచ్చు.

భారతదేశానికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేసినందుకు ఆదివారం తన మంత్రులు ముగ్గురిని మొయిజు సస్పెండ్ చేశారు. కొత్త సంవత్సరం తొలివారంలో రెండు రోజులు తమిళనాడు, కేరళలో పర్యటించిన భారత ప్రధాని నరేంద్రమోదీ, లక్షద్వీప్‌లోనూ కాలూని అక్కడ వెయ్యికోట్లు విలువచేసే ప్రాజెక్టులను ఆరంభించారు. ఈ ద్వీపంలో మోదీ అడుగుపెట్టడం పదేళ్ళ కాలంలో ఇది రెండోసారి. ఈసారి ఆయన సమీక్షలకు, ప్రకటనలకు పరిమితం కాకుండా, సముద్రంలో సాహసకృత్యాలు చేశారు, ఒడ్డున కూచొని ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదించారు. జనవరి 4న ఆయన చేసిన ట్వీట్లలో 'సాహసికులకు సరైన గమ్యస్థానం లక్షద్వీప్' అంటూ ఓ వ్యాఖ్య కూడా ఉంది. సహజంగానే, ఆయన అభిమానులు, బీజేపీ మద్దతుదారులు దాని ఆధారంగా, మోదీ పర్యటనతో లక్షద్వీప్‌లో టూరిజం హెచ్చి, చైనా కీలుబొమ్మ ప్రభుత్వం ఉన్న మాల్దీవులు చావు దెబ్బతింటుందని, ఇది మోదీ తెలివైన ఎత్తుగడనీ కీర్తించడం ఆరంభించారు. దీనికి ప్రతిగా ఈ రెండు ప్రాంతాలను సరిపోల్చుతూ మాల్దీవులనుంచి కొందరు చేసిన ట్వీట్లు అసభ్యకరంగా ఉండటం, అక్కడి మంత్రులు శ్రుతిమించడం ఆ దేశానికి అప్రదిష్ట తెచ్చింది. ఏటా రెండు లక్షలమంది భారతీయులు మాల్దీవులకు టూరిస్టులుగా పోతున్నందున జరిగిన నష్టాన్ని వెంటనే గుర్తించి అక్కడి అసోసియేషన్ కూడా ఈ వ్యాఖ్యలను ఖండించింది. భారత ప్రభుత్వం ఆ దేశ రాయబారిని పిలిచి తన ఆగ్రహాన్ని వెలిబుచ్చడం, సినీ, క్రీడాప్రముఖులు కొందరు ఈ వ్యాఖ్యలకు వ్యతిరేకంగా స్పందించడంతో అగ్గి చల్లారడం లేదు. ఈ రచ్చతో మనదేశంనుంచి వేసవి సెలవులకు మాల్దీవులకు పోదామనుకున్న వేలాదిమంది దేశాభిమానంతో టిక్కెట్లు రద్దుచేసుకున్నారని, ఇంటర్నెట్‌లో లక్షద్వీప్ గురించి తెలుసుకోవడం వేలాదిరెట్లు పెరిగిందని వార్తలు వస్తున్నాయి. 'బాయ్‌కాట్ మాల్దీవ్స్' అన్న నినాదం వినడానికి బాగుంటుంది కానీ, సగం దీవులు మాత్రమే నివాసయోగ్యంగా ఉంటూ పరిమాణంలో చిన్నదైన లక్షద్వీప్‌ను దానికి పోటీగా నిలపడం అసాధ్యమైన విషయం. చాలాదేశాలనుంచి మాల్దీవులకు ఇప్పటికే ఉన్న విమానసౌకర్యాలు, పర్యాటకమే లక్ష్యంగా దశాబ్దాలుగా అది వివిధ దీవుల్లో నెలకొల్పిన వసతులు, సౌకర్యాల దృష్ట్యా లక్షద్వీప్‌ను ఎంతోకొంత పెంచడానికి సైతం చేయవలసింది చాలా ఉంటుంది.

2020లో గుజరాత్ మాజీ మంత్రి ప్రఫుల్ ఖోడా పటేల్ లక్షద్వీప్ పాలకుడుగా నియమితుడైన తరువాత, లక్షద్వీప్ డెవలప్‌మెంట్ అథారిటీ రెగ్యులేషన్ చట్టం పేరిట ఆయనకు దఖలుపడిన సర్వాధికారాలు స్థానికుల, స్థానిక నాయకుల్లో తీవ్రమైన ఆగ్రహం కలిగించాయి. అభివృద్ధి కోసం స్థానికులను వేరే ప్రాంతాలకు తరలించేందుకు, వారి ఆస్తులను స్వాధీనం చేసుకొనేందుకు ఈ చట్టం అనుమతిస్తుంది. లక్షద్వీప్ అందం, అభివృద్ధి గురించి పాలకులు మాట్లాడుతున్నారంటే, వారి అభిమానులు దేశభక్తిని జోడిస్తున్నారంటే, దానిని ఆశ్రిత పెట్టుబడిదారులకు అప్పగించడానికేనని కొందరు ట్వీట్లు చేస్తున్నారు. మాల్దీవులకు, శ్రీలంకకు సమీపంలో ఉంటూ, హిందూమహా సముద్రంలో చైనా పెత్తనం పెరుగుతున్న నేపథ్యంలో లక్షద్వీప్‌ను రక్షణపరంగా బలోపేతం చేసుకోవడం ముఖ్యం. అలాగే, ప్రస్తుత పాలకుడు మనకు వ్యతిరేకంగా ఉన్నంత మాత్రాన మాల్దీవులను దూరం చేసుకోవడం అది చైనాకు మరింత సన్నిహితం కావడానికి ఉపకరిస్తుంది.

ఉద్యమ లక్ష్యాలు నెరవేర్చలేదు!

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కేవలం భౌగోళిక గుర్తింపు కోసం మాత్రమే పరిమితమైంది కాదు, ఈ ప్రాంతానికే పరిమితమైన సొంత అస్తిత్వం, ఆత్మగౌరవం, బహుజనుల పాలన భాగస్వామ్యం కోసం, ప్రజాసంఘాలతో కూడిన స్వేచ్ఛాయుత ప్రజాస్వామ్య పాలన కోసం 60 ఏండ్లు సాగిన అంశం. కానీ వాటన్నింటికీ భిన్నంగా స్వరాష్ట్రంలో పదేండ్ల పాలన సాగింది. ఈ కాలంలోను అమలుకు నోచుకోని అంశాలెన్నో ఉన్నాయి. ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భావానికి మూల కారణాలు నీళ్లు, నిధులు, నియామకాలు. కాని స్వరాష్ట్రంలో అవి సంపూర్ణంగా సాధించుకున్నట్టుగా తెలంగాణ సమాజం భావించడం లేదు.

తెలంగాణలో కృష్ణానది పరివాహక ప్రాంతం 68 శాతం ఉంది, సీమాంధ్రకు ఉన్నది కేవలం 32 శాతం మాత్రమే. కానీ 1969లో ఏర్పడిన బచావత్ ట్రిబ్యునల్ ప్రకారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన 811 టిఎంసిలనే 2014 ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం తాత్కాలిక కేటాయింపులు చేశారు. సహజ న్యాయసూత్రాలకు విరుద్ధంగా 68శాతం కృష్ణా బేసిన్ ఉన్న తెలంగాణకు 299 టిఎంసిలతో 36 శాతం నీటిని, కేవలం 32శాతం కృష్ణా బేసిన్ ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు 512 టిఎంసిలతో 64శాతం నీటి కేటాయింపులు జరిగాయి. దీనిని ఉద్యమ కాలంలో తీవ్రంగా వ్యతిరేకించిన టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆంధ్ర నాయకుల ఇండ్లల్లో విందులు చేసుకుని 'బేసిన్లు లేవు – బేషజాలు లేవు' అనడం, కృష్ణానది జలాలపై తెలంగాణ హక్కుల సాధనలో రాజీపడడమే.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వంలో పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని 11,000 క్యూసెక్కుల నుంచి 44,000 క్యూసెక్కులకు పెంచినప్పుడు దక్షిణ తెలంగాణ ఎడారిగా మారుతుందని టీఆర్ఎస్ పార్టీ ఆందోళన వ్యక్తం చేసింది. ప్రతేక రాష్ట్ర ఏర్పాటు తర్వాత కూడా జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం పోతిరెడ్డిపాడు సామర్థ్యాన్ని 80,000 క్యూసెక్కులకు పెంచినా కూడా తెలంగాణ ప్రభుత్వం దాన్ని అడ్డుకునే ప్రయత్నం చేయలేదు. 1969 బచావత్ ట్రిబ్యునల్ ప్రకారం నికరజలాలపై మాత్రమే ప్రాజెక్టులు నిర్మించాలి కాని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దానికి విరుద్ధంగా మిగులు జలాల పేరుతో కృష్ణా నదీ పరివాహక ప్రాంతం పరిధి దాటి నిర్మించ తలపెట్టిన రాయలసీమ(సంగమేశ్వర) ఎత్తిపోతల ప్రాజెక్టును నిర్మిస్తుంటే బీఆర్ఎస్ ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరించింది.



అంతేకాదు ఉద్యమకాలంలో గోదావరిపై మహారాష్ట్ర అక్రమంగా బాబ్లి వంటి ప్రాజెక్టులు నిర్మిస్తూ ఎస్ఆర్ఎస్‌పీని ఎండబెడుతుంద్రు అని వాదించిన టీఆర్ఎస్ పార్టీ బీఆర్ఎస్‌గా మారిన తర్వాత, తమ రాజకీయ అవసరాల కోసం ఎస్ఆర్ఎస్‌పీ బ్యాక్ వాటర్ ద్వారా మహారాష్ట్ర ప్రాంతానికి సాగునీరందిస్తామని అత్యుత్సాహం ప్రదర్శించింది. ఉమ్మడి రాష్ట్రంలో కాంట్రాక్టులన్నీ ఆంధ్రులకే పోతున్నాయని గోల చేసిన టీఆర్ఎస్ పార్టీ, స్వరాష్ట్రంలోను ప్రధానమైన ప్రాజెక్టులన్నీ ఆంధ్ర పెట్టుబడిదారులకే కట్టబెట్టింది. అంతేగాక కేసీఆర్ తన వ్యక్తిగత దాతృత్వాన్ని ప్రదర్శించడానికి, సొంత రాష్ట్ర రైతులకు ఖమ్మంలో మద్దతు ధర అడిగితే బేడీలు వేయించి, పంజాబ్‌కు రైతులకు ఆర్థిక సాయం, మహారాష్ట్ర పార్టీ శాఖకు పనిచేసే వ్యక్తికి తెలంగాణ ప్రభుత్వం ఖజానా నుంచి చెల్లింపులు చేశారు.

ఇక నియమకాల విషయానికొస్తే– 2021లో రాష్ట్ర ప్రభుత్వమే నియమించిన పీఆర్‌సీ(బిస్వాల్) కమిటీ ప్రకారం 1,91,000 ఖాళీలున్నట్లు చెప్పినా, 2022లో కేసీఆర్ అసెంబ్లీలో 81,000 ఖాళీలు ఉన్నట్లు చెప్పి, టిఎస్‌పిఎస్‌సి అస్తవ్యస్త నిర్వహణ ద్వారా వాటిని భర్తీ చేయడంలో అభాసుపాలయింది. తెలంగాణలో ఉద్యోగాలు తెలంగాణ వారికే చెందాలని కొట్లాడిన ఉస్మానియా యూనివర్సిటీలో సాధారణ సెక్యూరిటీ సిబ్బందిని మూకుమ్మడిగా తొలగించి స్థానికేతరులను నియమించింది. ఇది ఉద్యమ స్ఫూర్తికి, ఉద్యమ లక్ష్యానికి పూర్తిగా ద్రోహం. ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన 369 మంది 1969 తొలిదశ ఉద్యమకారులకు గుర్తింపుగా నిర్మించిన స్థూపం ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వమే ప్రారంభించాలని నినదించిన ఉద్యమ పార్టీనే 10 ఏండ్లుగా అధికారంలో ఉన్నా ఎందుకు ప్రారంభించలేదో? అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గీతంలో తెలంగాణకు తగిన ప్రస్తావన లేదన్న టిఆర్ఎస్ పార్టీ, అధికారంలోకి వచ్చాకయినా జయజయహే తెలంగాణ గీతం గాని, మరేదైనా గాని ఎందుకు తెలంగాణ గీతంగా గుర్తించలేదో నేటికి సమాధానం లేని ప్రశ్నే!

బీఆర్ఎస్ ప్రభుత్వం చాలా అంశాలలో ఓట్ల కోసం తెలంగాణ ఉద్యమాన్ని భావావేశాన్ని రగిలించడం వరకే పరిమితమైంది కానీ ఉద్యమ లక్ష్యాలను ఏ మాత్రం నెరవేర్చలేదు. తెలంగాణ ఒక కంఠం గాని, ఒక పార్టీ గాని నినదిస్తే రాలేదు. దాదాపు ఆరు దశాబ్దాలు ముక్తకంఠంతో పోరాడితే మాత్రమే వచ్చింది. అలా కాదని చెప్పడం అంటే అది ముమ్మాటికీ చరిత్ర వక్రీకరణే అవుతుంది.

– కె. రమేశ్ యాదవ్
ఓయు జేఏసీ చైర్మన్

అమెరికా సరిహద్దుల్లో పట్టుబడ్డ సుమారు లక్ష మంది భారతీయులలో 45 వేల మంది తమకు స్వదేశంలో ప్రాణాపాయం ఉన్నందున శరణార్థులుగా ఆశ్రయం ఇవ్వాల్సిందిగా కోరడం గర్హనీయం. అమెరికాలో అడుగు పెట్టడానికై మాతృభూమిపై అభాండాలు వేయడమేమిటి? స్వదేశంపై నీచమైన నిందలు మోపిన వారి గురించి దేశానికి తెలియజేయడం ప్రభుత్వ నైతిక బాధ్యత కాదా?

లజ్జాకర వలసలు!

ఏదైనా ఒక ప్రాంతం నుంచి వలసలు జరుగుతున్నాయంటే సదరు ప్రాంతం అభివృద్ధికి అమడ దూరంలో ఉన్నదై ఉంటుంది. ఉపాధి, వ్యాపారావకాశాలు లేని చోట ఎవరు సుఖ సంతోషాలతో ఉండగలరు? మాతృభూమిలో లభించని మెరుగైన ఉన్నత విద్య, పరిశోధన అవకాశాలను అందిపుచ్చుకోవడానికై భారత మన యువజనులు నేడు పెద్ద సంఖ్యలో పరసీమలకు వెళ్లుతున్నారు.

భారత్ శరవేగంగా అభివృద్ధి చెందుతోంది, సందేహం లేదు. ముఖ్యంగా గుజరాత్, సత్వర అభివృద్ధిలో యావద్భారతదేశానికీ ఆదర్శప్రాయంగా ఉన్నది. 'గుజరాత్ అభివృద్ధి నమూనా' ఆధారంగానే నరేంద్ర మోదీ జాతీయ స్థాయి నాయకుడుగా ఎదిగారు. అయితే అన్ని రంగాలలో బాగా వెనుకబడిన వివిధ ఉత్తరాది రాష్ట్రాల నుంచి కాకుండా మోదీ నిర్మించిన 'ఉజ్వల గుజరాత్' నుంచే విదేశాలకు, ముఖ్యంగా అమెరికాకు వలసలు చోటు చేసుకుంటున్నాయి. ఇది నిజంగా ఒక విస్మయకర వాస్తవం. అనాదిగా వలసలకు గుజరాత్ పెట్టింది పేరు. మహాత్మాగాంధీ కంటే చాలా ముందుగా ఆఫ్రికా దేశాలకు గుజరాతీలు గౌరవప్రదమైన రీతుల్లో వలస వెళ్లారు. సిరి సంపదలు, పేరు ప్రతిష్ఠలు సంపాదించారు. గాంధీ మొదలు, ధీరుబాయి అంబానీ, శ్యాం పిత్రోడాల వరకు అనేక మంది గుజరాతీలు వలస వెళ్లారు. మళ్లీ మాతృభూమికి తిరిగి వచ్చారు. అటు కర్మభూమి, ఇటు జన్మభూమి అభివృద్ధికి అసాధారణ సేవలు అందించారు. గల్ఫ్ దేశాల వ్యాపార, వాణిజ్య రంగాలలో అగ్రగణ్యులుగా ఉన్న ప్రవాస భారతీయులలో గుజరాతీలనే ముందుగా చెప్పితీరాలి. దుబాయి అభివృద్ధిలో గుజరాతీల పాత్ర విస్మరించలేనిది.

గల్ఫ్ లేఖ

వలసజీవనులుగా విశిష్ట చరిత్ర ఉన్న గుజరాతీలు గత కొంత కాలంగా అడ్డదారిన అమెరికాకు పయనించడానికి పట్టువదలని విక్రమార్కుల్లా పడుతున్న పాట్లు దిగ్భ్రాంతి కలిగిస్తున్నాయి. ప్రత్యేకించి అమెరికా ఇరుగు పొరుగు దేశాల నుంచి ఆ భాగ్యసీమలోకి చొరబడేందుకు చేస్తున్న ప్రయత్నాలు భారత్ ప్రతిష్ఠను మంటగల్పుతున్నాయి. వీసా వగైరా లేకుండా అడ్డదారిన అమెరికాలో చొరబడడానికి మరీ ప్రత్యేక విమానాలలో వెళ్ళినట్టుగా వస్తున్న వార్తలు భారత్‌కు గౌరవ హాని కలిగిస్తున్నాయి. గుజరాత్ నుంచి దుబాయికి, దుబాయి నుంచి ప్రత్యేక విమానాలలో నికరాగ్వాకు, అక్కడి నుంచి మెక్సికో వెళ్లి అంతిమంగా అమెరికాలో ప్రవేశించేందుకు గుజరాతీలు చేస్తున్న ప్రయత్నాలు వెలుగులోకి వస్తున్నాయి. భారత్ సిగ్గుతో మౌనంగా తలదించుకోవల్సిన ఆగత్యం ఏర్పడింది.




అమెరికాలోకి అక్రమ చొరబాటుకు పూనుకున్నవారిని తీసుకువెళ్లుతున్న ఒక ప్రత్యేక విమానం దుబాయి నుంచి బయలుదేరి తన గమ్య స్థానమైన నికరాగ్వాకు వెళ్లుతూ మార్గమధ్యంలో ఫ్రాన్స్‌లో అక్రమ రవాణా అభియోగంపై అడ్డగించబడి అటు నికరాగ్వా ఇటు దుబాయి కాకుండ గుట్టుచప్పుడుగా భారత్‌కు తిరిగి వచ్చింది. తీవ్ర ఉదంతంగా పరిగణించాల్సిన ఈ వ్యవహారంపై మీడియా, న్యూఢిల్లీ అధికార వర్గాలు మౌనం వహించడం మరీ ఆశ్చర్యం కలిగిస్తోంది.

ఒక్క 2023 సంవత్సరంలోనే వీసా లేకుండా అక్రమంగా తమ దేశంలో ప్రవేశించడానికి ప్రయత్నిస్తున్న ఇంచుమించు లక్ష మంది భారతీయులను అమెరికా అధికారులు అరెస్ట్ చేశారు. దీన్ని బట్టి అమెరికాలోకి అక్రమ చొరబాటుల వ్యవహారం ఎంత పరాకాష్ఠకు చేరిందో అర్థం చేసుకోవచ్చు. అదే సంవత్సరంలో బంగ్లాదేశ్ నుంచి భారత్‌లో అక్రమంగా చొరబడడానికి ప్రయత్నించి పట్టుబడ్డ బంగ్లాదేశీ జాతీయుల సంఖ్య ఎంతో తెలుసా? కేవలం 744 మాత్రమే. అమెరికా సరిహద్దుల్లో పట్టుబడ్డ సుమారు లక్ష మందిలో 45 వేల మంది తమకు భారత్‌లో ప్రాణాపాయం ఉందని చెప్పి తమకు శరణార్థులుగా ఆశ్రయం ఇవ్వాల్సిందిగా కోరడం గర్హనీయం. అమెరికాలో అడుగు పెట్టడానికై మాతృభూమిపై ఇలాంటి అభాండాలు వేయడమేమిటి? స్వదేశంపై నీచమైన నిందలు మోపిన వారి గురించి దేశానికి తెలియజేయడం ప్రభుత్వ నైతిక బాధ్యత కాదా? మొత్తం 7.25 లక్షల మంది భారతీయులు తమ దేశంలో అక్రమంగా నివసిస్తున్నారని అమెరికా ప్రభుత్వ నివేదికలు వెల్లడిస్తున్నాయి. రెండు దశాబ్దాల క్రితం తెలంగాణ రాష్ట్ర సమితి శాసనసభ్యులు కొందరు తమ కుటుంబ సభ్యులుగా గుజరాతీ మహిళలు, పిల్లలను అమెరికాకు తమ వెంట తీసుకువెళ్ళిన విషయం గుర్తుందా?

ఆకలి మంటలు, అంతర్యుద్ధాలతో విలవిలలాడే ఆఫ్రికా దేశాల వారు సహారా ఎడారి దాటి, సముద్రమార్గాన ఐరోపాకు చేరుకోవడాన్ని అర్థం చేసుకోవచ్చు. అదే విధంగా, కరువుకాటక ప్రాంతాలకు చెందిన (సరైన వృత్తి నైపుణ్యాలు లేని) యువత గల్ఫ్ దేశాలలో వీసా నేరంపై పట్టుబడుతున్నారంటే అర్థం చేసుకోవచ్చు. అయితే ఆర్థిక పరిస్థితి బాగా ఉండి కూడ అడ్డదారిన అమెరికాకు వెళ్లుతున్న గుజరాతీల ఉదంతాలను ఏ విధంగా అన్వయించుకోవాలి? తెలుగు యువజనులతో సహా ఎంతో మంది యువ భారతీయులు తమ ప్రతిభా సామర్థ్యాలతో అమెరికాలో తమ తమ వృత్తులు, ఉద్యోగాలలో అగ్రగాములుగా వెలుగొందుతున్నారు. మరి ఆ సుసంపన్న దేశంలోకి అక్రమంగా చొరబడేందుకు కొందరు చేస్తున్న ప్రయత్నాలు ఒక్క గుజరాత్ లేదా పంజాబ్‌కే కాకుండ సమస్త భారతావనికి తీరని కళంకం కలిగిస్తున్నాయి.

■ మొహమ్మద్ ఇర్ఫాన్
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

'జాతీయ' బంధాలలో ప్రాంతీయ పార్టీలు



ప్రధాని మోదీ పుణ్యమా అని ఏకమైన 'ఇండియా' కూటమి రాబోయే లోక్‌సభ ఎన్నికలకు సర్వసన్నద్ధమవుతోంది. మిత్రపక్షాలతో చురుగ్గా సీట్ల సర్దుబాట్లు చేసుకుంటోంది. బీజేపీతో ముఖాముఖి తలపడే సీట్లపైనే దృష్టి కేంద్రీకరిస్తోంది. రామమందిరం లాంటి భావోద్వేగ అంశాల జోలికి పోకుండా సామాజిక, ఆర్థిక సమస్యలపైనే వ్యూహాత్మకంగా ప్రజల్లోకి వెళుతోంది. దెబ్బతిన్న పులిలా రాహుల్ గాంధీ దేశంలో మరోసారి జోడో యాత్ర ప్రారంభించనున్నారు.



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

దేశ రాజకీయాలు వేగంగా మారుతున్నాయి. గత రెండు సార్వత్రిక ఎన్నికల్లోనూ బీజేపీకి పూర్తి మెజారిటీ సాధించి పెట్టిన నరేంద్రమోదీ ఇప్పుడు ఆచితూచి అడుగులు వేస్తున్నట్లు కనపడుతోంది. రామమందిర నిర్మాణాన్ని ఒక ఎన్నికల అంశంగా మార్చేందుకు ఎంత ప్రయత్నించినా అది ఎన్ని రాష్ట్రాల్లో బీజేపీకి సానుకూలంగా మారుతుందో ఆ పార్టీ నేతలు కూడా చెప్పలేకపోతున్నారు. ముఖ్యంగా ఈశాన్య, దక్షిణాది రాష్ట్రాల్లో మతం రాజకీయంగా భావోద్వేగపరమైన అంశంగా మారుతుందా అన్నది చర్చనీయాంశం. 'రామమందిరం నిర్మాణం జరిగినందుకు దూకుడుగా వ్యవహరించకండి' అని మోదీ తన మంత్రులకు చెప్పడం అతిగా ప్రచారం బెడిసికొడుతుందేమో అన్న భయానికి సంకేతం. ఇటీవల జరిగిన మూడు ఉత్తరాది రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించినప్పటికీ కాంగ్రెస్ ఓటు శాతం ఏ మాత్రం తగ్గలేదు. అసెంబ్లీ ఎన్నికలను కూడా మోదీ జాతీయ స్థాయి ఎన్నికలుగా మార్చడంతో ప్రాంతీయ పార్టీలను అక్కడి ప్రజలు పూర్తిగా తిరస్కరించారు. ఎస్‌పి, బీఎస్‌పీలు మాత్రమే కాదు, ఛత్తీస్‌గఢ్‌లో అజిత్ జోగి కుమారుడు అమిత్ జోగి నేతృత్వంలోని జనతా కాంగ్రెస్ పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది. అందువల్ల ఈ మూడు రాష్ట్రాల్లో ఓటమితో కాంగ్రెస్‌ను కొట్టిపారేయాల్సిన అవసరం ఎంత మాత్రమూ లేదు. కర్ణాటక, తెలంగాణ విజయాలతో పుంజుకున్న కాంగ్రెస్ ఈ సారి వివిధ రాష్ట్రాల్లో మిత్రపక్షాలతో పొత్తుల విషయంలో ఎన్ని త్యాగాలకైనా సిద్ధమన్న వైఖరిని ప్రదర్శించడంతో ఇండియా కూటమి ఈ సారి మోదీతో అమీతుమీ తేల్చుకునేందుకు సిద్ధపడుతున్న సంకేతాలు కనపడుతున్నాయి.

ఈ నేపథ్యంలో 2024 ఎన్నికలు స్పష్టంగా రెండు కూటములు, రెండు భావజాలాల మధ్య పోటీగా మారబోతున్నాయనడంలో సందేహం లేదు. బీజేపీ, దాని మిత్రపక్షాలు– కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు మధ్య జరిగే ఈ ప్రధాన పోటీలో ఇతర ప్రాంతీయ పార్టీల పాత్ర బాగా తగ్గిపోయే అవకాశాలు ఉన్నాయి. నిజానికి ఈ దేశంలో ప్రాంతీయ పార్టీల హవా 2014 నుంచీ తగ్గిపోతూ వస్తోంది. 1989–2014 మధ్య జాతీయ పార్టీలకు మెజారిటీ రాకపోవడంతో ప్రాంతీయ పార్టీల ప్రాధాన్యం బాగా పెరిగింది. కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏ జాతీయ పార్టీ ఏర్పాటు చేసినా ప్రాంతీయ పార్టీల దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఉండేది. 2014 తర్వాత లోక్‌సభలో బీజేపీ మెజారిటీ సాధించడం, యూపీ, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో బీజేపీదే పైచేయి కావడంతో ప్రాంతీయ పార్టీలు ఆత్మరక్షణలో పడ్డాయి. 2019 తర్వాత ప్రాంతీయ పార్టీల ఉనికికే ప్రమాదం ఏర్పడే పరిస్థితి ప్రారంభమైంది. కాంగ్రెస్, బీజేపీల్లో ఏదో ఒక జాతీయ పార్టీతో కలిసి పనిచేయాల్సిన చారిత్రక అవసరం వాటికి ఏర్పడింది.

కర్ణాటక, తెలంగాణల్లో కాంగ్రెస్‌ను గెలిపించడం ద్వారా ప్రాంతీయ పార్టీలను ప్రజలు తిరస్కరించారు. కర్ణాటకలో జెడి(ఎస్) బాగా దెబ్బతినగా, తెలంగాణలో బీఆర్ఎస్ తానెక్కిన కొమ్మను తానే నరుక్కుంది. కుమారుడి భవిష్యత్ కోసం జనతాదళ్ (ఎస్) అధినేత దేవెగౌడ తన చరమ దశలో మోదీ చెంతకు చేరేందుకు సిద్ధపడ్డారు. మరి తెలంగాణలో బీఆర్ఎస్‌ను బీజేపీ అధికారికంగా చేరదీస్తుందా, లేక బీఆర్ఎస్ మటుమాయమైపోతే ఆ స్థానంలో తాను బలపడాలని భావిస్తోందా అన్న చర్చ జరుగుతోంది. ఈ ప్రశ్నకు సమాధానం త్వరలో లభించవచ్చు. ఏదైనా బీఆర్ఎస్ మళ్లీ ఒకప్పటి పోరాట స్ఫూర్తితో పనిచేస్తేనే కాని కోలుకునే అవకాశాలు లేవు.

ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించినప్పుడు అక్కడ అధికారంలో ఉన్న వైసీపీ తీవ్ర ప్రజా వ్యతిరేకత కూడగట్టుకున్న విషయం స్పష్టమైంది. అధికార వర్గాలు, గ్రామీణ ప్రజలు, రాజకీయ పరిశీలకులు, జర్నలిస్టులు, మేధావులు అందరూ ముఖ్యమంత్రి జగన్ మళ్లీ అధికారానికి వచ్చే అవకాశాలు లేవని గట్టిగా అభిప్రాయపడ్డారు. ఇప్పటికే వేడెక్కిన రాజకీయ వాతావరణం జగన్‌కు ప్రతికూలంగా, తెలుగుదేశం–జనసేనకు అనుకూలంగా కనపడుతోంది. నిజానికి ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్‌తో ఒక సందర్భంలో మాట్లాడినప్పుడు తాను గత ఎన్నికల్లో జగన్‌కు సహాయపడే బదులు చంద్రబాబు తరఫున పనిచేసి ఉంటే బాగుండేదని అన్నారు. 'జగన్ ఒక వన్ టైమ్ వండర్' అని కూడా ఆయన వ్యాఖ్యానించారు. ఏ ఓటు బ్యాంకు ద్వారా జగన్ బలపడ్డారో ఆ ఓటు బ్యాంకును కొల్లగొట్టేందుకు జగన్ చెల్లెలు షర్మిలను కాంగ్రెస్ ప్రయోగించడం ఇటీవల జరిగిన ఒక కీలక పరిణామం. 2010లో కాంగ్రెస్ అధిష్ఠానం ఎంత చెప్పినా జగన్మోహన్ రెడ్డి వినకుండా పదవీకాంక్షతో ప్రాంతీయ పార్టీని స్థాపించారు. ఆయన జైలులో ఉన్నప్పుడు అన్న ప్రయోజనాలు కాపాడేందుకు షర్మిల ఎంతో కష్టపడ్డారన్నది జగద్విదితం. ఒక దశలో షర్మిల, తల్లి విజయమ్మ కలిసి ఎవరికి తెలియకుండా ఉండేందుకు బెంగళూరు ద్వారా ఢిల్లీ వచ్చి కాంగ్రెస్ పెద్దలతో జగన్ తరఫున రాజీకి ప్రయత్నించారు. ఇటీవల సోనియా, రాహుల్ గాంధీలను ఆమె కలుసుకున్నప్పుడు సొంత కుటుంబసభ్యురాలిని కలుసుకున్నట్లుగా వారు సంతోషించారు. 'అన్న లాగా షర్మిల వేరు కుంపటి పెడితే ఏం చేస్తారు' అని ఒక ఏపీ కాంగ్రెస్ నేత ప్రశ్నించినప్పుడు 'ఆమె ఇక కాంగ్రెస్ మనిషి. అది మా గ్యారంటీ' అని ఖర్గే, రాహుల్ అన్నట్లు సమాచారం. ప్రజలు అందలమెక్కించినప్పటికీ తనకు తానే నష్టం చేసుకున్న జగన్ కేసీఆర్ కోవలోకి చేరిపోయే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. కాలక్రమేణా ఏపీలో కూడా ఎన్డీఏ, కాంగ్రెస్ పార్టీలే రంగంలో మిగిలిపోయినా ఆశ్చర్యపడనక్కర్లేదు.

ఇక ఇతర రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీల పరిస్థితి ఎలా ఉన్నది? ఒడిషాలో నవీన్ పట్నాయక్ నేతృత్వంలోని బిజూజనతాదళ్ గత ఎన్నికల్లో అయిదోసారి అధికారంలోకి వచ్చినప్పటికీ లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 8 సీట్లు గెలుచుకుంది. రాష్ట్రంలో బీజేపీ ప్రత్యర్థి అయినప్పటికీ ఆయన కేంద్రంలో బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారు. నవీన్ పట్నాయక్ అనంతరం బీజేడీ భవిష్యత్ అగమ్యగోచర పరిస్థితిలో పడడం తమకు ప్రయోజనకరమని బీజేపీకి తెలుసు. పశ్చిమబెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్‌ది పై చేయిగా ఉన్నప్పటికీ బీజేపీని ఎదుర్కోవడం కోసం కాంగ్రెస్, తదితర పార్టీలతో కలిసి పనిచేయక తప్పని పరిస్థితి ఏర్పడింది. బిహార్‌లో ఆర్‌జేడీకి గత లోక్‌సభలో ఒక సీటు కూడా రాలేదు. బీజేపీతో పొత్తు మూలంగా జనతాదళ్ (యు) లోక్‌సభలో 16 సీట్లు గెలిచింది కాని అది స్వంత బలం కాదు. అందువల్ల ఇప్పుడు మోదీ వ్యతిరేక శక్తులన్నీ కాంగ్రెస్‌తో కలిసి పోరాడక తప్పదు. యూపీలో సమాజ్‌వాది పార్టీ నేత అఖిలేశ్ యాదవ్ ఈ సారి లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చూపించలేకపోతే ఆయన భవిష్యత్ కూడా సమస్యలో పడుతుంది. కనుక ఆయన కూడా కాంగ్రెస్‌తో కలిసి పనిచేయాల్సిన అగత్యం ఏర్పడింది. ఒకప్పుడు ముఖ్యమంత్రి పదవిలో ఉన్న మాయావతికి ఇప్పుడు అసెంబ్లీలో ఒక్క సీటే ఉన్నది. అదృశ్యమయ్యే ప్రాంతీయ పార్టీల జాబితాలో బిఎస్‌పి చేరకుండా ఆమె ఏమి చేస్తారన్నది ఇప్పుడు ఆసక్తికరం. '80 ఏళ్లు దాటినా కొందరు రాజకీయాలను పట్టుకుని వేళ్లాడుతుంటారు' అని మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ తన బాబాయి, ఎన్‌సీపీ నేత శరద్ పవార్ గురించి వ్యాఖ్యానించారు. మహారాష్ట్రలో రెండు ముక్కలైన నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీని బతికించి తన కుమార్తె సుప్రియా సూలే భవిష్యత్‌ను కాపాడేందుకు 84 ఏళ్ల శరద్ పవార్ తీవ్ర పోరాటం చేస్తున్నారు. మరోవైపు ఉద్ధవ్ థాకరే నేతృత్వంలోని శివసేన కూడా రెండు ముక్కలై పార్టీ ఎన్నికల గుర్తు కూడా కోల్పోయింది. మోదీ ధాటికి తట్టుకోలేక కకావికలైన ఎన్‌సీపీ(శరద్ పవార్), శివసేన(ఉద్ధవ్ థాకరే)లకు కాంగ్రెస్‌తో కలిసి బీజేపీని ఎదుర్కోవడం మినహా వేరే మార్గం లేదు. ఢిల్లీ, పంజాబ్‌లలో ఒకప్పుడు కాంగ్రెస్‌పై పోరాడిన ఆమ్ ఆద్మీ పార్టీ కూడా నరేంద్రమోదీ తమపై కేంద్ర ఏజెన్సీలను ప్రయోగించడం మూలంగా దిక్కుతోచని పరిస్థితుల్లో కాంగ్రెస్‌తో రాజీపడాల్సివస్తోంది. జార్ఖండ్‌లో జేఎంఎం, తమిళనాడులో డీఎంకే మొదటి నుంచీ కాంగ్రెస్‌తో ఉన్నవే. బీజేపీతో తెగతెంపులు చేసుకున్న అన్నాడీఎంకే ఎటువైపు వెళుతుందో ఎన్నికల తర్వాత తేలుతుంది.

ఇటీవల ముగిసిన పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఇండియా కూటమికి చెందిన పార్టీల ఎంపీలు అందరినీ మోదీ సర్కార్ ఉద్దేశపూర్వకంగానే బహిష్కరించింది. ఈ బహిష్కరణ మూలంగానే కాక, ఏజెన్సీలను ప్రయోగించడం వల్ల కూడా ఆ పార్టీలన్నీ గత్యంతరం లేక మరింత సంఘటితం అవుతాయని, తమను ఎదుర్కొనేందుకు సిద్ధపడతాయని మోదీకి బాగా తెలుసు. ఆయన కూడా తన వైపుకు వచ్చే పార్టీలను కూడా కలుపుకుని 'ఇండియా' కూటమిని ఎదుర్కొనేందుకు సిద్ధపడుతున్నారు. ఒకరకంగా ఇది మోదీ చేస్తున్న మరో బలమైన ప్రయోగం. ఎందరు ఎదురొచ్చినా తాడో పేడో తేల్చుకునేందుకు ఆయన తన సర్వశక్తులు ఒడ్డి పోరాడాలనుకుంటున్నారు. దేశంలో రాజకీయ పోరాటాన్ని ఆయనే రెండు కూటముల మధ్య ఘర్షణగా మార్చారు. ఈ ఘర్షణలో బీజేపీ ప్రభంజనం వీస్తే దేశంలో ఎన్ని పార్టీలు అస్తిత్వ పరీక్షలో పడతాయో చెప్పలేము. కాని మోదీ పుణ్యమా అని ఏకమైన ఇండియా కూటమి కూడా బలంగా రంగంలోకి దిగేందుకు సన్నాహాలు చేస్తోంది. అతి వేగంగా మిత్రపక్షాలతో సీట్ల సర్దుబాట్లు కుదుర్చుకుంటోంది. బీజేపీ, ఇతర రాజకీయ ప్రత్యర్థులతో ముఖాముఖి తలపడే సీట్లపైనే దృష్టి కేంద్రీకరిస్తోంది. రామమందిరం లాంటి భావోద్వేగ అంశాల జోలికి పోకుండా కేవలం రాజకీయ, సామాజిక, ఆర్థిక న్యాయానికి సంబంధించిన అంశాలపైనే వ్యూహాత్మకంగా ప్రజల్లోకి వెళుతోంది. దెబ్బతిన్న పులిలా రాహుల్ గాంధీ మరోసారి దేశంలో జోడో యాత్ర ప్రారంభించనున్నారు. ఈ ఎన్నికలు రాహుల్, కాంగ్రెస్, ఇండియా కూటమి భవిష్యత్‌నే కాదు, దేశ భవిష్యత్‌ను నిర్దేశించే ఎన్నికలని చెప్పక తప్పదు.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

భారత్ వికసిస్తోందా... ఏదీ, ఎక్కడ?

నరేంద్రమోదీ ప్రభుత్వం 'వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర' పేరున దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రచారాన్ని చేపట్టింది. ఈ పదేళ్ల పాలనలో మోదీ సర్కార్ సాధించిన విజయాలను ప్రజల్లో ప్రచారం చేయడం ఈ యాత్ర ముఖ్యోద్దేశం. కేంద్ర మంత్రులు అనేక ప్రాంతాల్లో పర్యటిస్తూ తమ పాలనలో దేశం సాధించిన అభివృద్ధిని ప్రచారం చేస్తున్నారు. దేశ జీడీపీ (స్థూల జాతీయ ఉత్పత్తి) 7 శాతానికి పైగా వృద్ధి రేటుతో దూసుకుపోతోందని, 2047 కల్లా ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరిస్తుందని ప్రధాని మోదీ ఇటీవలే ప్రకటించారు. ఆయన ప్రభుత్వం ఈ పదేళ్ల కాలంలో సాధించిందేమిటో పరిశీలిస్తే స్వాతంత్ర్య శతాబ్ది ఉత్సవాల (2047) నాటికి దేశం ఏ స్థితిలో ఉంటుందో స్పష్టంగా అవగతమవుతుంది.

జీడీపీ వృద్ధిరేటును ముందు సంవత్సరంతో పోల్చి ఈ సంవత్సరం ఎంత పెరిగిందో శాతంగా తెలుపుతారు. 2021లో కోవిడ్ సందర్భంగా మన జీడీపీ మైనస్ 5.8 శాతం నమోదయింది. దీనితో పోల్చి 2022, 2023లలో జీడీపీ వృద్ధిరేటు ఏడు శాతానికి పైగా చేరిందని ప్రభుత్వం లెక్క కట్టింది. వాస్తవంగా 2004–14 సంవత్సరాల మధ్య పదేళ్ల కాలంలో జీడీపీ వృద్ధిరేటు సగటున 8.1శాతంగా ఉంది. అదే నరేంద్ర మోదీ ప్రభుత్వ కాలంలో అది 5.4శాతం మాత్రమే. పోనీ వీరు చెబుతున్నట్లు సాధించిన అభివృద్ధి సామాన్యుల వద్దకు చేరుతోందా? ఆర్థిక అసమానతలలో భారతదేశం ప్రపంచంలోనే అగ్రభాగాన ఉందని ప్రపంచ బ్యాంకు తాజా నివేదిక పేర్కొంది. ఆక్స్‌ఫామ్ ఇంటర్నేషనల్ గత పదేళ్ల కాలంలో భారతదేశంలోని సంపన్నుల ఆదాయం పదిరెట్లు పెరిగిందని, వారి వార్షికాదాయం నేడు భారతదేశ బడ్జెట్ కంటే అధికమని తెలిపింది. జనాభాలో ఒక్క శాతంగా ఉన్న సంపన్నులకు దేశ ఆదాయంలో 73 శాతం పోతుండగా, 67 కోట్ల మంది సామాన్యుల ఆదాయం మాత్రం ఒక్క శాతమే పెరిగింది. వైద్య ఖర్చులకై అప్పులు చేయడం, ఆస్తులు అమ్ముకోవడం ద్వారా దేశంలో ప్రతి ఏటా 6.3 కోట్ల మంది ప్రజలు దారిద్ర్యంలోకి నెట్టబడుతున్నారని ఈ సంస్థ పేర్కొంది.

కేంద్ర ప్రభుత్వం గొప్పగా చెప్పుకుంటున్న వృద్ధిరేటు... ఉపాధి అవకాశాలు కల్పిస్తోందా అంటే అవీ సన్నగిల్లుతున్నాయి. మోదీ మహాశయుడు ఇచ్చిన రెండు కోట్ల ఉద్యోగాల హామీ గాలికి పోయింది. నిరుద్యోగిత రేటు పది శాతానికి చేరింది. ఇప్పటికే కులం, ప్రాంతం, మతం, జెండర్ అసమానతలతో ఉన్న భారతదేశంలో నేడు ఆర్థిక అసమానతలు కూడా చేరడం ఆందోళనకరంగా ఉందని ప్రొఫెసర్ హిమాన్షు (జేఎన్‌యూ) అన్నారు. పోనీ ప్రజల జీవన ప్రమాణాలయినా మెరుగుపడ్డాయా అంటే, దానికి భిన్నంగా పేదరికం పెద్ద ఎత్తున పెరుగుతోంది. ఆర్భాటంగా ప్రారంభించిన జన్‌ధన్ అకౌంట్లలో డబ్బులే లేవు. పెరుగుతున్న ధరలతో ప్రజలు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు.

ప్రధాని మోదీ పదేళ్ళ పాలనలో అసమానతలు మరింత పెరిగి, ప్రజల జీవన ప్రమాణాలు ఘోరంగా పడిపోయాయి. 2047లో స్వాతంత్ర్య శతాబ్ది ఉత్సవాల నాటికి అయినా మనం నిజమైన 'వికాసం' సాధించగలుగుతామా?



నిత్యావసర సరుకులన్నీ విపరీతంగా పెరిగాయి. విద్య వైద్యం విలాస వస్తువులుగా మారిపోవడంతో సామాన్య ప్రజలు తీవ్ర ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఫలితంగా ప్రజలు పెద్ద ఎత్తున పేదరికంలోకి నెట్టబడుతున్నారు. 74.1 శాతం భారతదేశ పౌరులు ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోలేకపోతున్నారని ఐక్యరాజ్యసమితికి చెందిన ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ నివేదిక తెలిపింది. జీడీపీ వృద్ధిరేటు సాధించడంలో విశేషమైన పాత్ర పోషిస్తున్న కార్మికులు, రైతుల జీవన ప్రమాణాలైనా మెరుగుపడ్డాయా అంటే అదీ లేదు.

అతి పెద్ద రైల్వే సహా ప్రభుత్వ సంస్థల్లో ఉద్యోగ నియామకాలను కేంద్ర ప్రభుత్వం దాదాపు నిలిపివేసింది. ఎటువంటి ఉద్యోగ భద్రత లేని, అత్యంత తక్కువ వేతనాలకు ఈ రోజున కార్మికులు పనిచేయవలసి వస్తోంది. కొత్తగా వస్తున్న ఉపాధి కూడా కాంట్రాక్టు, అసంఘటిత రంగాల్లోనే. వీరికి అత్యధికంగా నెలకు పదిహేను వేలకు మించి ఆదాయమే ఉండటం లేదు. మహిళాభివృద్ధి, బేటీ పడావో అని గొప్ప నినాదాలిస్తున్న మోదీ ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీ, ఆశ, మిడ్ డే మీల్స్ వంటి రంగాల్లో పనిచేస్తున్న సుమారు కోటి మందికి పైగా మహిళా కార్మికులకు ఉద్యోగ భద్రత లేకపోవడమే కాక, వేతనాలు కూడా అత్యంత తక్కువ. పేదలకు పోషకాహారం, మహిళా, శిశు సంరక్షణ వంటి ముఖ్యమైన అనేక సేవలందిస్తున్న ఈ స్కీం వర్కర్ల సమస్యలు ఎంతగా ఉన్నాయంటే ఆఖరుకు ఆరెస్సెస్‌కు అనుబంధంగా ఉన్న భారతీయ మజ్దూర్ సంఘ్ కూడా వీరి సమస్యల పరిష్కారానికై ఆందోళన చేయవలసి వచ్చింది.

ఎన్డీఏ మొదటి ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన పెన్షన్ విధానం ఉద్యోగుల పొదుపు సొమ్మును కొంతమంది కార్పొరేట్లు కొల్లగొట్టుకుపోయేలా తయారైంది. దీనిని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని అనేక రాష్ట్రాల్లో ఉద్యోగులు పెద్ద ఎత్తున పోరాడుతున్నారు. ఇది చాలదన్నట్లు కార్మికులకు కొంతైనా మేలు కలిగే 27 కార్మిక చట్టాలను రద్దుచేసి, వాటి స్థానంలో సంఘం పెట్టుకోవడం, సమ్మె చేయడం వంటి హక్కులను సైతం హరించే కార్మిక వ్యతిరేక అంశాలతో నాలుగు లేబర్ కోడ్‌లను మోదీ ప్రభుత్వం చేసింది. మరోపక్క వ్యవసాయరంగంలో పూర్తి రైతు వ్యతిరేక విధానాలను అమలు చేస్తోంది. కార్పొరేట్ సేద్యాన్ని ప్రోత్సహించేలా నల్ల చట్టాలను చేసి, అన్నదాతలు సంవత్సరం పైగా పెద్ద ఎత్తున పోరాడిన దరిమిలా వాటిని రద్దు చేస్తున్నట్లు ప్రకటించినా ఆచరణలో అవే కార్పొరేట్ అనుకూల విధానాలను కేంద్రం కొనసాగిస్తోంది.

మోదీ ప్రభుత్వ కాలంలో శ్రామిక మహిళలతో పాటు సాధారణ మహిళలు కూడా పెద్ద ఎత్తున వివక్షకు గురవుతున్నారు. నేషనల్ క్రైమ్ బ్యూరో నివేదిక ప్రకారం గత ఏడాది దేశంలో 62,946 మంది బాలికలు కనిపించకుండా పోయారు. వీరిలో అత్యధికులు వేశ్యాగృహాలపాలయ్యారు. ఇవన్నీ అధికారికంగా నమోదైన లెక్కలు. వాస్తవంలో ఇంకా ఎక్కువగా ఉన్నాయి. ఉదాహరణకు ఒడిషా రాష్ట్రంలోని సుందర్‌ఘర్ ప్రాంతంలో సర్వే నిర్వహించిన ప్రగతి అనే స్వచ్ఛంద సంస్థ 70 గ్రామాలలో పదమూడు వేలమంది అమ్మాయిలు కనపడలేదని తెలిపింది.

నేడు దేశం వికసిత భారత్‌గా కాక, అత్యధిక ప్రజానీకాన్ని అభివృద్ధి ఫలాల నుండి గెంటివేసే భారత్‌గా రూపాంతరం చెందుతోంది. ఇది ఇలాగే కొనసాగితే 2047 కల్లా దేశం ఎలా ఉంటుందన్నది ఊహించుకుంటేనే ఆందోళన కలుగుతుంది. ప్రధాని మోదీ పదేళ్ళ పాలనలో అసమానతలు మరింత పెరిగి, ప్రజల జీవన ప్రమాణాలు ఘోరంగా పడిపోయాయన్నది వాస్తవం. భావోద్వేగాలు రెచ్చగొట్టి కొంతకాలం పబ్బం గడుపుకోగలరేమో గానీ, ఎల్లవేళలా అశేష ప్రజానీకాన్ని మోసపుచ్చలేరు.

• ఎ. అజ శర్మ
ప్రధాన కార్యదర్శి, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక



మూత 'బడి'కి మోక్షం



మూతబడిన పాఠశాలలకు మంచి రోజులు రానున్నాయి. త్వరలో ఇవి తిరిగి తెరుచుకోనున్నాయి. సీఎం ఆదేశాలతో ఆ దిశగా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవడం మొదలు పెట్టారు. మూతబడిన సర్కార్ బళ్లను తిరిగి తెరిచేందుకు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా బళ్లు మూతపడిన గ్రామాల్లో విద్యార్థుల గురించిన సర్వేను నిర్వహిస్తున్నారు. బడులు మూతపడడంవల్ల ఇతర స్కూళ్లలో చేరలేకపోయి ఇంటి వద్దనే ఉంటున్న ఇప్పటికీ పాఠశాల ముఖం చూడని పిల్లలను గుర్తించే పనిలో పడ్డారు అధికారులు. మూడబడులను తిరిగి తెరి చే విషయమై ప్రభుత్వం నుంచి ఇంకా మార్గదర్శకాలు రాలేదు. రాగానే ఆ మేరకు చర్యలు తీసుకోవడానికి అధికారులు సిద్ధమవుతున్నారు.

తిరిగి తెరిచేందుకు విద్యాశాఖ కసరత్తు

- సీఎం ఆదేశాలతో కదిలిన అధికారులు
- హనుమకొండ జిల్లాలో 15 పాఠశాలలు మూత
- గ్రామాల్లో మరోసారి సర్వే
- విద్యార్థులను బడికి రప్పించే చర్యలు
- మూతడినవాటిలో ఎక్కువ ఏకోపాధ్యాయ స్కూళ్లే..

హనుమకొండ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు లేక చాలా చోట్ల బడులు మూత పడ్డాయి. ఏళ్లు గడుస్తున్నా విద్యాశాఖ అధికారులు వాటి గురించి పట్టించుకోవడం లేదు. దీంతో ఆ పాఠశాలలు పూర్తిగా కనుమరుగవుతున్నాయి. విద్యార్థులు లేరనే సాకుతో అక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై ఇతర పాఠశాలలకు పంపడంవల్ల ఈ పరిస్థితి నెలకొన్నది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీసుకున్న తాజా నిర్ణయం వల్ల మూతపడిన పాఠశాలలకు మంచి రోజులు రానున్నాయి. మూసివేసిన వాటిని వెంటనే తెరిపించాలని సీఎం అధికారులను ఆదేశించడం వల్ల స్వగ్రామంలోనే విద్యార్థులు చదువుకునే అవకాశం కలుగనున్నది.

ఇక మంచి రోజులు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 320 పాఠశాలలు మూతపడగా హనుమకొండ జిల్లాలో 15పాఠశాలలను మూసి వేశారు. విద్యార్థులు వస్తే పాఠశాలలు నడిపేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ విద్యార్థులు లేరంటూ ఉపాధ్యాయులను ఇతర పాఠశాలలకు పంపారు. ఎంత మంది పిలలున్నా ప్రభుత్వ పాఠశాలను నడపాల్సిందేనని ముఖ్యమంత్రి ఆదేశించడంతో సర్కారు బడులకు మంచి రోజులు రానున్నాయి. ఉపాధ్యాయుల కొరత తీర్చేందుకు మెగా డీఎస్సీని వేయనన్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. కొత్త ఉపాధ్యాయులు వస్తే మూతపడిన పాఠశాలలు తిరిగి తెరుచుకునే అవకాశం ఉంది. వారు వచ్చేంత వరకు తాత్కాలికంగా ఇతరులను నియమించే అవకాశం ఉంది.

మూతకు పలు కారణాలు

ప్రభుత్వ పాఠశాలలు మూతపడడానికి విద్యార్థులు లేకపోవడం ఒక్కటే కారణం కాదని పలువురు అభిప్రాయపడుతున్నారు. నాణ్యమైన విద్య, సకల సదుపాయాలతో ప్రైవేటు స్కూళ్లకు దీటుగా విద్యను అందిస్తున్నట్టు చెబుతున్న ప్రభుత్వం.. వాస్తవంగా ఆ దిశగా పెద్దగా చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్లు ఉంటే విద్యార్థులు లేకపోవడం, విద్యార్థులున్న పాఠశాలల్లో టీచర్లు లేకపోవడం, విద్యార్థులు, ఉపాధ్యాయులున్న చోట్ల పాఠశాలలకు సొంత భవనాలు, కనీస సదుపాయాలు లేకపోవడం సర్వసాధారణంగా కనిపించే దృశ్యం. మూతపడిన పాఠశాలల్లో చాలావరకు ఏకోపాధ్యాయ పాఠశాలలు ఎక్కువ. ఒకరికన్నా ఎక్కువ మంది ఉపాధ్యాయులున్న పాఠశాలలు కూడా ఉన్నాయి. తల్లిదండ్రులు తమ పిల్లలను ఇలాంటి పాఠశాలలకు పంపడానికి ఇష్టపడడం లేదు.

ప్రాథమిక విద్యార్థులు కరువు

హనుమకొండ జిల్లాలోని 14 మండలాల పరిధిలో మొత్తం 880 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, వీటిలో లక్షాపదివేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా ఉన్నా ప్రాథమిక స్థాయిలో మాత్రం విద్యార్థుల సంఖ్య పడిపోతూ వస్తోంది. విద్యాహక్కు చట్టం ప్రకారం కిలో మీటరు పరిధిలో పాఠశాల తప్పనిసరిగా ఉండాలనేది నిబంధన. ఈ లెక్కన గతంలో పాఠశాలల ఏర్పాటు జరిగింది. కానీ విద్యార్థులు లేరన్న కారణంతో వీటిలో కొన్నిటిని మూసివేశారు. ప్రాథమిక స్థాయిలో ఏకోపాధ్యాయ పాఠశాలలు ఎక్కువగా ఉండడటం, కొన్ని గ్రామాలలో ప్రైవేటు ప్రభావంతో విద్యార్థులు ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు తరలివెళుతున్నారు.

రేషనలైజేషన్ మరో కారణం

రేషన్‌లైజేషన్ పేరుతో ఉపాధ్యాయులను ఎక్కువ సంఖ్యల విద్యార్థుల పాఠశాలలకు పంపించడం బడులు మూతపడడానికి ఇంకో కారణంగా చెబుతున్నారు. విద్యార్థులుంటేనే పాఠశాల అనే భావనతో ఉన్న ప్రభుత్వం.. ఉపాధ్యాయుడు ఉంటేనే బడి అనే ఆలోచనను మాత్రం చేయడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు విమర్శిస్తున్నారు. ఉపాధ్యాయుల కొరత ఏకోపాధ్యాయ పాఠశాలలపై పడింది. ఎక్కువమంది విద్యార్థులున్న పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతను తీర్చేందుకు రేషనలైజేషన్ పేరుతో ఐదునుంచి పది మంది విద్యార్థులున్నప్పటికీ ఏకోపాధ్యాయ పాఠశాలల నుంచి ఉపాధ్యాయులను తరలించడంతో ఆ పాఠశాలలు మూతపడక తప్పలేదు.

అస్తవ్యస్తంగా ఏకోపాధ్యాయ బోధన

జిల్లాలో ఏకోపాధ్యాయ బోధన అస్తవ్యస్తంగా మారింది. పాఠశాలలు మూతపడడడానికి ఇది కూడా ఒక కారణంగా చెబుతున్నారు. ఉపాధ్యాయుడు సెలవుపై వెళ్లినా లేదా సమావేశానికి వెళ్లినా ఆరోజు పాఠశాల మూతపడుతోంది. దీంతో విద్యార్థులకు సరైన బోధన అందడం లేదు. ఏకోపాధ్యాయ టీచర్లకు నెలకు రెండుసార్లు మండలంలో జరిగే మీటింగ్‌లకు వెళ్లాల్సి రావడంతో ఆ సమయంలో విద్యార్థులను ఇళ్లకు పంపిస్తున్నారు. అంతే కాకుండా 1 నుంచి 5 తరగతుల విద్యార్థులను ఒకే గదిలో కూర్చోబెట్టి పాఠాలు బోధిస్తుండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో 155 వరకు ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉండగా, వాటిలో విద్యార్థులు లేక 15 పాఠశాలలు మూతపడ్డాయి. మిగతా పాఠశాలల్లో ఒకే టీచర్ చొప్పున బోధిస్తున్నారు. ఏ పాఠాలు ఎవరికి చెబుతున్నారో అర్థంకాక విద్యార్థులు చదువులో వెనకబడుతున్నారు. దీంతో తల్లిదండ్రులు బడి మాన్పించి ప్రైవేటు పాఠశాలల బాటపడుతున్నారు.

మూతబడిన స్కూళ్లు

హనుమకొండ జిల్లాలో మొత్తం 15 పాఠశాలలు మూతపడ్డాయి. ఇవన్నీ ప్రాథమిక పాఠశాలలు. వీటి ఒక హైస్కూల్, ఒక అప్పర్ ప్రైమరీ స్కూల్ కూడా ఉంది. వీటిలో పనిచేస్తున్న ఉపాధ్యాయులందరినీ డిప్యూటేషన్‌పై ఇతర స్కూళ్లకు పంపించారు. శాయంపేట మండలంలో ఎంపీపీఎస్ కొప్పుల, జడ్పీహెచ్ఎస్ కొప్పుల, ఎంపీపీఎస్ నూర్జాన్‌పల్లి, ఆత్మకూరు మండలంలో ఎంపీపీఎస్ ఆత్మకూరు, ఎంపీపీఎస్ బ్రాహ్మణపల్లి, భీమదేవరపల్లి మండలంలో ఎంపీపీఎస్ వీవీ నగర్, ఎంపీపీఎస్ గొల్లపల్లి, ఎంపీపీఎస్ మంకతనాయక్ తండా, ఎంపీపీఎస్ వీర్లగడ్డ తండా, వేలేరు మండలంలో ఎంపీపీఎస్ వీర్లగడ్డ తండా, కమలాపూర్ మండలంలో ఎంపీపీఎస్ (ఆర్/ఎస్) శనిగరం, హసన్‌పర్తి మండలంలో ఎంపీపీఎస్ కేసీ క్యాంప్, హనుమకొండ మండలంలో ప్రభుత్వ యూపీఎస్ పోలీస్ గ్రౌండ్, ఐనవోలు మండలంలో ఎంపీపీఎస్ లక్ష్మీపురం (ఐ) ఎంపీపీఎస్ లక్ష్మీపురం (పి). సీఎం ఆదేశాల మేరకు ఈ పాఠశాలలు తిరిగి తెరుచుకునే అవకాశాలున్నాయి.



సీఎం రేవంత్‌రెడ్డికి జాతర ఆహ్వాన పత్రికతోపాటు మల్లన్న స్వామి చిత్రపటాన్ని అందజేస్తున్న మంతి కొండా సురేఖ, ఎమ్మెల్యే నాగరాజు

ఐలోని మల్లన్న జాతరకు రండి..

- సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన మంత్రి కొండాసురేఖ, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు
- ఆహ్వాన పత్రిక అందజేత

ఐనవోలు, జనవరి 9: లక్షలాది మంది భక్తులు కొలిచే ఐనవోలు మల్లికార్జునస్వామి జాతర ఉత్సవాలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆహ్వానించారు. దేవదాయ ధర్మాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరా మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో సీఎంను కలిసి జాతర ఆహ్వానపత్రికను అందజేశారు. ఈ నెల 14, 15 తేదీలలో జరిగే మహాజాతర తీరును వివరిస్తూ జాతరకు రావాలని కోరుతూ ఆలయ అర్చకులు కోరుతూ స్వామి వారి చిత్రపటం, ప్రసాదంతోపాటు వేద ఆశీర్వచనం అందజేశారు.

కాగా, టీపీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి ఉన్న సమయంలో కింద టేడు ఫిబ్రవరి 16న 'హాత్‌సే హాత్ జోడో' పాదయాత్రలో భాగంగా ఐనవోలు ఆలయ సమీపంలో విడిదిచేశారు. మరుసటి రోజు స్వామి వారిని దర్శించుకొని పాదయాత్రను ప్రారంభించారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే నాగరాజుతోపాటు అర్చకులు సీఎంకు గుర్తుచేయగా సంతోషించారు. ఆహ్వానంపై సీఎం సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఆలయ ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, వేదపండితులు పురుషోత్తంశర్మ, విక్రాంత్‌జోషి, అర్చకుడు నరేశ్‌శర్మ, సీనియర్ న్యాయవాది నిమ్మాని శేఖర్‌రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్బిడి రాజిరెడ్డి, నాయకులు కుందూరు వెంకట్‌రెడ్డి, పింగిళి వెంకట్ రెడ్డి, గొట్టిముక్కుల రమాకాంత్‌రెడ్డి, ఆలయ అధికారులు శ్రీకాంత్ పాల్గొన్నారు.



మేడిగడ్డ బ్యారేజీ నుంచి తెచ్చిన ఫైళ్లను మహదేవపూర్‌లోని సబ్‌డివిజన్ కార్యాలయంలోకి తరలిస్తున్న సిబ్బంది

కాళేశ్వరం ప్రాజెక్టు వద్ద సోదాలు

- మేడిగడ్డ, కన్నెపల్లి పంప్‌హౌస్, సబ్ డివిజన్ కార్యాలయాల్లో విజిలెన్స్ తనిఖీలు
- మూడు బృందాలుగా విడిపోయి విచారణ
- కీలక ఫైళ్లు, కంప్యూటర్ హార్ట్ డిస్కుల స్వాధీనం

మహదేవపూర్ రూరల్/మహదేవపూర్, జనవరి 9: కాళేశ్వరం ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రభుత్వం విచారణ చేపట్టింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీ, కన్నెపల్లి పంప్‌హౌస్‌లతో పాటు మహదేవపూర్‌లోని ఇరిగేషన్ సబ్ డివిజనల్ కార్యాలయంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఏకకాలంలో మంగళవారం సోదాలు చేశారు. మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటు, కన్నెపల్లి పంప్‌హౌస్‌లోని మోటార్ల నీటమునకతోపాటు నిర్మాణ వ్యయాలకు సంబంధించి కీలక ఫైళ్లను సేకరించారు. మధ్యాహ్నం ఒంటి గంటకు ఈ సోదాలు ప్రారంభమయ్యాయి.

రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ రమేష్ నేతృత్వంలోని సుమారు 12 మంది అధికారులు మహదేవపూర్‌లోని ఇరిగేషన్ సబ్‌డివిజన్ కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం మూడు బృందాలుగా విడిపోయారు. ఒక బృందం మేడిగడ్డ బ్యారేజీకి, మరో బృందం కన్నెపల్లి పంప్‌హౌస్‌కు, మరో బృందం మహదేవపూర్‌లోని సబ్‌డివిజన్ కార్యాలయానికి చేరుకొని తనిఖీలు ప్రారంభించాయి. తొలుత కార్యాలయంలో పనిచేసే ఇరిగేషన్ అధికారులు, సిబ్బంది ఫోన్లను స్వాధీనం చేసుకున్న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెట్ అధికారులు తమ ఆదేశాలు లేకుండా ఎవరూ బయటకు వెళ్లొద్దని సూచించారు. సబ్ డివిజన్ కార్యాలయంలోని పలు ముఖ్యమైన ఫైళ్లతో పాటు కంప్యూటర్లలో నిక్షిప్తమైన డేటాను సేకరించారు. మరింత సమాచారాన్ని కార్యాలయ అధికారుల నుంచి సేకరించేందుకు ప్రయత్నించగా వారు సహకరించలేదని సమాచారం.

సబ్‌డివిజన్ కార్యాలయంలో గ్రౌండ్ ఫ్లోర్‌లో మేడిగడ్డ బ్యారేజీ ఈఈ కార్యాలయం, ఫస్ట్‌ఫ్లోర్‌లో అన్నారం బ్యారేజీ ఈఈ కార్యాలయం ఉండగా కేవలం మేడిగడ్డ బ్యారేజీ, కన్నెపల్లి పంప్‌హౌజ్‌లకు సంబంధించిన ఈఈ కార్యాలయంలోనే తనిఖీలు చేపట్టారు. కొద్దిసేపటికే అన్నారం ఈఈ కార్యాలయంలోనూ ఓమారు తనిఖీ చేపట్టారు. ఇది మేడిగడ్డ ఫైళ్ల కోసమేనేని తెలిసింది. అన్నారం ఈఈ కార్యాలయంలో పనిచేసే సిబ్బందిని ఇంటికి పంపించగా, మేడిగడ్డ

మిగతా 8వ పేజీలో..

ఐటీసీ చేతికి బిల్ట్!

- పేపర్ మిల్లు, ఆహార ఉత్పత్తుల యూనిట్ ఏర్పాటుకు అవకాశం
- కొనసాగుతున్న పాత యంత్రాల తొలగింపు
- అందుబాటులో 750 ఎకరాల భూములు
- మంత్రి సీతక్క చొరవపై సర్వత్రా హర్షాతిరేకాలు

7



కల్యాణంలో పాల్గొన్న కాశీక్షేత్ర ట్రస్ట్ చైర్మన్ అశోక్ బైదిక్

ఘనంగా మాస శివరాత్రి

- పాల్గొన్న కాశీక్షేత్ర ట్రస్ట్ చైర్మన్ అశోక్ బైదిక్

హనుమకొండ కల్చరల్, జనవరి 9: వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో మార్గశిర మాస త్రయోదశి యుక్త చతుర్దశి వేళ మంగళవారం పదో మాస కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉత్సవ రుద్రేశ్వర, రుద్రేశ్వరి విగ్రహాలను పాంచరాత్ర ఆగమానుసారం వైభవోపేతంగా కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో ప్రత్యేకంగా కాశీక్షేత్ర ట్రస్ట్ చైర్మన్ అశోక్ బైదిక్, మరో ట్రస్టీ నారాయణవర్మ త్రివేది పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో ఈవో వెంకటయ్య, ప్రణవ్ పాల్గొన్నారు.

వైష్ణవాలయాల్లో మంగళహారతులతో నీరాజనం

ధనుర్మాస వేడుకల పర్వంలో భాగంగా మంగళవారం నగరంలోని అన్ని వైష్ణవ ఆలయాల్లో 24వ పాశురాన్ని అర్చకులు భక్తులచే అనుసంధానం చేయించారు. పాశురానికి అనుగుణంగా తెల్లవారుజామున్నే ఆలయానికి తరలివచ్చిన మహిళలు శ్రీకృష్ణ పరమాత్మను కొలుస్తూ మంగళహారతులతో ప్రత్యేకదీపాలతో పాశురాన్ని అనుసంధానం చేస్తూ స్వామిని కొలిచారు. హనుమకొండ అదాలత్ సమీపంలోని శ్రీదేవి, భూదేవి సహిత వెంకటేశ్వరాలయంలో 300 మంది మహిళలు సంప్రదాయ దుస్తులతో ఆలయానికి తరలివచ్చి వేడుకల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు దేశికన్ స్వామి, వంశీకృష్ణ, అరవింద్ కృష్ణమూర్తి, అనిల్ కుమార్ త్రిపాఠిల ఆధ్వర్యంలో అర్చన, పూజా కార్యక్రమాలు జరుగగా ఆలయ చైర్మన్ శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అదే విధంగా నగరంలోని పలు ఆలయాల్లో కూడా మహిళలు తెల్లవారుజామున్నే ఆలయాలకు తరలివెళ్లి పరమాత్మ కృపకు నీరాజనాలు అందించారు.

నేలకొరిగిన సామాజిక సేవా శిఖరం

- గుండెపోటుతో రామా శ్రీనివాస్ కన్నుమూత
- మోక్షారామం ఫౌండేషన్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు
- హైదరాబాద్‌లో నివాళులర్పించిన కేటీఆర్, హరీష్‌రావు
- విషాదంలో ఓరుగల్లు.. నేడు అంత్యక్రియలు



రామా శ్రీనివాస్ (ఫైల్)



హైదరాబాద్‌లో శ్రీనివాస్ భౌతికదేహానికి నివాళులర్పిస్తున్న కేటీఆర్, హరీష్‌రావు

వరంగల్ కలెక్టరేట్, జనవరి 9: సామాజిక సేవా శిఖరం నేలకొరిగింది. పిలిచిన వెంటనే తానున్నానంటూ ఎందరికో అండగా నిలిచిన మానవతామూర్తి కన్నుమూశారు. సామాజికసేవను జీవితంలో ఒక భాగంగా మలుచుకున్న ఆదర్శనీయుడు కనుమరుగైపోయారు. ప్రముఖ పారిశ్రామికవేత్త, సామాజిక సేవకుడు రామా శ్రీనివాస్(59) హైదరాబాద్‌లో మంగళవారం గుండెపోటుతో కన్నుమూయడంతో ఓరుగల్లు విషాదంలో మునిగిపోయింది. ఉదయం ఛాతిలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు యశోద ఆస్పత్రికి తరలించగా, చికిత్స అందిస్తున్న క్రమంలో మృతిచెందారు.

వరంగల్ రామన్నపేటలో జన్మించిన శ్రీనివాస్‌కు భార్య శోభారాణి, కుమారుడు శైలేష్, కూతురు స్వాతి ఉన్నారు. నలుగురు సోదరులు, సోదరి ఉన్నారు. పద్మశాలీ సామాజిక వర్గానికి చెందిన శ్రీనివాస్.. పేద ప్రజలకు నిరంతరం సేవలందిస్తూ అభివృద్ధికి పాటుపడ్డారు. 2016 నుంచి సేవా కార్యక్రమాలకు కోట్లాది రూపాయలు ఖర్చుచేశారు. రామన్నపేటలో మోక్షారామం ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసి లక్షలాది రూపాయలతో శ్మశాన వాటికను అభివృద్ధి పర్చి అందమైన గార్డెన్‌గా తీర్చిదిద్దారు. ఇల్లులేని వారు కుటుంబ సభ్యులు ఎవరైనా అకాల మృతి చెందితే వారి దహన సంస్కారాలు, కర్మకాండలు పూర్తయ్యే వరకు ఉచితంగా ఉండటం కోసం శ్మశాన వాటికలో నాలుగు గదులు నిర్మించారు.

వృద్ధులు, ఒంటరివారు, దివ్యాంగుల కోసం అమ్మ ఒడి భవనంలో నిత్యం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పండుగలు, సంస్కృతీ సంప్రదాయాలు, బొడ్డెమ్మ, బతుకమ్మ, దసరా, సంక్రాంతి ముగ్గులు కార్యక్రమాలను నిర్వహించి బహుమతులను ప్రదానం చేసే వారు. నిరుపేద ఆడపిల్లల కుటుంబాలకు వివాహానికి బంగారు పుస్తే, మట్టెలు, బట్టలు, నగదు సహాయం చేసేవారు. కరోనా సమయంలో ప్రతీరోజు ఆస్పత్రులకు, పోలీసు సిబ్బందికి వేయి మందికి ఆహారం అందించారు. నగర ప్రజలు ప్లాస్టిక్ వాడొద్దని బట్ట సం చులు కుట్టించి ఇంటింటికీ వితరణ చేశారు. చెత్త కోసం ఉపయోగించడానికి ప్రతీ ఇంటికి రెండు డస్ట్ బిన్‌లు ఇచ్చారు. నగరంలో చెత్త తీసుకెళ్లడానికి దాదాపు రూ. కోటితో 420 రిక్షాలను గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్యాలయానికి అందజేశారు. ఆలయాలకు, స్వచ్ఛంద సంస్థలకు విరాళాలు అందజేశారు. రామన్నపేట ప్రజల కోసం మినరల్ వాటర్ ప్లాంటు ఏర్పాటు చేసి కేవలం నాలుగు రూపాయలకే 20 లీటర్ల మంచినీరు అందిస్తున్నారు.

నగరంలో విషాదఛాయలు

రామా శ్రీనివాస్ ఇక లేరనే వార్త తెలిసి వరంగల్ వాసులు, మోక్షారామం, అమ్మ ఒడి కుటుంబ సభ్యులు శోకసముద్రంలో మునిగిపోయారు. పద్మశాలీ కుల బాంధవులు, వైద్యులు, న్యాయవాదులు, ఇంజనీర్లు, పారిశ్రామిక వేత్త లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు దిగ్భ్రాంతికి లోనయ్యారు.

కేటీఆర్, హరీష్ రావు నివాళి

శ్రీనివాస్ అకాల మృతి విషయం తెలియగానే టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మా జీ మంత్రి హరీష్‌రావు హుటాహుటిన హైదరాబాద్ సోమాజిగూడలోని శ్రీనివాస్ నివాసానికి వచ్చి భౌతిక కాయానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణితోపాటు పలువురు ప్రముఖులు, అధికారులు శ్రీనివాస్ భౌతిక దేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. మంగళవారం రాత్రి హైదరాబాద్ నుంచి వరంగల్ నగరానికి శ్రీనివాస్ భౌతికకాయాన్ని తీసుకొచ్చారు. బుధవారం ఉదయం రామన్నపేటలోని మోక్షారామం ఫౌండేషన్ ఆధ్వర్యంలోని శ్మశానవాటికలో అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

ప్రముఖులతో సంబంధాలు

పారిశ్రామికవేత్తగా, సేవాతత్పరుడిగా ఉన్న శ్రీనివాస్ పలువురు ప్రముఖులతో సన్నిహిత సంబంధాలు కొనసాగించారు. మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ప్రధాని నరేంద్రమోదీ, మాజీ ముఖ్యమంత్రులు చంద్రబాబు నా యుడు, కేసీఆర్‌తో పాటు దివంగత సీఎం రాజశేఖర్‌రెడ్డికి సన్నిహితంగా మెలిగారు. అలాగే పలువురు ప్రజాప్రతినిధులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీల తోపాటు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, పద్మశాలీ ప్రముఖులకు సుపరిచితుడిగా ఉన్నారు.

పది జోన్లుగా మేడారం

- పని విభజన చేసి సౌకర్యాలు కల్పించాలి
- 31లోగా మహాజాతర ఏర్పాట్లు పూర్తికావాలి
- రూ.30 కోట్ల విడుదలకు గ్రీన్‌సిగ్నల్
- భక్తుల కోసం 6 వేల ఆర్టీసీ బస్సులు
- జాతరపై మంత్రులు సీతక్క సురేఖ, పొన్నం సమీక్ష
- పాల్గొన్న ఉమ్మడి వరంగల్ జిల్లా కలెక్టర్లు, పోలీసు, ఇతర శాఖల అధికారులు

ములుగు, జనవరి 9: ఈ ఏడాది ఫిబ్రవరి 21 నుంచి నాలుగురోజుల పాటు జరిగే మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరను విజయవంతంగా జరిపించాలని, మొత్తం పది జోన్లుగా పనులను విభజించి భక్తులకు మెరుగైన వసతులు కల్పించాలని రాష్ట్ర మంత్రులు అధికారులను ఆదేశించారు. రూ.75 కోట్ల నిధులతో మొదలుపెట్టిన పనులను ఈనెల 31లోగా పూర్తి చేయాలని, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

మంగళవారం హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీలో మంత్రులు సీతక్క, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ సీఎస్ శాంతికుమారి, డీజీపీ రవిగుప్తాతో ఆధ్వర్యంలో రాష్ట్ర ఉన్నతస్థాయి సమీక్ష జరిపారు. పోలీసు, రెవెన్యూ, అటవీ, రోడ్లు భవనాలు, నీటిపారుదల శాఖల ఉన్నతాధికారులతోపాటు హనుమకొండ, వరంగల్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలకు చెందిన కలెక్టర్‌లు, ఎస్పీలు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల శాఖ అధికారి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ జాతరకు వచ్చే భక్తులు ప్రశాంతంగా వనదేవతలను దర్శించుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆదివాసీ సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిబింబించేలా కళాకారులతో ప్రత్యేక ప్రదర్శనలు ఏర్పాటు చేయాలన్నారు. స్నానఘట్టాల వద్ద విస్తృత ఏర్పాట్లు చేయాలన్నారు. జంపన్నవాగులోని నీరు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. పారిశుధ్య పనులను పకడ్బందీగా చేపట్టాలన్నారు. తాగునీటి వసతిని మెరుగుపర్చాలని, క్యూలైన్లలో భక్తులకు ఇబ్బంది జరగకుండా చూడాలని అన్నారు. రూ.75 కోట్లకు అదనంగా మరో రూ.30 కోట్ల కోసం అధికారులు సమర్పించిన ప్రతిపాదనలను ఆమోదించి వెంటనే నిధులను విడుదల చేస్తామని చెప్పారు. అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే జాతర సక్సెస్ అవుతుందని అన్నారు.



హైదరాబాద్‌లో మేడారం జాతరపై జరిగిన సమీక్షలో పాల్గొన్న రాష్ట్ర మంత్రులు

రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంతో మహిళా భక్తుల రద్దీ పెరిగే అవకాశముందని, అందుకు అనుగుణంగా సదుపాయాలు మెరుగుపర్చాలని తెలిపారు. ఈసారి 6 వేల బస్సులను నడిపించడాకి ఏర్పాట్లు చేస్తామన్నారు. జాతర నిర్వహణపై అనుభవం ఉన్న అధికారులను గుర్తించాలని, వారు రాష్ట్రంలోని ఏ జిల్లాలో ఉన్నా ప్రత్యేకంగా కేటాయిస్తామని తెలిపారు. గత జాతరలలో పనిచేసిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలన్నారు.

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖమంత్రి సీతక్క మాట్లాడుతూ జాతరను ప్లాస్టిక్ రహితంగా జరిపించాలన్నారు. రోడ్ల మరమ్మతులను సత్వరమే పూర్తిచేయాలని, ఇరువైపులా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. జాతరలో తప్పిపోయిన వారిని కుటుంబసభ్యుల చెంతకు చేర్చేలా కాల్‌సెంటర్‌లను ఏర్పాటు చేయాలని తెలిపారు.

దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ ఆదివాసీ సంప్రదాయాలకు అత్యంత ప్రాముఖ్యతనిస్తూ జాతర జరిపించాలన్నారు. దొంగతనాలు జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. మహాజాతర విశిష్టతపై డాక్యుమెంటరీని రూపొందించాలని అధికారులకు సూచించారు. నిరంతర విద్యుత్ సరఫరా కోసం చర్యలు తీసుకోవాలన్నారు. జాతరకు వచ్చే భక్తులకు అవగాహన కల్పిస్తూ సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారం కల్పించాలని తెలిపారు. 400 సీసీ కెమెరాలతో భద్రతను పర్యవేక్షిస్తామని డీజీపీ తెలిపారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడతామన్నారు.

ఈ సమీక్షలో ములుగు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శబరీశ్, ఇటీవల ఆదిలాబాద్‌కు బదిలీపై వెళ్లిన ఎస్పీ గౌష్ ఆలం, ఏటూరునాగారం ఐటీడీఏ పీవో అంకిత్, ములుగు డీఎస్పీ రవీందర్, ఇరిగేషన్ సీఈ విజయభాస్కర్, ఐటీడీఏ ఈఈ హేమలత, డీపీవో వెంకయ్య, డీపీఆర్వో రఫీక్ పాల్గొన్నారు.

2 రోజుల పాటు హసన్‌పర్తి రైల్వే గేటు మూసివేత

కాజీపేట, జనవరి 9: రైల్వే మూడోలైన్ నిర్మాణాల పనుల దృష్ట్యా బుధవారం, గురువారం రెండు రోజులపాటు హసన్‌పర్తి రైల్వే గేటు మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రైల్వే గేటు ద్వారా ప్రయాణించే వారు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వెళ్లాలని తెలిపారు. శుక్రవారం నుంచి యథావిధిగా ఈ గేటు తెరిచి ఉంటుందని చెప్పారు.

ఎంబీఏ మూడో సెమిస్టర్ ఫీజు గడువు 22

కేయూ క్యాంపస్, జనవరి 9: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఎంబీఏ మూడో సెమిస్టర్ పరీక్షలఫీజులు జనవరి 22 వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా చెల్లించుకోవాలని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ చాడ రాధి కారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.250 అపరాధ రుసుంతో జనవరి 24వ తేదీ వరకు అవకాశం ఉందని పేర్కొన్నారు. ఎంబీఏ మూడో సెమిస్టర్ రెగ్యులర్, ఎక్స్ ఇంప్రూమెంట్ అభ్యర్థులందరూ ఫీజుల చెల్లించుకోవాలన్నారు.

కేయూ డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో 5గురు డీబార్

కేయూ క్యాంపస్, జనవరి 9: కేయూ పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ 1,3,5వ సెమిస్టర్ పరీక్షల్లో మంగళవారం 5 గురు విద్యార్థులు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడగా తనిఖీ అధికారులు పట్టుకుని డీబార్ చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, డాక్టర్ ఎం.తిరుమలదేవి తెలిపారు. డీబారైన వారిలో ఉమ్మడి ఖమ్మంలో -2, ఉమ్మడి వరంగల్ జిల్లాలో 3 మంది డీబారైనట్లు తెలిపారు. వీరిపై చర్యలుంటాయని తెలిపారు.

నూతన పెన్షన్ విధానాన్ని

రద్దు చేయకుంటే సమ్మె చేస్తాం..

మజ్దూర్ యూనియన్ జోనల్ ప్రెసిడెంట్ కాల్వ శ్రీనివాస్



మాట్లాడుతున్న కాల్వ శ్రీనివాస్

కాజీపేట, జనవరి 9: కేంద్ర ప్రభుత్వం నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయకుంటే సమ్మె చేయడానికైనా సిద్ధమని దక్షిణ మధ్య రైల్వే జోనల్ అధ్యక్షుడు కాల్వ శ్రీనివాస్ హెచ్చరించారు. పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం రైల్వే మజ్దూర్ యూనియన్ డీజిల్ లోకో బ్రాంచ్ చైర్మన్ పాక వేదప్రకాశ్ ఆధ్వర్యంలో డీజిల్ షెడ్ వద్ద రెండో రోజు రిలే దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలను కాల్వ శ్రీనివాస్ హాజరై ప్రారంభించి మాట్లాడారు. రైల్వే కార్మికులకు జరుగుతున్న అన్యాయాన్ని కార్మికులు వారి కుటుంబాలు గమనిస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో కార్మికుల పక్షాన ఉన్న పార్టీలకే తమ మద్దతు ఉంటుందన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించే వారికే మద్దతిస్తామన్నారు. దీక్షలో కూర్చున్న వారిలో బ్రాంచ్ నాయకులు ఎస్.కె. జానీ, తిరుపతి, ప్రదీప్‌రాయ్, యాదగిరి, పి.రవి కిరణ్, నరేష్ యాదవ్, మాషుక్ జానీ, ఎ.సదానందం, జి.నాగరాజు ఉన్నారు.

బ్యాడ్మింటన్‌లో రాణిస్తున్న పోలీసు అధికారులు

అభినందించిన సీపీ అంబర్ కిశోర్ ఝా



పోలీసు క్రీడాకారులను అభినందిస్తున్న సీపీ

హనుమకొండ క్రైం, జనవ రి 9: రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలలో వరంగల్ పోలీసు కమిషనరేట్‌కు చెందిన ఇద్దరు పోలీసు అధికారులు ప్రతిభ కనబరిచారు. ఈ మేరకు వరంగల్ ఎస్‌బీ ఏసీపీ మూల జితేందర్‌రెడ్డి, ఏఆర్ అదనపు డీసీపీ కె.సంజీవ్‌లను వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా అభినందించారు. మంగళవారం సీపీ కార్యాలయానికి పిలి పించి ఇద్దరు అధికారులను ఘనంగా సత్కరించారు. ఈ నెల 5 నుంచి 7 వరకు హైదరాబాద్‌లో జరిగిన 9వ రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలలో సత్తాచాటారు. 55 యేళ్ల విభాగంలో జితేందర్‌రెడ్డి సింగిల్స్, మిక్స్ డబుల్స్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించగా, 60 యేళ్ల విభాగంలో సంజీవ్ బ్రాంజ్ మెడల్ సాధించారు. వీరిని జాతీయస్థాయి పోలీసు క్రీడలకు ఎంపిక చేసినట్టు నిర్వాకులు తెలిపారు. సత్తాచాటి పతకాలు సాధించిన క్రీడాకారులను వరంగల్ పోలీసు కమిషనరేట్ అధికారులు, సిబ్బంది అభినందించారు.

ఒకే జాతీయ గ్రామీణ బ్యాంకుగా ఏర్పాటు చేయాలి

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ధర్నా

కాజీపేట జంక్షన్, జనవరి 9: దేశ వ్యాప్తంగా ఉన్న 43 ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులన్నింటినీ కలిపి ఒకే జాతీయ గ్రామీణ బ్యాంకుగా ఏర్పాటు చేయాలని కోరుతూ హనుమకొండ రాంనగర్‌లోని వరంగల్ గ్రామీణ వికాస బ్యాంకు ప్రధాన కార్యాలయం ఎదుట బ్యాంకు ఉద్యోగుల సంఘం, అధికారుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి కారింగ్ భిక్షమయ్య గౌడ్ మాట్లాడుతూ.. గ్రామీణ వికాస బ్యాంకులో పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నట్లు వాటి పరిష్కారం కోసం యాజమాన్యం దృష్టికి తెచ్చేందుకు ధర్నా కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. బ్యాంకులో 20 యేళ్లుగా తాత్కాలిక ఉద్యోగులుగా పనిచేస్తున్న సుమారు 700మంది ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని గ్రామీణ వికాస బ్యాంకులను స్పాన్సర్ బ్యాంకుల నుంచి విడదీయాలని, మ్యాన్ పవర్ పాలసీ ప్రకారంగా ప్రమోషన్లు, నియామకాలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. అంతేగాక వాణిజ్య బ్యాంకుల మాదిరిగా ఉద్యోగులకు గ్రాట్యుటీ బేసిక్‌పే, డీఏ కలిపి చెల్లించాలని అన్నారు. ధర్నా అనంతరం ఉద్యోగ సంఘం నాయకులు బ్యాంకు జనరల్ మేనేజర్ దయాకర్‌కు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రాజు, అధికారుల సంఘం అధ్యక్షుడు క్రాంతి కుమార్, ప్రధాన కార్యదర్శి అప్పలనాయుడు, బ్యాంకు పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు జయరాములు, కుంభం వెంకట్‌రెడ్డి, సత్యపాల్‌రెడ్డి, వీరయ్య, మల్లయ్య, రమేష్, తిరుమలేశ్వర్‌రావు, ఉభయ సంఘాల కోర్ కమిటీ సభ్యులు, ప్రాంతీయ కార్యదర్శులు సుమారు 300 మంది ఉద్యోగులు పాల్గొన్నారు.


ధర్నాలో మాట్లాడుతున్న ఏపీజీవీబీ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి భిక్షమయ్య గౌడ్

సంక్రాంతి కీడు అంటూ..

● పల్లెల్లో ఐదు రకాల గాజుల సెంటిమెంట్
● మూఢనమ్మకాలను పట్టించుకోవద్దంటున్న విద్యావంతులు

గూడూరు(మహబూబాబాద్ జిల్లా), జనవరి 9 : ఈ సంవత్సరం సంక్రాంతి పండుగ కీడుతో వచ్చిందంట..! అందుకని ఒక్క కుమారుడు ఉన్న తల్లులు ఇద్దరు కుమారులు కలిగిన తల్లుల వద్ద డబ్బులు తీసుకుని ఐదు రకాల గాజులను వేయించుకోవాలి, లేదంటే ఒక్క కొడుకుకు కీడు తప్పదు. ఈ విషయం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఓ వైపు ప్రపంచం సైన్స్ పరంగా అభివృద్ధిలో దూసుకుపోతోంటే ఈ ప్రస్తుత పరిస్థితుల్లో ఇలాంటి అసత్య మూఢనమ్మకాలు కొనసాగుతున్నాయి. సంక్రాంతి పండుగ రాబోతున్న వేళ తాజాగా ఈ ప్రచారం షికారు చేస్తోంది. ఇద్దరు కుమారులు ఉన్న తల్లుల వద్ద డబ్బులు తీసుకుని ఒక్క కుమారుడు ఉన్న తల్లులు ఐదు రకాల గాజులు కొనుక్కోవాలంట..! అవి మళ్లీ ఒక కొడుకు ఉన్న వారితోనే వేయించుకోవాలంట.. ఈ వింత ప్రచారం పల్లెల నుంచి పట్టణాలకు పాకింది. మహిళలు ఈ ప్రచారాన్ని నమ్ముతూ.. గాజుల షాపుల వద్దకు పరుగులు తీస్తున్నారు. ఇదిలా ఉండగా సైన్స్ ఉపాధ్యాయుడు, మండల నోడల్ అధికారి చీర భిక్షపతి ఈ వింత ప్రచారాన్ని నమ్మొద్దని సూచిస్తున్నారు. ఆధునిక యుగంలో ఇలాంటి వాటిని ప్రోత్సహించవద్దన్నారు. గతంలో సైతం సంక్రాంతి, ఉగాది పండుగల ముందు వదిన, మరదళ్ల గాజులు, అన్నదమ్ముళ్లకు కుడుకలు, ఆడబిడ్డలకు కుంకుమభరణాలు, చీరలంటూ ప్రచారాలు జరిగాయని, ఇలాంటి వాటిని ప్రతీ ఒక్కరు ఖండించాలని భిక్షపతి కోరారు.

నిట్‌లో కేర్ ఆస్పత్రి వైద్యశిబిరం

కాజీపేట, జనవరి 9: నిట్‌లో మంగళవారం హైదరాబాద్ కేర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ఆర్థోపెడిక్ డాక్టర్ హరీష్, కార్డియాలజిస్ట్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి హాజరై నిట్ సిబ్బందికి, స్టూడెంట్స్‌కు సుమారు 150 మందికి వివిధ రకాల పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో నిట్ హెల్త్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు ఊరట

● వన్య ప్రాణుల దాడిలో ధ్వంసమైన పంటలకు పరిహారం పెంపు
● అధికారుల సహకారం కోసం రైతుల ఎదురుచూపులు


గూడూరు అభయారణ్యంలో సంచరిస్తున్న అడవిపందులు(ఫైల్)

గూడూరు, జనవరి 9: వన్యప్రాణుల దాడులతో నష్టపోయిన వారికి ఇచ్చే నష్టపరిహారాలను పెంచుతూ రాష్ట్ర అటవీశాఖ ఇటీవల ఉత్తర్వులను జారీ చేసింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు ఏజెన్సీ గ్రామాలు అటవీ ప్రాంతాలకు దగ్గరగా ఉండడంతో వ్యవసాయక్షేత్రాలకు రైతులు వెళ్లిన సమయంలో తరుచూ వన్యప్రాణుల బారిన పడి ప్రమాదాలకు గురవుతున్నారు. అలాగే వన్యప్రాణులు వేల ఎకరాల్లో పంటలను నష్టం చేస్తున్నాయి. గతంలో నష్టపరిహారానికి ఉత్తర్వులు ఉన్నప్పటికి కొందరికే పరిహారం మంజూరైంది. రెండేళ్లుగా పంటనష్ట పరిహారానికి సంబంధించి దరఖాస్తులను తీసుకోలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వన్యప్రాణుల వల్ల జరిగే నష్టానికి పరిహారం పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసిన విషయం విదితమే. దీంతో ఏజెన్సీ ప్రాంత సాగు రైతులకు కొంతమేర మేలు జరుగనుంది.

15.49 లక్షల ఎకరాల్లో వివిధ పంటల సాగు

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఏజెన్సీ, మైదాన ప్రాంతాల్లో రైతులు 15.49 లక్షల ఎకరాల్లో వివిధ పంటలను సాగుచేస్తున్నారు. మహబూబాబాద్ జిల్లాలో 1.50 లక్ష హెక్టార్లలో అటవీ విస్తరించి ఉంది. జిల్లాలోని పలు గ్రామాలు ఏజెన్సీ గ్రామాలు, అటవీప్రాంతాలకు దగ్గరగా ఉండడం ద్వారా అడవి పందుల బెడద ఎక్కువగా ఉంటోంది. ఈ సీజన్‌లో సుమారు 19 నుంచి 20 వేల ఎకరాల్లో పంటలకు నష్టం జ రుగుతున్నట్లు ప్రాథమిక అంచనా. పరిహారం పొం దడంపై అవగాహన లోపం, త్వరగా మంజూరు కాకపోవడంతో చాలామంది గిరిజన, గిరిజనేతర రైతులు ప్రభుత్వానికి దరఖాస్తు కూడా చేసుకోవడం లేదు. రైతులు రాత్రి, పగలు కష్టపడుతున్నా వన్యప్రాణుల నుంచి పంటలను మాత్రం కాపాడుకోలేకపోతున్నారు. అడవి పందులు పంటల యొక్క వాసన పసిగట్టే గుణం కలిగి ఉంటాయి. మొక్కల ఉనికిని అవి దూరం నుంచే పసిగట్టి గుంపులు గుంపులుగా పంటక్షేత్రాల్లో చొరబడి పంటలను ధ్వంసం చేస్తుంటాయి. చేనులకు కాపలాగా ఉన్న రైతులు పందులను తరిమికొట్టే సమయంలో వాటిదాడిలో తీవ్రంగా గాయపడతారు. దీంతోపాటు ఇతర క్రూరమైన జంతువుల దాడిలో పశువులు కూడా మృత్యువాత పడిన సంఘటనలు అనేకం ఉన్నాయి.

అంచనా వేయడంలో జాప్యం

అడవి పందుల దాడులతో జరిగిన నష్టానికి పరిహారం రావాలంటే దరఖాస్తు చేసుకున్న రైతుల పంట క్షేత్రాలను అటవీ అధికారులు సందర్శించి, నష్టం అంచనా వేయాల్సి ఉంది. అయితే సకాలంలో వారు రాకపోవడంతో పరిహారంపై రైతులు ఆసక్తి చూపడం లేదు. దరఖాస్తు సమయంలోనే రెవెన్యూ, వ్యవసాయ, అటవీశాఖ అధికారుల నివేదికలు జతచేసి పంపిస్తున్నా విచారణ పేరుతో నెలల తరబడి ఫైల్ ముందుకు కదలడం లేదు. యేటా ఎంతోమందికి పరిహారం ఇచ్చారనేది కూడా అధికారుల వద్ద సమాచారం లేకపోవడం గమనార్హం. వన్యప్రాణుల దాడిలో మనుషులు మృతిచెందితే గతంలో రూ.5లక్షల పరిహారం ఉండగా, ప్రస్తుతం దానిని రూ.10లక్షలకు పెంచారు. తీవ్రంగా గాయపడిన వారికి రూ.75వేలు ఉంటే ప్రస్తుతం రూ.లక్ష, పంటనష్టం జరిగితే ఎకరాకు గతంలో రూ.6వేలు ఉంటే ఇప్పుడు రూ.7,500, పశువులు చనిపోతే గతంలో రూ.20 వేలు ఉండగా ప్రస్తుతం రూ.50 వేలకు పెంచారు.


సీతానగారంలో అడవి పందుల సంచారంతో ధ్వంసమైన మొక్కజొన్న పంట (ఫైల్)

పరిహార నిబంధనలు ఇవే..

అటవీ జంతువులతో ప్రమాదం జరిగినా, వ్యక్తులు మృతి చెందిన, పంటలకు నష్టం వాటిల్లినా.. సంబంధిత అటవీశాఖ నుంచి పరిహారం పొందవచ్చు. అయితే పాములు, కోతుల కారణంగా మృతి చెందినా, గాయపడ్డ పరిహారానికి అర్హత ఉండదు. కేవలం వన్యప్రాణుల దాడిలో జరిగిన నష్టానికి పరిహారం పొందవచ్చు. సంఘటనలు జరిగిన ఒకట్రెండురోజుల్లో సంబంధిత అటవీశాఖ రేంజ్ అధికారికి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. వ్యవసాయశాఖ అధికారి, రెవెన్యూ, అటవీశాఖ అధికారులు సంయుక్తంగా పంటనష్టం జరిగిన ప్రదేశానికి వెళ్లి పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తారు. వారు విచారణ జరిపి బాధితులకు నష్టపరిహారం మంజూరు చేస్తారు. కాగా, క్షేత్రస్థాయిలో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నా.. సంబంధిత శాఖల అధికారులు వేర్వేరుగా వన్యప్రాణుల దాడుల్లో ధ్వంసమైన పంట క్షేత్రాలను పరిశీలిస్తున్నారు. ఇలా ఒక్కొక్క అధికారి చుట్టు రైతులు తిరగాల్సిన దయనీయమైన పరిస్థితి నెలకొంది.

రైల్వే కార్మికులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

కాజీపేట, జనవరి 9: రైల్వే కార్మికులకు నూతన పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. రైల్వే కార్మికుల డిమాండ్‌లను నెరవేర్చకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. కాజీపేట రైల్వేస్టేషన్ ఎదుట రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ ఆధ్వర్యంలో ఓపీఎస్‌ను వెంటనే అమలు చేయాలని మంగళవారం రెండో రోజు రిలే దీక్షలు చేశారు. ఈ దీక్షలను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హాజరై ప్రారంభించి సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగాలు భర్తీ చేయకుండా నిరుద్యోగుల జీవితాలతో సైతం మోదీ ప్రభుత్వం ఆటలాడుకుం టోందన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, అనంతరం ఉద్యోగులకు అన్నివిధాలుగా న్యాయం చేయడానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయీస్ సంఘ్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ కొత్త మురళీ కృష్ణ, కేంద్ర కమిటీ సభ్యుడు చింతమురళి, సాధినేని వెంకటనారాయణ, ఐఎన్‌టీయూసీ జిల్లా సెక్రటరీ, రన్నింగ్ బ్రాంచ్ వర్కింగ్ చైర్మన్ పాక రాజ్‌కుమార్, అభిలాష్, ముస్తాక్ హుస్సేన్, బలివేందర్ సింగ్, లక్ష్మీనారాయణ, రాజలింగం, స్థానిక కార్పొరేటర్ విజయ శ్రీ రజాలీ, మాజీ కార్పొరేటర్లు రావుల సదానందం, గోల్కొండ రాంబాబు, కాంగ్రెస్ నాయకులు ఎం.డి.అంకూస్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

హాస్టల్స్ డైరెక్టర్‌గా ప్రొఫెసర్ శ్రీనివాసరావు బాధ్యతలు

కేయూ క్యాంపస్, జనవరి 9: కాకతీయ యూనివర్సిటీ నూతన హాస్టల్స్ డైరెక్టర్‌గా ప్రొఫెసర్ పెదమళ్ల శ్రీనివాసరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు ఇప్పటివరకు హాస్టల్స్ డైరెక్టర్‌గా ఉన్న జువాలజీ విభాగం ప్రొఫెసర్ వై.వెంకయ్య నుంచి కేయూ హాస్టల్స్ ఆఫీస్‌లో బాధ్యతలు స్వీకరించారు. కాగా, బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసరావును ఆల్ ఇండియా వర్సిటీ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ పుల్లా శ్రీనివాస్, దూరవిద్య కేంద్రం పీఆర్‌ఓ డాక్టర్ సంగాల ఎఫ్రామ్‌రాజ్, కేయూ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ శ్రీధర్‌కుమార్‌లోథ్, డాక్టర్ చిలువేరు రాజ్‌కుమార్, తదితరులు పుష్పగుచ్ఛం అందచేసి అభినందనలు తెలిపారు.


డైరెక్టర్ శ్రీనివాసరావును అభినందిస్తున్న శ్రీధర్‌కుమార్‌లోథ్, చిలువేరు రాజ్‌కుమార్ తదితరులు

ఐటీసీ చేతికి బిల్ట్!

● పేపర్‌మిల్లు, ఆహార ఉత్పత్తుల యూనిట్ ఏర్పాటుకు అవకాశం ● నెలరోజులుగా కొనసాగుతున్న పాత యంత్రాల తొలగింపు ● అందుబాటులో 750 ఎకరాల భూములు ● మంత్రి సీతక్క చొరవపై సర్వత్రా హర్షాతిరేకాలు



బిల్ట్ ప్రధాన గేటు

ములుగు, జనవరి 9: ఎట్టకేలకు బిల్ట్‌కు మంచిరోజులు రాబోతున్నాయి. మూడు దశాబ్దాలపాటు వెలుగు వెలిగిన ములుగు జిల్లా మంగపేట మండలం కమలాపురంలోని బిల్ట్ ఫ్యాక్టరీ పదేళ్లుగా తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంది. కార్మికులకు, పరోక్షంగా ఆధారపడ్డ వారికి ఉపాధిని దూరం చేసింది. ఆశలు అడుగంటిన క్రమంలో ఐటీసీ సంస్థ ముందుకు వచ్చింది. ఇక పునరుద్ధరణ ప్రక్రియ చకాచకా సాగుతుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది. అత్యాధునిక సాంకేతికతతో పాత పేపర్ మిల్లు స్థానంలో మళ్లీ పేపర్, ఆహార ఉత్పత్తుల తయారీ యూనిట్లను నెలకొల్పుతారని తెలుస్తోంది.

ఐటీసీ ద్వారా బిల్ట్ పునరుద్ధరణ

పారిశ్రామిక రంగంలో ఐటీసీ సంస్థకు దేశీయంగా మంచి పేరు ఉంది. 2014లో బిల్ట్ మూతపడ్డప్పటి నుంచి ఈ సంస్థపైనే అందరి దృష్టి మరలింది. పేపర్‌తోపాటు ఆహార ఉత్పత్తుల తయారీలో ఐటీసీ విస్తరించగా బిల్ట్ పునరుద్ధరణ ఈ సంస్థతో సాధ్యమవుతుందని సర్వత్రా భావించారు. సుదీర్ఘ కాలం తర్వాత ఎట్టకేలకు ఐటీసీయే ముందుకు రావడం గమనార్హం. నేషనల్ కంపెనీ లా అప్పిలేట్ ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌ఏటీ) తీర్పు తర్వాత బిల్ట్ ఆస్తులపై హక్కులు పొందిన ఫిన్‌క్వెస్ట్ ఫైనాన్స్ సొల్యూషన్ కంపెనీతో జరిపిన చర్చలు సఫలీకృతమైనట్లు సమాచారం. ఇటీవల పలు దఫాలుగా ఐటీసీ ప్రతినిధులు కమలాపురం వచ్చి సర్వేలు కూడా చేపట్టారు. తాజాగా సీఎం రేవంత్‌రెడ్డిని ఇరు సంస్థల ప్రతినిధులు కలవడం, బిల్ట్‌ను నడిపించేందుకు ఐటీసీకి ప్రభుత్వం పక్షాన పూర్తి సహకారం అందిస్తామని వెల్లడించడంతో త్వరలోనే ఫ్యాక్టరీలో సైరన్ మోగుతుందనే తెలుస్తోంది.

బిల్ట్ స్థిరాస్తి 750 ఎకరాలు

బిల్ట్ సంస్థకు కమలాపురంలో 750 ఎకరాల భూములు ఉన్నాయి. 600 ఎకరాల్లో ఫ్యాక్టరీ, 150 ఎకరాల్లో కాలనీ, ఆస్పత్రి, అతిథిగృహాలు, పాఠశాల (థాపర్ విద్యావిహార్), స్టాఫ్‌క్లబ్ నిర్మాణాలు ఉన్నాయి. ఇవన్నీ ఎం.ఎల్.థాపర్ పేరిట ఉండగా ఎన్‌సీఎల్‌ఏటీ తీర్పు తర్వాత ఫిన్‌క్వెస్ట్ కంపెనీ ఆధీనంలోకి వెళ్లాయి. ప్రస్తుతం భవనాలన్నీ శిథిలావస్థకు చేరుకున్నాయి. వాటిని కూల్చివేసి అవసరాలకు అనుగుణంగా నూతన నిర్మాణాలు చేసుకోవచ్చు.

కొనసాగుతున్న పాత యంత్రాల తొలగింపు

పదేళ్లుగా యంత్రాలు నడవకపోవడంతో తుప్పుపట్టి పనికిరాకుండా పోయాయి. ఇటీవలికాలంలో కొన్ని దొంగిలించబడ్డాయి. చోరీలకు పాల్పడుతున్న పలువురిని పోలీసులు అరెస్టు చేసి సామగ్రిని పట్టుకున్నారు. ఈనేపథ్యంలో ఫ్యాక్టరీలోని పాత యంత్రాలను ఫిన్‌క్వెస్ట్ సంస్థ ఆధ్వర్యంలో తొలగిస్తున్నారు. నెలరోజులుగా కార్మికులు భారీ యంత్రాలను విడదీస్తుండగా వాహనాల్లో తరలిస్తున్నారు. ఆరు నెలల కాల వ్యవధిలో పాత యంత్రాల తొలగింపు పూర్తిచేసి ఐటీసీకి అప్పగించేలా ఆసంస్థ ఒప్పందం చేసుకున్నట్లు సమాచారం.

ఉపాధికి ఊతం

బిల్ట్ ఫ్యాక్టరీ తిరిగి తెరుచుకుంటే స్థానికులకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు కలగనున్నాయి. ఉన్నత విద్యార్హత ఉన్నప్పటికీ సరైన అవకాశాలు లేక చాలా మంది పట్టణాలకు వెళ్తున్నారు. కొందరు పొరుగు రాష్ట్రాల్లో పనిచేస్తున్నారు. బిల్ట్‌తో అలాంటి వారందరికీ ఉద్యోగాలు లభిస్తాయనే ఆశ కలుగుతోంది. పరోక్షంగా వందలాది కుటుంబాలకు ఉపాధి కలగనుంది. కర్మాగారం లేఆఫ్ ప్రకటించిన తర్వాత 670 మంది పర్మినెంట్ కార్మికులు మిగిలారు. గడిచిన పదేళ్లలో 58 మంది వివిధ కారణాలతో మరణించారు. 37మంది ఉద్యోగ విరమణ పొందారు. ఎన్‌సీఎల్‌ఏటీ ఆదేశాలతో ఇటీవల వీరి కుటుంబాలకు గ్రాట్యుటీ కింద వారివారి సర్వీసును బట్టి కొంత మొత్తాన్ని చెల్లించారు. 2020 వరకు సర్వీసును పరిగణలోకి తీసుకోవాల్సి ఉండగా 2015 డిసెంబరు కాలానికే ఇచ్చారని కార్మికులు చెబుతున్నారు. చట్ట ప్రకారం పూర్తి మొత్తంతోపాటు పెండింగ్ వేతనాలిచ్చి ఆదుకోవాలని కోరుతున్నారు. కార్మిక కుటుంబాలకు చెందిన నిరుద్యోగ యువతకు అర్హతను బట్టి ఉద్యోగావకాశం కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

సీతక్క కృషిపై సర్వత్రా హర్షం

ములుగు ఎమ్మెల్యే సీతక్క రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నెలరోజుల వ్యవధిలోనే బిల్ట్ ఫ్యాక్టరీపై సీఎం స్థాయిలో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఫ్యాక్టరీని తెరిపించే విషయంలో 2014 నుంచి సీతక్క పోరాడుతున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యేగా అసెంబ్లీలో గత ప్రభుత్వంపై అనేక పర్యాయాలు ఒత్తిడి తెచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే తొలి ప్రాధాన్యంగా బిల్ట్ అంశాన్ని తీసుకుంటానని, ఫ్యాక్టరీని పునరుద్ధరించేందుకు కృషి చేస్తానని ఎన్నికల ప్రచార సభల్లో ప్రకటించారు. ఇచ్చిన మాట మేరకు ఐటీసీ సంస్థను ఒప్పించి ప్రభుత్వం ద్వారా అన్ని విధాలా సహకారానికి భరోసా ఇప్పించారు. ఆ సంస్థ ప్రతినిధులు సానుకూలంగా స్పందించడం, పాత యంత్రాల తొలగింపు ప్రక్రియ కొనసాగుతుండటం, ఏళ్లకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల గ్రాట్యుటీ సెటిల్ కావడం వంటి అనుకూల పరిణామాలు చకాచకా చోటుచేసుకోవడంతో బిల్ట్‌కు మంచిరోజులు వస్తాయనే ఆశకు మరింత బలాన్నిస్తున్నాయి.



ఆర్ట్స్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థి ఉత్తమ ప్రతిభ

సుబేదారి, జనవరి 9: హిమాచల్‌ప్రదేశ్‌లోని ధర్మశాలలో 10 రోజుల పాటు నిర్వహించిన ఇంటిగ్రేటెడ్ క్యాంపులో ట్రెక్కింగ్, రాక్ క్లైంబింగ్ విభాగాలలో హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలకు చెందిన విద్యార్థి విగ్నేష్ ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. ఈ మేరకు మంగళవారం కళాశాలలో విగ్నేష్‌ను కళాశాల ప్రిన్సిపాల్ బన్న ఐలయ్య, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ హనుమంతు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ చందూలాల్‌లు అభినందించారు.


ఉత్తమ ప్రతిభ కనబరిచిన విగ్నేష్‌ను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ ఐలయ్య

ఆప్తాలమిక్ ఆఫీసర్లకు ప్రమోషన్లు కల్పించాలి

▸▸ ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహాకు వినతి


మంత్రి దామోదర్ రాజనర్సింహాకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

హనుమకొండ రూరల్, జనవరి 9: వైద్య, ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ఆప్తాలమిక్ ఆఫీసర్లకు ప్రమోషన్లు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజ నర్సింహకు ఆప్తాలమిక్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్య క్షుడు ప్రతాపగిరి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి పనస ప్రవీణ్ కుమార్‌లు వినతిపత్రం అందజేశారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రిని కలిసి పలు సమస్యలపై విన్నవించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. సుమారు 35 యేళ్ల నుంచి ఎలాంటి ప్రమోషన్లు లేకుండానే రిటైర్ అవుతు న్నారని, ఆప్తాలమిక్ కేడర్‌లో ప్రమోషన్లు కల్పించాలని వినతిపత్రంలో పేర్కొన్నట్లు తెలిపారు.

యువత అవకాశాలను వినియోగించుకోవాలి

▸▸ సీజేఐటీ డైరెక్టర్ విజయపాల్‌రెడ్డి


జిల్లా స్థాయి విజేతకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న యువజన అధికారి అన్వేష్ తదితరులు

జనగామ కల్చరల్, జనవరి 9: అందివచ్చిన అవకాశాలను వినియోగించుకొని యువత ఎదగాలని క్రీస్తుజ్యోతి ఇం జనీరింగ్ కళాశాల (సీజేఐటీ) డైరెక్టర్ విజయపాల్‌రెడ్డి సూ చించారు. మంగళవారం జనగామ జిల్లా యశ్వంతాపురంలోని సీజేఐటీలో నెహ్రూ యువకేంద్ర వరంగల్ ఆధ్వర్యంలో 'మై భారత్ వికసిత్ భారత్' అనే అంశంపై జిల్లా స్థాయి ఉపన్యాస పోటీలు నిర్వహించారు. జిల్లా యువజన అధికారి చింతల అన్వేష్ నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ రెడ్డి అధ్యక్షత వహించగా విజయపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు అవకాశాలు అంది పుచ్చుకునేందుకు నెహ్రూ యువ కేంద్రం ఉపయోగపడుతుందన్నారు. ఈ పోటీలలో గనియా నాజ్ జిల్లా స్థాయి విజేతగా నిలిచి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమానికి సుధాకర్, అనిత, సయాబేగం, న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించగా నాగరాజు, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎంసీల చైర్మన్ల కొనసాగింపు

ఆరు నెలలు పొడిగిస్తూ ఉత్తర్వులు

హనుమకొండ రూరల్, జనవరి 9: పాఠశాలల అభివృద్ధిలో భాగస్వాములై విద్యాభివృద్ధికి పాటుపడుతున్న పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్‌ఎంసీ)ల గడువును ప్రభుత్వం మరోసారి పొడిగించింది. నిబంధనల ప్రకారం రెండేళ్లకోసారి కమిటీలను ఎన్నుకోవాల్సి ఉండగా, ఆచరణలో అది అమలు కావడం లేదు. కిందటేడు నవంబరుతో ఎస్‌ఎంసీల గడువు ముగియగా, మరో ఆరునెలలపాటు పొడిగిస్తూ విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

పలువురి భాగస్వామ్యం

తల్లిదండ్రులు పాఠశాలల నిర్వహణలో ప్రధాన భాగస్వాములు కావాలనే ఉద్దేశంతో విద్యాహక్కు చట్టం ఎస్‌ఎంసీలను ఏర్పాటు చేసింది. పాఠశాలలో చదివే పిల్లల తల్లిదండ్రులే సభ్యులుగా కొనసాగుతారు. కమిటీ నిర్వహణ కోసం విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణలో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తారు. విధివిధానాలను వివరించి మొదట ప్రతీ తరగతి నుంచి ముగ్గురు ప్రతినిధులను ఎన్నుకుంటారు. ఆ తర్వాత మరో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఒకరిని చైర్మన్‌గా, మరొకరిని వైస్‌చైర్మన్‌గా ఎన్నుకుంటారు. ఎక్కువ మంది పోటీలో ఉంటే ప్రతినిధుల అభిప్రాయాలు కూడా తీసుకుంటారు. ఈ కమిటీలలో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి, అంగన్‌వాడీ, ఆరోగ్య కార్యకర్త, మహిళా సమాఖ్య సభ్యురాలికి సైతం ప్రాతినిధ్యం కల్పిస్తారు. ఎంపికయ్యే తల్లిదండ్రుల్లో కేటగిరిలా వారిగా రిజర్వేషన్‌ను అమలు చేస్తారు.

పాతవారే కొనసాగింపు

ఎస్‌ఎంసీ చైర్మన్, వైస్‌చైర్మన్‌లు ప్రతీ రోజు విధిగా మధ్యాహ్న భోజనం, విద్యార్థుల హాజరు, ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాల పంపిణీ వంటి అంశాలను పర్యవేక్షించాల్సి ఉంటుంది. మూత్రశాలలు, మంచినీరు, మైదానాలు, క్రీడా సామగ్రి తదితర సమస్యలను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరుకు కృషి చేయాలి. నిర్వహణ నిధులు ప్రధానోపాధ్యాయులు, ఎస్‌ఎంసీ చైర్మన్ జాయింట్ ఖాతాలో వేస్తారు. వీటిని సక్రమంగా వినియోగించుకోవాల్సిన బాధ్యత వారిదే. ఆరు నెలలపాటు పాతవారే కొనసాగుతూ పాఠశాలలను పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది.



దృష్టి పెట్టాలి

కొన్ని పాఠశాలల్లో వంటగదులు లేక తరగతి గదులు, ఆవరణలోనే వంట చేస్తున్నారు. మంచినీరు అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులు ఇంటి నుంచే వాటర్ బాటిళ్లు తెచ్చుకుంటున్నారు. పదోతరగతి పరీక్షలు సమీపించడంతో ఎస్‌ఎంసీల కమిటీల సభ్యులు దృష్టి పెడితే మెరుగైన ఫలితాలు వచ్చే అవకాశం ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

పాఠశాలలు

హనుమకొండ జిల్లాలో పాఠశాలల వివరాలు ఇలా ఉన్నాయి. ప్రాథమిక 304, ప్రాథమికోన్నత 60, ఉన్నత పాఠశాలలు 128, ఆదర్శ 3, కస్తూర్బా విద్యాలయాలు 9 ఉండగా, వీటిలో 34,890 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.



ఉత్తర్వులు వచ్చాయి : డీఈవో డాక్టర్ అబ్దుల్ హై

ఎస్‌ఎంసీ చైర్మన్‌ల పదవీకాలం మరో ఆరు నెలలు పొడిగిస్తూ ఇటీవల ఉత్తర్వులు వచ్చాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు పాతవారే కొనసాగుతారు. కొత్త కమిటీల ఎంపికపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నూతన విద్యా సంవత్సరం ఆరంభంలో కొత్త కమిటీల ఎంపిక ఉండే అవకాశం ఉంది.

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి..

కాజీపేట ఏసీపీ డేవిడ్ రాజ్

సుబేదారి, జనవరి 9: మానవ అక్రమ రవాణా, బాండెడ్ లేబర్ నిర్మూలనలో స్వచ్ఛంద సంస్థల పాత్ర కీలకమని కాజీపేట ఏసీపీ డేవిడ్ రాజ్ అన్నారు. మానవ అక్రమ రవాణా, బాండెడ్ లేబర్(వెట్టి చారికి కార్మికులు) నిర్మూలన కోసం ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్, ఎఫ్‌ఎంఎం సాంఘిక సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో హనుమకొండ సుబేదారిలోని అసుంత భవన్‌లో మంగళవారం స్వచ్ఛంద సంస్థలకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఏసీపీ డేవిడ్ రాజ్ మాట్లాడుతూ.. మానవ అక్రమ రవాణా అనేది మానవ జాతికి తీరని కలంకంగా మారిందని, బాండెడ్ లేబర్ సమస్య వల్ల అనేక రకమైన సమస్యలు తెలెత్తి మనుషుల అవయవాల దోపిడీ, లైంగిక వేధింపులు, వెట్టి చాకిరి వంటివి అనేకం జరుగుతున్నాయన్నారు. దీనిని నియంత్రించడానికి ప్రభుత్వ శాఖలతో పాటు స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలన్నారు. మద్రాస్ హైకోర్టు న్యాయవాది రాజ్ కుమార్ మాట్లాడుతూ.. మనిషికి జీవించే హక్కు, స్వేచ్ఛ హక్కు, పనిచేసే హక్కులు ఎలా ఉన్నాయో వాటిని పొందేందుకు సంపూర్ణమైన హక్కులు మనిషి పొంది ఉన్నాడని, వాటిని కాదని బలవంతంగా చేయిస్తే చట్టంలో శిక్షార్హమని, దానికి కారకులైన వారిని శిక్షించేందుకు చట్టంలో అనేక సెక్షన్లు రూపొందించారన్నారు. ఎఫ్‌ఎంఎం సాంఘిక సేవా సంస్థ డైరెక్టర్ సిస్టర్ రెజీనా చిన్నప్ప అధ్యక్షతన జరిగిన సమావేశంలో వరంగల్, మహబూబాబాద్ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్‌లు అనిల్ చందర్‌రావు, నాగవాణి, హనుమకొండ డీసీపీవో సంతోష్, ఏహెచ్‌టీయూ సీఐ వెంకట్రామ్, ఎఫ్‌ఎంఎం సాంఘిక సేవా సంస్థ ప్రాజెక్టు మేనేజర్ ఎర్ర శ్రీకాంత్, ప్రోగ్రాం అధికారి బత్తుల కరుణతో పాటు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, చైల్డ్ లైన్, సీడబ్ల్యూసీ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏసీపీ డేవిడ్ రాజ్

కాళేశ్వరం ప్రాజెక్టు వద్ద సోదాలు

5వ పేజీ తరువాయి

అధికారులను మాత్రం అక్కడే ఉంచుకొని విచారించారు. ఈ సోదాల వివరాలను అధికారులు బయటకు వెల్లడించలేదు.

ఫైళ్ల తరలింపు

మేడిగడ్డ బ్యారేజీతోపాటు కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద ఉన్న కార్యాలయాల్లో తనిఖీలు నిర్వహించిన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అక్కడ పనిచేసే అధికారుల నుంచి సమాచారాన్ని సేకరించినట్లు తెలిసింది. బ్యారేజీ, పంప్‌హౌస్‌కు సంబంధించి ఎత్తిపోసిన నీటి వివరాలు, బ్యారేజీలోకి వచ్చిన ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లోతోపాటు వీటి మెయింటనెన్స్‌కు సంబంధించి వినియోగించిన విద్యుత్ వినియోగం, ఖర్చుల వివరాలు సేకరించారు. లాగ్‌బుక్‌లను తనిఖీ చేశారు. అనంతరం బ్యారేజీ, పంప్‌హౌస్ కంట్రోల్ రూం కార్యాలయాల్లోని పలు కీలక ఫైళ్లను మహదేవపూర్‌లోని ఇరిగేషన్ సబ్‌డివిజన్ కార్యాలయానికి తరలించి తనిఖీని ముమ్మరం చేశారు. సంబంధిత కార్యాలయాల్లో పనిచేసే అధికారులను హైదరాబాద్‌లోని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయానికి రావాల్సిందిగా సూచించినట్లు సమాచారం. ఏకకాలంలో తనిఖీలు నిర్వహించిన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు ఒక్క చోట కూడా ఇరిగేషన్ అధికారులు సహకరించలేదని తెలిసింది. దీంతో తనిఖీలు, విచారణలో ఆలస్యమైనట్లు సమాచారం. తనిఖీల్లో ముఖ్యమైన ఫైళ్లతో పాటు పలు కంప్యూటర్లకు సంబంధించిన హార్డ్ డిస్క్‌లను సైతం స్వాధీనపర్చుకున్నట్లు తెలిసింది.

విద్యార్థులు వ్యాపార మెళకువలు అలవర్చుకోవాలి

పింగిళి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య చంద్రమౌళి గౌడ్

వడ్డెపల్లి, జనవరి 9: విద్యార్థులు వ్యాపార మెళకువలు అలవర్చుకోవాలని పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య చంద్రమౌళి గౌడ్ అన్నారు. హనుమకొండ వడ్డెపల్లిలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో కామర్స్ విభాగం ఆధ్వర్యంలో 'రోల్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ ఇన్ ప్రోమోటింగ్ ఉమెన్ ఎంటర్ పెన్యూర్ షిప్ ఇన్ ఇండియా' అనే అంశంపై రెండు రోజుల పాటు నిర్వహించిన జాతీయ సదస్సు మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా కాకతీయ విశ్వవిద్యాలయం కామర్స్ విభాగం బీవోఎస్ డాక్టర్ రాజేందర్ మాట్లాడుతూ.. మహిళా శక్తి అనేది సమాజాన్ని ఎంతో ప్రభావితం చేస్తుందని అన్నారు. ఈ సదస్సులో కేడీసీ ప్రిన్సిపాల్ రాజారెడ్డి, సదస్సు కన్వీనర్ కామర్స్ విభాగాధిపతి డాక్టర్ రజిత, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుహాసిని, పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రామకృష్ణారెడ్డి, అకాడమిక్ కో ఆర్డినేటర్ పార్వతి, కామర్స్ అధ్యాపకులు డాక్టర్ భాస్కర్, శిరీష, సురేష్, హేమలతతో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న ఆచార్య బత్తిని చంద్రమౌళి గౌడ్

అంబేద్కర్ విగ్రహాలను ఏర్పాటు చేయాలి

టీఎంపీఎస్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పెరుమాండ్ల వెంకటేశ్వర్లు


అంబేద్కర్ విగ్రహం వద్ద కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మాల పోరాట సమితి నేతలు

వడ్డెపల్లి, జనవరి 9: అంబేద్కర్ విగ్రహాలను రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేయాలని తెలంగాణ మాల పోరాట సమితి (టీఎంపీఎస్) వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పెరుమాండ్ల వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం హనుమకొండ పబ్లిక్‌గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన సమావేశంలో కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. భారతదేశానికి రాజ్యాంగాన్ని అందించిన అంబేద్కర్ ఆశయ సాధన కోసం టీఎంపీఎస్ రాష్ట్ర వ్యాప్తంగా సభలు, సమావేశాలు నిర్వహించి అంబేద్కర్ జీవిత చరిత్రను ప్రజలకు వివరిస్తుందని అన్నారు. అంబేద్కర్ దేశానికే కాకుండా ప్రపంచ మేధావిగా ఐక్యరాజ్య సమితి గుర్తించిన మహనీయుడని అన్నారు. ఈ సమావేశంలో టీఎంపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంకేశ్వరపు రమేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మగ్గిడి దర్గ స్వామి, రాష్ట్ర కార్యదర్శులు శ్రీరాముల పైడి, గునిగంటి రమేష్, తరాల శంకర్, ఆకుల శంకర్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మేడిపల్లి రాణి, నరుకుటి ఎల్లయ్య, బొమ్మ రవి తదితరులు పాల్గొన్నారు.


మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరపై మంగళవారం హైదరాబాద్‌లో మంత్రులు నిర్వహించిన సమీక్షా సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

'రోటరీ' ఆధ్వర్యంలో
గెట్ టు గెదర్

సుబేదారి, జనవరి 9 : రోటరీ క్లబ్ ఆఫ్ హనుమకొండ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి రోటరీ క్లబ్ ఫ్యామిలీ సభ్యులు హనుమకొండ వికాస్‌నగర్‌లోని ఎస్వీ కన్వెన్షన్ హాల్‌లో ఘనంగా గెట్ టు గెదర్ పార్టీ నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ సభ్యుల కుటుంబాలకు చెందిన మహిళలు, పిల్లలు ఉత్సాహంగా ఆటలు ఆడుతూ పాటలు పాడుతూ గడిపారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ హనుమకొండ పూర్వ అధ్యక్షులు కాయిత ఇంద్రసేనా రెడ్డి మాట్లాడుతూ.. రోటరీ క్లబ్ సభ్యులందరు ఫ్యామిలీలతో కలిసి గడపడం ఆనందంగా ఉందని, క్లబ్ ఆధ్వర్యంలో ఇంకా ఎన్నో సేవా కార్యక్రమాలు చేయాలన్నారు. ఈ గెట్ టు గెదర్ పార్టీలో రోటరీ క్లబ్ ఆఫ్ హనుమకొండ అధ్యక్షుడు అన్నం రవీంద్రనాథ్, సెక్రటరీ కేవీఎన్ శిరీష్ కుమార్, ట్రెజరర్ నరేష్, అసిస్టెంట్ గవర్నర్ శ్రీకాంత్‌తో పాటు పెద్ద సంఖ్యలో రోటరీ క్లబ్ సభ్యుల ఫ్యామిలీ మెంబర్లు పాల్గొన్నారు.



గెట్ టు గెదర్‌లో పాల్గొన్న రోటరీ క్లబ్ ఫ్యామిలీ మహిళలు

ప్రభుత్వ భూములు రక్షించాలి

ప్రజావాణిలో ఎల్లాపూర్ వాసుల ఫిర్యాదు

హసన్‌పర్తి, జనవరి 9: అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ భూములను రక్షించాలని కోరుతూ హైదరాబాద్ ప్రజావాణిలో మంగళవారం ఎల్లాపూర్ గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ భూముల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అధికారులకు సమర్పించారు. ఎల్లాపూర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రి భూమి, చేపల చెరువుల భూముల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని, చెరువును నిరుద్యోగులకు కేటాయించి, చేపల పెంపకానికి అవకాశం కల్పించాలని, శ్మశానవాటికను పూర్తి చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో ప్రభుత్వ భూముల పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు రేణుకుంట్ల దుర్గాప్రసాద్, వెలిశోజు బుచ్చిరాములు, ఆర్గనైజర్ ఎర్ర నాగరాజు, స్థానికులు ఉన్నారు.

వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ టికెట్ చింత ప్రవీణ్‌కు ఇవ్వాలి

వడ్డెపల్లి, జనవరి 9: వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ టికెట్ ఎన్‌ఆర్‌ఐ చింత ప్రవీణ్‌కుమార్‌కు ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నేత చింత ప్రకాష్ మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీని కలిసి వినతి పత్రంతో పాటు బయోడేటాను సమర్పించారు. ఈ సందర్భంగా చింత ప్రకాష్ మాట్లాడుతూ.. చింత ప్రవీన్‌కుమార్ ఇండియాలో యువజన నాయకుడిగా, అమెరికాలో రాష్ట్ర నాయకుడిగా ఎదిగి కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు కృషి చేస్తున్న వ్యక్తి అని అన్నారు. కాంగ్రెస్ జాతీయ నాయకులతో చింత ప్రవీన్‌కుమార్‌కు సత్సంబంధాలు ఉన్నాయని, వరంగల్ లోక్‌సభ ఎస్సీ రిజర్వుడు స్థానాన్ని ఆయనకు కేటాయించి సముచిత స్థానం కల్పించాలని కోరారు. తొలుత సీఎం రేవంత్‌రెడ్డిని, రాష్ట్ర నామినేటెడ్ పోస్టుల ఇన్‌చార్జి మహేష్‌కుమార్ గౌడ్‌తో పాటు మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డిలను వేర్వేరుగా కలిసి వినతి పత్రాలను అందజేశారు. వినతి పత్రం సమర్పించిన వారిలో కాంగ్రెస్ పార్టీ నేతలు రాజేష్, రమేష్ తదితరులు ఉన్నారు.

ఘనంగా రుద్రహోమం

మడికొండ, జనవరి 9: కాజీపేట మండలం మడికొండలో దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న మెట్టు రామలింగేశ్వర స్వామి, సీతారామచంద్రస్వామి దేవస్థానంలో మంగళవారం మాస శివరాత్రిని పురస్కరించుకొని లోక కల్యాణార్థం రుద్రహోమాన్ని భక్తి ప్రపత్తులతో రుత్వికులు నిర్వహించారు. రామాలయంలో శ్రీసీతారామచంద్ర స్వామికి ప్రత్యేక అర్చనలు జరిపించారు. కార్యక్రమంలో కార్యనిర్వాహణాధికారి శేష భారతి, అర్చకులు రాగిచేడు అభిలాష్ శర్మ, పరాశరం విష్ణువర్ధనాచార్యులు, పారుపల్లి సత్యనారాయణశర్మతో పాటు ఆలయ సిబ్బంది , భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మెట్టు రామలింగేశ్వర స్వామి, సీతారామచంద్రస్వామి ప్రత్యేక పూజలు చేసి కొలిచారు.


రుద్రహోమం నిర్వహిస్తున్న రుత్వికులు

మహిళా చదువు ప్రగతికి దోహదం

ధర్మసాగర్, జనవరి 9: మహిళా చదువు సమాజ ప్రగతికి దోహదం చేస్తుందని ధర్మసాగర్ బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయులు ధర్మాప్రకాష్ అన్నారు. సావిత్రిబాయి పూలే జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని 'సమాజ ప్రగతి మహిళా పాత్ర' అనే అంశంపై ఆయన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు ఉపాధ్యాయురాలు రజమ్మ మాట్లాడారు. ఒక పురుషుడు చదివితే అది అతడికే ఉపయోగం, కానీ ఒక మహిళా చదివితే అది ఒక కుటుంబానికి తోడ్పడుతుందన్నారు. మహిళలు అంది వచ్చిన అవకాశాన్ని వినియోగించుకుని అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు పొందిన ఉపాధ్యాయులు కిరణ్‌మైని విద్యార్థులు, ఉపాధ్యాయులు సన్మానించారు.


ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న విద్యార్థులు

19 నుంచి కేయూలో క్రీడా సాంస్కృతిక ఉత్సవాలు

అనుమతి కోరుతూ రిజిస్ట్రార్‌కు ఏబీవీపీ నేతలు వినతి

కేయూ క్యాంపస్, జనవరి 9: జనవరి 19వ తేదీ నుంచి 29 వరకు కేయూ క్రీడా మైదానంలో వివేకనంద, నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతులను పురస్క రించుకుని ఏబీవీపీ కేయూ శాఖ, సామ జగన్మోహన్ మెమోరియల్ ట్రస్ట్ సంయుక్త నిర్వహణ లో క్రీడా సాంస్కృతిక ఉత్సవాలను నిర్వహిస్తామని ఏబీవీపీ నేతలు తెలిపారు. దీనికి సంబంధించి తమకు అనుమతి ఇవ్వాలని కోరుతూ మంగళవారం కేయూ ఏబీవీపీ నేతలు రిజిస్ట్రార్ చాంబర్‌లో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావుకు వినతి పత్రాన్ని అందచేశారు. వివేకనంద, నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని వర్సిటీ ప్రధాన క్రీడా ప్రాంగణం, వర్సిటీక్యాంపస్‌లోని ఇండోర్ స్టేడియంలో క్రీడలు నిర్వహించుకునేందుకు తమకు అవకాశం కల్పించాలని ఏబీవీపీ నేతలు రిజిస్ట్రార్ శ్రీనివాసరావుకు ఇచ్చిన వినతి పత్రంలో కోరారు. దీనికి రిజిస్ట్రార్ సానుకూలంగా స్పందించినట్లు ఏబీవీపీ కేయూ సెక్రటరీ బొండ్ల శ్రావణ్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్ లక్ష్మణ్, స్టేట్ ఎగ్జిక్యూటీవ్ ప్రణయ్, ఏబీవీపీనాయకులు అజయ్, ప్రమోద్, యాకూబ్, రాము, ఫణీంద్ర, రమేశ్, రఘురాం తదితరులు పాల్గొన్నారు.


రిజిస్ట్రార్ శ్రీనివాసరావుకు వినతి పత్రాన్ని ఇస్తున్న ఏబీవీపీ నేతలు

సహృదయ అనాథ వృద్ధాశ్రమంలో అన్నదానం

వడ్డెపల్లి, జనవరి 9: ప్రముఖ బుద్ధిస్టు, సంఘ సేవకుడు కర్రె నారాయణ 5వ వర్థంతిని పురస్కరించుకుని కుటుంబ సభ్యులు మంగళవారం హనుమకొండ వడ్డెపల్లి ప్రశాంత్‌నగర్‌లోని సహృదయ అనాథ వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆశ్రమంలోని వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. తొలుత కర్రె నారాయణ చిత్రపటానికి పూల మాలలు వేసి బుద్ధ వందనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నారాయణ సతీమణి కర్రె లక్ష్మి తులసీ, బీఎస్‌ఐ రాష్ట్ర నేతలు బొమ్మల్ల అంబేద్కర్, సురేందర్, అంబేద్కర్ సంఘం రాష్ట్ర కార్యదర్శి తరాల సందీప్, ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ కొంగర జగన్‌తో పాటు ప్రజా సంఘాల నాయకులు తరాల రాజమణి, బంగ్లా మొగిలి, రాములు, రాహుల్, హిందూ తదితరులు పాల్గొన్నారు.


అనాథ వృద్ధాశ్రమంలో అన్నదానం చేస్తున్న కర్రె లక్ష్మి తులసీ, బీఎస్‌ఐ రాష్ట్ర నేత అంబేద్కర్

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం

ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు (పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు... రియల్ పార్టనర్: స్వర్గసీమ సుకేతన) ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లోని 83 కేంద్రాల్లో జనవరి 5, 6, 7, 8 తేదీల్లో ఘనంగా జరిగాయి. 12 వేల మందికి పైగా మహిళలు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతి కేంద్రంలో ప్రథమ రూ.6,000, ద్వితీయ రూ.4,000, తృతీయ బహుమతి రూ.3,000తో పాటు అనేక కన్సొలేషన్ బహుమతులు అందించాం. ప్రతి ఉమ్మడి జిల్లా స్థాయిలో విజేతగా నిల్చిన మహిళలు రాష్ట్ర స్థాయిలో జరిగే ఫైనల్ పోటీలకు అర్హత సాధించారు. తెలంగాణలోని 10 ఉమ్మడి జిల్లాల విజేతలకు హైదరాబాద్‌లో జనవరి 10న ఫైనల్ పోటీలు జరుగుతాయి. ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాలతోపాటు తమిళనాడు, కర్ణాటక విజేతలిద్దరు... మొత్తం 15 మందికి జనవరి 11న విజయవాడలో ఫైనల్ పోటీలు జరుగుతాయి. ఫైనల్స్‌లో ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించిన ఎనిమిదిమందికి రూ.1,20,000 బంపర్ బహుమతులతోపాటు ఇతరులకు రూ.51,000 కన్సొలేషన్ బహుమతులు ఉంటాయి. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనబోతున్న ఫైనలిస్టులు, వారు జిల్లాస్థాయి పోటీల్లో తీర్చిన అందమైన రంగవల్లులు 'నవ్య' పాఠకుల కోసం....

కెనరా బ్యాంక్-ఆంధ్రజ్యోతి ముత్యాల ముగ్గుల పోటీలు ఫైనలిస్టులు వీరే



జి.హిమలత, ఆదిలాబాద్



జె.పద్మ, కరీంనగర్



ఎం.కవిత, వరంగల్



బి.లత, నిజామాబాద్



ఎన్. శ్రీలత, నల్లగొండ



జి.అరుణశ్రీ, మహబూబ్‌నగర్



ఎం.నీరజ, ఖమ్మం



కె.జోత్స్న, హైదరాబాద్



వి.దివ్య, మెదక్



పి.ధనలక్ష్మి, రంగారెడ్డి

బ్యూటీ

చర్మం పొడిబారిందా?



చలికాలం చర్మం పొడిబారి కళావిహీనంగా తయారైందా? చర్మం తగినంత తేమగా లేకపోతే ఇలాగే డ్రైగా తయారవుతుంది. ఇలా జరగకుండా ఉండాలంటే కొన్ని చిట్కాలు పాటించాలి.

- స్నానం చేసిన వెంటనే తడిపొడి చర్మం మీదే మాయిశ్చరైజర్ అప్లై చేయాలి.
- చర్మాన్ని తేమగా ఉంచే మాయిశ్చరైజింగ్ సబ్బులే వాడాలి.
- రోజుకి 8 నుంచి 10 గ్లాసుల నీళ్లు తాగడం తప్పనిసరి.
- చలిగా ఉంది కదా! అని స్నానం చేయడం మానకూడదు. స్నానంతో మృత చర్మకణాలు వదిలి చర్మం మెరుగవుతుంది.
- స్నానానికి మరీ చల్లని లేదా మరీ వేడి నీళ్లు వాడకూడదు.
- శనగపిండి, ముల్తానీ మట్టిలతో ఫేస్ ప్యాక్ వేసుకోవడం వల్ల పొడిచర్మం మరింత పొడిబారుతుంది.
- ప్రతిరోజూ మాయిశ్చరైజర్ అప్లై చేసిన తర్వాత దాని మీద సన్‌స్క్రీన్ అప్లై చేసుకోవాలి.
- గ్లిజరిన్, నిమ్మరసం, రోజ్‌వాటర్ సమపాళ్లలో కలిపి ముఖం, చేతులు మీద పూసుకుని ఆరిన తర్వాత కడిగేసుకుంటే చర్మం తేమగా మారుతుంది.
- బొప్పాయి, అరటి గుజ్జులతో ముఖం మర్దనా చేసుకున్నా చర్మం తేమగా మారుతుంది.

స్టయిల్ టిప్

ఎలాంటి హ్యాండ్ బ్యాగ్?



సందర్భానికి తగ్గట్టు దుస్తులు ధరిస్తాం. మరి ఆ దుస్తులకు తగిన హ్యాండ్ బ్యాగ్ ఎంచుకుంటున్నామా? నిజానికి ఔట్‌ఫిట్‌కి మ్యాచ్ అయ్యే బ్యాగ్ చేతిలో ఉంటేనే స్టయిల్ చమక్కుమంటుంది. ఏ ఔట్‌ఫిట్‌కు ఎలాంటి బ్యాగ్ సెలెక్ట్ చేసుకోవాలంటే...

ఆఫీసు, షాపింగ్, క్యాజువల్, ఫార్మల్... ఇలా వేర్వేరు సందర్భాలకు తగ్గట్టు వేర్వేరు ఔట్‌ఫిట్స్, బ్యాగ్స్ ఎంచుకోవాలి. పెద్ద సైజు బ్యాగులు క్యాజువల్ అకేషన్స్‌కు సూటయితే, ఫార్మల్ అకేషన్లకు చిన్న బ్యాగులు మ్యాచవుతాయి. అలాగే....

- **షాపింగ్:** టీ షర్ట్, షార్ట్స్, స్నీకర్స్... ఈ డ్రస్‌లో షాపింగ్‌కు బయల్దేరితే పెద్ద సైజు హోబో లేదా డఫుల్ బ్యాగు ఎంచుకోవాలి. స్కిన్నీ జీన్స్ మీదకు హోబో లేదా టోట్ బ్యాగ్, సమ్మర్ డ్రస్, శ్యాండిల్స్ వేసుకుటే స్లింగ్ బ్యాగ్ ఎంచుకోవాలి.
- **ఆఫీసు:** చీర కడితే హ్యాండీగా ఉండే షోల్డర్ బ్యాగ్ సరిపోతుంది. అదే చుడీదార్ వేసుకుంటే స్లింగ్ బ్యాగ్ లేదా మరీ పెద్దది, చిన్నదిగా కాకుండా మధ్యస్థంగా ఉండే హ్యాండ్ బ్యాగ్ ఎంచుకోవాలి. ఒకవేళ ట్రౌజర్స్ ధరిస్తే బాక్సీ బ్యాగ్, హై వెయిస్ట్ ట్రౌజర్లు, కార్డిగాన్ ధరిస్తే శాచెల్ బ్యాగ్ ఎంచుకోవచ్చు.
- **బోర్డ్ రూమ్ మీటింగ్:** ఈ సందర్భాల్లో అఫిషియల్ లుక్ కోసం హోబో, డఫుల్‌లకు బదులు టాప్ హ్యాండిల్ టోట్ లేదా బ్రీఫ్‌కేస్ బ్యాగ్ ఎంచుకోవాలి.
- **ఫార్మల్ ఈవెంట్లు:** లాంగ్ గౌన్ లేదా కాక్‌టెయిల్ డ్రస్ వేసుకుంటే క్లచ్ ఎంచుకోవాలి. ట్రెండీ లుక్ కోసం సెక్విన్, మెటాలిక్ లుక్ ఉండే ఎన్వలప్ క్లచ్ క్యారీ చేయాలి.

స్టయిల్

లవ్లీ లెగ్గింగ్!



నల్ల లెగ్గింగ్ ఒక్కటి ఉంటే చాలు! బోలెడన్ని డ్రస్సులకు మ్యాచ్ అయిపోతుంది. ఇది నిజమే! అయితే బ్లాక్ లెగ్గింగ్‌తో మ్యాచ్ అయ్యే డ్రస్సింగ్ స్టయిల్‌ను ఫాలో అయితే అటైర్ మొత్తానికి అందమొస్తుంది. అదెలాగంటే...

- ఫ్లేర్డ్ డ్రస్ కిందకు బ్లాక్ లెగ్గింగ్ వేస్తే, దాంతోపాటు పాదాలకు వెడ్జెస్, నడుముకు బెల్ట్ తప్పనిసరి.
- ఈ చలికాలం ఓవర్‌సైజ్‌డ్ స్వెటర్ ఎంచుకున్నారా? అయితే బ్లాక్ లెగ్గింగ్‌తోపాటు యాంకిల్ బూట్లు ధరించండి!
- లాంగ్ టాప్ వేసుకుంటే, బ్లాక్ లెగ్గింగ్‌తోపాటు పాదాలకు ఫ్లాట్స్ వేసుకోండి!
- కార్డిగాన్ వేసుకుందామనిపిస్తే, లోపల షార్ట్స్, ఫిట్టెడ్ టాప్, బూట్లు వేసుకోవలసిందే!
- ఫ్లేర్డ్ స్కర్ట్ అయితే, ఫిట్టెడ్ టాప్, రైడింగ్ బూట్లు ధరించాలి.

మొయినుద్దీన్‌గా తలైవా..



కులాలకు, మతాలకు, జాతులకు, ప్రాంతాలకు అతీతమైనవి క్రీడలు. అలాంటి క్రీడలకు మత మౌఢ్యాన్ని అద్ది.. లేనిపోని వివాదాలకు తెరలేపుతూ పెడత్రోవ తొక్కుతున్న కొందరు యువకులను సన్మార్గంలో నడిపించి, వారిలో సఖ్యతను కుదిర్చే ఓ వ్యక్తి కథే 'లాల్ సలామ్'. ఇందులో సూపర్‌స్టార్ రజనీకాంత్ మొయినుద్దీన్ అనే శక్తివంతమైన పాత్రలో కనిపించనున్నారు. ముంబై నేపథ్యంలో నడిచే సినిమా ఇది. విష్ణు విశాల్, విక్రాంత్ ప్రధాన పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి ఐశ్వర్య రజనీకాంత్ దర్శకురాలు. సుభాస్కరన్ నిర్మాత. ప్రపంచవ్యాప్తంగా ఫిబ్రవరి 9న విడుదల కానున్న ఈ పాన్‌ఇండియా సినిమాకు సంబంధించిన రిలీజ్ డేట్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. బ్లాక్‌బాస్టర్ 'జైలర్' తర్వాత వస్తున్న తలైవా సినిమా కావడంతో సినిమాపై భారీ అంచనాలే ఉన్నాయి. కెరీర్‌లో ఇప్పటివరకూ చేయని విభిన్న పాత్రను ఇందులో రజనీ చేసున్నారని మేకర్స్ చెబుతున్నారు. ప్రపంచ ప్రఖ్యాత క్రికెటర్ కపిల్‌దేవ్ ఇందులో ప్రత్యేకపాత్ర పోషిస్తుండటం విశేషం. జీవితా రాజశేఖర్, సెంథిల్, తంబి రామయ్య, అనంతిక, వివేక్ ప్రసన్న, తంగదురై తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: విష్ణు రంగస్వామి, సంగీతం: ఏ.ఆర్.రెహమాన్.

లోకేశ్ కనకరాజ్ దర్శకత్వంలో రజనీకాంత్ 171వ చిత్రం రూపొందుతున్న విషయం తెలిసిందే. విశేషమేమిటంటే.. తలైవా 172కు కూడా రంగం సిద్ధమైంది. కర్ణన్, మామన్నన్ చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న మారి సెల్వరాజ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు. ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. లోకేశ్ కనకరాజ్ సినిమా నిర్మాణం పూర్తికాగానే, ఈ సినిమా షూటింగ్ మొదలవుతుంది.

ఐదొందల జీతానికి పనిచేశా

సమంత



స్టార్ హీరోయిన్‌గా ఎదిగిన తర్వాత జీవితంలో ఆర్థిక స్థిరత్వం వచ్చింది, అన్ని సౌకర్యాలు అమరాయి కానీ కెరీర్ ఆరంభంలో చాలా కష్టాలు పడాల్సి వచ్చిందన్నారు సమంత. ఒక్కపూట భోజనం కోసం వెతుక్కున్న రోజులు తన జీవితంలో ఉన్నాయని ఆమె చెప్పారు. ప్రస్తుతం మయోసైటిస్ వ్యాధితో సినిమాలకు విరామం ఇచ్చారు సమంత. ఇటీవలే జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్రమంలో సినిమాల్లోకి రాకముందు తన జీవితం గురించి వివరిస్తూ ఆమె భావోద్వేగానికి గురయ్యారు. అమ్మానాన్న చదువుకోమని చాలా ప్రోత్సహించినా ఆర్థిక స్తోమత సరిపోక పెద్ద చదవులు చదవలేకపోయానని చెప్పారు. 'కుటుంబ పోషణ కోసం చిన్న చిన్న ఉద్యోగాలు చేసేదాన్ని. ఒక స్టార్ హోటల్లో రూ. 500 నెల జీతానికి పనిచేశాను. అక్కడ నిర్వహించే కార్యక్రమాలకు వ్యాఖ్యాతగా వ్యవహరించేదాన్ని. మధ్యతరగతి కుటుంబం నుంచి జీవితంలో ఈ స్థాయికి రావడం వెనుక ఎన్నో కష్టనష్టాలు, అవమానాలు, హేళనలు ఎదుర్కోవలసి వచ్చింది' అని తెలిపారు. త్వరలోనే సమంత ఓ బాలీవుడ్ చిత్రం చేయబోతున్నారని సమాచారం.

ఈసారి కూడా బాగా గట్టిగా కొడతాం

మహేశ్‌బాబు



"నాకూ, నాన్నగారికీ సంక్రాంతి బాగా కలిసొచ్చిన పండుగ. సంక్రాంతికి విడుదలైన మా సినిమాలు బ్లాక్‌బస్టర్లయ్యాయి. ఈ సారి కూడా బాగా గట్టిగా కొడతాం. కానీ ఈ సారి 'గుంటూరు కారం' చిత్రం రికార్డులు, వసూళ్ల గురించి మాట్లాడడానికి నాన్న మన మధ్య లేరనే వెలితి ఉంది. ఆ లోటును ఇక మీరే (అభిమానులు) తీర్చాలి. ఇకపై నాకు అమ్మా, నాన్నా... అన్నీ మీరే' అని మహేశ్‌బాబు భావోద్వేగంతో స్పందించారు. ఆయన హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వం వహించిన చిత్రమిది. ఈనెల 12న విడుదలవుతోంది. మంగళవారం చిత్రబృందం గుంటూరులో ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించింది. ఈ సందర్భంగా మహేశ్‌బాబు మాట్లాడుతూ "త్రివిక్రమ్ అంటే నాకు చాలా ఇష్టం. గత రెండేళ్ల ఆయన నాకు అండగా నిలిచిన తీరు ఎప్పటికీ మర్చిపోలేను. ఆయన సినిమాల్లో చేసేటప్పుడు నా నటనలో ఏదో మ్యాజిక్ జరుగుతుంది. 'అతడు, ఖలేజా' చిత్రాల తరహాలో ఇప్పుడు 'గుంటూరు కారం'లోనూ అదే మ్యాజిక్ జరిగింది. ఇందులో మీరు కొత్త మహేశ్‌బాబును చూడబోతున్నారు. దానికి కారణం త్రివిక్రమే. మా నిర్మాత చినబాబు ఇష్టపడే హీరోని నేనే. వారితో మరిన్ని గొప్ప సినిమాలు తీయాలని కోరుకుంటున్నాను. చాలా రోజుల తర్వాత మన తెలుగు అమ్మాయి శ్రీలీల పెద్ద హీరోయిన్ కావడం గొప్ప విషయం. ఆ అమ్మాయితో డాన్స్ చేయాలంటే హీరోలందరికీ తాట ఊడిపోద్ది. థమన్ బెస్ట్ సాంగ్స్ ఇచ్చాడు' అని తెలిపారు. త్రివిక్రమ్ మాట్లాడుతూ 'ఒక సినిమాకు వంద శాతం పనిచేయాలంటే రెండొందల శాతం పనిచేసే హీరో ఎవరైనా ఉన్నారంటే అది మహేశ్‌బాబే. పాతికేళ్లయింది అంటున్నారు కానీ ఆయన్ను చూస్తుంటే నిన్నో, మొన్నో సినిమాల్లోకి వచ్చిన హీరోలానే ఉన్నారు. సూపర్‌స్టార్ కృష్ణగారు గొప్ప నటుడు. ఆయన నటించిన ఒక సినిమాకు సహాయ రచయితగా పనిచేశాను. అంత గొప్ప మనిషికి కొడుకుగా పుట్టిన మహేశ్‌బాబు ఎంత అదృష్టవంతుడో కదా అనిపిస్తుంది. 'అతడు, ఖలేజా' సినిమాలకు పనిచేసినప్పుడు మహేశ్ ఎలా ఉన్నారో ఇప్పుడు కూడా అలానే ఉన్నారు. నటనలోనూ అదే స్పీడ్ చూపిస్తున్నారు. షూటింగ్ తర్వాత బాగా అలసిపోయి కూడా మిమ్మల్ని కలుసుకోవడానికి గుంటూరు వచ్చారు. జనవరి 12న థియేటర్లలో కలుద్దాం. సంక్రాంతిని ఈసారి రమణగాడితో కలసి చేసుకుందాం' అన్నారు. శ్రీలీల మాట్లాడుతూ 'నాకు ఈ సినిమా మళ్లీ రీ లాంచ్‌లా అనిపిస్తోంది. మహేశ్‌బాబు బంగారపు విగ్రహానికి ప్రాణం పోసినట్లు ఉంటారు. ఆయన మనసు కూడా అంతే అందమైనది' అని చెప్పారు. నిర్మాత దిల్‌రాజు మాట్లాడుతూ 'మేకర్స్‌గా చినబాబు, వంశీ ప్రయాణం అద్భుతంగా ఉంది. త్రివిక్రమ్ ఈ సినిమాతో కలెక్షన్ల తాట తీస్తాడు. మహేశ్‌బాబు మరో బ్లాక్‌బస్టర్ చిత్రం ఇస్తున్నారు' అన్నారు. మీనాక్షి చౌదరి మాట్లాడుతూ 'త్రివిక్రమ్‌తో పనిచేయాలనే కోరిక ఈ చిత్రంతో తీరింది. ఆయనను అందరూ గురూజీ అని ఎందుకు పిలుస్తున్నారో అర్థమవుతోంది. మహేశ్‌బాబు గారి సినిమాలో చేయాలని అడిగినప్పుడు షాక్ తిన్నాను. ఆయనతో నటించే అవకాశం రావడం గౌరవంగా భావిస్తున్నాను. ఇది మహేశ్‌గారి మాస్ ఫిల్మ్' అని అన్నారు.

రేకుల షెడ్డు కూలి అభిమానులకు గాయాలు

గుంటూరు జిల్లాలోని పెదకాకాని సమీపంలో మహేష్ బాబు హీరోగా నటించిన గుంటూరు కారం సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో మంగళవారం రాత్రి అపశృతి చోటుచేసుకుంది. అంచనాలకు మించి భారీగా మహేష్ బాబు అభిమానులు రావడంతో, సభ ప్రాంగణం మొత్తం కనుచూపు మేర జనసంద్రంగా మారిపోయింది. దీంతో ప్రాంగణం కుడి వైపున వాచ్‌మెన్ కోసం నిర్మించిన రేకుల షెడ్డుపైకి పెద్ద ఎత్తున అభిమానులు ఎక్కారు. మహేష్ బాబును చూసేందుకు యువత ఒక్కసారిగా ఎగబడ్డారు. దీంతో రేకుల షెడ్డు కూలిపోయింది. ఈ ఘటనలో 20 మందికి స్వల్ప గాయాలయ్యాయి. అందులో కొందరిని విజయవాడ, గుంటూరు అస్పత్రులకు తరలించి చికిత్స అందించారు.

- పెదకాకాని

వెంకటేశ్ నట విశ్వరూపం చూస్తారు



'జయాపజయాల గురించి పట్టించుకోను. ప్రయాణాన్ని మాత్రమే ఆస్వాదిస్తాను. నిజాయితీగా పనిచేస్తే విజయం అదే వస్తుంది' అంటున్నారు దర్శకుడు శైలేష్ కొలను. ఆయన దర్శకత్వంలో వెంకటేశ్ కథానాయకుడిగా రూపొందిన చిత్రం 'సైంధవ్'. వెంకట్ బోయనపల్లి ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన ఈ సినిమా ఈ నెల 13న సంక్రాంతి కానుకగా విడుదల కానుంది. ఈ సందర్భంగా శైలేష్ విలేకరులతో మాట్లాడారు.

- 'హిట్2' తర్వాత వెంకటేశ్‌గారిని కలిశాను. బాగా తీశావ్ అని అభినందించారు. మేం సినిమాల కంటే జనరల్ విషయాలే ఎక్కువ మాట్లాడుకునేవాళ్లం. రెండుమూడు మీటింగ్స్‌లో మా ఇద్దరికీ మంచి బాండింగ్ ఏర్పడింది. సినిమా చేయాలనుకున్నాం. 'సైంధవ్' ఐడియా చెప్పాను. ఆయనకి బాగా నచ్చింది. 'నా 75వ సినిమా అంటే ఇలా ఉండాలి' అంటూ సంబరపడిపోయారు. ఆ లైన్ డవలప్‌చేసి పూర్తి స్క్రిప్ట్ వినిపించాను. కథ మొత్తం విని హగ్ చేసుకున్నారు. 'ఇది చేస్తున్నాం' అంటూ భుజం తట్టారు
- ఎలాంటి టెన్షన్ లేకుండా సినిమాను పూర్తి చేశాను. దానికి కారణం వెంకటేశ్‌గారే. అయితే.. ప్రమోషన్స్‌లో వెంకటేశ్‌గారి ఏవీలు చూస్తుంటే.. 'ఇంతటి అద్భుతమైన జర్నీ ఉన్న హీరోతో సినిమా చేశానా!?' అని టెన్షన్ మొదలైంది. నా వరకూ దర్శకుడిగా పూర్తి సంతృప్తితో ఉన్నా. వెంకీ 75 మూవీ ఎలా ఉండాలో అలా చేశాం. ఇందులో వెంకటేశ్ విశ్వరూపం చూస్తారు.
- వెంకటేశ్‌గారు ఎమోషనల్‌గా చేసిన ప్రతి సినిమా హిట్టే. శత్రువు, ధర్మచక్రం, గణేశ్, తులసి.. ఇలా చెప్పుకుంటూపోతే చాలా ఉన్నాయి. ఈ సినిమా వాటిని మించేలా ఉంటుంది. ఇంత ఎమోషనల్ డెప్త్ ఉన్న కథ చేయడం నాకిదే ప్రథమం. ఇందులో వెంకటేశ్‌గారి పెర్‌ఫార్మెన్స్ ప్రేక్షకులకు గూజ్‌బమ్స్ తెప్పిస్తుంది. హృదయాలను ద్రవింపజేసే భావోద్వేగపూరిత సన్నివేశాలు ఉన్నాయి ఇందులో.
- స్పైనల్ మస్కులర్ ఆట్రోఫీ అనే అరుదైన వ్యాధితో బాధపడుతున్న వారి పోరాటానికి బలమైన గొంతుకలేదు. 17కోట్ల ఇంజక్షన్ కోసం తపన పడే పేరెంట్స్ గురించి, వారి పోరాటం గురించి మనకి పెద్దగా అవగాహనలేదు. సమాజంలో ఈ విషయంపై అవగాహన పెంచాలంటే విస్తృతంగా కమ్యునికేట్‌చేసే నటులు కావాలి. వెంకటేశ్‌గారితోపాటు ఆండ్రియా, రుహానీ శర్మ లాంటి నటులు ఇందులో భాగమవ్వడానికి కారణం అదే. ఒక పవిత్రభావనతో తయారు చేసుకున్న కథ ఇది. అందుకే అందరికీ కనెక్ట్ అవుతుందని నమ్ముతున్నాను.
- ఇందులో నవాజుద్దీన్ సిద్దిఖీ పాత్ర యూనిక్‌గా ఉంటుంది. ఇప్పటివరకూ ఆయన కూడా ఈ తరహా పాత్ర చేయలేదు. డబ్బింగ్ సమస్య కారణంగా ఆయన దక్షిణాది సినిమాలు చేయడానికి ఇన్నాళ్లూ ఆసక్తి చూపలేదు. ఇందులో వచ్చీరాని తెలుగులో మాట్లాడే పాత్రని రాసుకున్నాను. ఆ పాత్రకు ఆయనతో డబ్బింగ్ చెప్పించడమే కరెక్ట్. అది ఆయనకి నచ్చింది. దాంతో చేయడానికి ఒప్పుకున్నారు. శ్రద్ధగా డబ్బింగ్ చెప్పారు.
- సినిమా చాలా కాస్ట్‌లీగా ఉంటుంది. కథకోసం వైజాగ్ సముద్రతీరంగా 'ఇంద్రప్రస్థ' అనే ఫిక్షనల్ టౌన్‌ని క్రియేట్ చేశాం. నిర్మాత ఏ విషయంలోనూ రాజీ పడలేదు. అందుకే సినిమా ఇంతబాగా వచ్చింది. పార్ట్2కు అవకాశం ఉన్న కథ ఇది. ప్రేక్షకులు కోరుకుంటే తప్పకుండా పార్ట్2 ఉంటుంది. ఇక నా 'హిట్3' రైటింగ్ దశలో ఉంది. అది రావడానికి ఏడాదిన్నర పట్టొచ్చు.

సంగీత దర్శకుడు ఉస్తాద్ రషీద్‌ఖాన్ కన్నుమూత



ప్రముఖ సంగీత దర్శకుడు ఉస్తాద్ రషీద్‌ఖాన్ (55)కన్నుమూశారు. ప్రోస్టేట్ క్యాన్సర్ బారిన పడిన ఆయన కొంతకాలంగా చికిత్స తీసుకుంటున్నారు. మంగళవారం కోల్‌కతాలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో రషీద్‌ఖాన్ తుదిశ్వాస విడిచారు. అభిమానుల సందర్శనార్థం ఆయన భౌతిక కాయాన్ని రవీంద్ర సదన్‌లో ఉంచారు. నేడు అంత్యక్రియలు నిర్వహించనున్నారు. రషీద్‌ఖాన్ మృతిపట్ల పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు సంతాపం తెలిపారు. ఆయనకు అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తామని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తెలిపారు. సంగీత రంగంలో ఆయన అందించిన సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం పద్మభూషణ్, పద్మశ్రీ పురస్కారాలతో సత్కరించింది. 'ఇష్కేరియా, మౌసమ్, హేట్ స్టోరీ 2, రాజ్, షాదీ మైన్, ఆవోగే జబ్‌తుమ్, కర్లే ప్యార్ కర్లే' తదితర చిత్రాలకు ఆయన సంగీతం అందించారు.

వరాలు అందరికీ నచ్చుతుంది..



'ఇందులో నాపేరు వరాలు. స్వతంత్ర భావాలు కలిగిన అమ్మాయిని. పల్లెటూరి అమ్మాయిలంటే సాధారణంగా సున్నితంగా ఉంటారు. కానీ నేను మాత్రం ఇందులో రెబల్. సినిమా చూసినవాళ్లు 'అమ్మాయి అంటే ఇలా ఉండాలి' అనేలా నా పాత్ర ఉంటుంది' అని అషిక రంగనాథ్ అన్నారు. అక్కినేని నాగార్జున కథానాయకుడిగా విజయ్ బిన్నీ దర్శకత్వంలో శ్రీనివాస్ చిట్టూరి నిర్మించిన 'నా సామిరంగ' చిత్రంలో అషిక కథానాయికగా నటించారు. జనవరి 14న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో ముచ్చటించారు. 'నాలాంటి కొత్తమ్మాయికి నాగార్జునగారి లాంటి టాప్‌స్టార్‌తో నటించే అవకాశం రావడం నిజంగా అదృష్టం. నా కేరక్టర్‌లో రెండు కోణాలుంటాయి. కొంతభాగం యంగ్‌స్టర్‌గా, కొంతభాగం ప్రౌఢగా కనిపిస్తాను. నటనలోనే కాదు, ఆహార్యంలో కూడా తేడా ఉంటుంది. కష్టపడి చేశాను. ఇంత అద్భుతమైన పాత్ర దక్కడం నా అదృష్టం.' అంటూ ఆనందం వెలిబుచ్చారు అషిక. కథానుగుణంగా నాగార్జున పాత్రకూ, తన పాత్రకూ మధ్య అద్భుతమైన లవ్‌ట్రాక్ ఉంటుందని, రొమాంటిక్ సన్నివేశాలను కూడా అందంగా దర్శకుడు తీర్చిదిద్దారని అషిక చెప్పారు. అల్లరి నరేశ్, రాజ్‌తరుణ్ పాత్రలు కూడా కథలో కీలకంగా ఉంటాయని, వారి కాంబినేషన్‌లో వచ్చే తన సీన్స్ చక్కని వినోదాన్ని పంచుతాయని అషిక తెలిపారు. ఎం.ఎం.కీరవాణి లాంటి గ్రేట్ టెక్నీషియన్ పనిచేస్తున్న చిత్రంలో భాగమవ్వడం పట్ల అషిక సంతోషం వ్యక్తం చేశారు. వేగం, క్లారిటీ ఈ రెండూ దర్శకుడు విజయ్ బిన్నీకి ఆభరణాలని, అనుభవం ఉన్న దర్శకుడిగా వండర్ అనిపించేలా సినిమాను తీర్చిదిద్దాడని, నిర్మాత శ్రీనివాస్ సహకారం వల్లే ఇంత అద్భుతమైన ప్రొడక్ట్ తయారైందని ఆమె పేర్కొన్నారు. తమిళంలో సిద్దార్థ్ కథానాయకుడిగా రూపొందుతోన్న చిత్రంతోపాటు కన్నడలో రెండు చిత్రాల్లో నటిస్తున్నట్టు ఈ సందర్భంగా అషిక తెలిపారు.

నిజాలు తెలుసుకొని వార్తలు రాయండి

- మిడిమిడి జ్ఞానంతో వార్తలు రాసి చిత్రపరిశ్రమను ఇబ్బందిపెడితే చర్యలు తప్పవు
- అసత్యాలను ప్రచారం చేసే పాత్రికేయులపై చర్యలు తీసుకోవాలని మీడియా సంస్థలను కోరిన తెలుగు చలనచిత్ర వాణిజ్య మండలి, తెలంగాణ రాష్ట్ర చలనచిత్ర వాణిజ్య మండలి, తెలుగు చలన చిత్ర నిర్మాతల మండలి

తెలుగు చలనచిత్ర పరిశ్రమ

ఇక నుంచి మెయిన్‌స్ట్రీమ్ మీడియా, సోషల్ మీడియా, డిజిటల్ మీడియా సంస్థలు చిత్ర పరిశ్రమను ఇబ్బందిపెట్టేలా ఇష్టం వచ్చిన రాతలు రాస్తే తగిన చర్యలు తీసుకుంటామని తెలుగు చలనచిత్ర వాణిజ్య మండలి, తెలంగాణ రాష్ట్ర చలనచిత్ర వాణిజ్య మండలి, తెలుగు చలన చిత్ర నిర్మాతల మండలి సంయుక్తంగా హెచ్చరించాయి. ఈ మేరకు మంగళవారం ఆ మూడు సంస్థలు సంయుక్తంగా ఓ ప్రకటన విడుదల చేశాయి. నిజాలను నిర్భయంగా ప్రచారంలో పెట్టవచ్చు కానీ అసత్యాలు, ఈర్ష్య ద్వేషాలతో వ్యక్తుల గౌరవాన్ని దెబ్బతీయడం సరైనది కాదని లేఖలో మీడియా సంస్థలకు హితవు పలికాయి. కొన్ని వెబ్‌సైట్లు, డిజిటల్ మీడియా సంస్థలు సంక్రాంతి టైంలో వాళ్ల రేటింగ్స్ కోసం అదేపనిగా తమకు నచ్చినట్లు వార్తలు రాయడం వల్ల హీరోలు, దర్శకులు వారి అభిమానుల నుంచి విమర్శలు ఎదుర్కొంటున్నారు, కాబట్టి ఇక నుంచి ఏ మీడియా సంస్థ అయినా వార్తలు ప్రచురించేముందు మా మూడు సంస్థలను సంప్రదించి నిజాలు తెలుసుకోవాలని కోరాయి. సినీ ప్రముఖులు మాట్లాడేటప్పుడు పూర్తిగా అవగతం చేసుకోకుండా మిడిమిడి జ్ఞానంతో పరిశ్రమ ఇబ్బందిపడేలా వార్తలు రాయడం విచారకరం అని పేర్కొన్నాయి. సంక్రాంతి సినిమాల మధ్య పోటీ ఆహ్లాదకరంగా ఉండాలనీ, తెలుగు సినిమా హీరోలు, దర్శకులు, నిర్మాతలు... ఎవరూ నష్టపోకూడదనీ మా మూడు సంస్థలు కలసి కృషి చేస్తుంటే సహకరించాల్సింది పోయి మీడియా సంస్థలు అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని సూచించాయి. తెలుగు సినీ పరిశ్రమకు పుట్టుక నుంచి మీడియాతో ఉన్న అనుబంధాన్ని దృష్టిలో ఉంచుకొని ఇబ్బందికర వ్యాఖ్యలు చేసేవారిపైన తగు చర్యలు తీసుకోవాలని సినీ పాత్రికేయ సంఘాలు, మీడియా యాజమాన్యాలను లేఖలో అభ్యర్థించాయి. సంక్రాంతి బరిలో ఉన్న సినిమాలకు థియేటర్ల కేటాయింపు వివాదంపై ఆ సంస్థల గౌరవ కార్యదర్శులు కే.ఎల్ దామోదర్ ప్రసాద్, కే అనుపమ్ రెడ్డి, తుమ్మల ప్రసన్నకుమార్ ప్రకటనలో స్పందిస్తూ 'గతంలో ఓ సమావేశం ఏర్పాటు చేసి, నిర్మాతలను పిలిచి సహకరించమని కోరాము. మా వినతిని మన్నించి, 'ఈగల్' చిత్రాన్ని సంక్రాంతికి విడుదల చేయకుండా వాయిదా వేసుకున్నారు. తద్వారా మిగతా నాలుగు సినిమాలకు సహకరించినందుకు ఆ చిత్ర నిర్మాత టీజీ విశ్వప్రసాద్, హీరో రవితేజకు ధన్యవాదాలు. అలాగే రజనీకాంత్ ' లాల్‌సలామ్', ధనుష్ 'కెప్టెన్ మిల్లర్' శివ కార్తికేయన్ 'అయలాన్' చిత్రాలను తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతికి విడుదల చేయకుండా వాయిదా వేసేందుకు అంగీకరించినందుకు వారికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాం' అని ప్రకటనలో తెలిపారు.

పోలీస్ వారి హెచ్చరిక



బాబ్జీ దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'పోలీస్‌వారి హెచ్చరిక'. అభిల్ సన్నీ, అజయ్‌ఘోష్, రవికాలే ప్రధానపాత్రధారులు. బెల్లి జనార్ధన్ నిర్మాత. ప్రస్తుతం చిత్ర ప్రధాన తారగణంపై పోరాట సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. దర్శకుడు మాట్లాడుతూ '80 శాతం షూటింగ్ పూర్తయింది. ఈ నెలాఖరుకు షూటింగ్ పూర్తవుతుంది. త్వరలోనే సినిమాను విడుదల చేస్తాం' అని చెప్పారు. సంజయ్ నాయర్, కాశీవిశ్వనాథ్, గడ్డేష్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: కొండపల్లి నళినీకాంత్, సంగీతం: గజ్వేల్ వేణు.

ఈ ఏడాదిలో రూ.4.15 లక్షల కోట్లు



ఐపీఓలు, ఫండింగ్ డీల్స్‌పై కోటక్ అంచనా

ముంబై: దేశీయ క్యాపిటల్ మార్కెట్లో ఈ ఏడాది పబ్లిక్ ఆఫరింగ్స్ (ఐపీఓ), ఫండింగ్ డీల్స్ మరింత చురుకుగా జరగనున్నాయని కోటక్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ పేర్కొంది. వీటి ద్వారా నిధుల సమీకరణ 2021లో నమోదైన ఆల్‌టైం రికార్డును సైతం మించి 5,000 కోట్ల డాలర్ల (రూ.4.15 లక్షల కోట్లు)కు చేరుకోవచ్చని అంచనా వేసింది. నవతరం టెక్ కంపెనీల ఇష్యూలు ఈ ఏడాది ప్రైమరీ మార్కెట్ మరింత సందడి చేయనున్నాయని కోటక్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ ఎండీ, సీఈఓ ఎస్ రమేశ్ మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అన్నారు. 2023లో దేశీయ ఫండ్స్ మార్కెట్లో 2,580 కోట్ల డాలర్ల పెట్టుబడులు పెట్టాయన్నారు. నిఫ్టీ ఏడాది ఫార్వార్డ్ ప్రీమియం సరికొత్త రికార్డు 20.1 రెట్ల స్థాయిలో ఉందని, వర్ధమాన మార్కెట్లలోకెల్లా ఇదే అత్యధికమని ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. ఈ ఏడాది మరిన్ని బడా ఐపీఓలను చూడబోతున్నామని కోటక్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ ఎండీ వీ జయశంకర్ అన్నారు. సెకండరీ మార్కెట్లో లోక్‌సభ ఎన్నికల సంబంధిత ఊగిసలాటలు ప్రైమరీ మార్కెట్లో పబ్లిక్ ఇష్యూలను దీర్ఘకాలం పాటు ప్రభావితం చేసే అవకాశాల్లేవన్నారు. ఎందుకంటే, ఎన్నికల తంతు 2-3 నెలల్లో ముగుస్తుందన్నారు.

గత ఏడాది రికార్డు స్థాయిలో 59 కంపెనీలు ఐపీఓకు వచ్చాయి. తద్వారా దాదాపు రూ.53,000 కోట్లు సమీకరించాయి. కాగా, మరో 182 ఎస్ఎంఈలు సైతం పబ్లిక్ ఇష్యూకు వచ్చాయి. ఐపీఓల ద్వారా అత్యధికంగా నిధులు సమీకరించిన మార్కెట్లలో అమెరికా, చైనా, జపాన్ తర్వాత మన దలాల్‌స్ట్రీట్ నాలుగో స్థానంలో నిలిచింది. డీల్స్ విషయానికొస్తే, 2019 నుంచి 2023 మధ్య కాలంలో 5,500 కోట్ల డాలర్ల విలువైన కొనుగోళ్లు జరిగాయి. అంతకు 15 ఏళ్లలో నమోదైన డీల్స్ కంటే అధికమిది. ప్రమోటర్లు కంపెనీల విలువను పెంచేందుకు వాటాను వదులుకునేందుకు ముందుకు వస్తుండటమే ఇందుకు కారణం. అలాగే, పలు కంపెనీలు ఈక్విటీతోపాటు రుణ పత్రాల (డెట్ ఇన్‌స్ట్రుమెంట్స్) జారీ ద్వారా నిధుల సమీకరణలో వివిధీకరణ వ్యూహాన్ని అనుసరిస్తుండటం మరో కారణం. వచ్చే రెండేళ్లలో దేశీయ మార్కెట్లో మరో 20 స్టార్టప్‌లు యూనికార్న్‌లుగా (కనీసం 100 కోట్ల డాలర్ల విలువైన కంపెనీ) ఎదిగే అవకాశం ఉందని కోటక్ అంచనా వేసింది.

అదానీ చేతికి ల్యాంకో అమర్‌కంటక్ ప్లాంట్!

న్యూఢిల్లీ: అదానీ గ్రూప్ విద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని మరింతగా విస్తరిస్తోంది. ఇందులో భాగంగా దివాలా ప్రక్రియలో ఉన్న మధ్యప్రదేశ్‌లోని ల్యాంకో అమర్‌కంటక్ థర్మల్ పవర్ ప్లాంట్ కోసం పోటీపడుతోంది. ఇందుకోసం రూ.4,100 కోట్లకు బిడ్ సమర్పించింది. ఈ నెల 16న ఎన్‌సీఎల్‌టీ దీనిపై నిర్ణయం తీసుకోనుంది. 2022 జనవరిలోనే ఈ ప్లాంట్ కోసం పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (పీఎఫ్‌సీ) నాయకత్వంలోని కన్సార్షియం రూ.3,020 కోట్లకు బిడ్ సమర్పించింది. మెజారిటీ రుణదాతలు ఆమోదించడంతో ఈ ప్రతిపాదనను దివాలా పరిష్కార నిపుణుడు ఎన్‌సీఎల్‌టీ ఆమోదం కోసం సమర్పించారు. ఎన్‌సీఎల్‌టీ తన నిర్ణయాన్ని వెల్లడించక ముందే అదానీ గ్రూప్ సంస్థ అదానీ పవర్ రూ.4,100 కోట్లు చెల్లించేందుకు ముందుకు వచ్చింది. పీఎఫ్‌సీ సమర్పించిన బిడ్ కంటే ఇది 36 శాతం ఎక్కువ. దీంతో ల్యాంకో అమర్‌కంటక్ ప్లాంట్ అదానీ గ్రూప్ పరమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.

హైదరాబాద్‌కు చెందిన నీహార్ ఇన్ఫో గ్లోబల్ లిమిటెడ్... హెల్త్‌కేర్ స్టార్టప్ మెస్సర్స్ లైఫ్ 108 హెల్త్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్‌లో 51 శాతం వాటాను చేజిక్కించుకున్నట్టు ప్రకటించింది. లైఫ్ 108.. హెల్త్‌కేర్, లైఫ్ స్టైల్ ఉత్పత్తులను రిటైల్, హోల్‌సేల్, బీ2బీ, ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్స్‌తో పాటు తన సొంత పోర్టల్ ద్వారా విక్రయిస్తోంది. అంతేకాకుండా వివిధ హెల్త్‌కేర్ బ్రాండ్స్‌తో భాగస్వామ్యాలు కుదుర్చుకోవటంతో పాటు కొత్త ఉత్పత్తులను తీసుకువచ్చే ఆలోచనలో ఉందని నీహార్ ఇన్ఫో వెల్లడించింది. మెజారిటీ వాటా కొనుగోలుతో లైఫ్ 108.. నీహార్ ఇన్ఫో అనుబంధ సంస్థగా ఉండనుందని పేర్కొంది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	62,950 ▼	57,700 ▼	78,000 ▲
ముంబై	62,415 ▲	57,172 ▲	71,840 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



9వ తేదీ		విజయవాడ	565
హైదరాబాద్	560	విశాఖపట్నం	625
10 జనవరి		వరంగల్	562
చిత్తూరు	583	డజను గుడ్లు రూ.72	
గోదావరి	565		

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	85	గోదావరి	84
వరంగల్	85	విజయవాడ	84
కరీంనగర్	85	గుంటూరు	85
మహబూబ్‌నగర్	85	ఒంగోలు	85
కర్నూలు	85	చిత్తూరు	85
విశాఖపట్నం	79		

అంతంత మాత్రంగానే జాబ్ మార్కెట్

ఐటీలో 21 శాతం తగ్గిన రిక్రూట్‌మెంట్.. నౌకరీ జాబ్ స్పీక్ ఇండెక్స్ వెల్లడి

ముంబై: వైట్ కాలర్ జాబ్స్ మార్కెట్ ఇంకా కోలుకోలేదు. 2022 డిసెంబరుతో పోలిస్తే గత ఏడాది డిసెంబరులో వైట్ కాలర్ జాబ్స్ నియామకాలు 16 శాతం పడిపోయాయి. ఐటీ, బీపీఓ, విద్య, రిటైల్, హెల్త్‌కేర్ కంపెనీలు నియామకాలపై ఆచితూచి వ్యవహరించడం ఇందుకు ప్రధాన కారణం. 2023 నవంబరుతో పోల్చితే మాత్రం గత నెలలో నియామకాలు రెండు శాతం పెరిగాయి. ఐటీయేతర రంగాల్లో నియామకాలు కొద్దిగా పెరగడం ఇందుకు ప్రధాన కారణం. మంగళవారం వెలువడిన 'నౌకరీ జాబ్ స్పీక్ ఇండెక్స్' ఈ విషయం తెలిపింది.

ఇంకా డౌన్‌లోనే ఐటీ: ఐటీ రంగంలో సంక్షోభం ఇంకా కొనసాగుతోంది. ఐటీ, బీపీఓ కంపెనీలు కొత్త నియామకాలను దాదాపుగా పక్కన పెట్టాయి. దీంతో 2022 డిసెంబరుతో పోలిస్తే గత ఏడాది డిసెంబరులో ఐటీ రంగంలో 21 శాతం, బీపీఓ రంగంలో 17 శాతం నియామకాలు తగ్గాయి. నవంబర్‌తో పోల్చినా డిసెంబరు నెలలో ఐటీ కంపెనీల నియామకాలు నాలుగు శాతం తగ్గినట్టు నౌకరీ ఇండెక్స్ తెలిపింది. అయితే డేటా సైంటిస్టులు, ఐటీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇంజనీర్లు, ఆటోమేషన్ ఇంజనీర్లకు ఐటీ కంపెనీలు ఇప్పటికీ స్వాగతం పలుకుతున్నాయి.

ఈ రంగాల్లో అప్: ఐటీ వంటి కొన్ని రంగాల్లో నియామకాల జోరు తగ్గినా కొన్ని రంగాల్లో మాత్రం నియామకాల జోరు పెరిగింది. డిసెంబరులో ఆతిథ్య రంగంలో నియామకాలు నాలుగు శాతం, ఫార్మా రంగంలో రెండు శాతం, పెరిగాయి. ఆయిల్ అండ్ గ్యాస్ రంగంలో నియామకాలు పెరగకపోయినా స్థిరంగా ఉన్నాయి.

హైదరాబాద్‌లో 23 శాతం క్షీణత

గత ఏడాది డిసెంబరు నెల హైదరాబాద్ జాబ్ మార్కెట్‌కు పెద్దగా కలిసి రాలేదు. 2022 డిసెంబరుతో పోలిస్తే 2023 డిసెంబరులో నియామకాలు 23 శాతం పడిపోయాయి. ఐటీ కంపెనీలో నియామకాల జోరు తగ్గడం ఇందుకు ప్రధాన కారణం. భారత సిలికాన్ వ్యాలీగా పేరొందిన బెంగళూరులోనూ ఇదే పరిస్థితి. చెన్నై, పుణె, కోల్‌కతాల్లోనూ నియామకాలు 16 నుంచి 24% పడిపోయాయి.

ఆఖరి గంటలో అమ్మకాలు

స్వల్ప లాభాలతో సరిపెట్టుకున్న సూచీలు

ముంబై: స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు మంగళవారం అతి స్వల్ప లాభాలతో సరిపెట్టుకున్నాయి. ఆఖరి గంటలో అమ్మకాలు పోటెత్తడం ఇందుకు కారణమైంది. ఈ వారంలోనే కార్పొరేట్ కంపెనీల త్రైమాసిక ఆర్థిక ఫలితాల సీజన్ ప్రారంభంతో పాటు స్థూల ఆర్థిక గణాంకాలు కూడా విడుదల కానున్న నేపథ్యంలో మదుపరులు ముందుజాగ్రత్తగా లాభాల స్వీకరణకు పాల్పడ్డారని మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి. ఒక దశలో 680 పాయింట్లకు పైగా ఎగిసి 72,000 స్థాయిని దాటిన సెన్సెక్స్.. చివరికి 30.99 పాయింట్ల లాభంతో 71,386.21 వద్ద క్లోజైంది. ఇంట్రాడేలో 211 పాయింట్లు పెరిగిన నిఫ్టీ.. ట్రేడింగ్ ముగిసే సరికి కేవలం 31.85 పాయింట్ల లాభంతో 21,544.85 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో సగం లాభపడగా.. మిగతా సగం నష్టాలు చవిచూశాయి.

జీ షేరు ధమాల్: సోనీ ఇండియాతో గతంలో కుదుర్చుకున్న విలీన ఒప్పందంపై అనిశ్చితి మబ్బులు కమ్ముకోవడంతో జీ ఎంటర్‌టైన్‌మెంట్ షేరు ఇంట్రాడేలో 12.66 శాతం వరకు క్షీణించి రూ.242.30కి పతనమైంది. చివరికి, 7.64 శాతం నష్టంతో రూ.256.25 వద్ద ముగిసింది. దాంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.2,036 కోట్లు తగ్గి రూ.24,613.31 కోట్లకు పడిపోయింది. కాగా, సోనీతో విలీన ఒప్పందాన్ని పూర్తి చేసేందుకు కట్టుబడి ఉన్నామని, ఈ దిశగా ప్రయత్నాలు కొనసాగుతున్నాయని జీ ఎంటర్‌టైన్‌మెంట్ వివరణ ఇచ్చింది.

బజాజ్ ఆటో.. రూ.2 లక్షల కోట్లు: దేశీయ వాహన కంపెనీ బజాజ్ ఆటో బోర్డు రూ.4,000 కోట్ల సొంత షేర్ల తిరిగి కొనుగోలు (బైబ్యాక్)కు ఆమోదం తెలుపడంతో కంపెనీ షేరు ధర ఒకదశలో 6.21 శాతం పుంజుకొని రూ.7,420 వద్ద సరికొత్త ఏడాది గరిష్ఠాన్ని నమోదు చేసుకుంది. చివరికి 1.55 శాతం లాభంతో రూ.7,093.75 వద్ద స్థిరపడింది. దాంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.2 లక్షల కోట్లు దాటింది.



బీ న్యూలో రెడ్‌మీ నోట్ 13 5జీ ఆవిష్కరణ

మల్టీ బ్రాండ్ మొబైల్స్ రిటైల్ చెయిన్ బీ న్యూ మొబైల్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ స్టోర్లలో రెడ్‌మీ నోట్ 13 5జీ సిరీస్ స్మార్ట్‌ఫోన్ అందుబాటులోకి వచ్చింది. మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఈ 5జీ స్మార్ట్‌ఫోన్‌ను సినీ నటి రుహానీ శర్మ, బీ న్యూ మొబైల్స్ సీఈఓ సాయి నిఖిలేష్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాయి నితేష్ లాంఛనంగా విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని 150కి పైగా బీ న్యూ షోరూమ్‌ల్లో ఈ స్మార్ట్‌ఫోన్‌ను కొనుగోలు చేయవచ్చు. రెడ్‌మీ నోట్ 13 ప్రొ ప్లస్ 5జీ.. 8జీబీ, 12 జీబీ వేరియంట్లలో, రెడ్‌మీ నోట్ 13 5జీ.. 6జీబీ, 8జీబీ, 12 జీబీ వేరియంట్స్‌లో అందుబాటులో ఉండనుంది.

సెలెక్ట్ మొబైల్స్‌లో రెడ్‌మీ నోట్ 13 5జీ



మొబైల్ రిటైల్ చెయిన్ సెలెక్ట్ మొబైల్స్ మాదాపూర్ స్టోర్‌లో షావోమీ రెడ్‌మీ నోట్ 13 5జీ స్మార్ట్‌ఫోన్‌ను సినీ నటి సిరి హనుమంతు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో షావోమీ తెలంగాణ స్టేట్ హెడ్ సయ్యద్ అన్వర్, ఇష్తికార్ (రిటైల్ మార్కెటింగ్ హెడ్) పాల్గొన్నారు. కొత్త టెక్నాలజీ, కొత్త మోడల్స్‌ను ప్రవేశపెట్టడంలో సెలెక్ట్ మొబైల్స్ ఎప్పుడు ముందు వరుసలో ఉంటుందని.. అదే ఒరవడిని కొనసాగిస్తూ రెడ్‌మీ నోట్ 13 5జీ ఫోన్‌ను తీసుకువచ్చినట్లు సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మురళి రేతినేని తెలిపారు. ఈ స్మార్ట్‌ఫోన్ ఏపీ, తెలంగాణ, మహారాష్ట్రలోని అన్ని సెలెక్ట్ స్టోర్లలో అందుబాటులో ఉంటుందన్నారు.

2036 నాటికి 6.4 కోట్ల ఇళ్లు అవసరం

న్యూఢిల్లీ: దేశంలో నివాస గృహాలకు డిమాండ్ రోజురోజుకీ పెరిగిపోతోంది. పెరుగుతున్న జనాభా, ఆర్థిక వ్యవస్థతో 2036 నాటికి దేశంలో 6.4 కోట్ల ఇళ్లకు డిమాండ్ ఉంటుందని అంచనా. ఇందులో ఎక్కువ భాగం ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లోనే ఉంటుందని క్రెడాయ్, డేటా అనలిటిక్స్ సంస్థ లిసెస్ ఫోరాస్ సంయుక్తంగా రూపొందించిన ఒక నివేదికలో తేలింది. 2018 నాటికి ఉన్న 2.9 కోట్ల గృహాల కొరతను కూడా పరిగణనలోకి తీసుకుంటే 2036 నాటికి మొత్తం 9.3 కోట్ల గృహాలు అవసరమని ఈ నివేదిక పేర్కొంది. గత ఏడాది రెరా వద్ద నమోదైన 19,050 రియల్ ఎస్టేట్ ప్రాజెక్టుల్లో 45 శాతం నివాస గృహాల ప్రాజెక్టులని క్రెడాయ్ జాతీయ అధ్యక్షుడు బొమన్ ఇరానీ తెలిపారు.

మూడేళ్లలో 5 కొత్త కార్లు

రెనో సీఈఓ వెంకట్రామ్ మామిళ్లపల్లి



న్యూఢిల్లీ: ఫ్రెంచ్ కార్ల ఉత్పత్తి దిగ్గజ సంస్థ రెనో... రాబోయే మూడు సంవత్సరాల కాలంలో 5 కొత్త కార్లను భారత మార్కెట్లో ప్రవేశపెట్టనుంది. భిన్న సవాళ్ల కారణంగా గత ఏడాది అమ్మకాలు నిరాశావహంగా ఉన్న నేపథ్యంలో ఈ ఏడాది పునరుజ్జీవం సాధించగలమని విశ్వసిస్తోంది. 2023 సంవత్సరంలో కంపెనీ 49,000 కార్లను దేశీయ మార్కెట్లో విక్రయించడంతో పాటు 28,000 కార్లను విదేశాలకు ఎగుమతి చేసింది. ఈ ఏడాది తాము తప్పనిసరిగా రెండంకెల వృద్ధిని సాధిస్తామని రెనో ఇండియా సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ వెంకట్రామ్ మామిళ్లపల్లి తెలిపారు. కొత్తగా విడుదల చేయనున్న కార్లన్నీ పూర్తిగా కొత్త మోడళ్లని, వాటిలో కొత్తతరం కైగర్, ట్రైబర్ కూడా ఉంటాయని ఆయన అన్నారు. భారత మార్కెట్లో పూర్తిగా కొత్త బ్రాండ్ గుర్తింపు సాధించాలనే ప్రయత్నానికి ఇది నిదర్శనమని ఆయన చెప్పారు. కస్టమర్ బేస్‌ను విస్తరించుకునే ప్రయత్నాల్లో భాగంగా రెనో మంగళవారం క్విడ్, ట్రైబర్, కైగర్ కార్లలో కొత్త వేరియెంట్లను మార్కెట్లో ప్రవేశపెట్టింది. వీటి ధరల శ్రేణి రూ.4.69 లక్షల నుంచి రూ.10.99 లక్షల మధ్యన ఉంది.

2028 నాటికి 1000 స్టోర్లు

ముంబై: టాటా స్టార్‌బక్స్ 2028 నాటికి తమ స్టోర్ల సంఖ్య వెయ్యికి పెంచుకోవాలనుకుంటోంది. ప్రస్తుతం దేశంలో 390 స్టార్‌బక్స్ స్టోర్లున్నాయి. రాబోయే రోజుల్లో ప్రతి 3 రోజులకు ఒక స్టోర్ ప్రారంభించాలనుకుంటున్నామని; అలాగే ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలకు విస్తరించనున్నామని స్టార్‌బక్స్ ఒక ప్రకటనలో తెలిపింది. తమ ఉద్యోగుల సంఖ్యను కూడా 8600కి పెంచనున్నట్టు వెల్లడించింది.

'అర్జును'లు హుస్సామ్, అజయ్

● సాత్విక్, ఇషా గైర్హాజరు
● ఘనంగా క్రీడా అవార్డుల ప్రదానోత్సవం



శీతల్ దేవి



మహ్మద్ షమి



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి అవార్డులు అందుకుంటున్న హుస్సాముద్దీన్, అజయ్‌కుమార్

న్యూఢిల్లీ: తెలుగు క్రీడాకారులు మహ్మద్ హుస్సాముద్దీన్ (బాక్సింగ్), ఇల్లూరి అజయ్‌కుమార్ రెడ్డి (అంధుల క్రికెట్)తోపాటు క్రికెటర్ షమి అర్జున అవార్డులతో మెరిశారు. మంగళవారం రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించిన జాతీయ క్రీడా అవార్డుల ప్రదానోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా వీరు ప్రతిష్ఠాత్మక క్రీడా అవార్డులను అందుకొన్నారు. ఈ ఏడాది 26 మందిని అర్జునకు ఎంపిక చేయగా.. జకార్తాలో ఆసియా ఒలింపిక్స్ క్వాలిఫయర్స్‌లో పాల్గొంటున్న తెలుగు షూటర్ ఇషా సింగ్ ఈ వేడుకకు గైర్హాజరైంది. సాధారణంగా హాకీ లెజెండ్ మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి రోజైన ఆగస్టు 29న క్రీడా అవార్డులను ప్రదానం చేస్తుంటారు. అయితే, ఆసియాడ్ కారణంగా ఈసారి వాయిదా వేయాల్సి వచ్చింది. గతేడాది జరిగిన బాక్సింగ్ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో హుస్సాముద్దీన్ కాంస్య పతకం సాధించాడు. ఇక, అజయ్ కుమార్ సారథ్యంలో భారత అంధుల క్రికెట్ జట్టు వన్డే, రెండు టీ20 వరల్డ్‌కప్‌లు గెలిచింది.

ప్రత్యేక ఆకర్షణ.. షమి, శీతల్: క్రికెటర్ షమి, పారా ఆర్చర్ శీతల్ దేవి ఈ కార్యక్రమానికే హైలైట్‌గా నిలిచారు. షమి అవార్డు అందుకోవడానికి వచ్చినప్పుడు ఆహూతులు కరతాళ ధ్వనులతో అభినందించారు. వన్డే వరల్డ్‌కప్‌లో షమి అద్భుత ప్రదర్శన చేశాడు. కాగా, అర్జున అందుకొన్న పిన్నవయసు అథ్లెట్‌గా 16 ఏళ్ల శీతల్ ప్రత్యేకంగా నిలిచింది. దివ్యాంగురాలైన ఆమె అవార్డు స్వీకరిస్తున్నప్పుడు కూడా హాల్‌లో ఎంతో ఉత్సాహ వాతావరణం నెలకొంది. రెండు చేతులు లేకపోయినా.. కాళ్లతో ఆర్చరీ సాధన చేసిన శీతల్ పారా ఆసియాడ్‌లో మూడు స్వర్ణాలు సాధించడం విశేషం. యువ గ్రాండ్ మాస్టర్ ఆర్. వైశాలి, రెజ్లర్ అంతిమ్ పంగల్ కూడా అర్జునను స్వీకరించారు.

'మలేసియా'లో సాత్విక్, చిరాగ్ జోడీ..: క్రీడా అవార్డుల్లో అత్యున్నతమైన ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న అవార్డుకు బ్యాడ్మింటన్ డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టి ఎంపికయ్యారు. అయితే, మలేసియా ఓపెన్‌లో ఆడుతుండడంతో వీరిద్దరూ కార్యక్రమానికి హాజరుకాలేక పోయారు. మరోసారి ప్రత్యేకంగా ఏర్పాటు చేసే కార్యక్రమంలో వీరికి అవార్డులను ప్రదానం చేస్తారు. ఖేల్‌రత్న అవార్డు కింద మొమెంటోతోపాటు రూ. 25 లక్షల నగదు బహుమతి అందనుంది. అర్జున్ అవార్డీలకు మొమెంటోతోపాటు రూ. 15 లక్షల నజరానా దక్కనుంది.

చైతన్యకు సాహస అవార్డు



టెన్సింగ్ నార్కే జాతీయ సాహస అవార్డును ఆంధ్రకు చెందిన స్విమ్మర్ మోతుకూరి తులసీ చైతన్య అందుకొన్నాడు. వృత్తిరీత్యా ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగం హెడ్ కానిస్టేబుల్ అయిన చైతన్య.. ఇంగ్లిష్ చానెల్, జిబ్రాల్టర్ జలసంధి, పాక్ జలసంధి ఈదాడు. చైతన్య పలు అంతర్జాతీయ మారథాన్ స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొన్నాడు.



శ్రీకాంత్ ముందంజ

కౌలాలంపూర్: ఫామ్ కోసం తంటాలు పడుతున్న మాజీ వరల్డ్ నెంబర్ వన్ కిడాంబి శ్రీకాంత్ మలేసియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో ప్రీక్వార్టర్స్‌కు చేరుకొన్నాడు. మంగళవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలిరౌండ్‌లో శ్రీకాంత్ 12-21, 21-18, 21-16తో ఆరో సీడ్ జొనాథన్ క్రిస్టీ (ఇండోనేసియా)పై పోరాడి నెగ్గాడు. మహిళల్లో ఆకర్షి కశ్యప్ 15-21, 15-21తో జాంగ్ ఇ మన్ (చైనా) చేతిలో ఓడింది. డబుల్స్‌లో అశ్విని పొన్నప్ప-తనీష జోడీ 21-13, 21-16తో అమెరికా జంట ఫ్రాన్సెసా-అలిసన్‌పై గెలిచింది. అయితే, రితూపర్ణ-శ్వేతపర్ణ ద్వయం, అర్జున్-ధ్రువ్ జంటలు ఆరంభరౌండ్లోనే వెనుదిరిగాయి.

మళ్లీ జట్టులోకి సింధు..



న్యూఢిల్లీ: మోకాలి గాయం నుంచి కోలుకొంటున్న ఏస్ షట్లర్ పీవీ సింధు మళ్లీ కోర్టులోకి అడుగుపెట్టనుంది. మంగళవారం ప్రకటించిన భారత ఆసియా టీమ్ చాంపియన్‌షిప్ జట్టులో ఆమెకు చోటు దక్కింది. గతేడాది అక్టోబరులో సింధుకు గాయమైంది. వచ్చేనెలలో 13 నుంచి 19 వరకు మలేసియాలో ఈ టోర్నీ జరగనుంది. ఒలింపిక్ క్వాలిఫికేషన్ పాయింట్లు లభించనుండడంతో.. ఈ టోర్నీ మన షట్లర్లకు కీలకం.

భారత జట్లు

పురుషులు: ప్రణయ్, శ్రీకాంత్, లక్ష్య సేన్, చిరాగ్ సేన్, సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ షెట్టి, ధ్రువ్, అర్జున్. సూరజ్, పృథ్వీ రాయ్.

మహిళలు: సింధు, అన్‌మోల్, తన్వీ, అస్మిత, ట్రీసా జాలీ, గాయత్రి, అశ్విని, తనీషా, ప్రియా దేవి, శ్రుతి.

తీరు మారని టైటాన్స్

ముంబై: ప్రొ కబడ్డీలో వరుస ఓటములతో తెలుగు టైటాన్స్ చెత్త రికార్డును మూటగట్టుకునే దిశగా సాగుతోంది. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో టైటాన్స్ 26-46తో బెంగాల్ వారియర్స్ చేతిలో ఓడింది. ఈ సీజన్‌లో టైటాన్స్‌కు ఇది పదో పరాజయం.

'టాప్'లేపిన చెన్నై క్విక్ గన్స్

సెమీస్‌లో యోధాస్ ప్రత్యర్థి చెన్నై

అల్టిమేట్ ఖో-ఖో

కటక్: అల్టిమేట్ ఖో-ఖో సీజన్-2లో భాగంగా మంగళవారం జరిగిన మ్యాచ్‌లో చెన్నై క్విక్ గన్స్ 38-21తో గుజరాత్ జెయింట్స్‌పై నెగ్గింది. దీంతో చెన్నై 25 పాయింట్లతో టేబుల్ టాపర్‌గా నిలిచింది. మరో మ్యాచ్‌లో ఒడిశా 34-23తో ముంబై ఖిలాడీస్‌పై నెగ్గింది. ఇక్కడితో గ్రూప్ దశ ముగిసింది. గురువారం జరిగే సెమీఫైనల్స్‌లో ఒడిశా జగర్‌నాట్స్‌తో గుజరాత్, తెలుగు యోధాస్‌తో చెన్నై తలపడతాయి.

ఈసారీ నిరాశే..

ఆఖరి మ్యాచ్‌లోనూ భారత్ ఓటమి

2-1తో ఆసీస్‌దే సిరీస్



ముంబై: స్వదేశంలో ఆస్ట్రేలియాపై తొలి టీ20 సిరీస్ సాధించాలనుకున్న భారత మహిళలకు ఈసారి కూడా ఫలితం దక్కలేదు. మొదటి మ్యాచ్‌లో గెలిచి ఆధిక్యం సాధించినా.. ఆ తర్వాత గతి తప్పిన ఆటతీరుతో సువర్ణావకాశాన్ని చేజార్చుకుంది. మంగళవారం జరిగిన ఆఖరి టీ20లో బ్యాటింగ్ కాస్త పర్వాలేదనిపించినా.. బౌలర్లు నిరాశపరిచారు. దీంతో ఆస్ట్రేలియా 7 వికెట్ల తేడాతో నెగ్గి 2-1తో సిరీస్ దక్కించుకుంది. కెప్టెన్ హీలీ (55), మూనీ (52 నాటౌట్) అర్ధసెంచరీలతో కీలక ఇన్నింగ్స్ ఆడారు. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 147 పరుగులు చేసింది. రిచా ఘోష్ (34), మంధాన (29) రాణించారు. సదర్లాండ్, వేర్‌హమ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో ఆసీస్ 18.4 ఓవర్లలో 3 వికెట్లకు 149 పరుగులు చేసి గెలిచింది. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా సదర్లాండ్, ప్లేయర్ ఆఫ్ ద సిరీస్‌గా హీలీ నిలిచారు.

మెరుపు ఆరంభం: ఛేదనలో ఆసీస్ ఓపెనర్లు హీలీ, మూనీ ఆరంభం నుంచే కదం తొక్కారు. అయితే హీలీ 38 రన్స్ దగ్గర ఉన్నప్పుడు క్యాచ్ అవుట్‌పై రీప్లేలో స్పష్టత లేకపోవడంతో బతికిపోయింది. ఈ ఊపులో హీలీ 34 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేసింది. కానీ తర్వాతి ఓవర్‌లోనే ఆమెను దీప్తి శర్మ అవుట్ చేయడంతో తొలి వికెట్‌కు 89 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత తహిలా (20), పెర్రీ (0)లను వరుస బంతుల్లో వస్త్రాకర్ అవుట్ చేసి కాస్త ఆశలు రేకెత్తించినా.. వచ్చీ రాగానే లిచ్‌ఫీల్డ్ (17 నాటౌట్) బాదుడు మొదలెట్టింది. ఇక రెండు వరుస ఫోర్లతో హాఫ్ సెంచరీ చేసిన మూనీ.. 8 బంతులుండగానే మ్యాచ్‌ను ముగించింది.

ఆదుకున్న రిచా: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్ స్కోరు ఓ దశలో 66/4. అయినా దాదాపు 150 పరుగుల దరిదాపుల్లోకి రాగలిగిందంటే మిడిలార్డర్‌లో రిచా ఘోష్ మెరుపు ఆటతీరే కారణం. దీప్తి శర్మ (14), అమన్‌జోత్ (17 నాటౌట్) తమ వంతు సహకారాన్ని అందించారు. ఆరంభంలో ఓపెనర్లు మంధాన, షఫాలీ తొలి వికెట్‌కు 39 పరుగులందించారు. షఫాలీ వర్మ 26 పరుగులు చేసింది.



స్కోరుబోర్డు

భారత్: షఫాలీ (సి) హీలీ (బి) షట్ 26; మంధాన (సి) గార్డ్‌నర్ (బి) వేర్‌హమ్ 29; జెమీమా (సి) వేర్‌హమ్ (బి) సదర్లాండ్ 2; హర్మన్‌ప్రీత్ (బి) సదర్లాండ్ 3; రిచా (బి) గార్డ్‌నర్ 34; దీప్తి శర్మ (సి) తహిలా (బి) వేర్‌హమ్ 14; అమన్‌జోత్ (నాటౌట్) 17; వస్త్రాకర్ (నాటౌట్) 7; **ఎక్స్‌ట్రాలు: 15; మొత్తం: 20 ఓవర్లలో 147/6. వికెట్ల పతనం:** 1-39, 2-60, 3-64, 4-66, 5-99, 6-135; **బౌలింగ్:** షట్ 4-0-36-1; గార్త్ 4-0-31-0; గార్డ్‌నర్ 4-0-40-1; సదర్లాండ్ 4-0-12-2; వేర్‌హమ్ 4-0-24-2.

ఆస్ట్రేలియా: హీలీ (ఎల్బీ) దీప్తి శర్మ 55; మూనీ (నాటౌట్) 52; మెక్‌గ్రాత్ (సి) దీప్తి శర్మ (బి) వస్త్రాకర్ 20; పెర్రీ (ఎల్బీ) వస్త్రాకర్ 0; లిచ్‌ఫీల్డ్ (నాటౌట్) 17; **ఎక్స్‌ట్రాలు:5, మొత్తం: 18.4 ఓవర్లలో 149/3. వికెట్ల పతనం:** 1-85, 2-117, 3-117; **బౌలింగ్:** రేణుకా సింగ్ 4-0-35-0; టిటాస్ 3-0-23-0; శ్రేయాంక 4-0-30-0; వస్త్రాకర్ 3.4-0-26-2; దీప్తి శర్మ 4-0-32-1.

స్పోర్ట్స్

ఆసియా షూటింగ్‌లో ఉమా జోడీకి స్వర్ణం



ఉమామహేష్

జకర్తా: ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్ గ్రాండ్ ప్రీలో విజయవాడ యువ షూటర్ మద్దినేని ఉమామహేష్ జోడీ పసిడి పతకం కొల్లగొట్టింది. మంగళవారం ఇక్కడ ముగిసిన 10 మీటర్ల జూనియర్ మిక్స్‌డ్ టీమ్ ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో ఉమామహేష్-ఇషా అనిల్ టక్సాలే ద్వయం 17-11తో చు జికింగ్-పాన్ బోవెన్ (చైనా) జోడీపై గెలిచి, అగ్రస్థానంలో నిలిచింది. ఇదే ఈవెంట్‌లో భారత్‌కే చెందిన అభినవ్ షా-అన్వీ రాథోడ్ ద్వయం కాంస్యం సాధించింది. 10 మీటర్ల సీనియర్ ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ రుద్రాంక్ష్-మెహులీ జోడీ 16-10తో పెన్ యుఫాన్-వింగ్‌మయ్ (చైనా) ద్వయంపై గెలిచి స్వర్ణం సాధించింది. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో అర్జున్-రిథిమ్ జోడీ రజతం అందుకుంది.

రోజున్నర పిచ్..మరీ నాసి

» ఐసీసీ ఆగ్రహం

కేప్‌టౌన్: భారత్-దక్షిణాఫ్రికా మధ్య జరిగిన రెండో టెస్టు ఒకటిన్నర రోజుల్లోనే ముగిసి క్రికెట్ ప్రేమికులను తీవ్రంగా నిరాశపరిచింది. బ్యాటర్లకు చుక్కలు చూపించిన ఈ పిచ్‌పై ఐసీసీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇది మరీ నాసిరకంగా ఉందని, నిబంధనల ప్రకారం దక్షిణాఫ్రికా క్రికెట్ (ఎస్ఏ)ను మందలించడంతో పాటు ఒక డీమెరిట్ పాయింట్ విధించింది. 'న్యూలాండ్స్ పిచ్‌పై బ్యాటింగ్ చేయడం కష్టంగా మారింది. మ్యాచ్ సాగుతున్నకొద్దీ బంతి అనూహ్యంగా బౌన్స్ అయ్యింది. ఈ కారణంగానే ఎక్కువ వికెట్లు నేలకూలాయి' అని మ్యాచ్ రెఫరీ క్రిస్ బ్రాడ్ పేర్కొన్నాడు. ఈ టెస్టు తొలి రోజునే పేసర్లు 23 వికెట్లతో పండగ చేసుకున్న విషయం తెలిసిందే.

ఉప్పల్ టెస్టు మ్యాచ్ విద్యార్థులకు ఫ్రీ ఎంట్రీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): భారత్-ఇంగ్లండ్ జట్ల మధ్య ఉప్పల్ స్టేడియంలో ఈనెల 25 నుంచి 30 వరకు జరగనున్న తొలి టెస్టు మ్యాచ్‌కు పాఠశాల విద్యార్థులను ఉచితంగా అనుమతించనున్నారు. ప్రభుత్వ పాఠశాలలు, సర్కారు గుర్తింపు గల స్కూళ్లలో చదివే 6 నుంచి 12వ తరగతి విద్యార్థులకు ఈ అవకాశం కల్పిస్తున్నారు. మ్యాచ్‌కు వచ్చే విద్యార్థులకు హెచ్‌సీఏ ఉచితంగా భోజనాన్ని కూడా అందించనుంది. అయితే, ఇందుకోసం పాఠశాలల ప్రిన్సిపాల్స్ తమ స్కూల్‌నుంచి ఎంతమంది విద్యార్థులు, సిబ్బంది వస్తున్నారో ఈనెల 18వ తేదీ లోపు హెచ్‌సీఏ సీఈఓకు ceo.hydca@gmail.com మెయిల్ చేయాలి.

బిల్కిస్ బానో కేసులో సుప్రీం తీర్పు బీజేపీకి చెంపపెట్టు: ఉత్తమ్

హైదరాబాద్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): బిల్కిస్ బానో కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు బీజేపీకి చెంపపెట్టని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. నేరగాళ్లకు మద్దతుగా బీజేపీ పాత్ర ఏంటో ఈ తీర్పు బయట పెట్టిందని పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటనను విడుదల చేశారు. ఈ తీర్పు బీజేపీ మహిళా వ్యతిరేక విధానాన్ని బట్టబయలు చేసి న్యాయ వ్యవస్థమీద ప్రజలకు విశ్వాసాన్ని పెంచిందన్నారు. 'బిల్కిస్ బానో' నిందితులను తిరిగి జైలుకు పంపాలని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు హర్షణీయమని సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ ఒక ప్రకటనలో పేర్కొరు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కేసులో దోషులుగా ఉన్న వారిని వదిలేసిన బీజేపీకి అయోధ్యలో రామ మందిరం ప్రారంభించాలనుకోవడంలో ఏ నైతికత ఉందని ఆయన ప్రశ్నించారు. రామమందిరాన్ని యోగ్యులు ప్రారంభించాలిగాని, మహిళల రక్తమాంసాలను పిప్పి చేసిన బీజేపీ నేతలు ప్రారంభించాలనుకోవడం సిగ్గుచేటని విమర్శించారు.

ఖైదీ కడుపులో మేకులు, గంజాయి పొట్లాలు !

ఎండోస్కోపి ద్వారా బయటకు తీసిన ఉస్మానియా వైద్యులు

మంగళ్‌హాట్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): చంచల్‌గూడ జైలులోని ఓ ఖైదీ చేసిన నిర్వాకం ఇటు పోలీసులు, అటు వైద్యులను ఉరుకులు పరుగులు పెట్టించింది. కడుపు నొప్పితో విలవిలలాడుతూ ఆస్పత్రికి వచ్చిన ఆ ఖైదీ కడుపులో నుంచి మేకులు, రబ్బరు మూతలతోపాటు, గంజాయి పొట్లాలుగా భావిస్తున్న రెండు ప్లాస్టిక్ కవర్ ప్యాకెట్లను ఉస్మానియా వైద్యులు బయటికి తీశారు. చంచల్‌గూడ్ జైలులో ఖైదీగా ఉన్న మహ్మద్ సోహేల్(21) తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడుతుండడంతో పరీక్షలు నిర్వహించిన జైలు వైద్యులు ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. సోహేల్‌కు ఎక్స్‌రే తీయించిన వైద్యులు అతని కడుపులో రెండు మేకులు ఉన్నట్టు గుర్తించారు. సోహేల్ రెండ్రోజుల క్రితం ఆ మేకులు మింగినట్టు తెలిసింది. మంగళవారం ఎండోస్కోపీ ద్వారా సోహేల్ కడుపులోని మేకులను వైద్యు లు బయటికి తీశారు. అనంతరం మరోసారి పరీక్షించగా సోహేల్ కడుపులో రెండు రబ్బరు మూతలు, రెండు ప్యాకెట్లు ఉన్నట్లు గుర్తించారు. వాటిని కూడా ఎండోస్కోపీ ద్వారా బయటకి తీసేశారు. సోహేల్ కడుపులో నుంచి తీసిన ప్యాకెట్లలో గంజాయి ఉందన్న అనుమానంతో వాటిని పరీక్షలకు పంపించారు. శస్త్రచికిత్స చేయకుండా రోగి ప్రాణాలను కాపాడిన గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగం హెచ్‌వోడీ డాక్టర్ బి. రమేశ్ బృందాన్ని ఉస్మానియా సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్ అభినందించారు.

15 రోజుల్లో.. రూ.100 కోట్లు వసూల్

- రాష్ట్రంలో 1.14కోట్ల పెండింగ్ చలానాలు క్లియర్
- సబ్సిడీ చెల్లింపులకు నేడే ఆఖరి తేదీ
- హైదరాబాద్ ట్రాఫిక్ అదనపు సీపీ విశ్వప్రసాద్



హైదరాబాద్ సిటీ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రకటించిన ట్రాఫిక్ పెండింగ్ చాలానాల సబ్సిడీ ఆఫర్‌ను వాహనదారులు సద్వినియోగం చేసుకోవాలని హైదరాబాద్ ట్రాఫిక్ అడిషనల్ సీపీ విశ్వప్రసాద్ కోరారు. చెల్లింపుల విషయంలో వాహనదారుల నుంచి మంచి స్పందన వస్తోందని ఇప్పటి వరకు రూ.100.5కోట్ల మేర వసూలైందని వివరించారు. పెండింగ్ చాలానాలను చెల్లించే వాహనదారులకోసం పబ్లిక్‌గార్డెన్ ఎదురుగా ఉన్న ప్రధాన ట్రాఫిక్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. సబ్సిడీలపై చలానాల చెల్లింపు ఆఫర్ బుధవారంతో ముగుస్తుందని ఆయన గుర్తు చేస్తూ.. వాహనదారులు ఈ స్కీమ్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాగా.. ప్రభుత్వం ప్రకటించిన సబ్సిడీ స్కీమ్‌లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 3.59 కోట్ల పెండింగ్ చలానాలకు గాను.. 1.14 కోట్ల చలానాలు క్లియర్ అయ్యాయి. అంటే.. 31.7% పెండెన్సీ క్లియర్ అయ్యింది. రూ.100.5 కోట్ల ఆదాయంలో సింహభాగం ట్రై కమిషనరేట్ల(హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ) నుంచే వసూలైంది. ఈ మూడు కమిషనరేట్లలో 66.57 లక్షల పెండింగ్ చలానాలు క్లియర్ అవ్వగా.. 57.53 కోట్ల ఆదాయం ట్రాఫిక్ విభాగానికి సమకూరింది.

4 ఐటీడీఏల పరిధిలో టీ డయాగ్నస్టిక్ కేంద్రాలు

- కమిషనర్ ఆర్వీ కర్ణన్ ఉత్తర్వులు

హైదరాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నాలుగు ఐటీడీఏల పరిధిలోని సర్కారు దవాఖానాలకు తెలంగాణ డయాగ్నస్టిక్ కేంద్రాలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈమేరకు వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూరు ఆస్పత్రి, ములుగు జిల్లాలోని ఏటూరునాగారం సామాజిక ఆరోగ్య కేంద్రం, భద్రాద్రి జిల్లాలోని భద్రాచలం ఏరియా ఆస్పత్రి, నాగర్ కర్నూల్ జిల్లాలోని మన్ననూరు పీహెచ్‌సీకి డయాగ్నస్టిక్ కేంద్రాలను మంజూరు చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ నెల 20వ తేదీలోగా ఆ నాలుగు ఆస్పత్రులను సందర్శించాలని సంబంధిత ప్రోగ్రామ్ ఆఫీసర్, డీఎంహెచ్‌వోలు, టీఎస్ఎంఎస్ఐడీసీ అధికారులను కమిషనర్ ఆదేశించారు.

రేవంత్‌ను ఏపీ సీఎం కలవకపోవడం సరికాదు: టీపీసీసీ



హైదరాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణకు వచ్చిన ఏపీ సీఎం వైఎస్ జగన్.. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలవకపోవడం సరికాదని టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్‌గౌడ్ అన్నారు. గాంధీభవన్‌లో మంగళవారం నాడు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన.. పక్కరాష్ట్ర సీఎం వచ్చినప్పుడు ఇక్కడి సీఎంను కలవడం ప్రజాస్వామ్య వ్యవస్థలో ఆనవాయితీ అని, వ్యక్తిగత అంశాల కోసమే వచ్చిన జగన్ ప్రజా ప్రయోజనాలను విస్మరించారన్నారు. ఈ విషయంలో ఏపీ మాజీ మంత్రి కొడాలి నాని మాటలు అహంభావ పూరితమైనవని, తెలంగాణలోనూ ఇలాగే అహంభావంతో మాట్లాడిన బీఆర్ఎస్ నాయకులు అడ్రస్ లేకుండా పోయారన్నారు.

ఆర్మీ బాయ్స్ స్పోర్ట్స్ కెడెట్స్ ప్రవేశానికి ర్యాలీ

- ఏప్రిల్ 1 నుంచి 7 వరకు నిర్వహణ

అల్వాల్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): 1 ఈఎంఈ సెంటర్ సికింద్రాబాద్ బాయ్స్ స్పోర్ట్స్ కంపెనీ(బీఎస్‌సీ)లో స్పోర్ట్స్ కెడెట్స్‌ను చేర్చుకోవడానికి ఏప్రిల్ 1వ తేదీ నుంచి 7 వరకు వాలీబాల్, కయాకింగ్, కెనోయింగ్ విభాగాలలో ర్యాలీని నిర్వహిస్తున్నట్లు రక్షణశాఖ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. దారఖాస్తుదారుడి వయస్సు 8 నుంచి 14 సంవత్సరాల మధ్య ఉండాలని, 1 ఏప్రిల్, 2010 తరువాత, 1 ఏప్రిల్ 2016 ముందు జన్మించినవారై ఉండాలని పేర్కొన్నారు. ఏదైనా పాఠశాలలో 3వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి, ఇంగ్లిష్, హిందీలో తగిన పరిజ్ఞానం ఉండాలని ఏదైనా రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పతకం సాధించిన విజేతలకు ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. శరీరంపై ఏ భాగంలోనైనా పచ్చబొట్టు శాశ్వతంగా వేయించుకున్న వారు దరఖాస్తు చేసుకోవడానికి అనర్హులని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఉచితంగా బోర్డింగ్, లాడ్జింగ్, 10 వతరగతి వరకు విద్య, బీమా వైద్య సదుపాయాలతో పాటు సైంటిఫిక్ కోచింగ్‌ను అందిస్తామన్నారు. అనంతరం అర్హత పొందిన కెడెట్స్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ నిబంధనల ప్రకారం ఇండియన్ ఆర్మీలో తీసుకుంటామని వివరించారు. ఇతర వివరాల కోసం 9398543351 వాట్సప్‌లో లేదా ఈ మెయిల్: bsc1emecentre@gmail.com లేదా బాయ్స్ స్పోర్ట్స్ కంపెనీ, 1 ఈఎంఈ సెంటర్, సికింద్రాబాద్, తెలంగాణ -500010లో సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు.

పెట్టుబడులతో రండి

- రాష్ట్రంలో అపార వ్యాపార అవకాశాలు
- ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం
- గోద్రెజ్ అగ్రోవెట్ కంపెనీ ప్రతినిధులతో సీఎం



గోద్రెజ్ కంపెనీ ప్రతినిధులతో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో రియల్ ఎస్టేట్, ఫర్నిచర్, కన్స్యూమర్ గూడ్స్ రంగాల్లో ఉన్న అపారమైన వ్యాపార అవకాశాలను పరిశీలించాలని సీఎం రేవంత్ రెడ్డి గోద్రెజ్ కంపెనీ ప్రతినిధులకు సూచించారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెడితే ప్రభుత్వపరంగా పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. గోద్రెజ్ అగ్రోవెట్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం సింగ్ యాదవ్ నేతృత్వంలోని కంపెనీ ప్రతినిధుల బృందం మంగళవారం ముఖ్యమంత్రితో సచివాలయంలో భేటీ అయ్యింది. కంపెనీ తెలంగాణలో ఇప్పటికే నిర్వహిస్తున్న వంటనూనెలు, డెయిరీ, అగ్రో, వెటర్నరీ సర్వీసెస్, ఆగ్రో కెమికల్స్, పశువుల దాణా, వెటర్నరీ సర్వీసెస్ గురించి సీఎంకు వివరించారు. మలేషియాకు చెందిన సిమ్ డార్బీ కంపెనీతో కలిసి ఖమ్మం జిల్లాలో ఇంటిగ్రేటెడ్ ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ కాంప్లెక్స్‌ను ఈ కంపెనీ ఏర్పాటు చేస్తోంది. సీఎం రేవంత్ రెడ్డితో ఈ విషయమై చర్చలు జరిపారు. ఇప్పటికే కంపెనీ చేపట్టిన ఆయిల్ పామ్, డెయిరీ బిజినెస్ మరింత విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని ఈ సందర్భంగా సీఎం హామీ ఇచ్చారు. కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా స్కిల్ డెవలప్‌మెంట్‌ను ప్రోత్సహించాలని కంపెనీ ప్రతినిధులకు సీఎం సూచించారు. సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబు, సీఎస్ శాంతికుమారి, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ తదితరులు పాల్గొన్నారు.

దావోస్‌కు వెళ్లే అధికారుల బృందం ఇదే

దావోస్‌కు సీఎం రేవంత్‌రెడ్డి వెంట వెళ్లే అధికారుల బృందాన్ని ప్రభుత్వం ఖరారు చేసింది. మొత్తం ఎనిమిది మంది ప్రతినిధుల బృందం వెళ్లనుంది. ఈ బృందం పర్యటనకు అనుమతిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 15 నుంచి 19 వరకు దావోస్‌లో వరల్డ్ ఎకనామిక్ ఫోరం(డబ్ల్యూఈఎఫ్) వార్షిక సమావేశం జరగనుంది. దీనికి సీఎం రేవంత్‌రెడ్డి వెళుతున్నారు. ఆయన వెంట సీఎంవో ముఖ్యకార్యదర్శి వి.శేషాద్రి, ఐటీ శాఖ ముఖ్యకార్యదర్శి జయేష్ రంజన్, సీఎంవో స్పెషల్ సెక్రటరీ బి.అజిత్‌రెడ్డి, ఇన్వెస్ట్‌మెంట్స్ ప్రమోషన్ అండ్ ఎక్స్‌టర్నల్ ఎంగేజ్‌మెంట్స్ విభాగం స్పెషల్ సెక్రటరీ విష్ణువర్ధన్‌రెడ్డి, మీడియా రిలేషన్ విభాగంలో కర్రి శ్రీరామ్, సీఎం చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ తఫ్సీర్ ఇక్బాల్, సీఎం సహాయ సిబ్బంది తరఫున ఆర్. ఉదయ సింహ, గుమ్మి చక్రవర్తి వెళ్లనున్నారు.

అభివృద్ధి చేసుకోండి 10 కోట్లు ఇస్తా..

(మొదటి పేజీ తరువాయి)

వచ్చేలోపే అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయాలని సూచించారు. ఖమ్మం, వరంగల్, కరీంనగర్, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల ఇన్‌చార్జ్ మంత్రులు, పార్టీ ఎమ్మెల్యేలు, పార్టీ తరఫున పోటీ చేసి ఓడిన అభ్యర్థులతో మంగళవారం ఆయన ఇక్కడి మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో సమావేశమయ్యారు. త్వరలోనే ఇందిరమ్మ కమిటీలను నియమించి.. నిజమైన లబ్ధిదారులందరికీ సంక్షేమ పథకాలు చేరవేద్దామని సీఎం సూచించారు. నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు కోరుకున్న అధికారులను నియమిస్తామన్న ఆయన.. నిజాయితీ, నిబద్ధత ఉన్న అధికారులనే నియమించుకోవాలని స్పష్టం చేశారు. అవినీతి అధికారులను ప్రోత్సహించేది లేదని.. అధికారులు, పోలీసుల బదిలీల్లో పైరవీలకు తావు లేదని తేల్చి చెప్పారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకొచ్చే పనులు చేయవద్దని సూచన చేశారు. "బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చేసిన తప్పులను మనం చేయకూడదు. మంచి పేరు కోసం పని చేయాలి" అని హెచ్చరించారు. ఇప్పుడు పార్టీని బలోపేతం చేసుకుంటే వచ్చే రెండు, మూడు టర్మ్‌లూ కాంగ్రెస్ పార్టీనే అధికారంలో ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. కార్పొరేషన్ చైర్మన్లు, నామినేటెడ్ పోస్టుల నియామకాలనూ వీలైనంత త్వరగా చేపట్టనున్నట్లు వెల్లడించారు. పార్టీని, ప్రభుత్వాన్ని సమన్వయం చేసుకుంటూ ప్రజల్లోకి వెళ్లాలని.. లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని, రాష్ట్రంలో 12 సీట్లకు తగ్గకుండా గెలిపించుకోవాలని దిశానిర్దేశం చేశారు. సంక్రాంతి తర్వాత లోక్‌సభ నియోజకవర్గాల వారీగా సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షలు నిర్వహించనున్నారు. కాగా.. మంగళవారంనాటి భేటీలో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, స్పీకర్ ప్రసాద్‌కుమార్, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఢిల్లీకి సీఎం రేవంత్‌రెడ్డి

ఎమ్మెల్సీ అభ్యర్థులపై రానున్న స్పష్టత

హైదరాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి సహా రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాల సమన్వయకర్తలూ గురువారం ఢిల్లీకి వెళ్లనున్నారు. దేశంలోని అన్ని లోక్‌సభ స్థానాలకూ ఏఐసీసీ ఇటీవల సమన్వయకర్తలను నియమించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా రాష్ట్రంలోని 17 లోక్‌సభ నియోజక నియోజకవర్గాలకు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి తదితరులను సమన్వయకర్తలుగా ఏఐసీసీ నియమించింది. ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో ఈ సమన్వయకర్తలందరి భేటీ జరగనుంది. ఈ పర్యటనలో భాగంగానే.. పార్టీ ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థులు, గవర్నర్ కోటా సిఫారసులపైనా అధిష్ఠానంతో సీఎం రేవంత్‌రెడ్డి చర్చలు జరపనున్నట్టు సమాచారం. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు గురువారమే నోటిఫికేషన్ విడుదల కానున్న నేపథ్యంలో అభ్యర్థులను కూడా ప్రకటిస్తారని చెబుతున్నారు. అలాగే.. కార్పొరేషన్లు, నామినేటెడ్ సీట్ల భర్తీపైనా అధిష్ఠానంతో ఆయన చర్చించనున్నట్లు తెలిసింది.

వికారాబాద్–కృష్ణా రైల్వే లైన్ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించండి

- దక్షిణ మధ్య రైల్వే జీఎంకు సీఎం రేవంత్‌రెడ్డి సూచన



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న అరుణ్ కుమార్

హైదరాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్-కృష్ణా రైల్వే లైన్ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. మంగళవారం సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డిని అరుణ్ కుమార్ జైన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నేపథ్యంలో పెండింగ్‌లో ఉన్న రైల్వే లైన్ల అభివృద్ధి, కొత్త రైల్వే లైన్ల ఏర్పాటుపై చర్చలు జరిపారు. గతంలో ప్రతిపాదించిన వికారాబాద్- కృష్ణా రైల్వే లైన్ అభివృద్ధిపైనా చర్చించారు. సుదీర్ఘ కాలంగా నిర్లక్ష్యానికి గురైన ఈ మార్గాన్ని పూర్తి చేయాల్సిన అవసరం ఉందని సీఎం సూచించారు. ఈ మార్గాన్ని పూర్తి చేసిన పక్షంలో సమీప ప్రాంతాల్లో పరిశ్రమలను నెలకొల్పేందుకు వీలుంటుందన్నారు. ఈ సమావేశంలో రోడ్లు భవనాలు, రవాణా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాస రాజు తదితర అధికారులు పాల్గొన్నారు.

మరో గెలుపునకు కృషి చేయండి

- లోక్‌సభ ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలి
- అధికార ప్రతినిధుల సమావేశంలో దీపాదాస్ మున్షీ

హైదరాబాద్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో విజయం సాధించడం ద్వారా ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ బలంగా ఉందని, కష్టపడి పని చేస్తే వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో మరింత మంచి ఫలితాలు సాధిస్తామని ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ అన్నారు. ఈ విషయంలో టీపీసీసీ అధికార ప్రతినిధుల బాధ్యతే కీలకమని స్పష్టం చేశారు. ఇందుకోసం ప్రణాళికను రూపొందించుకోవాలని, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. గాంధీభవన్‌లో మంగళవారం టీపీసీసీ అధికార ప్రతినిధులతో సమావేశమైన దీపాదాస్ మున్షీ.. వారికి దిశానిర్దేశం చేశారు. తెలంగాణలో బీజేపీ ఇప్పటికే ప్రత్యేక దృష్టి సారించిందని, అప్రమత్తంగా ఉండాలన్నారు. లోక్‌సభ ఎన్నికల కోసం సంసిద్ధం కావాలని సూచించారు. కాగా.. దీపాదాస్ మున్షీని మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం గాంధీభవన్‌లో కలిశారు. హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాలకు సంబంధించి సీఎం దగ్గర సోమవారం జరిగిన సమీక్ష అంశాలను ఆయన వివరించారు.

టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సభ్యుల రాజీనామాలను ఆమోదించండి: ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి లేఖ

టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సభ్యుల రాజీనామాలను వెంటనే ఆమోదించాలని గవర్నర్ తమిళిసైని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కోరారు. రాజీనామాలు సమర్పించి నెల రోజులు గడుస్తున్నా ఆమోదించకపోవడం వల్ల ఉద్యోగ నియామకాల్లో జాప్యం జరుగుతోందన్నారు. ఈ మేరకు గవర్నర్‌కు మంగళవారంనాడు ఆయన లేఖ రాశారు.

ఆరు గ్యారెంటీలపై కాంగ్రెస్ డ్రామాలు!

- మార్చి, ఏప్రిల్‌లో పార్లమెంటు ఎన్నికలు
- ఫిబ్రవరిలో ఎన్నికల కోడ్
- అందుకే దరఖాస్తుల కంప్యూటరీకరణ పేరుతో కాలయాపన: బండి సంజయ్



సిరిసిల్ల, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామన్న కాంగ్రెస్ ఇప్పుడు వాటి ఆచరణ విషయంలో డ్రామాలాడుతోందని బీజేపీ ఎంపీ బండి సంజయ్ అన్నారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలంలోని వెంకటాంపల్లి గ్రామంలో 'వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర'లో బండి సంజయ్ పాల్గొన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, షెడ్యూల్ ప్రకారం వచ్చే మార్చి, ఏప్రిల్‌లో పార్లమెంట్ ఎన్నికలు జరగబోతున్నాయని, ఫిబ్రవరిలోనే ఎన్నికల కోడ్ వచ్చే అవకాశం ఉందని అన్నారు. ఈ విషయం తెలిసి దరఖాస్తుల కంప్యూటరీకరణ, క్షేత్రస్థాయి పరిశీలన పేరుతో ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా కాంగ్రెస్ డ్రామాలు ఆడుతోందని ఆరోపించారు. తాము నిర్మాణాత్మకంగా మాట్లాడుతున్నామని, అయినా గత ప్రభుత్వం మాదిరిగా అహంకార పూరితంగా ప్రతి విమర్శలు చేస్తే బీఆర్ఎస్ నేతలకు పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుందని అన్నారు. అప్పుల ఊబిలో కూరుకుపోయిన తెలంగాణను ఎట్లా గట్టెక్కిస్తారో? ఆరు గ్యారెంటీలను ఎట్లా అమలు చేస్తారో? ప్రజలకు వెల్లడించాలని కోరారు. పదేళ్లలో ఒక్క కొత్త రేషన్ కార్డు ఇవ్వలేదని అన్నారు. ఇప్పుడు రేషన్ కార్డు ప్రతిపాదినతో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామంటే పేదలకు న్యాయం జరిగే అవకాశం లేదని పేర్కొన్నారు. అప్పుల నుంచి తెలంగాణ గట్టెక్కాలన్నా, ప్రభుత్వ సంక్షేమ పథకాలకు నిధులు కావాలన్నా కేంద్ర సాయం అవసరం ఉందని స్పష్టం చేశారు. కేంద్రంలో మళ్లీ బీజేపీ ప్రభుత్వమే రాబోతోందని అన్ని సర్వేలు వెల్లడిస్తున్నాయని చెప్పారు. కేంద్రం నుంచి అదనపు నిధులు రావాలంటే తెలంగాణ నుంచి ఎక్కువ మంది బీజేపీ ఎంపీలను గెలిపించాల్సిన అవసరం ఉందని ప్రజలను కోరారు. రాష్ట్రంలోని పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు. భారత్‌ను, ప్రధాని మోదీని దూషిస్తే ఫలితాలు ఎలా ఉంటాయో మాల్దీవుల ప్రభుత్వానికి రుచి చూపించిన భారతీయులకు హ్యాట్సాఫ్ చెబుతున్నానని బండి సంజయ్ అన్నారు.

'పాలమూరు' పనులు 90% పూర్తయ్యాక మళ్లీ టెండర్లలేంటి?: ఎమ్మెల్సీ కవిత

మహబూబ్‌నగర్, జనవరి 9 : "పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులను బీఆర్ఎస్ ప్రభుత్వం 90% పూర్తి చేసింది. మిగతా 10% పనులు పూర్తి చేస్తే సరిపోతుంది. అంతేకానీ పనులు ఆపేస్తామని, మళ్లీ టెండర్లు నిర్వహిస్తారంటూ ప్రచారం జరుగుతోంది. ఇందులో మతలబేంటి?" అని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. మంగళవారం మహబూబ్‌నగర్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరులతో ఆమె మాట్లాడారు. 100 రోజుల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే ఉద్యమాలు చేయాల్సి వస్తుందని, ఇందుకు బీఆర్ఎస్ శ్రేణులు సిద్ధంగా ఉండాలని ఆమె పిలుపునిచ్చారు. సమావేశంలో మాజీ మంత్రి వి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డితో జగ్గారెడ్డి భేటీ

రాష్ట్ర రాజకీయాలపై చర్చ



హైదరాబాద్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి.. మంగళవారం జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో కలిశారు. దాదాపు 20 నిమిషాల పాటు వారి భేటీ కొనసాగింది. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్ష హోదాలో సీఎంను కలిసిన జగ్గారెడ్డి.. రాష్ట్రంలోని ప్రస్తుత రాజకీయ పరిణామాలపైన చర్చించారు. వచ్చే లోక్‌సభ ఎన్నికలకు పార్టీని సన్నద్ధం చేసే అంశంపైనా చర్చ జరిపారు.

మూడోసారీ మోదీనే ప్రధాని

- ఆయన పాలనలో అద్భుత సంస్కరణలు
- అనేక సమస్యలకు పరిష్కారం చూపారు
- కుటుంబ పార్టీలకు స్వస్తి పలకాలి: కిషన్‌రెడ్డి



హైదరాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఎంత మంది ఒవైసీలు, రాహుల్ గాంధీలు అడ్డొచ్చినా కేంద్రంలో మరోసారి మోదీ ప్రభుత్వమే వస్తుందని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఎవరూ ఊహించని మెజారిటీతో మోదీ మూడోసారి ప్రధాని కావడం ఖాయమన్నారు. దేశంలోని యువత అంతా మోదీనే మరోసారి ప్రధాని కావాలని కోరుకుంటున్నారని చెప్పారు. మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన 'నమో యాప్.. వికసిత్ భారత్ అంబాసిడర్ క్యాంపెయిన్ వర్క్‌షాప్'లో కిషన్‌రెడ్డి మాట్లాడారు. "ప్రధాని మోదీ.. సుపరిపాలనతో పాటు అనేక సాహసోపేత నిర్ణయాలు తీసుకున్నారు. అద్భుత సంస్కరణలు తీసుకొచ్చారు. అనేక ఘనతలు సాధించారు. జమ్మూ కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అనేక సమస్యలను పరిష్కరించారు. బాబర్ కూలగొట్టిన రామ మందిరాన్ని రక్తపు బొట్టు చిందకుండా పునర్నిర్మించుకున్నాం. మోదీ ప్రభుత్వ అభివృద్ధి ఫలాలు, పథకాలు, ప్రయోజనాలను ప్రతి ఒక్కరికీ చేరువ చేయడమే వికసిత భారత్ సంకల్ప్ యాత్ర లక్ష్యం. 2047 వరకు భారత్ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలనే సంకల్పంతో ప్రతి ఒక్కరూ వికసిత్ భారత్ కార్యక్రమంలో పాల్గొనాలి. దేశంలో కుటుంబ పార్టీలు ప్రజాధనాన్ని దోపిడీ చేస్తున్నాయి. వాటి నుంచి విముక్తి పొందేలా మార్పు రావాలి" అని కిషన్‌రెడ్డి అన్నారు. కాగా, రాష్ట్రంలోని 17 లోక్‌సభ నియోజకవర్గాలకు సంస్థాగత ఇన్‌చార్జ్‌లను కిషన్‌రెడ్డి నియమించారు.

రాహుల్, కేటీఆర్, కవిత.. కుహనా లౌకికవాదులు: రఘునందన్

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్, బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, కవితలు కుహనా లౌకికవాదులని బీజేపీ మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు విమర్శించారు. బిల్కిస్ బానో కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతించిన ఆ ముగ్గురూ.. అయోధ్య రామమందిరం నిర్మాణంలో అదే సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును ఎందుకు స్వాగతించలేదని ప్రశ్నించారు. మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రఘునందన్ మాట్లాడారు. బిల్కిస్ బానో కేసులో సుప్రీం ఇచ్చిన తీర్పుపై తొలుత రాహుల్ ప్రకటన చేయగా.. కొద్దిసేపటికి కేటీఆర్, కవితలు కూడా అదే ప్రకటన చేశారని చెప్పారు. తమ నాయకుడు రాహుల్ చెబితేనే తాను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను పరామర్శించానని సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల ఒక ఇంటర్వ్యూలో వెల్లడించారని చెప్పారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు ఒకటే అని చెప్పడానికి ఈ రెండు ఉదాహరణలే నిదర్శనమన్నారు.

పదికి పైగా ఎంపీ స్థానాలు గెలుస్తాం: శివరాజ్‌సింగ్

కరీంనగర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో పదికి పైగా స్థానాల్లో బీజేపీ గెలుస్తుందని మధ్యప్రదేశ్ మాజీ సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్ అన్నారు. మంగళవారం కరీంనగర్‌లో జరిగిన పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టును ఏటీఎంగా చేసుకుని అవినీతికి పాల్పడిన కేసీఆర్‌ను ప్రజలు ఇంటికి పంపించారని చెప్పారు. బండి సంజయ్ లాంటి పోరాట యోధుడిని పార్లమెంట్ ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. సమావేశంలో బండి సంజయ్ పాల్గొన్నారు.

'గుంటూరు కారం' టికెట్ ధరల పెంపు

స్పెషల్, బెనిఫిట్ షోలలో వర్తించేలా సర్కారు అనుమతి

హైదరాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మహేష్ బాబు హీరోగా నటించిన గుంటూరు కారం సినిమా స్పెషల్ షో, బెనిఫిట్ షోలలో టికెట్ ధరల పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతించింది. ఈ నెల 12న విడుదల కానున్న ఈ సినిమాకు.. 18 వరకు ఉదయం 4 గంటలకు ప్రత్యేక షో ప్రదర్శించేందుకు అనుమతిస్తూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శ్రీవెంకటేశ్వర ఫిలింస్ అభ్యర్థన మేరకు రాష్ట్ర వ్యాప్తంగా సింగిల్ స్క్రీన్ థియేటర్లలో రూ.65, మల్టీప్లెక్స్‌లలో రూ.100 చొప్పున స్పెషల్ షోలకు టికెట్ ధరలు పెంచుకునేందుకు సర్కారు అనుమతించింది. నెక్లెస్ రోడ్‌లోని ప్రసాద్ మల్టీప్లెక్స్ కూకట్‌పల్లిలోని నెక్సస్ మాల్, భ్రమరాంబ, మల్లికార్జున, అర్జున్, విశ్వనాథ్ థియేటర్లు.. గచ్చిబౌలిలోని ఏఎంబీ సినిమాస్, ఎర్రగడ్డలోని గోకుల్ టాకీస్, ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని సుదర్శన్ 35 ఎంఎం థియేటర్, దిల్‌సుఖ్‌నగర్‌లోని రాజధాని డీలక్స్ టాకీస్, వనస్థలిపురంలోని శ్రీరాములు థియేటర్, మల్కాజ్‌గిరిలోని శ్రీసాయిరామ్ టాకీస్, తుక్కుగూడలోని శ్రీ ప్రేమ థియేటర్, ఖమ్మంలోని ఎస్వీసీ తిరుమల్ టాకీస్, వినోద థియేటర్, కరీంనగర్‌లోని మమత థియేటర్, నల్లగొండలోని నటరాజ్ టాకీస్, నిజామాబాద్‌లోని ఎస్వీసీ విజయ థియేటర్, మహబూబ్‌నగర్‌లోని వేంకటేశ్వర టాకీస్, శ్రీనివాస థియేటర్, వరంగల్‌లోని రాధిక టాకీస్, హన్మకొండలోని అమృత థియేటర్, గద్వాలలోని ఎస్వీసీ మల్టీప్లెక్స్‌లలో బెనిఫిట్, ప్రత్యేక షోలకు ప్రభుత్వం అనుమతించింది.

భూంఫట్ స్వాహా!

(మొదటిపేజీ తరువాయి)


పక్కా పథకం రచించారు. ఇందుకు గత ప్రభుత్వం జారీ చేసిన జీవో 59ని అడ్డుపెట్టుకున్నారు. ఆ స్థలం తమ కబ్జాలో ఉన్నట్లు ఆ జీవో కింద దరఖాస్తు చేసుకున్నారు.

ఎన్నికల హోరులో క్రమబద్ధీకరణ జోరు

జీవో 59 ప్రకారం ప్రభుత్వ ఆక్రమిత స్థలాల్లో నిర్మించుకున్న ఇళ్లను మాత్రమే క్రమబద్ధీకరిస్తారు. అందుకు వారు కబ్జాలో ఉన్నట్లు తాగునీరు, విద్యుత్ బిల్లు, ఇంటి నంబర్, ఆస్తి పన్నులో ఏదైనా ఒక దానిని చూపిస్తూ దరఖాస్తు చేసుకోవాలి. ఇంటి నంబర్ మాత్రం కచ్చితంగా ఉండాలి. కబ్జాలో ఉన్నట్లుగా చూపుతున్న స్థలంలో కచ్చితంగా పక్కా నిర్మాణం ఉండాలి. దరఖాస్తు ఆధారంగా స్థానిక తహశీల్దార్ కార్యాలయ అధికారులు కాకుండా మరో మండలానికి చెందిన తహశీల్దార్ పరిశీలించి క్లియరెన్స్ ఇవ్వాల్సి ఉంటుంది. కానీ, నానక్‌రాంగూడలో ఈ నిబంధనలేవీ పాటించలేదు. అక్కడ పక్కా నిర్మాణం లేకపోయినా.. దానికి తాగునీటి, విద్యుత్ బిల్లు, ఇంటి నంబర్, ఆస్తి పన్ను నంబర్ వంటివి ఏవీ లేకపోయినా శేరిలింగంపల్లి రెవెన్యూ అధికారులు క్రమబద్ధీకరించేశారు. పైగా.. రాష్ట్రం మొత్తం ఎన్నికల హడావుడిలో ఉండగా.. గుట్టుచప్పుడు కాకుండా క్రమబద్ధీకరణ తతంగం పూర్తి చేశారు. నవంబరు మూడో తేదీన అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడితే.. నవంబరు 9న నలుగురు వ్యక్తులకు 490 చదరపు గజాల చొప్పున ఐదు ప్లాట్లను అంటే.. 2,450 గజాలను క్రమబద్ధీకరించారు. నవంబరు 28న ఏడుగురు వ్యక్తులకు ఒక్కొక్కరికీ 490 చదరపు గజాల చొప్పున ఏడు ప్లాట్లను అంటే.. 3,430 చదరపు గజాలను క్రమబద్ధీకరించారు. ఇక, ఎన్నికల ఫలితాలకు ముందు రోజు అంటే డిసెంబరు 2న ముగ్గురు వ్యక్తులకు 6,650 చ.గజాలను క్రమబద్ధీకరించేశారు. వీరిలో ఓ వ్యక్తికి 950 చ.గజాల చొప్పున నాలుగు ప్లాట్లుగా 3,800 చ.గజాలు, మరో వ్యక్తికి 950 చ.గజాల చొప్పున రెండు ప్లాట్లుగా 1900 చ.గజాలు, ఓ వ్యక్తికి 950 చ.గజాలను ఒక ప్లాటుగా క్రమబద్ధీకరించారు. ఎన్నికల ఫలితాలు వెలువడి కోడ్ ముగియనున్న డిసెంబరు 5న కేవలం ఇద్దరికే 8,824 చ.గజాలను పది ప్లాట్లుగా క్రమబద్ధీకరించారు. ఇందులో ఒకే వ్యక్తికి ఏడు ప్లాట్లుగా 6,034 చదరపు గజాలు; మరొకరికి మూడు ప్లాట్లుగా 2,850 చదరపు గజాలు క్రమబద్ధీకరించారు. అంతేనా.. డిసెంబరు 2న 3,800 చదరపు గజాలను క్రమబద్ధీకరించుకున్న వ్యక్తి కుటుంబీకురాలి పేరు మీద ఈ 2,850 చదరపు గజాలను క్రమబద్ధీకరించడం మరో విశేషం. అంటే, ఇక్కడ కూడా ఒకే కుటుంబానికి ఏడు ప్లాట్ల కింద 6,650 చదరపు గజాలను క్రమబద్ధీకరించారన్నమాట! ఈ మొత్తం ప్రక్రియలో ఇద్దరు వ్యక్తులు క్రమబద్ధీకరించుకున్న స్థలాలకు మాత్రమే ఇంటి నంబర్లు వేశారు. మిగిలిన 13 మందికీ ఇంటి నంబర్లు కూడా లేకుండా కేవలం హద్దులను గుర్తిస్తూ కన్వేయన్స్ డీడ్‌లను శేరిలింగంపల్లి తహసీల్దార్ కార్యాలయ అధికారులు చేశారు.



అక్రమబద్ధీకరణకు తార్కాణమిదే! జీవో 59 ప్రకారం ఏదైనా భూమి క్రమబద్ధీకరణ చేసుకోవాలంటే అప్పటికే అక్కడ ఏదైనా కట్టడం ఉండి ఉండాలి. నివాసానికి అనుకూలంగా ఉండాలి. కానీ ఈ గూగుల్ మ్యాప్‌లో కనిపిస్తున్న స్థలంలో అటువంటి కట్టడాలుగానీ, నివాసయోగ్యానికి అవసరమైన కరెంటు, తాగునీరు, డ్రైనేజీ వంటి ఏ విధమైన సదుపాయాలూగానీ కనిపించడంలేదు. అయినా ఈ స్థలం క్రమబద్ధీకరణ జరిగిపోయి సుమారు నెలరోజులు అయింది. ఇప్పటికీ అక్కడ ఎటువంటి నిర్మాణాలూ లేకపోవడం గమనార్హం.



15/73	VILL/COL: NANAKRAMGUDA/NANAKRAMGUDA W-B: 0-2 SURVEY: 149 EXTENT: 950SQ.Yds BUILT: 0SQ. FT Boundaries: [N]: SY.NO.149/PART [S] SY.NO.149/PART [E]: ROAD [W]: ROAD	1.(EX)THE GOVERNMENT OF TELANGANA REP BY TAHSILDAR,SERILINGAMPALLE MANDAL,RANGA REDDY DIST REP BY T SRINIVAS RAO 2.(EX)KONDRU FRANKLIN KRUPAL KUMAR (AUTHORISED SIGNATORY) 1.(CL)MOHAMMED ABDUR RAZZAK
16/73	VILL/COL: NANAKRAMGUDA/NANAKRAMGUDA W-B: 0-2 SURVEY: 149 EXTENT: 950SQ.Yds BUILT: 0SQ. FT Boundaries: [N]: SY.NO.149/PART [S] SY.NO.149/PART [E]: ROAD [W]: ROAD	1.(EX)THE GOVERNMENT OF TELANGANA REP BY TAHSILDAR,SERILINGAMPALLE MANDAL,RANGA REDDY DIST REP BY T SRINIVAS RAO 2.(EX)KONDRU FRANKLIN KRUPAL KUMAR (AUTHORISED SIGNATORY) 1.(CL)MOHAMMED ABDUR RAZZAK
17/73	VILL/COL: NANAKRAMGUDA/NANAKRAMGUDA W-B: 0-2 SURVEY: 149 EXTENT: 950SQ.Yds BUILT: 0SQ. FT Boundaries: [N]: SY.NO.149/PART [S] SY.NO.149/PART [E]: ROAD [W]: ROAD	1.(EX)THE GOVERNMENT OF TELANGANA REP BY TAHSILDAR,SERILINGAMPALLE MANDAL,RANGA REDDY DIST REP BY T SRINIVAS RAO 2.(EX)KONDRU FRANKLIN KRUPAL KUMAR (AUTHORISED SIGNATORY) 1.(CL)MOHAMMED ABDUR RAZZAK

8/73	VILL/COL: NANAKRAMGUDA/NANAKRAMGUDA W-B: 0-1 SURVEY: 149 EXTENT: 950SQ.Yds Boundaries: [N]: PART OF SURVEY NO 149 [S] PART OF SURVEY NO 149 [E]: ROAD [W]: ROAD Link Doct: 19302/2023 of SRO 1510	1.(EX)MOHAMMED ABDUR RAZZAK 2.(CL)M V R S PRASAD
9/73	VILL/COL: NANAKRAMGUDA/NANAKRAMGUDA W-B: 0-1 SURVEY: 149 EXTENT: 950SQ.Yds Boundaries: [N]: PART OF SURVEY NO.149 [S] PART OF SURVEY NO.149 [E]: ROAD [W]: ROAD Link Doct: 19300/2023 of SRO 1510	1.(EX)MOHAMMED ABDUR RAZZAK 2.(CL)M V R S PRASAD
10/73	VILL/COL: NANAKRAMGUDA/NANAKRAMGUDA W-B: 0-1 SURVEY: 149 EXTENT: 950SQ.Yds Boundaries: [N]: SURVEY NO.149/PART [S] SURVEY NO.149/PART E]: ROAD [W]: ROAD Link Doct: 19301/2023 of SRO 1510	1.(EX)MOHAMMED ABDUR RAZZAK 2.(CL)M V R S PRASAD

ఒకేరోజు అబ్దుర్ రజాక్ అనే వ్యక్తికి ఏడు ప్లాట్లను కట్టబెడుతున్నట్లు తెలిపే డాక్యుమెంట్లు

అదేరోజు ఆ వ్యక్తి నిర్మాణ సంస్థలకు ఆ ప్లాట్లను అమ్మేసినట్లు తెలియజేసే డాక్యుమెంట్లు

చదరపు గజానికి రూ.26 వేలే చెల్లింపు

నానక్‌రాంగూడలో జీవో 59 కింద క్రమబద్ధీకరించుకున్న వారంతా అక్కడి సబ్ రిజిస్ట్రార్ విలువ ప్రకారం చ.గజానికి రూ.26,700 చొప్పున మాత్రమే రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లించారు. అంటే.. ఇక్కడ మొత్తం 21,634 చదరపు గజాలు (దాదాపు ఐదు ఎకరాలు) క్రమబద్ధీకరిస్తే.. ప్రభుత్వానికి వచ్చిన ఆదాయం రూ.31.52 కోట్లు మాత్రమే! అక్కడి బహిరంగ మార్కెట్ విలువలో ఇది కనీసం ఐదు శాతం కూడా కాదు. నిజానికి, ఇక్కడ చదరపు గజం రూ.3 లక్షల వరకు పలుకుతోంది. అయినా.. అమ్మేందుకు ముందుకు రాని పరిస్థితులున్నాయి. హెచ్ఎండీఏ వేలం వేసినప్పుడు కోకాపేటలో ఎకరం వంద కోట్లు పలికిన విషయం తెలిసిందే. ఔటర్‌ను ఆనుకుని ఉన్న నానక్‌రాంగూడలో ఎకరం రూ.150 కోట్లకు పైగా పలుకుతోందని స్థానికులు చెబుతున్నారు. ఈ లెక్కన ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని బహిరంగ వేలం వేసి విక్రయిస్తే.. రాష్ట్ర ప్రభుత్వానికి సుమారు రూ.750 కోట్ల ఆదాయం వచ్చేది. కానీ, తమ అనుయాయులకు కేవలం రూ.31.52 కోట్లకే కట్టబెట్టారు.

ప్రముఖ నిర్మాణ సంస్థలకు అమ్మకాలు, ఒప్పందాలు

నానక్‌రాంగూడలో ప్రభుత్వ భూములను ఇలా క్రమబద్ధీకరించుకున్న వెంటనే సదరు కబ్జాదారులు వాటిని ప్రముఖ నిర్మాణ సంస్థలకు అమ్మేశారు. మరికొందరు వివిధ సంస్థలతో ఒప్పందాలు చేసుకున్నారు. శేరిలింగంపల్లి తహశీల్దార్ కార్యాలయ అధికారులు నవంబరు 9న కన్వేయన్స్ డీడ్ చేస్తే.. ఆ వెంటనే మరో సంస్థకు సేల్ డీడ్ చేసేశారు. నవంబరు 28న జరిగిన కన్వేయన్స్ డీడ్‌లు కూడా అదే రోజు మరొకరికి ఒప్పందాలయ్యాయి. డిసెంబరు 2న ఏడు స్థలాలను ముగ్గురికి క్రమబద్ధీకరిస్తే.. ఐదో తేదీన వాటిని ప్రముఖ నిర్మాణ సంస్థలకు సేల్ డీడ్, అగ్రిమెంట్ డీడ్‌లు చేశారు. అలాగే, ఐదో తేదీన ఏడు ప్లాట్లుగా 6,034 చ.గజాలను క్రమబద్ధీకరించుకున్న వ్యక్తి 8వ తేదీన ప్రముఖ నిర్మాణ సంస్థకు అగ్రిమెంట్ ఆఫ్ సేల్ కమ్ జీపీఏ చేశారు. ఈ మొత్తం వ్యవహారం వెనక గత ప్రభుత్వంలోని కొందరు కీలక పెద్దలు ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. క్రమబద్ధీకరించిన స్థలాలను కొన్న ప్రముఖ నిర్మాణ సంస్థలన్నీ గత ప్రభుత్వంలోని కొందరు పెద్దల అండదండలు ఉన్నవేననే ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో.. గత ప్రభుత్వం జీవో 59 కింద రెండు విడతల్లో క్రమబద్ధీకరణకు అవకాశం ఇవ్వడం వెనక సామాన్య ప్రజల ప్రయోజనాల కంటే బడా బాబులు, కొందరు ఎమ్మెల్యేలు, మంత్రుల స్వ ప్రయోజనాలే అధికంగా ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. తొలుత తెలంగాణ ఆవిర్భవించిన 2014 కంటే ముందు జరిగిన ఆక్రమణలను క్రమబద్ధీకరించేందుకు అవకాశం ఇచ్చినా.. ఆ తర్వాత 2020 జూన్ వరకూ జరిగిన కబ్జాలకు కూడా క్రమబద్ధీకరణకు అవకాశం ఇవ్వడాన్ని ఈ సందర్భంగా ఉదాహరిస్తున్నారు. అంతేనా.. ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా.. అధికార యంత్రాంగమంతా ఊపిరి సలపని విధుల్లో ఉండగా.. ఉన్నతస్థాయి ఆదేశాలతో శేరిలింగంపల్లి రెవెన్యూ అధికారులు క్రమబద్ధీకరణకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం వెనక భారీ మతలబు ఉందనే ఆరోపణలు వస్తున్నాయి.

జీవో 59 కింద క్రమబద్ధీకరణకు నిబంధనలు ఇవే..!

- ప్రభుత్వ స్థలంలో కొన్నేళ్ల క్రితమే శాశ్వత ఇంటి నిర్మాణం చేసుకొని ఉండాలి
- నిర్మాణం చేసుకొని ఉన్న ఇంటినే క్రమబద్ధీకరణకు పరిగణనలోకి తీసుకోవాలి
- ఆధార్ లేదా ఇతర గుర్తింపు కార్డు ఉండాలి
- ఇంటి ఫొటోను పొందుపర్చాలి

ప్రభుత్వ స్థలంలో ఉన్న ఇంటికి ఈ కింది వాటిలో ఏదైనా ఒకటి ఉండాలి

- ఏదైనా రిజిస్టర్డ్ డాక్యుమెంట్
- ఆస్తి పన్ను చెల్లింపు రశీదు
- విద్యుత్ బిల్లు రశీదు
- నీటి బిల్లు రశీదు
- అక్కడే నివాసముంటున్నట్లుగా ఇంకా ఏదైనా ఆధారం
- పంచాయతీ లేదా మున్సిపాలిటీ నిర్మాణ అనుమతి కాపీ

హైదరాబాద్‌లో త్వరలో గ్లోబల్ ఏఐ సమిట్

- నగరాన్ని ఏఐ హబ్ చేయడమే ప్రభుత్వ లక్ష్యం
- ఐటీ రంగం అభివృద్ధికి సంపూర్ణ సహకారం
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు
- ఐటీ సంస్థల ప్రతినిధులతో భేటీ

హైదరాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌ను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగానికి హబ్‌గా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఇందులో భాగంగా హైదరాబాద్ వేదికగా అతి త్వరలో ఓ గ్లోబల్ ఏఐ సమిట్ నిర్వహిస్తామని ప్రకటించారు. అంతర్జాతీయ స్థాయి సాంకేతిక నిపుణులు, సంస్థలను ఈ సదస్సుకు ఆహ్వానిస్తామని తెలిపారు. ప్రత్యేకమైన పనికి కాకుండా వివిధ రకాల కార్యకలాపాలను నిర్వహణకు రూపొందించే జనరిక్ ఏఐలకు మించిన ఏఐ వ్యవస్థల రూపకల్పనకు హైదరాబాద్ వేదిక కావాలన్నది తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ మేరకు గచ్చిబౌలిలోని ఇన్ఫోసిస్ క్యాంపస్‌లో వివిధ ఐటీ కంపెనీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడారు. రాష్ట్రంలో ఐటీ రంగం అభివృద్ధికి తమ ప్రభుత్వ సంపూర్ణ సహకారం అందిస్తుందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రగతి కోసం ఐటీ పరిశ్రమ వృద్ధిని పక్కా ప్రణాళికతో అందిపుచ్చుకోవాలని తమ ఆలోచనని తెలిపారు. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, గ్రీన్ టెక్, 5జీ టెక్నాలజీ తదితర రంగాలను మరింత ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు. ఐటీ రంగం అభివృద్ధికి అవసరమైన సదుపాయాల కల్పనతోపాటు, మానవ వనరులను అందుబాటులో ఉంచేందుకు పెట్టుబడులు పెట్టేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.

మేడారం జాతర పనులు త్వరితగతిన పూర్తిచేయాలి

- జాతరపై సమీక్షలో మంత్రులు

హైదరాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ కుంభమేళాగా భావించే సమ్మక్క-సారక్క జాతర ఫిబ్రవరిలో జరగనుండటంతో పనులను త్వరితగతిన పూర్తిచేయాలని మంత్రులు పొంగులేటి, పొన్నం ప్రభాకర్, సీతక్క, సురేఖ అధికారులను ఆదేశించారు. జాతర ఏర్పాట్లు, భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలపై మంగళవారం హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీలో జరిగిన సమావేశంలో సీఎస్ శాంతికుమారి, డీజీపీ రవిగుప్త, ఇతర శాఖల అధికారులతో కలిసి మంత్రులు సమీక్షించారు. ఈ సందర్భంగా.. మొత్తం పది జోన్లుగా పనులను విభజించి జనవరి 28లోపు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. జాతరకు కోటి.50లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉండడంతో ప్రధానంగా ట్రాఫిక్ జామ్, రూట్ క్లియరెన్స్ నిర్వహణ పటిష్ఠంగా ఉండాలని, కాబట్టి గతంలో అక్కడ పనిచేసిన అధికారులనే నోడల్ అధికారులుగా నియమిస్తున్నట్లు తెలిపారు. మహాలక్ష్మి పథకంతో ఈసారి జాతరకు మహిళలు అధికంగా వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే దాదాపు 6వేల ఆర్టీసీ బస్సులు నడిపించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు. ఇప్పటికే కేటాయించిన రూ.75 కోట్లకు అదనంగా మరో రూ.30 కోట్ల కోసం అధికారులు సమర్పించిన ప్రతిపాదనలను ఆమోదించి వెంటనే నిధులను విడుదల చేస్తామని చెప్పారు.



ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

ప్రజాభవన్‌లో ప్రజావాణికి 1906 దరఖాస్తులు

బేగంపేట, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రజాభవన్‌లో మంగళవారం జరిగిన ప్రజావాణికి 1906 దరఖాస్తులు వచ్చాయని అధికార వర్గాలు తెలియజేశాయి. నోడల్ అధికారి దివ్య ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి, పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తామని వారికి భరోసా ఇచ్చారు. పలు సమస్యలపై వచ్చిన ప్రజలు ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్నారు. రెవెన్యూలో పని చేసే పలువురు సీనియర్ వీఆర్ఏలు తమ ఉద్యోగాలను తమ కుటుంబసభ్యుల్లో ఒకరికి ఇప్పించాలని దరఖాస్తు చేసుకున్నారు. అలాగే యాదాద్రి పాతగుట్ట సమీపంలో 36 ఎకరాల్లో ఏర్పాటు చేసిన పుణ్యభూమి వెంచర్‌లో భూములు కొనుగోలు చేసిన పలువురు ప్రజావాణిలో తమ సమస్యను విన్నవించారు. తాము పుణ్యభూమి వెంచర్‌లో భూములు కొనుగోలు చేశామని, అయితే ఇటీవల కొందరు జేసీబీలతో వచ్చి ప్రహరీ కూల్చి వేయడంతో పాటు వెంచర్‌లోని ప్లాట్స్ కనబడకుండా చదును చేసి రాళ్లు పీకివేశారని ఫిర్యాదు చేశారు. తమకు న్యాయం చేయాలని కోరారు. అలాగే యూపీఏ ప్రభుత్వ హయాంలో సాక్షర భారత్ కో- ఆర్డినేటర్లుగా పని చేసిన తమను తిరిగి విధుల్లోకి తీసుకొని న్యాయం చేయాలని సాక్షర భారత్ కో- ఆర్డినేటర్లు ప్రజావాణిలో దరఖాస్తు చేశారు.

ఆర్టీసీలో వెల్ఫేర్ కమిటీలను రద్దు చేయాలి

- రేవంత్‌కు స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ వినతి

హైదరాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో వెల్ఫేర్ కమిటీలను తక్షణం రద్దు చేసి వాటి స్థానంలో యూనియన్ల ఏర్పాటుకు అనుమతివ్వాలని ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్(ఐఎన్‌టీయూసీ) ప్రధానకార్యదర్శి కె.రాజిరెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై మంగళవారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 2019 సమ్మె కాలంలో ఉద్యోగులపై పెట్టిన పోలీసుకేసులు ఎత్తివేయాలని, చనిపోయిన, ఆరోగ్యంబాగాలేని ఉద్యోగుల పిల్లలకు శాశ్వత ప్రాతిపాదికన ఉద్యోగాల్లో నియమించాలని కోరారు. అలాగే 2017, 2021 వేతనసవరణ పూర్తిచేయాలని విజ్ఞప్తి చేశారు. కాగా సంక్రాంతి తర్వాత ఆర్టీసీ యూనియన్లతో సమావేశం నిర్వహించి సమస్యలను పరిష్కరిస్తామని ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు రాజిరెడ్డి తెలిపారు.

ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించండి

- మంత్రి పొన్నంకు ఆటో డ్రైవర్ల జేఏసీ వినతి

హైదరాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పదేళ్లుగా ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిశీలించి పరిష్కరించాలని రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆటో డ్రైవర్ల జేఏసీ కోరింది. సీపీఐ నాయకుడు చాడవెంకటరెడ్డి నేతృత్వంలో మంగళవారం ఆటో సంఘాల జేఏసీ ప్రతినిధులు మంత్రి పొన్నంను కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. పెరిగిన ఇంధన, నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా తక్షణమే ఆటో మీటర్ చార్జీలు పెంచాలని, కొత్త ఆటో పర్మిట్‌లను జారీ చేయాలని కోరారు. అలాగే ఆటో డ్రైవర్‌లకు ప్రత్యేకంగా సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని విన్నవించారు. ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారం పట్ల మంత్రి పొన్నం సానుకూలంగా స్పందించారని యూనియన్ నేతలు తెలిపారు.

కాళేశ్వరంపై విజిలెన్స్ విచారణ



విజిలెన్స్ విచారణ సందర్భంగా అధికారుల నుంచి స్వాధీనం చేసుకున్న మొబైల్ ఫోన్లు

(మొదటిపేజీ తరువాయి)

సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ (సీడీవో)లో విజిలెన్స్ తనిఖీలు కొనసాగాయి. ఆయా విభాగాల్లో డిజైన్ల వివరాలు; అంచనా వ్యయాలు, సవరించిన అంచనాలు సహా సంబంధిత ఫైళ్లను స్వాధీనం చేసుకున్నారు. వాటి జిరాక్సులను తీసుకున్నారు. అలాగే, పెద్దపల్లి జిల్లా రామగుండంలోని నీటి పారుదల శాఖ ఈఎన్‌సీ కార్యాలయం, ఎస్ఈ కార్యాలయం, క్వాలిటీ కంట్రోల్ కార్యాలయాలను విజిలెన్స్ అదనపు ఎస్పీ పి బాలకోటయ్య నేతృత్వంలోని బృందాలు తనిఖీలు నిర్వహించాయి. ప్రాజెక్టు పనులు ప్రారంభమైన 2016 నుంచి పూర్తయ్యే నాటికి గల రికార్డులు, పత్రాలు, ఫైళ్లను అధికారులు సీజ్ చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ కార్యాలయాల పరిధిలో ఏఈ నుంచి సీఈ స్థాయి వరకు ఎంతమంది అధికారులు పని చేశారు? ఎవరైనా సస్పెన్షన్‌కు గురయ్యారా? ఏసీబీకి పట్టుబడ్డారా? తదితర వివరాలు కూడా సేకరించారు. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీ కాలనీలోని ఈఎస్‌సీ కాళేశ్వరం క్యాంప్ కార్యాలయం, ఎస్ఈ కార్యాలయంలోనూ తనిఖీలు జరిగాయి. రికార్డులు స్వాధీనం చేసుకున్నట్లు విజిలెన్స్ ఎస్పీ రమణారెడ్డి వెల్లడించారు. భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ నీటిపారుదల శాఖ కార్యాలయం నుంచి కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

మేడిగడ్డపై న్యాయవిచారణకు లేఖ

మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణ లోపాలపై జ్యుడీషియల్ విచారణ కోసం సిట్టింగ్ జడ్జిని నియమించాలని తెలంగాణ హైకోర్టును రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ఈ మేరకు హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధేకు ఓ లేఖ రాశామని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మంగళవారం ప్రకటించారు. మేడిగడ్డ బ్యారేజీ అంశంలో జ్యుడీషియల్ విచారణ జరిపించాలని మంత్రివర్గంలో ఇప్పటికే తీర్మానం కూడా చేశామని వెల్లడించారు. కాగా విచారణకు ఆదేశించిన నేపథ్యంలో ఆధారాలు తారుమారు చేస్తారనే ఉద్దేశంతో విజిలెన్స్ విచారణకు ఆదేశించినట్లు ఉత్తమ్ వెల్లడించారు. ఈ క్రమంలోనే అధికారులు సోదాలు చేపట్టి కీలక ఫైళ్లు స్వాధీనం చేసుకోవడం గమనార్హం. కాగా ఈ విజిలెన్స్ విచారణపై సంబంధిత అధికారులతో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మంగళవారం సమీక్షించారు. ఇక, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాళేశ్వరం ఎత్తిపోతల పథకంపై బుధవారం సమీక్ష నిర్వహించనున్నారు. ప్రాజెక్టుకు సంబంధించిన వివిధ అంశాలపై చర్చించనున్నారు. మేడిగడ్డపై జ్యుడీషియల్ విచారణకు సిట్టింగ్ జడ్జిని నియమించాలని ప్రభుత్వం హైకోర్టుకు లేఖ రాసిన నేపథ్యంలో ఈ సమీక్ష ప్రాధాన్యం సంతరించుకుంది.

హమ్మయ్య.. అప్పు పుట్టింది

(మొదటిపేజీ తరువాయి)

ఇప్పటికే తీసుకోవటంతో కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వానికి నిధుల కటకట ఏర్పడింది. చివరి త్రైమాసికంలో అప్పు తీసుకునే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో రూ.13,000 కోట్ల అదనపు అప్పు కావాలని, ఈ మేరకు అనుమతి ఇవ్వాలంటూ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేసింది. ఇటీవల రెండు సార్లు ఢిల్లీకి వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. ప్రధాని నరేంద్ర మోదీని, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిసి అదనపు అప్పు గురించి ప్రస్తావించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేదని, ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చాల్సి ఉందని వివరించారు. రూ.13 వేల కోట్ల అదనపు అప్పు ఇవ్వాలని కోరారు. ఆర్బీఐ డిసెంబరులో ప్రకటించిన అడ్వాన్స్‌డ్ కేలండర్‌లోనూ తెలంగాణకు సంబంధించిన రూ.13 వేల కోట్ల వివరాలను వెల్లడించారు. అయితే.. రాష్ట్ర ఆర్థిక శాఖ అధికారులు మాత్రం బడ్జెట్‌లోని నికర, స్థూల అప్పుల వివరాలను సమగ్రంగా సమీక్షించి రూ.15 వేల కోట్ల అప్పు కావాలంటూ ఇటీవల కేంద్రానికి ప్రతిపాదించారు. ఇప్పటి వరకూ రాష్ట్ర ప్రభుత్వం నికరంగా తీసుకున్న అప్పు కాకుండా... స్థూల అప్పును పరిగణనలోకి తీసుకుని రూ.15 వేల కోట్లను ఇవ్వాలని కోరారు. ఇలా వచ్చిన విజ్ఞప్తులు, రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడటం వంటి పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని రూ.9,000 కోట్ల అప్పునకు కేంద్రం తాజాగా అనుమతి ఇచ్చింది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక శాఖ అధికారులు రాష్ట్ర ఆర్థికశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ నెల 16న జరిగే ఆర్బీఐ వేలం పాటలో పాల్గొనవచ్చని సూచించారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం తొలిదశలో రూ.2,000 కోట్ల అప్పు తీసుకునే అవకాశాలున్నాయి. దీనికోసం ఈ నెల 12వ తేదీన ఆర్బీఐకి ఇండెంటు పెట్టనున్నట్లు సమాచారం. రాష్ట్ర ఆర్థిక శాఖ అధికారులు ప్రతిపాదించిన మొత్తం రూ.15 వేల కోట్లలో రూ.9 వేల కోట్ల అప్పుకే కేంద్రం అనుమతి ఇవ్వడంతో మిగతా రూ.6,000 కోట్ల అప్పు వచ్చే అవకాశాలున్నాయా? లేదా? అన్నదానిపై సందిగ్ధత నెలకొంది. వాస్తవానికి ఈసారి బడ్జెట్‌లో రూ.40,615 కోట్ల అప్పును అంచనా వేశారు. ఇందులో డిసెంబరు నాటికి రూ.39,051 కోట్ల అప్పు తీసుకున్నారు. ఇది నికరంగా తీసుకున్న అప్పు అని, స్థూల అప్పు రూ.50 వేల కోట్లకు పైగా తీసుకోవచ్చని చెబుతున్నారు. ఈ లెక్కన మిగతా రూ.6,000 కోట్ల అప్పు కోసం కూడా ప్రయత్నిస్తామని అధికారులు అంటున్నారు.

సర్కారుకు ఊరట

రూ.9,000 కోట్ల అప్పు తీసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో రాష్ట్ర ప్రభుత్వానికి కొంత ఊరట లభించినట్లయ్యింది. తక్షణ అవసరాల కోసం ఈ సొమ్ము పనికొస్తుందని భావిస్తోంది. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామంటూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. కానీ.. అధికారం చేపట్టగానే ఖాళీ ఖజానా కనిపించింది. దీంతో కొత్త ప్రభుత్వం మల్లగుల్లాలు పడుతోంది. ఈ నేపథ్యంలో, కేంద్రం అనుమతించిన రూ.9 వేల కోట్ల అప్పుతో ప్రభుత్వానికి కొంత ఉపశమనం లభించిందని అధికార వర్గాలు చెబుతున్నాయి.

సీఎంవో అధికారులకు శాఖలు

(మొదటిపేజీ తరువాయి)

జరగలేదు. తాజాగా సీఎం దీనిపై నిర్ణయం తీసుకున్నారు. ఏడుగురు అధికారులకు దాదాపు అన్ని మంత్రిత్వ శాఖలకు సంబంధించిన బాధ్యతలను అప్పగించారు. ఈ మేరకు తమకు కేటాయించిన శాఖల్లోని అంశాలను ఆయా అధికారులు చూస్తారు. అయితే విధానపరమైన అంశాలు ఏమైనా ఉంటే.. వాటిపై సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రితో చర్చించి నిర్ణయం తీసుకోవాలని నిర్దేశించారు.

సీఎంవో అధికారులకు కేటాయించిన శాఖలు



మాణిక్‌రాజ్,ఐఏఎస్, సీఎం కార్యదర్శి

ఎనర్జీ, సాగునీటి పారుదల, విద్య (పాఠశాల, ఉన్నత, సాంకేతిక విద్య), రెవెన్యూ (కమర్షియల్ ట్యాక్స్, ఎక్సైజ్), గనులు, భూగర్భ జలాలు.



జి. చంద్రశేఖర్‌రెడ్డి, ఐఎఫ్ఎస్, సీఎం కార్యదర్శి

అటవీ, పర్యావరణ, టెక్నాలజీ డిపార్ట్‌మెంట్, వ్యవసాయం, పశుసంవర్ధక శాఖ, డెయిరీ డెవలప్‌మెంట్, మార్కెటింగ్ శాఖ, ఆహార పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాలు, రవాణా, రోడ్లు, భవనాల శాఖ, హౌసింగ్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి



వేముల శ్రీనివాసులు, సీఎం ప్రత్యేకాధికారి (ఓఎస్డీ)

దేవాదాయ, పర్యాటకం, సాంస్కృతిక, ప్రజావాణి, సీఎంకు ఫిర్యాదులు, ముఖ్యమంత్రి కార్యదర్శితో కలిసి సీఎం సహాయనిధి బాధ్యతలు, సీఎం కార్యాలయం కంప్యూటరీకరణ.

వి.శేషాద్రి, ఐఏఎస్, సీఎం ముఖ్య కార్యదర్శి

సాధారణ పరిపాలన, శాంతిభద్రతలు, హోం, ఫైనాన్స్, ప్లానింగ్, న్యాయశాఖ, శాసనసభ వ్యవహారాలు, ల్యాండ్ రెవెన్యూ, సీఎంవో ఇంఛార్జి



షానవాజ్ ఖాసిం, ఐపీఎస్, సీఎం కార్యదర్శి

బీసీ, మైనార్టీ సంక్షేమం, విపత్తు నిర్వహణ, క్రీడలు, యువజన సర్వీసులు, సీఎం సెక్యూరిటీ.

బి. అజిత్‌రెడ్డి, డిఫెన్స్, సీఎం ప్రత్యేక కార్యదర్శి



మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పట్టణాభివృద్ధి, పరిశ్రమలు (పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు), ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, కార్మిక, ఉపాధి కల్పన, శిక్షణ, కర్మాగారాల శాఖ, సమాచార ప్రజా సంబంధాలు, ముఖ్యమంత్రి సహాయనిధి, సీఎం అపాయింట్‌మెంట్స్



ఎస్. సంగీత సత్యనారాయణ ఐఏఎస్, సీఎం సంయుక్త కార్యదర్శి

వైద్యారోగ్యం, కుటుంబ సంక్షేమం, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమం, దివ్యాంగులు, సీనియర్ సిటిజన్లు, ఎస్సీ, ఎస్టీల సంక్షేమంతోపాటు సీఎం ముఖ్యకార్యదర్శితో కలిసి సీఎంవో అడ్మినిస్ట్రేషన్.

ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీ ఫైనల్స్ నేడే

హైదరాబాద్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు (పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు... రియల్ పార్టనర్: స్వర్గసీమ సుకేతన) తుది అంకానికి చేరుకున్నాయి. తుది విజేతలు ఎవరో తేల్చే ఫైనల్స్ బుధవారం హైదరాబాద్‌లో జరగనున్నాయి. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 45 కేంద్రాల్లో ప్రాథమిక స్థాయి ముగ్గుల పోటీలు ఈ నెల 5, 6, 7 తేదీల్లో జరిగాయి. ఆరు వేల మంది మహిళలు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ప్రతి కేంద్రంలో ప్రథమ స్థానం సాధించిన వారి నుంచి పది మంది జిల్లాస్థాయి విజేతలుగా ఎంపికయ్యారు. వీరంతా హైదరాబాద్‌లో ఫైనల్స్‌లో పోటీ పడనున్నారు. ఈ పోటీల్లో విజేతలకు ప్రథమ బహుమతి రూ.30,000, మూడు ద్వితీయ బహుమతులు రూ.10,000 చొప్పున అందజేస్తారు. మరో ఆరుగురికి కన్సొలేషన్ బహుమతులు ఉంటాయి. పోటీల్లో పాల్గొనే అందరికీ స్పాన్సర్ల నుంచి గిఫ్ట్ హ్యాంపర్లు కూడా లభిస్తాయి. కొందరు సినీ, రాజకీయ, అధికార ప్రముఖులు ఈ ఫైనల్స్‌కు హాజరై విజేతలకు బహుమతి ప్రదానం చేస్తారు.

విమాన మరమ్మతు శిక్షణ రంగంలోకి జీఎంఆర్

- స్కూల్ ఆఫ్ ఏవియేషన్ ఏర్పాటు
- నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్ కోర్సు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): విమాన మరమ్మతు, నిర్వహణ (ఎంఆర్‌వో) శిక్షణ రంగంలోకి జీఎంఆర్ గ్రూప్ అడుగు పెట్టింది. జీఎంఆర్ స్కూల్ ఆఫ్ ఏవియేషన్‌ను ఏర్పాటు చేసింది. దీన్ని త్వరలో ప్రారంభించనుంది. జీఎంఆర్ ఎయిర్ కార్గో అండ్ ఏరోస్పేస్ ఇంజనీరింగ్ లిమిటెడ్‌కు చెందిన ఎంఆర్‌వో విభాగం జీఎంఆర్ ఏరో టెక్నిక్ 3 ఎకరాల్లో దీన్ని ఏర్పాటు చేసినట్లు జీఎంఆర్ ఏరో టెక్నిక్ ప్రెసిడెంట్ అశోక్ గోపినాథ్ తెలిపారు. రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలోని జీఎంఆర్ ఏరోస్పేస్ అండ్ ఇండస్ట్రియల్ పార్క్ దీన్ని ఏర్పాటు చేసినందు వల్ల భవిష్యత్తులో విమానాల మరమ్మత్తు, నిర్వహణ శిక్షణలో విప్లవాత్మక మార్పులు వస్తాయని జీఎంఆర్ గ్రూప్ భావిస్తోంది. ఇప్పటికే జీఎంఆర్ గ్రూప్ జీఎంఆర్ ఏవియేషన్ అకాడమీ ద్వారా గ్రౌండ్ హ్యాండ్లింగ్, విమానయాన రంగంలోని వివిధ విభాగాలకు అవసరమైన కోర్సులను అందిస్తోంది.

ఏడాదికి 200 మందికి శిక్షణ

స్కూల్ ఆఫ్ ఏవియేషన్ 4 ఏళ్ల సమగ్ర ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్ ఇంజనీరింగ్ కోర్సు అందిస్తుంది. ఈ కోర్సులో రెండు రకాలు ఉంటాయి. ఒకటి డీజీసీఏ ధ్రువీకరణ కోర్సు కాగా.. రెండోది డీజీసీఏ, యూరోపియన్ యూనియన్ ఏవియేషన్ సేఫ్టీ (ఈయూఏఎస్ఏ) గుర్తింపు ఉన్నది. ఈ కోర్సు కోసం సాంకేతిక సాయాన్ని అందించడానికి ఎయిర్‌బస్‌తో టెక్నికల్ కొలాబరేషన్ ఒప్పందాన్ని జీఎంఆర్ కుదుర్చుకుంది. ఈ కోర్సుతో పాటు ఎయిర్‌క్రాఫ్ట్ స్పెసిఫిక్ టైప్ ట్రైనింగ్, విమాన నిర్మాణం, ఎయిర్‌క్రాఫ్ట్ కాంపోజిట్ వంటి ఇతర కోర్సులను కూడా నిర్వహిస్తారు. ప్రారంభంలో ఏడాదికి 200 మందికి శిక్షణ ఇస్తారు. విద్యార్థులు మొదటి రెండేళ్లు అకడమిక్‌లో శిక్షణను పొందనుండగా చివరి రెండేళ్లు ఏరో టెక్నిక్‌లో ప్రాక్టికల్ ట్రైనింగ్‌ను పూర్తి చేసే అవకాశం ఉంటుంది. ఇంటర్మీడియెట్‌లో గణితం, రసాయన, భౌతిక శాస్త్రాల్లో 65 శాతం మార్కులు పొందిన వారు ప్రవేశ పరీక్ష ద్వారా వివిధ కోర్సుల్లో ప్రవేశం పొందడానికి అర్హులు.

ఏవియేషన్ స్కూల్ బిల్డింగ్





ఏవియేషన్ స్కూల్‌ను పరిశీలిస్తున్న అశోక్‌గోపీనాథ్, అధికారులు



గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఏసీబీ చీఫ్ ఆనంద్

గవర్నర్‌తో ఏసీబీ చీఫ్ భేటీ

హైదరాబాద్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌తో ఏసీబీ చీఫ్ సీవీ ఆనంద్ భేటీ అయ్యారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఆనంద్‌ను ప్రభుత్వం ఏసీబీ డైరెక్టర్‌గా నియమించిన విషయం తెలిసిందే. ఏసీబీ డీజీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత గవర్నర్ తమిళిసైని రాజ్‌భవన్‌లో ఆయన మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. గవర్నర్ ఏసీబీ డీజీ ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించినట్లు సమాచారం.

18న ఎన్టీఆర్ అమరజ్యోతి ర్యాలీ

హైదరాబాద్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): ఎన్నో విప్లవాత్మక సంస్కరణలను అమలు చేసిన ఘనత ఎన్టీఆర్‌దేనని, సంక్షేమ ఫలాలను దేశానికి పరిచయం చేసిన ఘనత ఆయనకే దక్కుతుందని టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి కంభంపాటి రామ్మోహన్‌రావు కొనియాడారు. మంగళవారం ఎన్టీఆర్‌భవన్‌లో జరిగిన పార్టీ సీనియర్ నేతల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈనెల 18న ఎన్టీఆర్ అమరజ్యోతి ర్యాలీ నిర్వహిస్తామని, రసూల్‌పుర నుంచి ఎన్టీఆర్ ఘాట్ వరకు జరిగే ర్యాలీని పార్టీ జాతీయాధ్యక్షుడు చంద్రబాబు ప్రారంభిస్తారని తెలిపారు. ఎన్టీఆర్ 1983 జనవరి 9న ఏపీ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసి మంగళవారం నాటికి 41 సంవత్సరాలు పూర్తయిందని, ఆరోజు తెలుగుజాతి చరిత్రనే మలుపుతిప్పిన శుభదినమని కంభంపాటి అన్నారు. ఆస్తిలో మహిళలకు సమానహక్కు, పటేల్ పట్వారీ వ్యవస్థ రద్దు, బీసీలకు, మహిళలకు రాజకీయ రిజర్వేషన్లు, మండలి వ్యవస్థ ఏర్పాటుతో ఎన్టీఆర్ ప్రజల వద్దకు పాలన తీసుకువెళ్లారని పేర్కొన్నారు.

ఇసుక అక్రమ దందాను అడ్డుకునే అధికారులపై దాడికి యత్నం

- ఇసుక ట్రాక్టర్‌తో ఢీకొట్టేందుకు యత్నించిన డ్రైవర్

ఇల్లెందు, జనవరి 9: రాష్ట్రంలో ఏజెన్సీ ప్రాంతాల నుంచి యథేచ్ఛగా ఇసుకను తరలించుకుపోతున్న అక్రమార్కులు.. ఏకంగా తమకు అడ్డొచ్చే అధికారులపైనే దాడులకు దిగుతూ సవాల్ విసురుతున్నారు. ఇసుక అక్రమ దందాను అరికట్టేందుకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు-కొత్తగూడెం మార్గంలో నాలుగురోజులుగా రాత్రివేళలో అటవీ అధికారులు తనిఖీలు చేస్తున్నారు. మంగళవారం తెల్లవారుజామున ఇల్లెందు ఎఫ్‌డీవో కర్నావత్ వెంకన్ననాయక్ ఆధ్వర్యంలో రేంజ్ అధికారి విజయ్‌కుమార్, సిబ్బంది మునిరాజు, రంగ్యా తదితర పదిమంది అటవీ సిబ్బంది ఇల్లెందు-టేకులపల్లి మధ్య రోళ్లపాడు క్రాస్‌రోడ్డు సమీపంలోని అటవీప్రాంతంలో తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో టేకులపల్లి మండలం నుంచి ఆరు ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తుండగా అధికారులు వాటిని అడ్డుకునేందుకు యత్నించారు. ముందుగా వచ్చిన రెండు ట్రాక్టర్లను నిలిపి విచారిస్తుండగా గమనించిన అక్రమార్కులు వెనుక వచ్చిన మరో నాలుగు ఇసుక ట్రాక్టర్లను వెనక్కే మళ్లించి పరారయ్యారు. ఆపిన రెండు ఇసుక ట్రాక్టర్లలోని ఒక ట్రాక్టర్ డ్రైవర్ తన ట్రాక్టర్‌తో అటవీ అధికారులను ఢీ కొట్టేందుకు యత్నించాడు. తేరుకున్న అధికారులు వాహనం నుంచి పక్కకు తప్పుకుని సురక్షితంగా బయటపడ్డారు. ట్రాక్టర్ ఢీకొని అధికారుల వాహనం మాత్రం ధ్వంసమైంది. ఇసుక తరలిస్తున్న ఇద్దరిని అధికారులు అదుపులోకి తీసుకున్నారు.

'కోటా' డిజిటల్ స్టడీ మెటీరియల్ సిద్ధం

హైదరాబాద్ సిటీ, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల కోసం కోటా డిజిటల్ స్టడీ మెటీరియల్‌ను సిద్ధం చేసింది. 6 నుంచి 10 వ తరగతి చదువుతున్న విద్యార్థులకు కోటా ఐఐటీ, మెడికల్ ఫౌండేషన్ డిజిటల్ స్టడీ మెటీరియల్, అసైన్‌మెంట్స్ తయారు చేసినట్లు కోటా పేజెస్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. మాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ ఫౌండేషన్ మెటీరియల్‌తో పాటు అసైన్‌మెంట్లని డిజిటల్‌గా వాట్సాప్ ద్వారా పొందవచ్చని తెలిపారు. మరింత సమాచారం కోసం ఐఐటీఎఫ్, ఎంఈడీఎఫ్ అని టైప్ చేసి వాట్సాప్ నెంబర్ 98490 -16661 నెంబర్‌కు మెసేజ్ చేయాలని సూచించారు.

16 ఏళ్ల బాలుడికి రెండోసారి ఓపెన్ హార్ట్ సర్జరీ

- విజయవంతంగా పూర్తి చేసిన అపోలో డాక్టర్లు

ఒకసారి ఓపెన్ హార్ట్ సర్జరీ అయిన 16 ఏళ్ల బాలుడికి మరోసారి ఆపరేషన్ చేసి గుండె సమస్యకు చెక్ పెట్టారు అపోలో ఆస్పత్రి వైద్యులు. అత్యంత క్లిష్టమైన మినిమల్లీ ఇన్వాసివ్ ప్రక్రియ ద్వారా ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. ఈ వివరాలను సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ మనోజ్ అగర్వాల్, పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్ డాక్టర్ అమోల్ గుప్తా మీడియాకు వివరించారు. మహబూబ్‌నగర్‌కు చెందిన 16 ఏళ్ల బాలుడు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, ఛాతీ నొప్పితో బాధపడుతూ ఈ నెల 2న అపోలో మెడికల్ కాలేజీ ఆస్పత్రికి వచ్చాడు. అతడికి 15 ఏళ్ల క్రితం(2007లో) పుట్టుకతో వచ్చిన గుండె జబ్బు టెట్రాలజీ ఆఫ్ ఫాలోకు ఓపెన్ హార్ట్ సర్జరీ జరిగింది. టెట్రాలజీ ఆఫ్ ఫాలో తర్వాత గుండె సమస్యలు రావడం సాధారణం. దీంతో బాలుడికి మళ్లీ ఓపెన్ హార్ట్ సర్జరీ అవసరమైంది. అయితే, రెండోసారి ఓపెన్ హార్ట్ సర్జరీ క్లిష్టమైనప్పటికీ.. ఆధునిక విధానాలు అందుబాటులో ఉండటంతో మినిమల్లీ ఇన్వాసివ్ ప్రక్రియ ద్వారా డాక్టరు సర్జరీ పూర్తి చేశారు.

ఐదు వేల మందికి గౌరవ వేతనాలిస్తాం

- ఉద్యమ కళాకారులకు అండగా ఉంటాం : మంత్రి పొన్నం

రవీంద్రభారతి, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ కోసం ఉద్యమించిన కళాకారులందరికీ ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం కేవలం 550 మంది కళాకారులకు గౌరవ వేతనాలు ఇచ్చిందని, తాము ఆ సంఖ్యను ఐదు వేలకు పెంచేందుకు కృషి చేస్తామని ప్రకటించారు. తెలంగాణ జానపద కళాకారుల సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు మంగళవారం ఆత్మీయ సత్కారం జరిగింది. రవీంద్రభారతీలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పొన్నం మంత్రి జూపల్లిని సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ తెలంగాణలో ప్రజా పాలన వచ్చిందని అన్నారు. 550 మంది కళాకారులు పొందుతున్న లబ్ధిని ఐదు వేల మందికి పెంచే అంశంపై మంత్రి వర్గ సమావేశంలో చర్చిస్తామని తెలిపారు. అనంతరం జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ గత ప్రభుత్వ వైఫల్యం వల్లే కళాకారులకు మూడు నెలలుగా వేతనాలు అందడం లేదని చెప్పారు. ముఖ్యమంత్రితో మాట్లాడి కళాకారులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

సీఎం కన్నా.. కేసీఆర్ అనే 3 అక్షరాలే పవర్‌ఫుల్

(మొదటి పేజీ తరువాయి)

వస్తారని చెప్పారు. సీఎం అనే రెండక్షరాల కన్నా.. కేసీఆర్ అనే మూడక్షరాలే పవర్‌ఫుల్ అని, ఆయన అధికారంలో ఉండటం కన్నా ప్రతిపక్షంలో ఉండటమే కాంగ్రెస్ పార్టీకి ప్రమాదకరమని అన్నారు. రానున్న రోజుల్లో కేసీఆర్ అసెంబ్లీకి వస్తే ఎలా ఉంటుందో ఊహించుకోండని వ్యాఖ్యానించారు. అధికారంలో ఉన్నప్పటి కన్నా ప్రతిపక్షంలో ఉంటేనే మరింత పోరాట పటిమ చూపగలమని, మొన్నటి అసెంబ్లీ సమావేశాల్లో బీఆర్ఎస్ పోరాట పటిమను తెలంగాణ ప్రజలు చూశారని అన్నారు. అయితే ప్రజల్లో ఉన్న అసంతృప్తికి కారణాలు తెలుసుకొని సమీక్షించుకుని ముందుకు వెళ్లాలన్నారు. ఇప్పటివరకు జరిగిన సమావేశాల్లో పార్టీపరంగా ఆత్మవిమర్శ చేసుకుంటున్నట్లు తెలిపారు. పార్లమెంటు నియోజకవర్గాల సమీక్షలు ముగియగానే.. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సమీక్షలు ఉంటాయన్నారు. త్వరలోనే రాష్ట్ర, జిల్లా కమిటీలు ఏర్పాటు చేస్తామని, ప్రతి రెండు, మూడు నెలలకోసారి అన్ని కమిటీల సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తామని చెప్పారు. త్వరలో జరగనున్న పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకుందామని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

కాంగ్రెస్‌ది మాట నిలబెట్టుకోలేని చరిత్ర..

ఎన్నికల హామీలను, ఇచ్చిన మాటను నిలబెట్టుకునే చిత్తశుద్ధి కాంగ్రెస్ చరిత్రలో లేదని కేటీఆర్ అన్నారు. స్వల్పకాలంలోనే ప్రజల విశ్వాసం కోల్పోయే లక్షణం ఆ పార్టీకి ముందు నుంచీ ఉందన్నారు. ఇప్పటిలాగే.. 1989 అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీని తిరస్కరించి కాంగ్రెస్‌ను గెలిపించిన ప్రజలు.. కేవలం ఏడాదిన్నరలోనే ఆ పార్టీపై విశ్వాసం కోల్పోయారని, ఆ తర్వాత జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో టీడీపీని భారీ మెజారిటీతో గెలిపించారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతర వర్గాలకు ఇచ్చిన హామీల అమలులో కాలయాపన దిశగా అడుగులేస్తోందనడానికి ఈ నెల రోజుల పాలనే సాక్ష్యమన్నారు. ఆ పార్టీన చేసిన వాగ్దానాల అమలు కోసం బీఆర్ఎస్ ప్రజల పక్షాన నిలిచి పోరాడుతుందని చెప్పారు. పదేళ్ల కాలంలోనే తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలబెట్టామని, బీఆర్ఎస్ పాలనలో ఈ రాష్ట్రం సాధించిన ఘనతకు, ప్రతిష్ఠకు ఏమాత్రం భంగం కలిగించకుండా చూసుకోవాల్సిన బాధ్యత గులాబీ శ్రేణులదేనని అన్నారు. బీఆర్ఎస్ అధిష్ఠానంపై జరుగుతున్న దుష్ప్రచారాలను కార్యకర్తలు తిప్పికొట్టాలని సూచించారు. అసెంబ్లీ ఎన్నికల్లో మధిర అభ్యర్థి కమల్‌రాజ్ గొంతు కోశారనడం తగదని, ఇటువంటి వ్యాఖ్యలను ఖండిస్తున్నామని తెలిపారు. కమల్‌రాజ్‌కు పార్టీ అన్ని విధాలా సహకరించిందన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థులకు టికెట్‌తోపాటు రూ.40 లక్షల చెక్ ఇచ్చిన పార్టీ బీఆర్ఎస్ మాత్రమేనన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్

వైఎస్సార్ కాంగ్రెస్, టీడీపీ కాంగ్రెస్, పాత కాంగ్రెస్..

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్‌కు మూడు గ్రూపులున్నాయని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. వీటిలో ఒకటి వైస్సార్ కాంగ్రెస్, మరొకటి టీడీపీ కాంగ్రెస్, ఇంకోటి పాత కాంగ్రెస్ అని ఎద్దేవా చేశారు. అన్ని పథకాలకూ వందరోజుల గడువు పెట్టి.. మోసం చేస్తే ప్రజలే కాంగ్రెస్‌పై చీటింగ్ కేసు పెడతారని పేర్కొన్నారు. నాలుగు రోజులు ఓపిక పడితే.. ప్రజలే బీఆర్ఎస్‌కు మళ్లీ అధికారాన్ని బంగారు పల్లెంలో పెట్టి ఇస్తారని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నెలరోజుల్లోనే.. బీఆర్ఎస్ కార్యకర్తలపై కక్షసాధింపు చర్యలు పెరిగాయని తెలిపారు. కేసీఆర్ ఇటువంటి చర్యలకు దిగి ఉంటే కాంగ్రెస్ నేతలంతా జైళ్లలో ఉండేవారని అన్నారు. తెలంగాణకు బీఆర్ఎస్ అవసరం లేదని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అంటున్నారని, బీఆర్ఎస్ లేకపోతే.. ఈ రాష్ట్రానికి అన్యాయం చేయొచ్చని భావిస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ తెలంగాణ ఇంటి పార్టీ అని, ఆయన ఆశలు అడియాసలవుతాయని అన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ ముఖ్య నేతలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కడియం శ్రీహరి, పువ్వాడ అజయ్‌కుమార్, మధుసూదనాచారి, నామా నాగేశ్వర్‌రావు, వద్దిరాజు రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం టికెట్ మరోసారి నామాకే ఇవ్వాలి

హైదరాబాద్/ఖమ్మం: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఖమ్మం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా మరోసారి నామా నాగేశ్వర్‌రావునే బరిలోకి దించాలని ఆ జిల్లా నేతలు ప్రతిపాదించారు. కాగా, అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమికి ప్రధానంగా పార్టీ అధిష్ఠానం తీసుకున్న నిర్ణయాలే కారణమని, పంతానికి పోయి.. అధికారాన్ని దూరం చేశారని పలువురు కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది. సీనియర్లు పార్టీని వీడటంతోనే జిల్లాలో పార్టీకి పెద్ద దెబ్బ తగిలిందని అభిప్రాయపడ్డట్లు సమాచారం. చంద్రబాబు అరెస్టు కూడా జిల్లా రాజకీయాలపై ప్రభావం చూపిందని మరికొందరు ప్రస్తావించినట్లు తెలిసింది. పార్లమెంటు ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చేలోపు కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను అమలు చేయాలని బీఆర్ఎస్ ఎంపీలు నామా నాగేశ్వర్‌రావు, వద్దిరాజు రవిచంద్ర డిమాండ్ చేశారు. కొత్త ప్రభుత్వానికి సమయం ఇవ్వాలన్న విషయం తమకు తెలుసునని, కేవలం కాంగ్రెస్ హామీలను తాము గుర్తు చేస్తున్నామని చెప్పారు.

హైకోర్టును సందర్శించిన పార్లమెంటరీ కమిటీ

- రాజేంద్రనగర్‌కు తరలించవద్దంటూ కొందరు న్యాయవాదుల వినతి
- అభిప్రాయాలు తీసుకున్నాక మళ్లీ నిరసన ఎందుకన్న చీఫ్ జస్టిస్

హైదరాబాద్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఉభయ సభల ఎంపీలతో కూడిన సిబ్బంది, ప్రజాసమస్యలు, లా అండ్ జస్టిస్ శాఖల పార్లమెంటరీ స్థాయీ సంఘం మంగళవారం హైకోర్టును సందర్శించింది. కమిటీ సీనియర్ సభ్యుడు ఎంపీ వివేక్ కే థంఖా, ఇతర సభ్యులైన కనకమేడల రవీంద్ర కుమార్, పి.విల్సన్, కేఆర్ సురేశ్‌రెడ్డి, కె. రఘురామ కృష్ణరాజు, వెంకటేశ్ తదితరులు హైకోర్టు బార్ అసోసియేషన్ సభ్యులతో భేటీ అయ్యారు. దేశవ్యాప్తంగా అన్ని హైకోర్టులను సందర్శించి న్యాయస్థానాల్లో సౌకర్యాలు, సమస్యలపై చర్చిస్తున్నట్లు తెలిపారు. హైకోర్టుకు చెందిన పలువురు సీనియర్ న్యాయవాదులు మాట్లాడుతూ హైదరాబాద్‌లో సుప్రీంకోర్టు రీజినల్ బెంచ్, కోర్ట్ ఆఫ్ అప్పీల్స్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. హైకోర్టును ఇక్కడి నుంచి రాజేంద్రనగర్‌కు తరలించొద్దంటూ పలువురు న్యాయవాదులు నిరసన తెలిపి వినతిపత్రం అందజేశారు. అనంతరం కమిటీ సభ్యులు హైకోర్టు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, ఇతర న్యాయమూర్తులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సమావేశంలో చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే మాట్లాడుతూ రాష్ట్ర బార్ కౌన్సిల్, హైకోర్టు బార్ అసోసియేషన్ కార్యవర్గం, న్యాయమూర్తులు, ఇతర భాగస్వాములతో చర్చించిన తర్వాతే హైకోర్టు తరలింపుపై నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. ప్రభుత్వం ఇందుకు వంద ఎకరాల భూమి కేటాయించిందని పేర్కొన్నట్లు తెలిసింది. భవిష్యత్తు తరాల కోసం జడ్జిల క్వార్టర్స్ సహా అన్ని సౌకర్యాలు ఒకేచోట ఉండేలా నూతన హైకోర్టు నిర్మాణం చేపట్టనున్నట్లు పేర్కొన్నట్లు సమాచారం. బార్ అసోసియేషన్ అభిప్రాయం తీసుకున్న తర్వాత నిరసనలు తెలపాల్సిన అవసరం లేదని అన్నట్లు తెలిసింది.



కేటీఆర్ పక్కన నిందితుడు అరవింద్ అలిశెట్టి

మిడ్ డే మీల్స్ కాంట్రాక్టు ఇప్పిస్తానంటూ బీఆర్ఎస్ కార్యకర్త బడా మోసం!

- జూబ్లీహిల్స్ వ్యాపారిని బురిడీ కొట్టించి
- రూ. 4కోట్లు వసూలు చేసిన అరవింద్ అలిశెట్టి
- అదుపులోకి తీసుకున్న సీసీఎస్ పోలీసులు

హైదరాబాద్ సిటీ, జనవరి 9(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్‌లో తానో కీలక కార్యకర్తనని, ప్రభుత్వంలోని ఏ శాఖకు చెందిన పనైనా చిటికెలో చేయించగలనంటూ ఓ వ్యాపారి ముందు గొప్పలు పోయాడో వ్యక్తి! ప్రభుత్వంలో తన పరపతి గురించి నమ్మించేందుకు ఆ వ్యాపారికి.. కేసీఆర్‌కు తాను నమస్కరిస్తున్న ఓ ఫొటో.. తెలంగాణ భవన్ వద్ద కేటీఆర్ తన పక్క నుంచి వెళుతున్న మరో ఫొటో చూపించాడు. మధ్యాహ్న భోజన పథకం కాంట్రాక్టును ఇప్పిస్తానని నమ్మించాడు. ప్రభుత్వం కాంట్రాక్టు ఇచ్చిందంటూ నమ్మించేందుకు జీవో, ఇతర అనుమతి పత్రాలనూ సృష్టించి వ్యాపారి చేతుల్లో పెట్టాడు. ఆ వ్యాపారి వద్దనుంచి విడతలవారీగా రూ.4కోట్లు గుంజాడు. నిందితుడు కూకట్‌పల్లిలోని కాకతీయ హిల్స్‌కు చెందిన అరవింద్ అలిశెట్టి! బాధితుడు జూబ్లీహిల్స్‌కు చెందిన బొల్లినేని ధనుష్ శ్రీనివాస్. ధనుష్‌కు అరవింద్ 2021 డిసెంబరులో పరిచయమయ్యాడు. తరచూ ధనుష్ ఇంటికి వెళ్లిన అరవింద్, ఆయనకు తెలంగాణ, ఏపీ సహా బెంగళూరులోనూ పలు వ్యాపారాలున్నట్లు తెలుసుకొని చనువు పెంచుకున్నాడు. కొన్నాళ్లకు.. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కాంట్రాక్టును ఇప్పిస్తానని, రాజకీయ నేతలను మేనేజ్ చేసేందుకు కొంత డబ్బు ఖర్చుచేస్తే సరిపోతుందని నమ్మించాడు. తొలుత 2022 ఫిబ్రవరి 22న రూ.50 లక్షలు ధనుష్ నుంచి తీసుకొని.. ఆ పథకానికి సంబంధించిన కాంట్రాక్టును ప్రభుత్వం అంగీకరించినట్లు నకిలీ జీవోను, ఇతర పత్రాలను సృష్టించి చూపెట్టాడు. ఇదంతా చేసిన అధికారులు, నాయకులకు ముడుపులు చెల్లించాల్సి ఉంటుందని చెప్పి విడతలవారీగా మొత్తం రూ.4 కోట్లు తీసుకున్నాడు. అయితే ఎంతకీ వర్క్ఆర్డర్ రాకపోవడంతో ధనుష్‌కు అనుమానమొచ్చింది. మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన జీవో, ఇతర ధ్రువపత్రాల గురించి ఆరా తీయగా అవన్నీ నకిలీవని తేలింది. దాంతో అరవింద్‌ను ధనుష్, అతడి సోదరుడు కార్తీక్ నిలదీశారు. అయితే 2023 జూలై వరకు వర్క్ ఆర్డర్ వచ్చేలా చూస్తానని.. వర్క్ ఆర్డర్ రాకపోతే డబ్బంతా తిరిగిచ్చేస్తానని ఆ సోదరులకు అరవింద్ మాటిచ్చాడు. అయినా ఆ తేదీ లోపు డబ్బు ఇవ్వకపోవడంతో బాధితుడు ధనుష్ డిసెంబరు 4న సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అరవింద్ అలిశెట్టిపై సీసీఎస్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. జనవరి 9న నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

విష ప్రయోగం వల్లే!

పథకం ప్రకారం గుర్తు తెలియని వ్యక్తులు ఆవు కళేబరాన్ని విషతుల్యం చేయడంతోనే మగపులి మృతి

- ఆధిపత్య పోరులో ఆడపులిని వేరే మగపులి చంపి ఉంటుంది
- ప్రాథమికంగా నిర్ధారించిన అటవీ శాఖ అధికారులు
- పులుల మృతిలో స్థానికుల ప్రమేయం?
- పాడి పశువులను చంపుతుండటంతోనే విష ప్రయోగం!

ఆసిఫాబాద్/కాగజ్‌నగర్, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ అటవీ ప్రాంతంలో మృతిచెందిన రెండు పులుల్లో ఒకటి విష ప్రయోగం వల్లే మృతిచెందిందని అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. విష ప్రయోగం వల్లే పులులు మృతిచెంది ఉంటాయంటూ 'ప్రమాదంలో పులులు' అనే శీర్షికన మంగళవారం ప్రచురించిన కథనంలో 'ఆంధ్రజ్యోతి' పేర్కొన్న సంగతి తెలిసిందే. ఇప్పుడదే నిజమైంది. కాగజ్‌నగర్ పట్టణానికి అత్యంత సమీపంలో ఉన్న దరిగాం అటవీ ప్రాంతంలోని బురదమామిడి పరిసరాల్లో శనివారం రెండేళ్ల వయసున్న ఆడపులి, సోమవారం ఆరేళ్ల వయసున్న మగపులి మృతిచెందాయి. ఈ ఘటనపై విచారణకు అధికారులు రంగంలోకి దిగారు. ఘటన స్థలాన్ని సందర్శించిన నిపుణుల బృందం.. మగపులిపై విషప్రయోగం జరిగినట్లు ప్రాథమికంగా తేల్చింది. పులులు ఎలా మరణించాయన్న దానిపై ప్రాథమికంగా ఆధారాలు సేకరించారు. మగపులి కళేబరం సమీపంలోనే ఛిద్రమైన స్థితిలో ఆవు కళేబరం పడి ఉండటాన్ని గమనించారు. ఆవు కళేబరాన్ని పథకం ప్రకారం గుర్తు తెలియని వ్యక్తులు విషపూరితం చేసి ఉంటారని, ఆ మాంసం తినడం వల్లే పులి మృతిచెంది ఉంటుందని భావిస్తున్నారు. ఈ మగపులి మెడకు ఉచ్చు ఉండటాన్నీ గమనించారు. ఎన్టీసీఏ సభ్యుల సమక్షంలో పులులు, ఆవుకి సంబంధించిన ముఖ్యమైన అవయవ భాగాలను సేకరించి ఫోరెన్సిక్ ల్యాబ్‌కు తరలించినట్లు అటవీ శాఖ అధికారులు వెల్లడించారు. శనివారం మృతిచెందిన ఆడపులిని ఆధిపత్య పోరులో వేరే మగపులి చంపి ఉంటుందని పీసీసీఎఫ్ డోబ్రీయాల్ వెల్లడించారు. కాగా పోస్టుమార్టం అనంతరం పులుల కళేబరాలను దహనం చేశారు.



పశువులపై వరుస దాడులే కారణమా?

కాగజ్‌నగర్ పట్టణానికి సమీపంలో ఉన్న దరిగాం అటవీ ప్రాంతంలోని బురదమామిడి పరిసరాల్లో మూడు కూనలతో పాటు ఓ పెద్ద ఆడపులి సంచరించినట్లు గతంలోనే అటవీ శాఖ అధికారులు గుర్తించారు. ఈ పులి కుటుంబం తరుచూ జనావాసాలకు వచ్చి వెళుతుండటం, గతంలో కాగజ్‌నగర్ పరిసర ప్రాంతాలకు రావడం సంచలనం సృష్టించింది. కొంత కాలంగా ఈ సమూహంలోని ఏదో ఒక పులి పశువులపై వరుసగా దాడులు చేస్తూ చంపేస్తుండటంతో పరిసర గ్రామాల రైతులు అటవీ శాఖ సిబ్బందికి ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో అటవీ సిబ్బంది పశువుల సంచారాన్ని నిరోధించేందుకు ప్రయత్నించడం, అడవుల్లోకి మేతకు వెళ్లకుండా కట్టడి చేయటం వంటి పరిణామాలు చోటు చేసుకున్నాయి. దీనిపై ఆగ్రహంతో ఉన్న గ్రామస్థులు పెద్దపులులను ఈ ప్రాంతంలో లేకుండా చేస్తే ముప్పు తప్పుతుందని భావించి విషం పెట్టినట్లు అనుమానిస్తున్నారు.

ఫోరెన్సిక్ ఫలితాల తర్వాతే వాస్తవాలు..

దరిగాం అడవుల్లో మృతి చెందిన పులుల అవశేషాలను పరీక్షల నిమిత్తం ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపాం. పులులపై విష ప్రయోగం జరిగిందా? అనే విషయం పరీక్షల తర్వాతే వెల్లడిస్తాం. ప్రాథమిక విచారణలో విష ప్రయోగం జరిగినట్లుగానే అనుమానిస్తున్నాం. తిప్పేశ్వర్, తడోబా పులుల అభయారణ్యాల్లో పులుల సంతతి పెరగడంతో కొన్ని పులులు కవ్వాల్‌కు కారిడార్‌గా ఉన్న కడంబా అడవుల్లోకి రాకపోకలు సాగిస్తున్నాయి. ఇందులో కొన్ని పులులు ఇక్కడే ఉంటూ ప్రాదేశిక ఆధిపత్యం కోసం ప్రయత్నిస్తున్నాయి.

- పీసీసీఎఫ్ డోబ్రియాల్

కడంబాలో పెరిగిన పులుల సంచారం..

కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలోని కడంబా అటవీ ప్రాంతాల్లో గత ఎనిమిదేళ్లుగా పులుల సంతానోత్పత్తి, సంచారం గణనీయంగా పెరిగింది. ముఖ్యంగా మహారాష్ట్రలోని తడోబా నుంచి ప్రాణహిత పరివాహక ప్రాంతంలో ఉన్న కడంబా అడవుల్లోకి పులులు తరుచూ రాకపోకలు సాగిస్తున్నాయి. అయితే పులుల కదలికలపై అధికారుల పర్యవేక్షణ నామమాత్రంగా ఉందంటున్నారు. దీనిపై కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలోని బెజ్జూరు, సిర్పూరు రేంజ్ పరిధిలో అధికారులకు అవగాహన లేక పోవడం, ఏడాదిగా యానిమల్ ట్రాకర్లకు వేతనాలు ఇవ్వకపోవడం వంటి అంశాలు పెద్ద పులుల భద్రతకు ముప్పుగా పరిణమించాయి. ఇదే అదనుగా అడవుల్లో స్మగ్లర్లు అడవుల్లోకి చొరబడి పులులతో పాటు ఇతర వన్యప్రాణుల ప్రాణాలకు హాని తలపెడుతున్నారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అయోధ్యలో తెలంగాణ రుచులు!

- 40 రోజులపాటు రామసన్నిధిలో మన వంటకాలు
- రోజూ 6వేల మంది భక్తుల కోసం.. ఉచితంగానే అందజేత
- వీహెచ్‌పీ ఆధ్వర్యంలో 25 టన్నుల బియ్యం, 12 టన్నుల సరుకులు

బర్కత్‌పుర, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలోని రామయ్య సన్నిధిలో భక్తులు తెలంగాణ రుచులను 'శ్రీరామ ప్రసాదం' పేరుతో ఆస్వాదించనున్నారు. అదీ 40 రోజుల పాటు.. పూర్తి ఉచితంగా! తెలంగాణకే ప్రత్యేకమైన పచ్చిపులుసుతో పాటు బగారా, తెల్లన్నం, కిచిడి, ఆలూ కుర్మా, టమాట ఆలుగడ్డ కూర, పప్పు, వంకాయ మసాలా, పులిహోర, పెరుగన్నం తదితర వంటకాలను భక్తులకు వడ్డించనున్నారు. ఇక తెలంగాణకే ప్రత్యేకమైన స్వీట్లు కూడా మూడు రోజుల పాటు భక్తులకు అందించనున్నారు. ఈ నెల 14 నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు రోజుకు 6 వేల మందికి వడ్డిస్తారు. అయోధ్యలోని శ్రీ రామమందిరం ప్రారంభోత్సవం సందర్భంగా హైదరాబాద్ నుంచి వీహెచ్‌పీ ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేకంగా నిత్యావసర సరుకుల లారీలు వెళ్లాయి. ఇందుకుగానూ తెలంగాణ సంబంధించి రెండు బృందాలకు అయోధ్య శ్రీరామతీర్థ ట్రస్ట్ ఈ అవకాశం ఇచ్చింది. 25 టన్నుల బియ్యం, 12 టన్నుల నిత్యావసర సరుకులతో కూడిన లారీలు బషీర్‌బాగ్‌లోని శ్రీఅమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం బయలుదేరాయి. ఈ వాహనాలు 12న అయోధ్యకు చేరుకోనున్నాయి. వంటల తయారీ కోసం ప్రత్యేకంగా హైదరాబాద్‌కే చెందిన 35 మంది వంటవాళ్లు, సహాయానికి 160 మంది వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ కార్యకర్తలు అయోధ్యకు వెళ్తున్నారు. తెలంగాణ ప్రత్యేక వంటకాలన్నీ కూడా ఆయోధ్యలోని మందిరం ఆరో గేటు సమీపంలో భక్తుల కోసం అందుబాటులో ఉంటాయని వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ నేతలు వెల్లడించారు. ప్రతి రోజు ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు వంటకాలు భక్తులకు అందుబాటులో ఉంటాయని చెప్పారు.

*Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: **K. Srinivas**. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. **Managing Director: Vemuri Radha Krishna,** Founder: K.L.N.Prasad.*

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
హైదరాబాద్ ● బుధవారం 10 జనవరి 2024
diksuchi@andhrajyothy.com



యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్(యూఓహెచ్) ఆధ్వర్యంలోని సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ వర్చువల్ లెర్నింగ్(సీడీవీఎల్) - డిప్లొమా, అప్ స్కిల్లింగ్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. వీటిని డిస్టెన్స్, ఆన్‌లైన్ మోడ్‌లలో నిర్వహిస్తారు. ఒక్కో ప్రోగ్రామ్‌లో కనిష్ఠంగా 50 సీట్లు ఉంటాయి. అకడమిక్ ప్రతిభ, డాక్యుమెంట్స్ వెరిఫికేషన్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు.

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో డిస్టెన్స్ డిప్లొమాలు

డిప్లొమా ప్రోగ్రామ్‌లు

- డిప్లొమా ఇన్ లైబ్రరీ ఆటోమేషన్ అండ్ నెట్‌వర్కింగ్
- డిప్లొమా ఇన్ సైబర్ లాస్ అండ్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్
- డిప్లొమా ఇన్ కమ్యూనికేటివ్ ఇంగ్లీష్
- డిప్లొమా ఇన్ క్రిమినల్ జస్టిస్ అండ్ ఫోరెన్సిక్ సైన్స్
- డిప్లొమా ఇన్ బిజినెస్ మేనేజ్‌మెంట్
- డిప్లొమా ఇన్ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్
- డిప్లొమా ఇన్ పంచాయతీ రాజ్ గవర్నెన్స్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్
- డిప్లొమా ఇన్ ఇన్ఫెక్షన్ ప్రివెన్షన్ అండ్ కంట్రోల్
- డిప్లొమా ఇన్ కమ్యూనిటీ ఐ హెల్త్
- డిప్లొమా ఇన్ టెలీకాం టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్

అప్ స్కిల్లింగ్ ప్రోగ్రామ్‌లు

- డిప్లొమా ఇన్ గవర్నెన్స్
- డిప్లొమా ఇన్ ఎనర్జీ మేనేజ్‌మెంట్
- డిప్లొమా ఇన్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్
- సర్టిఫికెట్ కోర్స్ ఇన్ బర్త్ కేర్ ప్రాక్టీషనర్

ప్రోగ్రామ్‌ల వివరాలు: ఒక్కో డిప్లొమా ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. గరిష్ఠంగా మూడేళ్లలో పూర్తిచేయాల్సి ఉంటుంది. ఒక్కో ప్రోగ్రామ్‌లో రెండు టర్మ్‌లు ఉంటాయి. ప్రతి టర్మ్‌లో అయిదు నుంచి పది రోజుల పాటు కాంటాక్ట్ క్లాసెస్ నిర్వహిస్తారు. వీటికోసం అభ్యర్థులు యూనివర్సిటీ క్యాంపస్‌లకు హాజరు కావచ్చు. లేదంటే ఆన్‌లైన్ ద్వారా వినవచ్చు. ప్రాక్టికల్ సెషన్స్ కూడా ఉంటాయి. కనీసం 75 శాతం అటెండెన్స్ తప్పనిసరి. ప్రతి ప్రోగ్రామ్‌లో స్టడీ సెమినార్‌లు, కౌన్సెలింగ్ సెషన్స్, ఇంటర్నల్ అసెస్‌మెంట్‌లు, అసైన్‌మెంట్‌లు, ప్రాజెక్ట్ వర్క్‌లు, టర్మ్ ఎండ్ ఎగ్జామినేషన్‌లు ఉంటాయి.

- సర్టిఫికెట్ ప్రోగ్రామ్ ఇన్ బర్త్ కేర్ ప్రాక్టీషనర్ వ్యవధి ఆర్నెల్లు.

అర్హత: లైబ్రరీ ఆటోమేషన్ అండ్ నెట్‌వర్కింగ్ ప్రోగ్రామ్‌నకు డిగ్రీ(లైబ్రరీ సైన్స్) పూర్తిచేసి ఉండాలి. ఇన్ఫెక్షన్ ప్రివెన్షన్ అండ్ కంట్రోల్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి డిగ్రీ(హెల్త్/మెడికల్/నర్సింగ్/అలైడ్ హెల్త్ సైన్సెస్) ఉత్తీర్ణులై ఉండాలి. ఏదేని డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు హెల్త్ కేర్ సెక్టార్‌లో కనీసం రెండేళ్ల అనుభవం ఉన్నవారు కూడా అర్హులే. టెలీకాం టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌నకు ఇంజనీరింగ్ డిగ్రీ(ఈసీఈ/ఈఈఈ/ఈఐఈ/ఈటీసీ/ఐసీటీ) ఉత్తీర్ణులు; ఎలక్ట్రానిక్స్ ఒక సబ్జెక్టుగా ఏదేని ఇంజనీరింగ్ డిగ్రీ పూర్తిచేసినవారు; ఎమ్మెస్సీ (ఎలక్ట్రానిక్స్) ఉత్తీర్ణులు అర్హులు. బీఎస్సీ(ఎలక్ట్రానిక్స్/ఫిజిక్స్/మేథ్స్/కంప్యూటర్ సైన్స్) లేదా డిప్లొమా(ఈసీఈ/ఈఈఈ) ఉత్తీర్ణతతోపాటు కనీసం రెండేళ్ల అనుభవం ఉన్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. కమ్యూనిటీ ఐ హెల్త్ ప్రోగ్రామ్‌నకు డిగ్రీ(మెడిసిన్/ఆయుష్/ఆప్టోమెట్రీ/నర్సింగ్/అలైడ్ హెల్త్ సైన్సెస్/ న్యూట్రిషన్) పూర్తిచేసినవారు; బయాలజీ ప్రధాన సబ్జెక్టుగా బీఎస్సీ ఉత్తీర్ణతతోపాటు సంబంధిత విభాగంలో ఏడాది అనుభవం ఉన్నవారు అప్లయ్ చేసుకోవచ్చు. సర్టిఫికెట్ ప్రోగ్రామ్ ఇన్ బర్త్ కేర్ ప్రాక్టీషనర్‌కు ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. మిగిలిన ప్రోగ్రామ్‌లన్నింటికీ ఏదేని డిగ్రీ పాసైతే చాలు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.300
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** ఫిబ్రవరి 29
- **జతచేయాల్సిన పత్రాలు:** దరఖాస్తు ఫీజు రిసీట్, పదోతరగతి సర్టిఫికెట్, ఇంటర్ మార్కుల పత్రాలు, డిగ్రీ సర్టిఫికెట్, రెండు ఫొటోలు
- **చిరునామా:** అసిస్టెంట్ రిజిస్ట్రార్, సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ వర్చువల్ లెర్నింగ్-యూఓహెచ్, సిటీ క్యాంపస్, గోల్డెన్ థ్రెషోల్డ్ బిల్డింగ్, నాంపల్లి స్టేషన్ రోడ్, అబిడ్స్, హైదరాబాద్ - 500001
- **వెబ్‌సైట్:** cdvl.uohyd.ac.in

పీజీ డిప్లొమా ఇన్ బిజినెస్ అనలిటిక్స్



ఖరగ్‌పూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ కేజీపీ), కోల్‌కతాలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎంసీ), ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్(ఐఎస్ఐ) ఉమ్మడిగా నిర్వహిస్తున్న 'పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ బిజినెస్ అనలిటిక్స్(పీజీడీబీఏ)' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ వెలువడింది. ఇది రెండేళ్ల ఫుల్ టైం రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ముందుగా కోల్‌కతా ఐఐఎంలో ఓరియంటేషన్ ప్రోగ్రామ్, ప్రీ సెమిస్టర్ మాడ్యూల్ నిర్వహిస్తారు. ఐఎస్ఐలో మొదటి సెమిస్టర్, ఐఐటీ కేజీపీలో రెండో సెమిస్టర్, ఐఐఎం కోల్‌కతాలో మూడో సెమిస్టర్ చదవాల్సి ఉంటుంది. నాలుగో సెమిస్టర్‌లో ఇండస్ట్రీ ఇంటర్న్‌షిప్ ఉంటుంది. ఈ ప్రోగ్రామ్‌లో మొత్తం 65 సీట్లు ఉన్నాయి. అడ్మిషన్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. మెరిట్ కం మీన్స్ స్కాలర్‌షిప్‌లను అనుమతిస్తారు. క్యాంపస్ ప్లేస్‌మెంట్ సౌకర్యం ఉంది.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బీఈ/బీటెక్/ఎమ్మెస్సీ/ఎంకాం ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంజనీరింగ్ డిప్లొమా తరవాత లేటరల్ ఎంట్రీ ద్వారా మూడేళ్ల ఇంజనీరింగ్ డిగ్రీ పూర్తిచేసినవారు; నాలుగేళ్ల బీఎస్సీ ఉత్తీర్ణులు; సీఏ/సీఎస్/ఐసీడబ్ల్యూఏఐ పూర్తిచేసినవారు; ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు అప్లయ్ చేసుకోవచ్చు. ఏ కోర్సులోనైనా ప్రథమ శ్రేణి మార్కులు తప్పనిసరి. ఏడాది వ్యవధిగల ఎంబీఏ డిగ్రీ చేసినవారు దరఖాస్తుకు అనర్హులు.

అడ్మిషన్ టెస్ట్ వివరాలు: దీనిని సీబీటీ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో మొత్తం 50 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. వెర్బల్ ఎబిలిటీ నుంచి 15, లాజికల్ రీజనింగ్ నుంచి 5, డేటా ఇంట్రప్రిటేషన్ అండ్ డేటా విజువలైజేషన్ నుంచి 5, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ నుంచి 25 ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు మూడు మార్కులు నిర్దేశించారు. మొత్తం మార్కులు 150. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం మూడు గంటలు. పరీక్ష సిలబస్ కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

ఎంపిక: అడ్మిషన్ టెస్ట్‌లో సాధించిన స్కోర్ ఆధారంగా అభ్యర్థులను ఇంటర్వ్యూకి పిలుస్తారు. అడ్మిషన్ టెస్ట్ స్కోర్‌కు 45 శాతం, ఇంటర్వ్యూలో వచ్చిన మార్కులకు 40 శాతం, ఇంటర్/డిప్లొమా స్థాయి మార్కులకు 8 శాతం, అనుభవానికి 7 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ముఖ్య సమాచారం

- **ప్రోగ్రామ్ ఫీజు:** రూ.25 లక్షలు(ట్యూషన్ ఫీజు+క్యాంపస్ లాడ్జింగ్+బుక్స్+స్టడీ మెటీరియల్+ఎగ్జామినేషన్ మెటీరియల్స్+ల్యాబొరేటరీ చార్జీలు)
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.2500; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1250
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 6
- **అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** ఫిబ్రవరి 20 నుంచి 22 వరకు
- **మాక్ టెస్ట్ నిర్వహణ:** మార్చి 9, 10
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, విశాఖపట్నం
- **కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ తేదీ:** మార్చి 17
- **పర్సనల్ ఇంటర్వ్యూలు:** మే 11, 12
- **ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** మే 24
- **పీజీడీబీఏ ప్రోగ్రామ్ ప్రారంభం:** జూలై 10 నుంచి
- **వెబ్‌సైట్:** isical.ac.in, iitkgp.ac.in, iim-cal.ac.in

SCHOLARSHIP ALERT

TSDPL Silver Jubilee Scholarship Program

Description: Tata Steel Downstream Products Limited (TSDPL) invites applications from students who are domiciles of Jamshedpur, Kalinganagar, Pantnagar, Faridabad, Pune, Chennai, Tada, and Kolkata. The scholarship is meant to support meritorious students from low income families to continue their education.

Eligibility: Open for students who are domiciles of locations such as Jamshedpur, Kalinganagar, Pantnagar, Faridabad, Pune, Chennai, Tada, and Kolkata are eligible to apply. Applicants must be pursuing any year of ITI/diploma, graduation or postgraduation in fields such as Nursing, UG medical courses such as MBBS, BDS, PG medical courses (any specialization), paramedical courses, ITI/diploma subjects such as fitter, electrical, welders, safety, etc. from government-recognized institutes. Must have scored at least 60% marks in their Class 10 and 12 examination. Annual family income of the applicants must not be more than INR 5,00,000 from all sources.

Prizes & Rewards: INR 1,00,000 for 1 year

Last Date to Apply: 21-01-2024

Application mode: Online only

Short Url: www.b4s.in/aj/TSDPL2

PROMYS India
(Program in Mathematics for Young Scientists)

Description: PROMYS India (Program in Mathematics for Young Scientists), India 2024 is an opportunity offered in partnership with the Indian Institute of Science (IISc), Bengaluru, for students in Class 9 to 12. The selected students will be awarded a full scholarship covering tuition, housing, and meals for the six weeks of the programme.

Eligibility: Open for students aged 15 years or older by May 5th, 2024, currently enrolled in Class 9 to 12 (or equivalent) at any recognised secondary or higher secondary school across India. Applicants must have completed (or be in) Class 9 before the program begins.

Prizes & Rewards: A full scholarship covering tuition, housing, and meals for the six weeks of the programme

Last Date to Apply: 01-02-2024

Application mode: Online only

Short Url: www.b4s.in/aj/POR1

Piaggio "Shiksha Se Samriddhi" Program

Description: An initiative of Piaggio Vehicles Pvt. Ltd. to support the STEM education of female students from Pune, Satara, Baramati, Nashik, Aurangabad, and Ahmednagar.

Eligibility: Open to female students pursuing STEM courses.
- Students from Pune, Satara, Baramati, Nashik, Aurangabad, and Ahmednagar can apply for the scholarship.
- Final-year students enrolled in graduation, post-graduation and diploma will be eligible under this program.
- Students must have scored at least 50% marks in their previous class.
- The annual income of the family should be less than INR 4 lakh.

Note: Children of employees of Piaggio and Buddy4Study are not eligible to participate.

Prizes & Rewards: INR 15000 - INR 20,000 (based on actuals)

Last Date to Apply: 20-01-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/PSD5

buddy4study.com

రిమైండర్

ఏపీపీఎస్సీ నోటిఫికేషన్స్

గ్రూప్-1 సర్వీస్ పోస్టులు

ఖాళీలు 81

ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న గ్రూప్-1 పోస్టుల భర్తీకి ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ) నోటిఫికేషన్ దరఖాస్తులు స్వీకరిస్తోంది.

శాఖల వారీ ఖాళీలు

1. డిప్యూటీ కలెక్టర్(ఏపీ సివిల్ సర్వీస్- ఎగ్జిక్యూటివ్ బ్రాంచ్): **9 పోస్టులు**
2. అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ స్టేట్ ట్యాక్స్(ఏపీ స్టేట్ ట్యాక్స్ సర్వీస్): **18 పోస్టులు**
3. డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్(సివిల్)(ఏపీ పోలీస్ సర్వీస్) కేటగిరీ-2: **26 పోస్టులు**
4. డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ జైల్స్(మెన్)(ఏపీ జైల్ సర్వీస్): **1 పోస్టు**
5. డివిజనల్/డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్(స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఫైర్ సర్వీస్: **1 పోస్టు**
6. రీజనల్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్(ఏపీ ట్రాన్స్‌పోర్ట్ సర్వీస్): **6 పోస్టులు**
7. డిస్ట్రిక్ట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్(ఏపీ బీసీ వెల్ఫేర్ సర్వీస్): **1 పోస్టు**
8. డిస్ట్రిక్ట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్(ఏపీ సోషల్ వెల్ఫేర్ సర్వీస్): 3 పోస్టులు
9. డిప్యూటీ రిజిస్ట్రార్(ఏపీ కో ఆపరేటివ్ సర్వీస్): **5 పోస్టులు**
10. మున్సిపల్ కమిషనర్ గ్రేడ్-2(ఏపీ మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసెస్): **1 పోస్టు**
11. అసిస్టెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్(ఏపీ ఎక్సైజ్ సర్వీస్): **1 పోస్టు**
12. అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్/అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్(ఏపీ ట్రెజరీ అకౌంట్స్ సర్వీస్): **3 పోస్టులు**
13. డిస్ట్రిక్ట్ ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్(ఏపీ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ సర్వీస్): **4 పోస్టులు**
14. అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్(ఏపీ స్టేట్ ఆడిట్ సర్వీస్): **2 పోస్టులు**

అర్హతలు: పూర్తి సమాచారం నోటిఫికేషన్‌లో చూడొచ్చు

ఎంపిక ప్రక్రియ: స్క్రీనింగ్ టెస్ట్, మెయిన్ ఎగ్జామినేషన్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

చివరి తేదీ: జనవరి 21

స్క్రీనింగ్ టెస్ట్(ప్రిలిమినరీ ఎగ్జామినేషన్): మార్చి 17

వెబ్‌సైట్: psc.ap.gov.in/

డిగ్రీ లెక్చరర్స్

ఖాళీలు 240

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ)...ఏపీ కాలేజియేట్ ఎడ్యుకేషన్ సర్వీస్‌కు సంబంధించి ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో లెక్చరర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.



సబ్జెక్టుల వారీగా ఖాళీలు

1. బోటనీ: **19**
2. కెమిస్ట్రీ: **26**
3. కామర్స్: **35**
4. కంప్యూటర్ అప్లికేషన్స్: **26**
5. కంప్యూటర్ సైన్స్: **31**
6. ఎకనామిక్స్: **16**
7. హిస్టరీ: **19**
8. మేథమెటిక్స్: **17**
9. ఫిజిక్స్: **11**
10. పొలిటికల్ సైన్స్: **21**
11. జువాలజీ: **19**

అర్హత: సంబంధిత విభాగంలో మాస్టర్స్ డిగ్రీ, నెట్/స్లెట్/సెట్ ఉత్తీర్ణులై ఉండాలి.

ఎంపిక ప్రక్రియ: కంప్యూటర్ బేస్డ్ రిక్రూట్‌మెంట్ టెస్ట్, కంప్యూటర్ ప్రొఫిషియెన్సీ టెస్ట్ తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు: జనవరి 24 నుంచి ఫిబ్రవరి 13 వరకు

రాత పరీక్ష తేదీ: 2024 ఏప్రిల్/మే

వెబ్‌సైట్: https://psc.ap.gov.in/

డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్లు

ఏపీ ఎడ్యుకేషనల్ సర్వీస్‌లో డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ ఖాళీల భర్తీకి సంబంధించిన నోటిఫికేషన్‌ను ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ) విడుదల చేసింది.

ఖాళీలు 38

అర్హత: ఏదైనా పీజీ తో పాటు బీఈడీ ఉత్తీర్ణులై ఉండాలి

పే స్కేల్: రూ.61,960 - రూ.1,51,370

వయసు: 2023 జూలై 1 నాటికి 18-42 ఏళ్ల మధ్య ఉండాలి

దరఖాస్తు రుసుము: జనరల్ అభ్యర్థులకు రూ.370, ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులు, ఎక్స్ సర్వీస్‌మెన్ అభ్యర్థులకు రూ.250.

ఎంపిక విధానం: స్క్రీనింగ్, మెయిన్ పరీక్ష ఆధారంగా ఎంపిక చేస్తారు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 29

స్క్రీనింగ్ పరీక్ష తేదీ: ఏప్రిల్ 13

వెబ్‌సైట్: https://psc.ap.gov.in

లిటిల్స్



ప్రాంతం-లక్షదీవ్

మీకు తెలుసా?

- ప్రధాని మోదీ పర్యటన వల్ల ఈ ఇరవై ఏళ్లలో గరిష్ఠంగా 'లక్షదీవ్'కోసం వెతికారు. ఇదో కేంద్రపాలిత ప్రాంతం.
- సముద్రతీరాలు, కొండపగుళ్లు, మడుగులతో ఎంతో అందంగా ఉంటాయి ఈ ద్వీపాలు. మాల్దీవుల్లా భూమి కింద కనపడే స్వచ్ఛమైన నీళ్లు ఇక్కడ ఉంటాయి. ఇక్కడ జీవావరణం అద్భుతం.
- కేరళకు 300 కి.మీ. దూరంలో ఉండే ఈ దీవులు 27 దీవుల కలయిక.




ఇందులో 17 దీవుల్లో మనుషులు జీవించటానికి అనువుగా లేదు. కేవలం పది దీవుల్లోనే మాత్రమే ఉన్నారు.

- లక్షదీవ్ అనేది ఓ జిల్లా. ఆ పేరుతోనే ఈ ప్రాంతం పిలవబడుతోంది. ఈ ద్వీప సముదాయాలకు ప్రధాన నగరం కవరట్టి.
- 2021 లెక్కల ప్రకారం ఈ దీవుల్లో జీవించే వారి సంఖ్య 60,965. ఉత్తర ద్వీపవాసుల్లోని ప్రజలంతా అరబిక్, తమిళ ప్రభావం ఉండే మలయాళం భాష మాట్లాడతారు. దక్షిణ ద్వీప వాసులు (మినికోయ్ దీవి) మాత్రం మహిల్ భాష మాట్లాడతారు. ఈ భాషను మాల్దీవుల్లో మాట్లాడతారు.
- లక్షదీవ్‌లో ఒకే ఒక్క విమానాశ్రయం ఉంది. 1988లో అగత్తి అనే దీవుల్లో దీన్ని నిర్మించారు. కేరళలోని కొచ్చిన్ నుంచి లక్షదీవ్‌కు విమానాలు వెళ్తాయి.
- మొత్తం కేవలం 32 చదరపు కిలోమీటర్లు మాత్రమే ఆవరించి ఉంది.
- పోర్చుగీసు నావికుడు వాస్కోడిగామా ఈ దీవుల మీదనే భారతదేశానికి వచ్చాడని చరిత్ర చెబుతోంది.


దారి కనుక్కోండి






6 తేడాలు గుర్తించండి

సరైన నీడ ఏది?





రంగులు వేయండి

డైలీ సుడోకు - 200

		1		2	4		7	
		6						5
		8		6				9
1	6						5	8
		5				3		
7	3						1	2
8				1		5		
5						2		
	1		7	3		9		

సుడోకు - 199 సమాధానం

5	9	3	6	1	4	7	2	8
8	4	2	5	7	3	1	6	9
6	7	1	9	2	8	3	5	4
7	5	9	4	6	2	8	1	3
2	1	6	8	3	9	5	4	7
4	3	8	1	5	7	6	9	2
1	2	4	7	8	6	9	3	5
9	8	5	3	4	1	2	7	6
3	6	7	2	9	5	4	8	1

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.